
ఆణిముత్యాలు
2003
కస్తూరి బెహెన్



# ఆణిముత్యాలు
## 2003





## కస్తూరి బెహన్

వ్యక్తిగత వినియోగం కొరకు మాత్రమే

కస్తూరీ బెహెన్ పుస్తకాల కొరకు

కె. రామదాస్ - 9440652774

కె. సుదర్శన్ - 9247805058

సంప్రదించగలరు.

# ఆణిముత్యాలు

**2003**

కస్తూరి బెహన్

# ఆణిముత్యాలు 2003

కస్తూరి బెహన్

సహజమార్గంలో అత్యున్నత పీఠముపై కస్తూరి బెహన్‌ను అధివసింపజేసిన బాబూజీమహరాజ్ యొక్క శక్తి సాధకులందరికి ఎలా లభ్యమవుతున్నదీ తద్వారా 'వారి' అనుగ్రహాన్ని అభ్యాసులందరూ ఎలా అనుభవించుతున్నదీ భగవత్ సాక్షాత్కారానికి ఎందరెందరో ఉవ్విళ్ళూరుతున్న విధమూ – ప్రశ్నలు సమాధానాల రూపంలో వివరించిన – అపూర్వ ఆనందవాహిని.

21-12-2003

బాబూజీ బిడ్డల సమర్పణ ఇది

# ఆణిముత్యాలు 2003

డాక్టర్ వరదాచారిగారు అడిగిన ఓ ప్రశ్నకు బాబూజీ జవాబు చెప్తూ "వెళ్ళిపోయిన వారిని గురించి బాధపడకూడదు. జీవించి ఉన్నవారికి సేవ చేయాలి" అని అన్నారు.

ఏదో ఒక పూజచేస్తూ ఉంటే దుఃఖం దరికిరాదని జనం భావిస్తూ ఉంటారు. కాని నిజమైన భక్తుడు భగవంతుని పొందాలని పూజిస్తాడు. కష్టాలను గురించి ఆలోచించడు. అందుచేత ఎవ్వరైనా సరే కష్టాలు రాకూడదని పూజచేస్తే అనుభవించాల్సినవి రాక తప్పవు. భగవంతుడూ దొరకడు. ఇది కర్మభూమి. ఇక్కడ చేసి వెళ్ళిన వాటి ఫలితాన్ని అనుభవించటానికే మళ్ళీ ఇక్కడకు రావటం జరుగుతుంది. మనం ఇతరుల నెవరినైనా మోసగిస్తే దానిని గురించి జ్ఞాపకం పెట్టుకోం. కాని ఇతరు లెవ్వరైనా మోసగిస్తే దానిని గురించి జ్ఞాపకం చేసుకుంటాం. మనం చేసిన దాని ఫలితం అనుభవించక తప్పదు కదా! బాబూజీ తమ యొక్క శక్తిలో కొద్దిపాటి శక్తిని వినియోగించి మనకు పరమానందాన్ని పంచి ఇస్తున్నారు. అందుకే వారు వచ్చారు. కుటుంబంలోని కష్టాలు తొలుగుతాయని ఇక్కడకు రావటం సరికాదు. అందుచేత కష్టాల గురించే ఆలోచించుకొని, అవి రాకూడదని అనుకుంటూ ఉంటే, అవి రావటం తప్పకపోగా దివ్య పరమానందం కూడా దొరకదు. బాబూజీ మహరాజ్ మనకు దివ్యత్వం, ప్రేమ, పరమానందం ఇస్తున్నారు. వారిని ప్రేమించి, మెప్పించి వాటిని పొందటానికి ప్రయత్నించాలి. దుఃఖమనేది లేకపోతే పరమానందమూ ఉండదు. ఒకదాని నంటి మరొకటి ఉంటుంది. అందుచేత భక్తి, ప్రేమను పెంచుకొని బాబూజీ మహరాజ్ యొక్క ఆశ్రయం పొంది వారిపట్ల శ్రద్ధ నిలిపితే అంతా మంచే జరుగుతుంది.

**ప్రశ్న: సహజమార్గ అభ్యాసీ యొక్క అంత్య నిశ్చయం ఎలా ఉంటుంది?**

**జవాబు:** సహజమార్గ అభ్యాసీ యొక్క అంత్య నిశ్చయం (పర్యవసానం లేదా ఫలప్రాప్తి) బాబూజీ వ్రాసే ఉంచుతారు. ఒక అభ్యాసీ "బాబూజీ! నేను మరణించేటప్పుడు మిమ్మల్ని స్మరించకపోతే నాగతి ఏమవుతుంది" అని అడిగినప్పుడు, బాబూజీ ఏమి చెప్పారంటే, "నీవు నన్ను జ్ఞాపకం చేసుకోలేకపోయినా నేను నిన్ను జ్ఞాపకం చేసుకుంటాను, నీకు మంచి స్థానం కల్పిస్తాను. కనుక చింతించకు" అని చెప్పారు. కనుక వారికి మనల్ని మనం సమర్పించుకుంటే అన్నీ వారే చూస్తారు.

బాబూజీ మహరాజ్ మా తండ్రిగార్కి వ్రాసిన ఉత్తరంలో "నీ కుమార్తె కస్తూరి ఎప్పుడో మరణించింది. ఇప్పుడు ఉన్నది నా కుమార్తె కస్తూరి" అని చెప్పారు. బాబూజీ పాదాల వద్ద మనం ఉన్నాం. వారి శరణు పొందుతున్నాం, అదే చాలు. అందులోనే మనకు పరమానందం కలుగుతుంది.

**ప్రశ్న: పురోగతి వేగంగా లేదనిపిస్తోంది.........ఎందుచేత?**

**జవాబు:** పురోగతి వేగంగా జరగటంలేదని తలుస్తున్నారంటే బాబూజీ మీద విశ్వాసం కుదరలేదన్నమాట. వారు వేగంగా నడుస్తూ ఉంటే మనం నిదానంగా ఎలా నడవగలం? ఒకవేళ నిదానంగా నడిచినా వారు ఈడ్చుకు వెళ్తారు. నడిపించే వారు వేగంగా నడుస్తుంటే వారిని అనుసరించే వారు కూడా వేగంగా

నడవాల్సిందే. అందుచేత విశ్వాసమే ముఖ్యం. అనుమానం అనవసరం. ఇందులో ఎవ్వరూ నిదానంగా ప్రయాణించరు. "ఎవరికైతే సహజమార్గం మీద సంపుర్ణ విశ్వాసం ఉంటుందో, వాళ్ళు ఈ ప్రపంచంలోకి మళ్ళీ రారు. అందుకు నేను హామీ ఇస్తున్నాను" అని అన్నారు బాబూజీ. సామాన్య గురువు తాను పైకి వెళ్ళవచ్చు లేదా తన అనుయాయుల్ని ఒకరిద్దరిని పైకి తీసుకుని వెళ్ళగలగవచ్చు. కానీ బాబూజీ అందరికోసం వచ్చారు కనుక అందరినీ తీసుకుని వెళ్తారు. ఇటువంటి సత్తా ఉన్నట్లు ఇప్పటివరకు ఏ గురువూ చెప్పి ఉండలేదు. ఇటువంటి గురువు ఇంతవరకు ఈ లోకంలోకి రాలేదు. అందువలన మనం చేయవల్సిందల్లా వారిని అంటి పెట్టుకొని ఉండటమే. వారే తీసుకు వెళ్తారు. అంతకంటే మనకు కావల్సింది ఏముంది. గురు శబ్దాన్ని బాబూజీ ఖండించారు. తల్లీ, తండ్రి, అన్నీ వారే.

ఒక అభ్యాసీ, "గాలి ఎంతమేర విస్తరించి ఉంటుందో అంతమేర మన సహజమార్గ విధానం వ్యాపించి ఉండాలి. ఇది నా అభిమతం" అని అనగానే నేను ఇలా చెప్పాను: "గాలి వ్యాపించి ఉన్నంత వరకే కాదు. సృష్టి వ్యాపించి ఉన్నంత వరకు ప్రాణాహుతి వ్యాపించి ఉంటుంది. గాలి కొంతమేరకే ఉంటుంది. దాని స్థాయి మించి ఇంకా ఆ పైన కూడా ప్రాణాహుతి వ్యాపించి ఉంటుంది. వారు పై నుంచే వచ్చారు. ప్రతి శ్వాసలోనూ వారు ఉన్నారు. పై నుంచే ప్రాణాహుతిని తెచ్చారు. సహజమార్గ విధానం కూడా సర్వత్రా వ్యాపించి ఉంటుంది."

**ప్రశ్న: డార్విన్ పరిణామ సిద్ధాంతం (Theory of Evolution) ప్రకారం సూక్ష్మజీవి అనేక పరిణామాల అనంతరం మానవునిగా రూపొందినట్లు చెప్పబడుతుంది. మీ అభిప్రాయం ఏమిటి? మన శాస్త్రాలు బ్రహ్మ సృష్టించినట్లు చెబుతున్నాయి.**

**జవాబు:** మనిషిని ఎవరూ సృష్టించలేదు. మూలం నుంచి శక్తి దిగి వచ్చింది. ఆ శక్తియే మానవుణ్ణి సృష్టించింది. అది ప్రకృతి సిద్ధంగా జరిగింది. ఇది పురాణాలు చెప్పే కథనానికి భిన్నమైనది. ఈ సృష్టికి అవసరమైన శక్తి మూలశక్తి నుంచి నేరుగా కాకుండా ప్రత్యేకమైన శక్తి స్థానం నుంచి అనగా హిరణ్యగర్భ దేశం నుండి వెలువడిన అంతిమ శక్తి ప్రవాహం యొక్క స్పందన వలన మానవుడు 'సత్యపథ్' వద్ద సహజంగానే సృష్టించబడ్డాడు. ఈ సృష్టి నిర్మాణానికి అవసరమైన శక్తి 'మూలం' నుండి విడివడి హిరణ్యగర్భ్‌గా ఏర్పడినది. హిరణ్యగర్భ్‌లో రచనాత్మక శక్తి ఈ సృష్టిని ఏర్పరచింది. అందుకు ఎంత శక్తి అవసరమో అంతే శక్తితో మానవుడు ఉద్భవించడం జరిగింది. అంతేగాని పూర్ణశక్తి అందుకు వినియోగించబడలేదు.

**ప్రశ్న: విశ్వమంతా మానవ శరీరంలో సూక్ష్మ రూపంలో ఇమిడి ఉన్నదంటారు!**

**జవాబు:** అవును. దైవం నీలో ఉన్నపుడు, దైవసృష్టి నీలో అంతర్నిహితంగా ఉంటుంది కదా!

**ప్రశ్న: బెహన్‌జీ! ఎప్పటికప్పుడు నూతన దివ్య రూపాలు సృష్టించబడతాయట. నిజమేనా?**

**జవాబు:** అవును. సృష్టి ద్వారా ప్రతిసృష్టి జరుగుతూ ఉంటుంది. ప్రతిసృష్టి చేయగల శక్తి ప్రతి జీవిలోనూ ఉంటుంది. ప్రతి ఒక్కరిలోను సంకల్పవశంచేత ఈ శక్తి సృష్టించబడుతుంది.

**ప్రశ్న: జోతిష్యశాస్త్రం సూర్య కుటుంబం మీద అధారపడి ఉందని, మానవ జీవితం మీద వాటి ప్రభావం ఉంటుందని అంటారు –ఏమిటి?**

**జవాబు:** జ్యోతిష్యులు, శాస్త్రవేత్తలు కొంత జ్ఞానం కలిగి ఉంటారు. వారికి దివ్యజ్ఞానం ఉండదు. కనుక ఆ దివ్యశక్తిని చేరే శక్తి వారికి ఉండదు. వారు పరిమితమైన జ్ఞానంతోనే ఏదైనా చెపుతారు. అది మైండ్ (బుద్ధి)కే పరిమితం. దివ్యశక్తి కలిగిన వారు మాట్లాడేది దైవం నుంచి వస్తుంది. ఆధ్యాత్మిక సాధకులు దైవంతో సంబంధం కలిగి ఉంటారు. దివ్యశక్తి వారికితోడై ఉంటుంది. ఒకరి విషయంలో మానవ శక్తి ఆధారితమైనదిగా ఉంటే మరొకరి విషయంలో దివ్యశక్తి సంపన్నమైనదిగా ఉంటుంది. రెంటికీ చాలా వ్యత్యాసం ఉంటుంది.

**ప్రశ్న: గ్రహాల గురించిన జ్ఞానం వలన కేవలం ప్రాపంచిక జీవితం గురించి మాత్రమే తెలుసుకోబడుతుందని అంటారా?**

**జవాబు:** వారు నేర్చినది అదొక విద్య. జ్యోతిష్యం, తత్త్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం–అవన్నీ విద్యకు సంబంధించినవే కాని ఆధ్యాత్మికతకు చెందినవి కావు.

**ప్రశ్న: సంస్కారాల సంగతి ఏమిటి?**

**జవాబు:** సంస్కారాలు మానవులలో ఏర్పడతాయి. ఆధ్యాత్మికత అంతటా వ్యాపించి ఉంటుంది. మనం సహజమార్గ విధానంలో ప్రవేశించామంటే అన్ని విద్యలకు అతీతమైన దానిలో చేరినట్లే. కాని జ్యోతిష్యం ఆధ్యాత్మికతను గురించి వివరించలేదు. అది మానవ మస్తిష్కం నుంచి వెలువడుతుంది. ఇది దివ్య మనస్సు నుంచి వెల్లడవుతుంది. దీనినే (సూపర్ కాన్షస్ మైండ్) అధిచేతన మనస్సు అంటాము. దాని ఆధీనంలోనే మనం ఉంటాము. బాబూజీ యొక్క సహజమార్గ విధానంలో అనుభూతి (ఫీలింగ్) అనేది మనస్సుకు చెందినది కాకుండా దివ్యత్వంతో సంబంధించినదిగా ఉంటుంది.

**ప్రశ్న: అవి రెండూ వేర్వేరు రంగాలకు చెందినవా?**

**జవాబు:** విజ్ఞాన శాస్త్రానికి చెందిన భౌతికమైన పరిణామానికి, ఆధ్యాత్మిక రంగానికి చెందిన పరిణామానికి భేదం ఉంది.

**ప్రశ్న: పురోగమనం అనేది వేర్వేరు వలయాలు కాకుండా ఒకే రేఖా వలయంగా ఏర్పడినట్లు ఉంటుందా?**

**జవాబు:** వలయాలు ఆధ్యాత్మికతను స్పర్శించలేవు. ఆధ్యాత్మికత దృష్టిలో నీవు మాట్లాడుతున్న వలయాలు అనేవి అహంకు చెందినవి. పురోగమనం ఉంటే అహం కరిగిపోతున్నట్లవుతుంది. అనుభూతి అనేది స్వాభావికంగా ఉంటుంది.

**ప్రశ్న: వలయాలు ఏకధాటిగా ఏర్పడినవి కాకుండా (Continuity) వేర్వేరు వలయాలుగా (Circles) ఏర్పడి ఉంటే ఒక వలయం దాటి మరొక వలయానికి చేరుకోవటం ఎలా?**

**జవాబు:** ఒక దివ్యత్వం కలిగిన వ్యక్తి మాట్లాడుతున్నారంటే అది ఏదో ఒక వలయానికి చెంది ఉండదు. అది మూల ఆధారం నుంచే వస్తుంది.

**ప్రశ్న: వలయాలు ఒకదానికొకటి కలిసి ఉండకపోతే వాటిని దాటడం ఎలా సాధ్యమో వివరించండి.**

**జవాబు:** నీవు వలయం (సర్కిల్) అనుకుంటున్నది ఏమిటో నాకు బోధపడటం లేదు.

**ప్రశ్న: మనం అంతిమం చేరటానికి సర్కిల్స్ దాటి వెళ్ళాలి కదా!**

**జవాబు:** వలయాలు గురించి పూర్తిగా నా పుస్తకంలో వ్రాయబడి ఉంది. వలయాల గురించి ఎందుకు! బాబూజీ మహరాజ్ సమస్త మానవాళి శ్రేయస్సు కొరకు తమ పరిశోధన పూర్తి చేశారు. బాబూజీ చెప్పారు "నేనొక స్థితి కల్పిస్తాను. దానివలన అన్ని వలయాల యొక్క స్థితుల అనుభూతి నీవు పొందగలవు" అని. మనకు కావలసిందల్లా మూడే విషయాలు –భక్తి, నిరంతర స్మరణ మరియు లయావస్థ మాత్రమే. ఆధ్యాత్మికత ఈ మూడింటి మీదే ఆధారపడి ఉంది. బాబూజీ మహరాజ్ యొక్క కృప అంతా ఈ మూడింటి మీదనే కేంద్రీకృతమైంది, ఆది నుంచి తుది వరకూ. మీరు అడిగే వలయాలన్నీ వారికి తెలుసుగాని నాకు ఏమీ తెలియదు. నాకు తెలిసింది నాకు కలిగిన స్థితులు. చేతనైంది వాటిని వారికి వ్రాయటం మాత్రమే.

**ప్రశ్న: కొంతమంది భక్తుల చరిత్రలో బొందితో కైలాసానికి (స్వర్గానికి) వెళ్ళినట్లుగా ఉంది. అదేమిటి?**

**జవాబు:** నాకు ఏమీ తెలియదు. నేను స్వర్గానికి పోలేదు. నేను బాబూజీ మహరాజ్ చరణాలను మాత్రమే ఆశ్రయించి ఉన్నాను. స్వర్గం ఉందనుకుంటే నరకం కూడా ఉంటుంది.

**ప్రశ్న: జీవించి ఉండగానే సమాధి చెందటాన్ని సజీవ సమాధి అంటున్నారు. అది ఎలాంటిది?**

**జవాబు:** వారు స్వశక్తితో చేసిన సాధన వలన సమాధి పొందటం కల్ల. కాని మన సహజమార్గ విధానంలో ప్రతి ఒక్కరూ ఆ స్థితిని పొందుతారు. ఒక పాయింట్ ఉందని, దానిని ఎవ్వరూ తెలుసుకోలేరని, లయావస్థ పొందినట్లయితే దేనినైనా తెలుసుకోవచ్చు, అనీ బాబూజీ చెప్పారు. మీరు భక్తితో ఆ దివ్య స్థితిలో గాఢంగా మునిగినట్లయితే మీరు గ్రహించగలుగుతారు. స్వశక్తితో ఎవరైనా ఆ స్థితి సాధించినట్లయితే దానిని నిలుపుకోలేరు. మళ్ళీ దిగజారిపోతారు. అదే స్థితి బాబూజీచేత ఇవ్వబడినదైతే చిరస్థాయిగా ఉంటుంది. అలా ఎందుకంటే, వారి శక్తి అటువంటిది కనుక.

సహజమార్గ సాధనలో ప్రతి ఒక్కరు కూడ సహజ సమాధి స్థితిని పొందుతారు. కాని దాని అనుభూతిని మాత్రం అందరూ పొందలేరు. బాబూజీ "లయావస్థ అనేది ఉంటేనే నీవు ప్రతి స్థితిని కూడ అనుభూతి పొందగలవు, తెలుసుకోగలవు" అని అన్నారు. కాబట్టి నీవు (డివోషన్) భక్తిలో మునిగిపోవాలి. అప్పుడే నీవు దానిని గురించి తెలుసుకోగలవు.

**ప్రశ్న: అలా సమాధి చెందిన వారు కూడా మళ్ళీ ప్రాపంచక జీవనంలోకి తిరిగిరారు కదా!**

**జవాబు:** వారు స్వప్రయత్నంతో సాధించినది నిలబడదు. బాబూజీ మహరాజ్ మాత్రమే ఆ స్థితిని ప్రసాదించగలరు. బాబూజీ చరణాల వద్ద నీవు ఆశ్రయం పొందగలిగినప్పుడే అది సిద్ధిస్తుంది. వారి శక్తి నిన్ను అలాపట్టి ఉంచుతుంది. అన్ని శక్తులూ వారితోనే సంబంధం కలిగి ఉన్నాయి. భక్తి, నిరంతర స్మరణ మరియు  లయావస్థ ఉంటే వారి ఆశ్రయం లభిస్తుంది. దానివలన నీవు దేనినైనా తెలుసుకోగలుగుతావు.

ఎవరైనా నిన్ను దేన్ని గురించి అయినా ప్రశ్నిస్తే దానికి సమాధానం అక్కడి నుంచే వస్తుంది. సహజమార్గంలో మూల అంశాలు ఈ మూడే. నాకు బాబూజీకి మధ్య ఈ మూడు మాత్రమే సంధాన కారకాలుగా ఉన్నాయి.

**ప్రశ్న: దయచేసి జీవన్ముక్తి గురించి వివరించండి.**

**జవాబు:** జీవన్ముక్తి అనేది ఒక అనుభూతి. అది ఒక స్థితికి చెందినది. దానిని ఎవ్వరైనా పొందగలరని బాబూజీ చెప్పారు. ఆ స్థితిలో నీ పేరు, ఉనికి కూడా తెలియవు. నీ పేరు ఎవ్వరైనా ఉచ్చరించినట్లయితే, అది వారి నోటి నుంచి వెలువడుతుందే కాని నిన్ను చేరదు. అనగా నీవు దైవాన్ని పట్టుకొని జీవతత్త్వాన్ని వదిలేసినట్లవుతుంది. దీనినే జీవన్ముక్తి అంటారు. మనలో చైతన్యం లేదా స్పృహయే లేకపోయిన కారణంగా మనం దానిని గుర్తించలేం. జీవించి ఉన్నప్పటికి నిన్ను నీవు (జీవుడు) కోల్పోయిన స్థితియే జీవన్ముక్తి అని బాబూజీ అనేకసార్లు చెప్పారు.

జీవన్ముక్తి అనే దానికి, సమాధి అనబడే దానికి అంతరం ఉంది. సమాధి అంటే జడసమాధి –శరీరం మాత్రమే సమాధి అవుతుంది. అది ప్రాణాయామానికి చెందినటువంటి క్రియ. అందులో ఆధ్యాత్మికతకు స్థానం లేదు. అది శాశ్వతం కూడా కాదు. బాబూజీ చెప్పారు: "నేను సమాధిని కల్పిస్తాను. కాని భూమి మీద నిలవనివ్వను" అని. మన సహజమార్గ విధానంలో క్రియకు స్థానం లేదు. మనం చేసేదంతా బాబూజీ మహరాజ్ కృపతో మాత్రమే. జీవించి ఉండగానే జీవ సంబంధం తొలగిపోవటాన్ని జీవన్ముక్తి అంటారు. ఇంక సమాధి విషయానికి వస్తే దానిని సాధువులు చేస్తూ ఉంటారు. అది క్రియాత్మకమైనది, సంస్కారాలకు తావిస్తుంది. సమాధి చెందిన వారు శరీరాన్ని వదిలిపెట్టి వెళ్ళారో లేదో మనం చూడలేము. ప్రజలు పుష్పాలు జల్లి, కానుకలు సమర్పిస్తారు. మన సహజమార్గ విధానంలో బాబూజీ మనల్ని భక్తులుగా తయారుచేసి తమ రక్షణలోకి తీసుకుని తమ సంకల్పంతో మనకు క్రియ నుంచి, భౌతిక ప్రపంచం నుంచి ముక్తి కలిగిస్తారు.

బాబూజీ, "ధ్యానంలో మీరందరూ మునిగి ఉండాలేగాని, నేను మీ అందరినీ అక్కడకు, ఆ అనంతానికి తీసుకు వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నాను" అని చెప్పేవారు.

ఒక మార్గమంటూ లేనప్పుడు దానిని చూపించేవారు కూడా ఉండరు. కాని ఒక మార్గమంటూ ఏర్పడ్డాక దానిని చూపించే వారు ఉంటారు. దారి తెలిసిన తర్వాత ఇక మనం ప్రయాణించాలి. మనకు ఏదైనా ఉద్యోగం దొరకనంతవరకు మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తాం. అంతవరకూ వేచి ఉంటాం. అది దొరకగానే ప్రవేశించిపోతాం. అదే విధంగా మనకు మన దివ్య మార్గదర్శకుడు, డివైన్ మాస్టర్ బాబూజీ దిగివచ్చి దారి చూపించినపుడు ఇంక ఎటువంటి ప్రశ్నకూ చోటు ఉండదు. ఇక ప్రశ్నించుకోవాల్సింది అభ్యాసీలే. అది ఏమిటంటే, బాబూజీపట్ల ప్రేమ, భక్తి ఎంతగా పెంచుకోగలం, అని. మీరు సాక్షాత్కారం పొందాలంటే వారి స్మరణలో ఉండాలి. మీరు వారిపట్ల భక్తి, ప్రేమ మరియు నిరంతర స్మరణతో ఉంటే మీకు ఆ దివ్యశక్తి సమకూరుతుంది. కనుక దివ్యశక్తి, దివ్య ప్రేమను పొందాలంటే బాబూజీని నిరంతరం స్మరించటం తప్పనిసరి అని అభ్యాసీలు గ్రహించాలి.

మనం భౌతికంగా ఈ ప్రపంచంలో ఏది కావాలని కోరుకుంటూ ఉంటామో అదే మన మనస్సులో నిలిచి ఉంటుంది. అదే విధంగా సాక్షాత్కారం గురించి తలుస్తూ ఉంటే దానిపట్ల ఆసక్తి, దీక్ష పెరుగుతాయి. బాబూజీ మహరాజ్ పాదపద్మాల మీద మీ దృష్టి నిలిపితే అది మీకు సులభంగా దక్కుతుంది. నిరంతర స్మరణ ద్వారా మనకు బాబూజీ ప్రేమ లభిస్తుంది. వారి ప్రేమ మనలో నిలిచినప్పుడు, ప్రార్థన మరియు నిర్మలీకరణల యొక్క అవుసరం ఉండదు. బాబూజీ యొక్క ప్రేమ లభించిన తరువాత అది శాశ్వతంగా నిలబడి ఉంటుంది. బాబూజీకి నేను ఇలా వ్రాశాను "మీ ప్రేమలో మునిగిపోయినపుడు ధ్యానం యొక్క ధ్యాసనే మర్చిపోతాను" అని. దానికి సమాధానంగా బాబూజీ ఇలా వ్రాశారు: "ఏ లక్ష్యంతో నీవు సహజమార్గ సాధన ప్రారంభించావో ఆ సాధన యొక్క అర్థం ప్రేమను పొందటమే. అప్పుడు నా బాధ్యత (పని) ప్రారంభమవుతుంది" అని. అనగా అభ్యాసీ యొక్క పని ముగిసినంతనే తదనంతరం గురించిన వారి పని ప్రారంభమవుతుంది. దాని అర్థం, వారు మనల్ని తమ రక్షణలోకి తీసుకున్నారు. కనుక మనల్ని కాపాడవలసింది వారే. అప్పుడు మనకు వారి శరణు పొందిన ఆనందం కలుగుతుంది. మనకు కలిగిన స్థితిలో బాబూజీ మహరాజ్ మనకు దేనిని అనుగ్రహించారో అది ఇతరులకు కూడా అనుగ్రహించబడాలి అని కోరుకోవాలి.

"దేనినైనా పొందాలి అంటే మరేదైనా పోగొట్టుకోవాలి" అని బాబూజీ చెప్పినపుడు, ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీతో "అలా మీరు చెప్పితే సహజమార్గంలోకి ఎవ్వరూ రారు" అన్నారు. పోగొట్టుకోవడం అనగానే సామాన్యంగా భౌతికంగానో, ప్రాపంచికంగానో అని అలోచిస్తారు. కోల్పోవలసింది కేవలం అహం మాత్రమే. అది చాలా చిన్న మాట. దానికే ఎంతో భయపడిపోతారు. మీరు సాధన చేస్తున్నారంటే ఏమి కోల్పోయారు? 'నేను' అనేది కోల్పోయి బాబూజీని పొందుతారు అంటే మనల్ని మనం ప్రేమించుకున్నట్లే వారినీ ప్రేమిస్తున్నామంతే.

ఒక అభ్యాసీ, ఒకసారి బాబూజీ చెప్పిన ఇల్లత్, కిల్లత్, జిల్లత్ అనే శబ్దాలు ఉదహరిస్తూ –అవంటే తనకు భయం కలిగింది అని చెప్పాడు. అన్నీ పోగొట్టుకోవాలని అనగానే అతడు ఏదో ఊహించుకొని భయపడ్డాడు. బాబూజీ చెప్పిన మాటలను అపార్థం చేసుకుంటున్నారు. మన కష్టాలను వారికి ఇచ్చి మనల్ని ఆనందం పొందమని బాబూజీ చెప్పారు. ఏదైనా మహితాశక్తి భూమి మీదకు వచ్చిందంటే అది మానవులకు శాంతిని చేకూర్చటానికేగాని అశాంతిని రేకెత్తించడానికి కాదు. ఆ శక్తి కష్టాలను తీసుకుంటుంది స్వయంగా. జిల్లత్ అనే మాట చాలా చిన్నదే కాని దాని అర్థం చాలా ముఖ్యమైనది. ఈశ్వర్ సహాయ్‌గారు బాబూజీని "ఈశ్వరుడు సృష్టి రచన చేశాడు. కాని దుఃఖం అనుభవించేటట్లు ఎందుకు చేస్తున్నాడు" అని ప్రశ్నించారు. అపుడు బాబూజీ చెప్పారు "నీవు అలా ఎందుకు అనుకుంటున్నావు. ఎంత పెద్ద కష్టం కలిగినా నోటితో 'హేరామ్!' అని అంటారు. రామ్‌ను ఎరుగరు. కష్టంతో రాముడు సంధానమై ఉన్నాడు. అపుడు కొంత మనశ్శాంతి కలుగుతుంది" అని. అందుచేత కష్టాల అనుభూతితో దేవుడు అనుసంధానం అవుతాడు. కొంత మనశ్శాంతి తాత్కాలికంగానైనా కలుగుతుంది. కాని మళ్ళీ కష్టాలు తప్పవు. ఒకదాని నంటి మరొకటి ఉంటూనే ఉంటాయి. కనుక మనం వారికి సమర్పితమైపోతే కలిగే ఆనందానికి విరామం ఉండదు. శాశ్వతానందం మనకు దక్కుతుంది.

రాముడు, కృష్ణుడు పేర్లు ఉచ్ఛరిస్తూ ఉంటే శాంతి కలుగుతుందని అనుకుంటారు జనులు. కాని మీరు 'రామ్ రామ్' అనిగాని, 'కృష్ణ కృష్ణ' అనిగాని ఉచ్ఛరిస్తూ ఉంటే మీకు ఆ శబ్దం నుంచి దూరం అనుభవమవుతుంది కాని, సామీప్యతానుభవం కలగదు. అదే విధంగా మీరు 'బాబూజీ' పేరు ఉచ్ఛరించినట్లయితే మీకు వారి సామీప్యతానుభవం కలుగుతుంది. ఇది ప్రకృతి యొక్క నిర్దేశం. బాబూజీ అనగా అనంత శక్తి కనుక వారి శరణు పొందమని ప్రకృతి సంకేతం చేస్తోంది, సందేశం ఇస్తోంది. ఇది నా స్వానుభవంతో చెప్పుతున్న మాట. మీరు కూడా ప్రయత్నించి చూడండి. మీకే తెలుస్తుంది.

జ్యోతిష్యం, విజ్ఞాన శాస్త్రం, తాంత్రిక విద్య లాంటివి విద్య క్రిందకు వస్తాయి. కాని ఆధ్యాత్మికత విద్య క్రిందకు రాదు. శాస్త్రవేత్తలు రూపొందించిన భౌతిక శక్తితో భౌతిక సాధనాలు నడుపబడతాయి. కరంటుతో ఫ్యాను, లైటు, మోటారు ఇలా ఆనేకం పని చేస్తున్నాయి. కాని ఆధ్యాత్మికత వలన బాబూజీ మహరాజ్ యొక్క దివ్యశక్తి సమకూరుతుంది. ఈ శక్తి మరే విధంగాను సృష్టించబడదు. ప్రపంచంలో భక్తి ఒక శక్తి. భక్తి ఒక యోగం, దీని ద్వారా మాత్రమే ఆ శక్తి ఆవిర్భవిస్తుంది. రాముడు 12వ వలయం నుంచి, కృష్ణుడు 16వ వలయం నుంచి వచ్చారు. ఒకరిలో శక్తి తక్కువ మరొకరిలో శక్తి ఎక్కువ ఉన్నాయి అని అలోచించకూడదు. అది అప్పటి అవసరానికి తగినట్లుగా వారిలో ఆ శక్తి నిక్షిప్తమై ఉంది. రాముని అవతారానికి ఉన్న లక్ష్యాలు –రావణ సంహారం, భక్త విభీషణుని రక్షణ వంటివి కొన్ని మాత్రమే. అందువలన రాముడు పరిమిత శక్తితో వచ్చాడు. కృష్ణావతార సమయంలో భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు వంటి ఎందరో శక్తిమంతులు ఉన్నారు. కురుక్షేత్ర సంగ్రామంలో వారందరితో తలపడాలంటే ఎక్కువ శక్తి అవసరం. అందుచేత కృష్ణుడు ఎక్కువ శక్తితో వచ్చాడు. రావణుడు మరణాన్ని జయించి రాజ్య మేలాలనుకున్నాడు. కాని భీష్మద్రోణాదులు భక్తితో శక్తిమంతులయ్యారు కాని, దీర్ఘకాలం జీవించాలని కోరుకోలేదు. వారికి మరణం తప్పదని తెలుసు. శ్రీకృష్ణునిపట్ల భక్తి కలిగి ఉన్నారు. భక్తితో శక్తిమంతులయ్యారు. కాని వారు కౌరవ సామ్రాజ్యంతో పోషించబడ్డారు (అన్నం తిన్నారు) కనుక వారి పక్షాన పోరాడవలసి వచ్చింది. ఎవ్వరైనా తపశ్శక్తిని దుర్వినియోగం చేస్తే ఆ శక్తి వారి నుండి తొలగిపోతుంది.

బాబూజీ మహరాజ్‌ని ఒక అభ్యాసీ ఇలా ప్రశ్నించాడు: "పాండవులు యుద్ధ నియమాలకు విరుద్ధంగా కౌరవులను చంపారు గదా! అది తప్పు కాదా?" అని. దానికి సమాధానంగా బాబూజీ "పాండవులు శ్రీకృష్ణ భగవానుని శరణుజొచ్చారు. శ్రీకృష్ణుడు ఆదేశించినట్లు వారు చేశారు. కనుక వారికి ఏ పాపమూ అంటదు" అని వివరించారు.

కురుక్షేత్ర యుద్ధానంతరం అన్ని కార్యాలు పూర్తయైన తర్వాత పాండవులు దృతరాష్ట్రుని దర్శించుకోవటానికి వచ్చారు. దృతరాష్ట్రుని అంతరంగంలో పాండవుల మీద ముఖ్యంగా భీముని మీద పట్టరాని కోపం, బాధ ఉన్నాయి. ఒక్క భీముడుతప్ప ధర్మరాజాదులు, నకుల సహదేవులందరూ వారి పెదతండ్రి దృతరాష్ట్రునికి వందనం చేయగా ఆయన ఒక్కొక్కరినీ కౌగిలించుకుని దీవెనలిచ్చాడు. ఇక భీముడు దృతరాష్ట్రునికి వందనాలు చెప్పటానికి సిద్ధమయ్యాడు. దృతరాష్ట్రుని అంతరంగంలోని బాధను కనిపెట్టిన శ్రీకృష్ణుడు ముందుగానే భీముని ఆకారంలో ఒక కంచు విగ్రహాన్ని తయారుచేయించి, భీముని

ధృతరాష్ట్రుడు కౌగిలించుకునే సమయంలో ఆ విగ్రహాన్ని ఆయన ముందుకు చేర్చాడు. 'భీమా' అంటూ ఆ విగ్రహాన్ని కౌగలించుకున్న ధృతరాష్ట్రుడు తన కోపతాపాల్ని తన కౌగిలిలో చూపాడు. కంచు విగ్రహం తుత్తునియలైంది. "అయ్యో భీమా! నా కౌగిలిలో నలిగిపోయావా" అంటూ బాధ నటించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు "మామ! నీ అంతరంగంలోని బాధను ముందే పసిగట్టి నేను భీముని ఆకారంలో తయారుచేసిన విగ్రహాన్ని నీ కౌగిలికి చేర్చాను. నీ కౌగిలి మాహాత్మ్యం వలన తుత్తునియలైంది ఆ విగ్రహమే కాని, భీముడు కాదు. నీ కోపం చల్లారిందా" అన్నాడు. దానికి ధృతరాష్ట్రుడు "కృష్ణా! నీవు ఇక్కడే ఉన్నావా. పాండవులకు నీవే అసలు ఆధారం. ఇక ఇలా జరక్క వేరే విధంగా జరగదు కదా!" అన్నాడు. ధృతరాష్ట్ర కౌగిలి అంటే ఇదే! శ్రీకృష్ణుడ్ని శరణుజొచ్చిన పాండవులకు లభించినది దివ్యమే.

శ్రీ రాఘవేంద్రరావు, శ్రీవాత్సవ వగైరా – ఇలా చాలా మంది తమకు తామే మిషన్‌కు ప్రెసిడెంట్ అనుకుంటున్నారు; ప్రెసిడెంట్‌గా గుర్తించమంటున్నారు. కాని ఒక్కటి ఆలోచించాలి. బుద్ధుడు, జైనుడు, క్రీస్తు మొదలైన వారి సిద్ధాంతాలతో సంస్థలు స్థాపించబడ్డాయి. అవి వారు గతించిన తర్వాత నేటికి కూడా వారి పేరుతోనే పిలవబడుతున్నాయి. ఏదైనా ఒక సంస్థను స్థాపించినపుడు, స్థాపించినవారే దానికి హెడ్ లేదా కర్త అవుతారు. తర్వాత నిర్వాహణ బాధ్యత వహించేవారు మేనేజరు అవుతారే కాని, హెడ్ కాలేరు. శ్రీరామచంద్ర మిషన్ మేనేజరు మరొక బ్రాంచీని ఏర్పాటు చేసినట్లయితే ఆ సంస్థకు వారు హెడ్‌గా వ్యవహరించవచ్చు. దేశంలో ఎన్నో మఠాలు, మత సంస్థలు ఉన్నాయి. వాటికి ఒకరి తర్వాత మరొకరు అధిపతిగా ఉండవచ్చు. ఆ విధంగా ఒకటవవారు, రెండవవారు, మూడవవారుగా దాన్ని అజమాయిషీ చేయవచ్చు. అయినా మొదటివారు మొదటి వారేగాని, ఆ స్థానాన్ని తరువాత వారు ఆక్రమించలేరు.

జనులు ఆధ్యాత్మిక ప్రతినిధి (స్పిరిట్యువల్ రిప్రజెంటేటివ్) అని అంటారు. ఆధ్యాత్మిక ప్రతినిధి అంటే అర్థం ఏమిటి? ఆ పేరును మనకు మనమే పెట్టుకుంటున్నాము. ఆధ్యాత్మిక ప్రతినిధి అంటే మానవులలో ఆధ్యాత్మికతను పెంచి, పంచి ఇచ్చేవారు. అలా వ్యవహరించబడేవారు ఆధ్యాత్మికతను పంచాలి, సహజమార్గ విధానాన్ని వ్యాప్తి చేయాలి, మూడు సిట్టింగులు గురించి చెప్పగలిగి ఉండాలి. రాముడు, కృష్ణుని కాలంలో వారు ఒక్కరే ఉన్నారు గాని, ఇతరు లెవ్వరూ లేరు. అందుచేత మనం మనస్సుతో ఆలోచించి నిర్ణయించుకోవాలి. మనం శ్రీరామచంద్ర మిషన్‌ను ఎంచుకున్నాం, దాని హెడ్ బాబూజీయే కాని మరొకరు కాదు అని; మేనేజర్లు మారవచ్చు కాని ప్రెసిడెంట్ పేరు మారదు, అని గ్రహించాలి. బాబూజీ అందరికీ ఆధ్యాత్మికతను పంచటానికే వచ్చారు, అందరినీ అంతిమం తీసుకుని వెళ్ళటానికే వచ్చారు.

నాకు నిరంతర స్మరణ, భక్తి, లయావస్థ అనే ఈ మూడు విషయాలు మాత్రమే తెలుసు. ఈ మూడింటిలోనే ప్రారంభం నుండి చివరి వరకు గల అన్ని స్థితులు కూడా బాబూజీ మహరాజ్ యొక్క ఆశీస్సుల రూపంలో ఉన్నాయి. నిరంతర స్మరణ, భక్తి మరియు లయావస్థ, ఈ మూడు మీలో ఉన్నట్లయితే మీరు బాబూజీ చరణాల వద్దనే ఉన్నారని అర్థం. అప్పుడు ఎవరైనా, ఏదైనా ప్రశ్న మిమ్మల్ని అడిగితే, 'వారి' కృప వలన మీరు ప్రతీది కూడ తెలుసుకోగలరు, చెప్పగలరు.

సహజమార్గంలో మూడు మాత్రమే ఉన్నాయి. నాలుగు కాదు. అభ్యాసీ, బాబూజీ మరియు మధ్యలో భక్తి (డివోషన్), అంటే మూడు మాత్రమే.

అహం అనేది కరిగిపోయినపుడు, నిజమైన, సహజమైన అనుభూతి (ఫీలింగ్) కలుగుతుంది. అప్పుడు మీరు ఎక్కువగా శక్తిని, ఆనందాన్ని పొందుతారు. బాబూజీ మహరాజ్ సమస్త మానవాళి శ్రేయస్సు కొరకు నా (కస్తూరీ బెహెన్) మీద ఆధ్యాత్మిక పరిశోధన చేశారు. ఈ డివైన్ రిసెర్చి గురించి నేను నా పుస్తకాలలో వివరించాను. బాబూజీ యొక్క ఆశీస్సుల వలన మన మందరం 'వారి'తోనే కనెక్షన్ కలిగి ఉన్నాం.

**జీవన్ముక్తి స్థితి:** ఈ స్థితిలో నీకు నీ పేరు, నీ రూపం, నీ గురించి నీకు ఎటువంటి ఎరుకగాని, జ్ఞాపకంగాని ఉండదు, అన్నీ మరచిపోతావు. ఎవరైనా నీ పేరుతో పిలిస్తే నీ నోరు మాట్లాడుతుంది కాని, నీ పేరు మాత్రం నీ లోపలికి ప్రవేశించదు. దీని అర్థం ఏమిటంటే, ఇప్పుడు నీవు ఈ జీవిని (శరీరం) విడిచిపెట్టి, 'వారి'ని పట్టుకున్నావు అని. ఇదే జీవన్ముక్తి. అనగా ఇక్కడ జీవించి ఉంటూనే ముక్తి యొక్క స్థితిని పొందడం. ఎవరైనా నిన్ను పిలిస్తే, నీ గురించి నీకు ఎటువంటి ఎరుక లేకుండా, ఎల్లవేళలా నీ ఎదుట కేవలం బాబూజీ మహరాజ్ మాత్రమే ఉంటారు.

ఒకసారి నేను, "బాబూజీ! నన్ను నేను స్పర్శించినా కాని, ఆ స్పర్శ నాకు తెలియడం లేదు. కావాలని జ్ఞాపకం చేసుకొని, ఇది కస్తూరీ చేయి అని స్పర్శించినా కూడ నాకు దాని ఎరుక లేదు. ఎవరిదో చేయి, ఎవరినో స్పర్శించినట్లుగా అనిపిస్తుంది" అని వ్రాశాను. అప్పుడు బాబూజీ, "బిటియా! నాకు చాలా ఆనందంగా ఉంది. జీవన్ముక్తి దశను చూసే ఉదాహరణ నాకు దొరికింది" అని వ్రాశారు.

సాధువులు కొందరు జీవసమాధిలోకి వెళ్ళిపోతారు. దీనిలో ఆధ్యాత్మికత అనేది ఏమీ లేదు. ప్రాణాయామం అనేది ఒక క్రియ. సహజమార్గ పద్ధతి 'క్రియ' అనే బంధనానికి అతీతమైనది. ఇక్కడ బాబూజీ యొక్క కృప వల్లనే సహజసమాధి స్థితిని పొందగలం. సహజమార్గం మొదట అభ్యాసీని భక్తునిగా మార్చి, తన శరణులోకి తీసుకుంటుంది. క్రియల నుండి మనలను విముక్తి చేస్తుంది. ఎందుకంటే, క్రియ అనేది ఉంటే సంస్కారాలు ఏర్పడుతాయి.

బాబూజీ సమస్త మానవాళిని అల్టిమేట్ (అంతిమం) వద్దకు తీసుకొని వెళ్ళటానికి, ఈ భూమి మీద అవతరించారు. కనుక మనమందరం కూడ అక్కడికి చేరుకుంటాము. ఎందుకంటే, మనమందరం 'వారి' ఆలోచనలోనే, వారి సంకల్పంలోనే ఇమిడిపోయి ఉన్నాం. సుఖం, దుఃఖం, బాధలు అనేవి ఈ ప్రపంచంలో ఎప్పటి నుండో ఉన్నాయి, ఉంటాయి కూడ. కానీ అభ్యాసీలమైన మనలోపల ఒక పరమానందం అనేది ఉన్నది. ఆ పరమానందం మానవుని యొక్క స్వంత సాధన వలన ఎప్పుడు కూడ ఇంతవరకు లభించలేదు, లభించదు. బాబూజీ మహరాజ్ తమ ప్రాణాహుతి శక్తితో మనకు ఆ పరమానందాన్ని ప్రసాదిస్తున్నారు. ఈ విశ్వం అంతటా కూడ వారి పావన ప్రకాశం మాత్రమే ప్రకాశిస్తుంది. ప్రపంచంలో ఎక్కడా అంధకారం అనేది ఉండదు.

ప్రశ్నలు అనేవి ఎప్పటివరకు ఏర్పడుతాయి? భగవంతుని చేరడానికి దారి లభించనంతవరకు ప్రశ్నలు ఏర్పడుతాయి. ఎప్పుడైతే మార్గం మరియు దానిని చూపించే గురువు లభిస్తారో అప్పుడు ఎటువంటి ప్రశ్నలు ఏర్పడవు. నీకు ఉద్యోగం లేనప్పుడు నీవు దాని కొరకే మరలా మరలా ప్రయత్నం చేస్తావు. ఉద్యోగం వచ్చిన తరువాత ఇంక ఎటువంటి ప్రయత్నం చేయవు. అదే విధంగా, సహజమార్గం మరియు డివైన్ మాస్టర్ అనగా బాబూజీ మహరాజ్ మనకు లభించినపుడు అడగడానికి ఇంక ఏ ప్రశ్నలూ మిగలవు. అభ్యాసీ వద్ద ఒకే ఒక ప్రశ్న ఉంటుంది. ప్రేమ, భక్తిని ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి? అని. బాబూజీ మహరాజ్ చాలా చక్కగా చెప్పారు, "నీకు సాక్షాత్కారం కావాలంటే నిరంతర స్మరణను ఏర్పరచుకో" అని. మీకు బాబూజీ కృప కావాలంటే మీ దృష్టి (అటెన్షన్) ఎల్లప్పుడు కూడ వారి చరణాల వద్దనే ఉండే విధంగా ప్రయత్నం చేయాలి. నిరంతర స్మరణ ద్వారా మనం బాబూజీ యొక్క ప్రేమను పొందుతాము. నిరంతర స్మరణ వలన మన హృదయం బాబూజీ యొక్క నిరంతర ప్రేమతో నిండిపోతుంది. ఎప్పుడైతే మనం బాబూజీ యొక్క నిరంతర ప్రేమను పొందుతామో అప్పుడు మనకు క్లీనింగ్, ప్రార్థన, మరి దేని యొక్క అవసరం ఉండదు. అందువలన, "నిరంతర స్మరణ అనేది చాలా ముఖ్యమైనది" అని బాబూజీ ఎప్పుడూ అనేవారు.

ఒకసారి నేను, "బాబూజీ! ఎప్పుడైనా మీ జ్ఞాపకం రాగానే లేదా ధ్యానంలో కూర్చోగానే, నా హృదయం అంతా కూడ మీ ప్రేమతో నిండిపోయినట్లు, దానితోనే నా హృదయం మునిగిపోయినట్లు అనిపిస్తుంది. ఇప్పుడు నేను ధ్యానం ఎలా చేయాలి?" అని వ్రాశాను. అప్పుడు వారు, "బిటియా! నీవు దేనికొరకైతే సహజమార్గ సాధన ప్రారంభించావో, దాని యొక్క ఫలితం లభించింది. 'మాలిక్' యొక్క ప్రేమ నీకు ప్రాప్తించింది. నీ సాధన సమాప్తమైంది. ఇప్పుడు నా పని ప్రారంభమైంది" అని వ్రాశారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! ఇప్పటివరకు బోధించిన వాళ్ళు అందరు కూడ, సాధన జీవితాంతం చేయాలి, సాధన ఎప్పుడూ చేస్తూనే ఉండాలి అని చెప్పారు. కాని మీరు మాత్రం, 'సాధన సమాప్తమైంది, ఇప్పుడు నా పని ప్రారంభమైంది' అని అంటున్నారు, ఇదేమిటి" అని ప్రశ్నించారు. అప్పుడు వారు,"భాయీ! వాళ్ళకు అసలు సాధన గురించే తెలియనప్పుడు, ఏం చెప్పుతారు. సాధన చేస్తూనే ఉండండి అనే చెప్పుతారు" అని అన్నారు.

ఎప్పుడైతే అభ్యాసీ యొక్క సాధన సమాప్తమవుతుందో అప్పటి నుండి బాబూజీ యొక్క పని ప్రారంభమవుతుంది. అందువలన నిరంతర స్మరణ అనేది చాలా అవసరం. నిరంతర స్మరణ వలన ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ యొక్క ప్రేమ మీలో నిండిపోతుందో అప్పుడే 'వారి' యొక్క పని ప్రారంభమవుతుంది. అంటే ఇప్పుడు మనం వారి చరణాల యొక్క శరణు పొందామని అర్థం.

బాబూజీ మహరాజ్‌కి నా ప్రార్థన ఏమిటంటే, "బాబూజీ! సాక్షాత్కార సమయంలో నేను పొందినటువంటి ఆ పరమానందం, అందరికీ లభించాలి" అని. బాబూజీ నన్ను ప్రిసెప్టర్‌గా తయారుచేసినప్పుడు, మొదట నేను చేసిన ప్రార్థన ఏమిటంటే, "బాబూజీ! నేను ఎటువంటి సేవ చేయగలగాలంటే అందరికి ఇటువంటి పరమానందం లభించాలి. అలాగే తమపట్ల అభ్యాసీలకు ప్రగాఢమైన ప్రేమ కలగాలి" అని.

ఒకసారి బాబూజీ, ఈశ్వర్ సహాయ్‌గారితో "భాయీ! మనం ఏదైనా పొందాలంటే, ఇంకొక దానిని కోల్పోవాలి" అని అన్నారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మీరు ఈ విధంగా చెప్పితే, ఎవ్వరు కూడ సహజమార్గ సాధనలో చేరడానికి ఇష్టపడరు. ఏదో కోల్పోవడం, పోగొట్టుకోవడం అనే మాట రాగానే, ప్రజలు అందరు కూడ, మా వద్ద ఉన్నదంతా దోచుకోబడుతుంది. మాకు అన్నీ దుఃఖాలు, కష్టాలే ఉంటాయి అని అనుకుంటారు. కనుక ఈ 'కోల్పోవాలి' అనే శబ్దాన్ని మాత్రం ఉపయోగించకండి" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "నేను సత్యమే చెప్పుతాను; కోల్పోవడం యొక్క అర్థం ఏమిటంటే. 'అహం'ను పోగొట్టుకోవడం. 'అహం' అనేది ఎంత చిన్నమాట. ఈ చిన్నమాటకు ప్రజలు భయపడుతున్నారు. తమ సర్వస్వం పోతుంది, అని ప్రజలు అనుకుంటున్నారు" అంటూ మరల వారు, "భాయీ! నీవే చెప్పు. ఈ సాధనను ప్రారంభించిన తరువాత మనం ఏం కోల్పోయాం? మనం దేనిని కోల్పోయామని మన అనుభవం చెప్పుతోంది! ఇదివరకు నిన్ను నీవే ప్రేమించుకునే వాడివి. ఇప్పుడు నీవు అందరినీ ప్రేమిస్తున్నావు; అంతే కదా!" అని అన్నారు.

బాబూజీ, "మీ కష్టాలు, దుఃఖాలు అన్ని నాకు ఇవ్వండి. నాలోని శాంతి, ఆనందాన్ని మీరు తీసుకోండి" అనేవారు. శ్రీ బాబూజీ మరియు స్వామి వివేకానంద కూడా ఈ విధంగానే అనేవారు – ఎవరైనా మహా పురుషులు లేదా మహాశక్తి ఈ భూమి మీద అవతరించినపుడు మానవుల కష్టాలను, దుఃఖాలను, తాము తీసుకొని వాళ్ళకు శాంతి, సుఖాలను ప్రసాదిస్తారు. కాని వారు మాత్రం తమ శిరస్సుపై ముళ్ళ కిరీటం ధరించి, ఇతరులకు శాంతిని, ఆనందాన్ని ఇస్తారు.

ఒకసారి ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! ఈశ్వరుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. కాని ఆ ఈశ్వరుడు ప్రజల యొక్క ఎవరి సుఖదుఃఖాలలో కూడ పాలుపంచుకోడు" అని అన్నారు. అప్పుడు బాబూజీ మహరాజ్, "భాయీ! నీవు ఇది ఎలా చెప్పగలవు? ఈశ్వరుడు అందరి సుఖదుఃఖాలలో పాలుపంచుకొంటాడు. ఎవరికైనా ఎక్కువ బాధ, దుఃఖం కలిగినప్పుడు అతడు 'అయ్యో భగవంతుడా!' అని అంటాడు. నిజానికి అతనికి భగవంతుడు అంటే ఎవరో తెలియదు. కాని నోటి నుండి మాత్రం అప్రయత్నంగానే 'అయ్యో భగవంతుడా!' అనే మాటలు వెలువడతాయి. అంటే భగవంతుడు మన ప్రతి కష్టంలో పాలుపంచుకుంటున్నాడనే కదా అర్థం. 'అయ్యో, భగవంతుడా!' అని అనగానే నీకు ఆ బాధ నుండి కొంచెం ఉపశమనం కలుగుతుంది" అని అన్నారు.

"భగవంతుడు దుఃఖాలలోనే కాదు నీ సుఖాలలో కూడ పాలుపంచుకుంటాడు. నీకు ఎంతటి ఆనందం, ఎంతటి సుఖం కలిగినా, కొంత సమయం తరువాత దానిలో విరామం ఏర్పడుతుంది. ఈ విధంగా ఎందుకు జరుగుతుంది? భగవంతుడే ఆ విధంగా చేసి, ఈ సుఖమే చివరిది కాదు, ఇది ప్రాపంచికమైనది. దీని తరువాత, ఇంకా ముందుకు వెళ్ళితే (ఆధ్యాత్మికంగా) చాలా సుఖం, చాలా ఆనందం ఉంటుంది; ఇక్కడే నీవు ఆగిపోవద్దు" అని భగవంతుడు చెప్పుతున్నాడన్న మాట.

ప్రజలు మేము రాముడు, కృష్ణుడు, శివుడిని పూజిస్తే మాకు శాంతి లభిస్తుంది అని అంటారు. నేను నా అనుభవ పూర్వకంగా చెప్పుతున్నాను. మీరు వాళ్ళను పూజించి చూడండి, రాముడుని పూజించి

చూడండి, మరల బాబూజీని స్మరించి చూడండి; రాముడు మీకు దూరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కాని బాబూజీ మీ వానిగా, మీ సమక్షంలోనే ఉన్నట్లుగా అనిపిస్తుంది. కృష్ణుడు మీకు దూరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కాని బాబూజీని స్మరించగానే, మీరు వారి సామీప్యతను అనుభూతి చెందుతారు. బాబూజీ మీకు చాలా దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తుంది. "రాముడు, కృష్ణుని యొక్క యుగం గడిచిపోయింది. ఇప్పుడు ఇది బాబూజీ యొక్క యుగం. వీరిని శరణు పొందండి" అని స్వయంగా ప్రకృతియే మనకు చెప్తున్నది.

జ్యోతిష్యం, ఫిలాసఫీ అనేది ఒక విద్య. ఎంత చదువుకుంటే అంతగా దానిని గురించి చెప్పగలరు. కాని ఆధ్యాత్మికత అనేది విద్య కాదు. చదువుట వలన రాదు. ఈశ్వర ప్రేమలో మునిగిపోయి, మనలను మనం కోల్పోయినపుడే ఆధ్యాత్మికతను పొందగలం. ఆధ్యాత్మికత అనేది దైవంతో కనెక్షన్ కలిగి ఉంది. ఆధ్యాత్మికత అనేది శక్తి రూపంలో బాబూజీ విరాట్ హృదయం నుండి మన హృదయంలోకి ప్రసారం చేయబడుతుంది. ఆ శక్తి మనలను ఈశ్వరునిలో లయం కావడానికిగాను, ఏ విధంగా తయారుచేయాలో ఆ విధంగా తయారుచేస్తుంది.

సైంటిస్ట్‌లు భౌతికమైన వాటితో ఫ్యాన్స్, విమానాలు తయారుచేసి నడిపిస్తున్నారు. ఈ విమానాలు పూర్వకాలంలో కూడా ఉండేవి. అవి భౌతిక వస్తువులతో, భౌతిక శక్తితో తయారు చేయబడలేదు. పూర్వం ఋషులు తమ శక్తితో విమానాన్ని తయారు చేసేవారు. అవి ఆ శక్తితోనే ప్రయాణించేవి. అగ్ని బాణాలు వేసేవారు. అవి భౌతికంగా తయారైనవి కావు. తమ శక్తితో వారు ఆ బాణాలను చార్జ్ చేసేవారు. బాబూజీ కూడ తమ దివ్య శక్తితో మనలను చార్జ్ చేస్తున్నారు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! కౌరవులు, పాండవులు అన్నదమ్ములు కదా! మరి పాండవులు తమ సోదరులే, అయినా కౌరవులను ఎందుకు చంపారు? కొన్ని సందర్భాలలో యుద్ధ నియమాలకు విరుద్ధంగా, అధర్మంగా కౌరవులను చంపారు. పాండవులకు ఎందుకు పాపం అంటుకోలేదు?" అని అడిగాడు. అప్పుడు వారు, "భాయీ! పాండవులు శ్రీకృష్ణుని యొక్క శరణాగతిలో ఉన్నారు. శ్రీకృష్ణుడు వాళ్ళతో –నేను ఏ విధంగా చెప్పితే మీరు ఆ విధంగా యుద్ధం చేయండి, అని అన్నాడు. శ్రీకృష్ణుడు ఏది చెప్పితే వాళ్ళు అదే చేసారు. కృష్ణుడు అవతార పురుషుడు కనుక వారికి ఏ పాపం అంటుకునే ప్రశ్నేలేదు కదా!" అని అన్నారు.

శ్రీకృష్ణ భగవానుడు "నేను పక్షులలో ఉన్నాను. వృక్షాలలో ఉన్నాను. పర్వతాలలో ఉన్నాను. నదులలో ఉన్నాను. ప్రకృతి అంతటిలోను ఉన్నాను" అని భగవద్గీతలో చెప్పారు. దీని అర్థం ఏమిటంటే, "నేను అంతటా ఉన్నాను. సమస్తం నందు వ్యాపించి ఉన్నాను. కేవలం నన్నే పూజించండి, నన్నే పొందండి" అని శ్రీకృష్ణుడు చెప్పాడు. కాని ప్రజల ఆలోచనాస్థాయి ఎంతగా దిగజారిపోయింది అంటే, కృష్ణుడు "నేను వృక్షాలలో కూడ ఉన్నాను అని చెప్పాడు కదా!" అని ప్రజలు శ్రీకృష్ణుని విడిచిపెట్టి వృక్షాలను పూజిస్తున్నారు.

ఒకసారి బాబూజీ మహరాజ్, లాలాజీ సాహెబ్‌తో "హూజూర్! నేను బ్రైటర్‌వరల్డ్‌లో పతంజలి గురించి అంతటా వెదికాను. కాని నాకు అతడు ఎక్కడా కనబడలేదు" అని అన్నారు. అప్పుడు లాలాజీ సాహెబ్, "నీ లోపలనే చూడు, అతడు కనిపిస్తాడు" అని అన్నారు. లాలాజీ సాహెబ్ చెప్పిన దానిని తప్పుగా

అర్థం చేసుకొని, పతంజలియే ఇప్పుడు బాబూజీ రూపంలో, ఆత్మోద్ధరణ కొరకు వచ్చాడని కొందరు అంటున్నారు. “మహాత్ముల మాటలకు ఎన్నడూ మనం మనకు తోచిన అర్థం చెప్పకూడదు” అని బాబూజీ అనేవారు. మహాత్ముల వాక్యాలకు మనం వివరణ ఇచ్చినట్లయితే, అది తప్పు అర్థానికి దారి తీస్తుంది. పైదాని అర్థం ఏమిటంటే, “నేను అంతటా వ్యాపించి ఉన్నాను” అని శ్రీకృష్ణుడు చెప్పిన విధంగానే, లాలాజీ సాహెబ్ కూడ చెప్పారు. “పతంజలి గురించి నీవు ఎక్కడ వెదుకుతావు? అందరు కూడ నీలోనే, నీ సంకల్పం లోపలనే ఉన్నారు. నీవు ఈ అందరి యొక్క ఆత్మోద్ధరణ కొరకు వచ్చావు” అని బాబూజీతో అన్నారు. కనుక మనం మహాత్ములు చెప్పిన దానిని మన స్వంత తెలివితో తప్పుగా అర్థం చేసుకోరాదు. ఎప్పటికి కూడ ప్రేమ, భక్తి మరియు బాబూజీ మహరాజ్ చరణాల వద్ద శరణాగతి తప్ప మనకు ఇంకా ఏదీ వద్దు.

గత సంవత్సరం నేను విజయవాడలో ఒక పత్రం చదివాను. దానిని మీరు జాగ్రత్తగా చదివినట్లయితే మీ మనస్సులో మీకు ఎటువంటి సందేహం రాదు. మానవులు ఈశ్వరప్రాప్తిని పొందటానికి బాబూజీ సహజమార్గ శిక్షణతో శ్రీరామచంద్ర మిషన్ అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థలో చేరడానికిగాను ప్రశిక్షకుని వద్ద మూడు సిట్టింగ్స్ తీసుకోవాలి. ప్రతిరోజు ఇంటి వద్ద ధ్యానం, క్లీనింగ్, రాత్రి – ప్రార్థన చేయాలి. దశాదేశాలను పాటించాలి. ఇవి అన్నీ కూడ శ్రీరామచంద్ర మిషన్ సంస్థ యొక్క నియమావళి మాత్రమే. మీరు శ్రీరామచంద్ర మిషన్‌లో చేరారు అంటే ఒక ఆధ్యాత్మిక సంస్థలో చేరారని అర్థం. కాని వాస్తవంగా మీరు బాబూజీ దృష్టిలో, శ్రీరామచంద్ర మిషన్‌లో చేరడానికి మీరు ఆ స్థితిని పొందవలసి ఉన్నది. మీరు అభ్యాసీలుగా చేరినప్పటికిని ఆ స్థితిని పొందనంతవరకు కూడ మీరు శ్రీరామచంద్ర మిషన్‌లో చేరనట్లే. ఆ స్థితి ఏమిటి? వాస్తవానికి శ్రీరామచంద్ర మిషన్ అంటే ఏమిటి? ఇంగ్లీష్‌లో ‘మిషన్’ అంటే సంకల్పం అనే అర్థం. నిజానికి బాబూజీ యొక్క మిషన్ (సంకల్పం) అంటే ఏమిటి? సమస్త మానవాళిలో ఈశ్వరప్రాప్తి యొక్క తీవ్రమైన కోరికను మేల్కొలపాలి, అనేది బాబూజీ యొక్క సంకల్పం (మిషన్). ఎప్పుడైతే మీరు పురోగతి చెందుతూ, “నేను ఏ విధంగానైతే పురోగతి చెందుతున్నానో, అందరు కూడా, సమస్త మానవాళి, నాలాగ పురోగతి చెందాలి” అనే ఆలోచన, ఫీలింగ్ నిరంతరం మీలో కలుగుతుందో, అప్పుడే మీరు శ్రీ బాబూజీ మహరాజ్ యొక్క శ్రీరామచంద్ర మిషన్‌లో చేరారని అర్థం. ఏ (మిషన్) సంకల్పంతోనైతే బాబూజీ వచ్చారో, మీరు కూడా ఇప్పుడు వారి (మిషన్) సంకల్పంలో చేరారని అర్థం. ఈ విధంగా, ఇటువంటి నిజమైన అభ్యాసీలు ఏ ఒక్కరో, ఇద్దరో మాత్రమే ఉంటారని బాబూజీ అనేవారు. కాని అటువంటి అభ్యాసీలు తప్పకుండా ఉంటారు. ఇంత పెద్ద భవనం నిర్మించారు. ఇదే శ్రీరామచంద్ర మిషన్ అని ఇక్కడే ఆగిపోతే, మీరు అసలైన శ్రీరామచంద్ర మిషన్ అనగా బాబూజీ యొక్క (మిషన్) సంకల్పంలో చేరడానికి అవసరమైన ఆ స్థితిని ఎప్పుడు పొందుతారు?

శ్రీరామచంద్ర మిషన్ యొక్క మేనేజర్ ఎవరినైనా తీసివేయవచ్చు. కాని శ్రీరామచంద్ర మిషన్ యొక్క స్థాపక అధ్యక్షులైన బాబూజీ మహరాజ్ అందరినీ అక్కడికి (అల్టిమేట్) తీసుకుని వెళ్ళడానికే వచ్చారు. బాబూజీని నిందించినా కూడా, వారు ఈ రోజు కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి అయినా

సరే, అందరినీ అక్కడికి తీసుకొని వెళ్ళతారు. ఈ రోజున చారీజీ నోటిలో నుండి బాబూజీ అనే మాట ఎందుకు వస్తున్నది. ఎందుకంటే, బాబూజీ మహరాజ్ వారిని దివ్య సౌందర్యంతో తయారుచేసారు కాబట్టి. చారీజీ శ్రీరామచంద్ర మిషన్ యొక్క మేనేజర్ మాత్రమే. శ్రీరామచంద్ర మిషన్‌లో బాబూజీ మహరాజ్ మాత్రమే శాశ్వతంగా 'మాస్టర్'.

రాక్షసులు శాంతికి భంగం కలిగిస్తున్నారు కనుక వాళ్ళను సంహరించటానికి రాముడు అవతరించాడు. శక్తి సంపన్నులైన వారు, తమ శక్తిని దుర్వినియోగం చేస్తున్నారు కనుక వాళ్ళను సంహరించటానికి శ్రీకృష్ణుడు అవతరించాడు. అందువలన అవతారాలకు ఒకే రకమైన సంకల్పం ఉండదు. ఈశ్వరుని మరచిపోయి, నిద్రాణమై ఉన్న మానవాళిలో తమ ఈశ్వరీయ శక్తితో మరల మానవుడ్ని జాగృతం చేయాలనే ఒక (మిషన్) సంకల్పంతో అవతరించారు బాబూజీ. అందువలన బాబూజీ తరువాత ఎవరు వచ్చినా, వారందరు బాబూజీ ఫాలోవర్స్ (అనుసరించే వారు) మాత్రమే అవుతారు. అందువలన ఫాలోవర్ (అనుసరించే వారు) ఎప్పుడు కూడా అధిపతి కాలేరు. ఒకవేళ ఈ రోజున బడాబయ్యా మేనేజర్‌గా లేకపోయినట్లయితే, ఇంకెవరో ఒకరు ఈ సంస్థకు మేనేజర్‌గా ఉండేవారు. వీరి తరువాత కూడా మరొకరు మేనేజర్‌గా ఉండి, సంస్థ యొక్క నిర్వహణను చూస్తారు. ఈ విధంగా శ్రీరామచంద్ర మిషన్‌లో ఎంతోమంది మేనేజర్లు వస్తూనే ఉంటారు. కాని బాబూజీ మాత్రం బాబూజీయే. ఇంకొక బాబూజీ ఎవరు కూడా రాలేరు. ఈ మేనేజర్లు అందరు కూడా శ్రీబాబూజీ మహరాజ్ యొక్క మార్గదర్శకత్వంలో వారి శక్తితోనే పనిచేస్తారు. (విద్యుత్తు) ఎలక్ట్రిసిటీతో కనెక్షన్ లేకుండా స్విచ్ వేస్తే బల్బు వెలుగుతుందా? ఎప్పటికి వెలగదు. అందువలన మీరందరు లక్ష్యంతో ధృడమైన కనెక్షన్ ఏర్పరచుకోండి. ఎవరైనా తప్పుచేస్తే, వారిని కూడా సరిచేసి దృఢంగా తయారుచేయండి. బాబూజీ నాకు ఉత్తరాలలో వ్రాశారు, ఎన్నోసార్లు చెప్పారు, "అధ్యాత్మికతలో నేను ఎవరిని కూడా బిచ్చవానిగా ఉంచలేదు" అని. దీని అర్థం ఏమిటి? ఆధ్యాత్మికత అనే నిధిని వారు అందరి హృదయాలలో నింపారు. ఆధ్యాత్మికత అనే బీజం వారు అందరి లోపల నాటారు. మనలో భక్తి ఎంతగా అభివృద్ధి చెందితే, ఆధ్యాత్మికత అనేది అంతగా వికసిస్తుంది. కనుక ఎప్పటికీ శ్రీ బాబూజీయే శ్రీరామచంద్ర మిషన్‌లో 'మాస్టర్'. అభ్యాసీ, ప్రిసెప్టర్, మిషన్ మేనేజర్ ఎవరైనాసరే శ్రీబాబూజీ మహరాజ్ నుండి ప్రవహించే ఈశ్వరీయ శక్తితోనే ముందుకు వెళ్ళగలరు. శ్రీబాబూజీ మహరాజ్ యొక్క శక్తి లేకుండా ఎవరూ పురోగమించలేరు.

నా బాబూజీ అందరి మీద పని చేస్తూనే ఉన్నారు. నాతో పని చేయిస్తూనే ఉన్నారు. నేను వారిని నా సమక్షంలోనే చూస్తున్నాను. అల్పమైన ఆలోచనలు ఎవ్వరికీ ఉండకూడదు. డాక్టరుగారు మిమ్మల్ని ఎందుకు పంపుతున్నారు? మీరంతా శ్రమపడి ఎందుకు వస్తున్నారు? బాబూజీ శక్తితో నింపబడాలని, శక్తి సంపన్నులు కావాలని, మంచి అభ్యాసులు కావాలని, 'వారి' అనుగ్రహం పొందాలని వస్తున్నారు. బాబూజీ అనే ఒకే ఒక ఆలోచన కలిగి ఉండండి.

డాక్టర్ సాహెబ్ (డా. పార్థసారథిగారు) యొక్క పరిశ్రమ, మీరందరు ఇక్కడకు రావడానికి మీ ప్రయత్నం యొక్క ఫలితం ఏమిటి అయి ఉండాలంటే, మీరందరు కూడా లక్ష్యం సాధించాలనే

దృఢమైన సంకల్పం కలిగి ఉండాలి. నిజమైన మంచి అభ్యాసీగా మార్పు చెందాలి. అప్పుడే డాక్టర్ సాహెబ్ యొక్క శ్రమకు ఫలితం లభిస్తుంది. బాబూజీ అభ్యాసీల నుండి ఒక్క పైసా కూడా కోరలేదు. కాని ఈ రోజున ఎవరైనా సరే డబ్బులు ఇవ్వనిదే మీరు అడుగు పెట్టడానికి వీలు లేదు. మీకు వాళ్ళ దర్శనం కూడా లభించదు. ఒకవేళ మీరు (అసలీయత్) వాస్తవికతను అనగా బాబూజీని విడిచిపెట్టినట్లయితే ప్రతిదీ, అన్నీ కూడా తప్పు అర్థంగా మారిపోతాయి. బాబూజీ దర్శనం కోసం ఎవరైనసరే వచ్చినట్లయితే, "వెళ్ళి ఫలానా అభ్యాసీని పిలుచుకొని రండి, ఆ అభ్యాసీని పిలవండి" అని బాబూజీ ఆహ్వానం పంపించేవారు. అతడు చాలా ధనవంతుడు, ఇతడు చాలా గొప్పవాడు అని బాబూజీ ఎప్పుడు అనేవారు కాదు. బీదవాడు అయినా సరే, ఆ అభ్యాసీని పిలుచుకుని రండి అని అనేవారు.

షాజహాన్‌పూర్‌లో యోగాశ్రమం నిర్మించబడిన తరువాత, బాబూజీ రాత్రి 9 లేదా 9.30 వరకు ఆశ్రమంలోనే ఉండి, ఆ తరువాత ఇంటికి వెళ్ళేవారు. ఒకసారి రాత్రి 11 గంటలకు 10, 12 మంది అభ్యాసీలు దక్షిణ భారతదేశం నుండి షాజహాన్‌పూర్ ఆశ్రమానికి వచ్చారు. చాలా రాత్రి అయింది, ఆలస్యం అయ్యింది అని గేట్‌కీపర్ గేటు తీయలేదు. అప్పుడు ఆ అభ్యాసీలు బాబూజీ ఇంటికి వెళ్ళారు. బాబూజీ తొందరగా తలుపులు తెరిచి, లోపలికి రమ్మని ప్రేమతో ఆహ్వానించారు. భోజనం చేస్తారా? అని అడిగారు. ఇంత రాత్రి సమయంలో భోజనం ఎలా ఉంటుంది అని వాళ్ళు మనసులో అనుకొని, భోజనం చేసామని చెప్పారు. బాబూజీ వాళ్ళందరికి టీ ఇచ్చారు. మరునాడు ఉదయం బాబూజీ వాళ్ళందరిని తనతోపాటుగా ఆశ్రమంకు తీసుకొని వచ్చారు. గేట్ కీపర్‌ను మరియు ఆశ్రమం నిర్వహణలో ఉన్నవారినందరిని పిలిచి బాబూజీ మహరాజ్ ఇలా అన్నారు:

"ఈ అభ్యాసులందరు కూడా తమ రక్తాన్ని చెమటగా మార్చి శ్రమదానం చేసి డబ్బులు ఇచ్చి ఈ ఆశ్రమం నిర్మించారు. ఇందులో నాది ఏమి లేదు. నేను ఈ ఆశ్రమాన్ని శక్తితో ఛార్జి చేసాను. ఈ ఆశ్రమం అభ్యాసులది. మీ మీద నాకు ఎటువంటి ఫిర్యాదు లేదు. కాని మీరు ఆశ్రమంలోనికి ఆభ్యాసీలు రాకుండ గేటు తీయకపోతే మాత్రం భవిష్యత్తులో మీరు ఇక్కడ ఉండటానికి వీలులేదు" అని మరల, "ఏ రోజునయితే ఆభ్యాసీలను ఆశ్రమంలోనికి రాకుండా చేస్తారో, ఆ రోజున ఈ ఆశ్రమం అనేది ఆశ్రమంగా ఉండదు" అని అన్నారు.

"ఎటువంటి మాయ లేదు, భయం లేదు, భ్రమ లేదు. నేను కూడా లేను. నీవు మాత్రమే నా దగ్గర ఉన్నావు" అని కబీర్ ఒక స్థితి గురించి వర్ణించాడు. ఎప్పటివరకైతే మీరు ఈ విధంగా మార్పు చెందరో, అప్పటివరకు 'వారు' మీ వద్దకు రాలేరు. మీరు వారికి దూరంగానే ఉంటారు. ఎప్పుడైతే మీరు ఒక నిజమైన అభ్యాసీగా మార్పుచెంది, వారి సంకల్పం (మిషన్)కు అనుగుణంగా మారుతారో, అప్పుడు వారి పనిలో కూడ, మీ ఆలోచన ఆనేది తప్పకుండా ఉంటుంది.

శ్రీరామచంద్ర మిషన్‌లో ఒకటి మాత్రం యధార్థం – శ్రీరామచంద్రజీ అనగా బాబూజీ కాకుండా ఇంకొక బాబూజీ ఎవ్వరు కూడా ఉండరు. ఒకసారి లాలాజీ సాహెబ్ బాబూజీతో, "ప్రెసిడెంట్స్, రిప్రజెంటేటివ్స్ (ఆధ్యాత్మిక ప్రతినిధులు) వేలకొలది వస్తూనే ఉంటారు. కాని నీవు మాత్రం ఒక్కనివే ఉంటావు. నీకు

బదులు (సబ్‌స్టిట్యూట్)గా ఇంకొకరు ఎప్పుడు కూడా ఉండరు; అలా తయారుచేయబడలేరు" అని అన్నారు. ఎందుకంటే బాబూజీ మహరాజ్ అంతిమసత్యం నుండి అవతరించారు. మరల ఆ అంతిమసత్యం నుండి ఇంకొక బాబూజీని ఎవరు తీసుకొని రాగలరు? కనుక ఎప్పటికీ ఈ బాబూజీయే మన బాబూజీ.

మీరాబాయి ఒంటరిగా ఉన్నప్పుడు, ఎవరితోనో మాట్లాడుతోందని, ఆమె భర్తకు సోదరుడైన రాణాతో అంతఃపురంలోని వాళ్ళు ఫిర్యాదు చేస్తారు. మీరా ఒక రాణి అయి ఉండి కూడా ఎవరితోనో మాట్లాడుతోంది అనే విషయం తెలియగానే రాణా (రాజు) ఒక గూఢాచారిని నియమించాడు.

ఒకరోజున "రాజా! ఇప్పుడు ఎవరో ఒక వ్యక్తితో మీరా మాట్లాడుతోంది" అని గూఢాచారి చెప్పగానే రాణా మహారాజు కోపంతో ఖడ్గం తీసుకొని ఆ అపరిచిత వ్యక్తిని చంపివేయడానికి మీరా వద్దకు వస్తాడు. కాని అతనికి అక్కడ ఎవరు కనబడలేదు. మీరా మాత్రం మాట్లాడుతూనే ఉంది.

"మీరా! నీవు మాట్లాడుతున్న వ్యక్తి ఎవరో చెప్పు. అతడ్ని ఎక్కడ దాచిపెట్టావో చెప్పు. ఇప్పుడు అతడ్ని, నిన్ను మీ ఇద్దరిని చంపివేస్తాను" అని ఖడ్గాన్ని చేతిలో పట్టుకొని కోపంగా అన్నాడు. అప్పుడు మీరా నవ్వుతూ, "రాజా! నేను శ్రీకృష్ణునితో మాట్లాడుతున్నాను. కృష్ణుడు నా లోపలనే ఉన్నాడు. అతడ్ని నీవు తిట్టలేవు, చంపలేవు. మీరా నీ ఎదుటనే నిలబడి ఉన్నది, కాని ఆమె కృష్ణునిలోపల ఉన్నది. నీవు ఎన్నిసార్లు ఖడ్గం ఎత్తినా మీరాను ఏమి చేయలేవు. కాని ఒకవేళ నీవు మీరాగా మారిపోతే అప్పుడు నీకు కృష్ణుడు కనిపిస్తాడు" అని అనగానే రాణా వెనుకకు మరలి వెళ్ళిపోయాడు.

దీని వలన లక్ష్యాన్ని సాధించడానికి అచంచలమైన సంకల్పాన్ని కలిగి ఉండాలని మనకు తెలుస్తుంది. ఎవరైనా ఏదైనా తప్పు చెప్పితే, వాళ్ళు కూడా బాబూజీ మహరాజ్ యొక్క శరణులోకి వచ్చే విధంగా మీరు వాళ్ళకు వివరించి చెప్పాలి.

బాబూజీ శ్రీరామచంద్ర మిషన్ స్థాపించినప్పుడు ప్రారంభంలో షాజహాన్‌పూర్‌లోని వారు చాలామంది బాబూజీని వారి ఎదుటనే విమర్శించేవారు, నిందించేవారు. వేరే ఊళ్ళ నుండి కూడా అభ్యాసీలు బాబూజీ ఇంటికి రావడం మొదలైనపుడు ఇరుగుపొరుగు వాళ్ళు, ఆ వీధిలోని వారు, "బాబూజీ ఈ వ్యాపారం (బిజినెస్) కూడా మొదలుపెట్టారా!" అని, వారి గురించి చెడుగా విమర్శించేవారు.

ఒక అభ్యాసీ ఇదంతా చూసి, "బాబూజీ! అందరూ మీ ఎదుటనే మిమ్మల్ని నిందిస్తున్నారు, విమర్శిస్తున్నారు. ఇది మీకు బాధగా అనిపించడం లేదా!" అని అడిగాడు. అప్పుడు వారు, "భాయీ! ఎవరైనా చెడుగా మాట్లడితే, తమ నోటితోనే మాట్లాడుతారు. ఎవరైనా చెడును వింటే, తమ చెవులతోనే వింటారు. కాని చెడుగా మాట్లాడటానికి నా దగ్గర నోరు లేదు. చెడు మాటలు వినడానికి నా దగ్గర చెవులు కూడా లేవు. కాని నా లాలాజీ సాహెబ్ గురించి మాత్రం ఎవరైనా మాట్లాడితే అప్పుడు ఆ మాటలు నాకు వినబడతాయి" అని అన్నారు.

లాలాజీ సాహెబ్‌పట్ల వారికిగల ప్రేమ ఎంత ఉన్నతమైనదో! మనం కూడ వారిలాగనే, వారి ప్రేమను కాపీ (నకలు) చేయాలి, అటువంటి ప్రేమనే బాబూజీపట్ల కలిగి ఉండటానికి ప్రయత్నించాలి.

బాబూజీ ఎప్పుడు కూడా అభ్యాసీల శ్రేయస్సు గురించే ఆలోచించేవారు. అభ్యాసీలకు ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి శక్తి) ఇస్తూ, వాళ్ళ మీద పనిచేస్తూ రాత్రి కూడా పూర్తిగా నిద్రపోయేవారు కాదు. భోజనం చేయాలి అనే ఎరుక కూడా వారికి ఉండేది కాదు. ఎల్లవేళలా అభ్యాసీలకు ఏం సేవ చేయాలా, అని ఆలోచిస్తూ ఉండేవారు.

ఈ సహజమార్గ శిక్షణ కొరకు బాబూజీ ఎవరినో ఒకరిని తన ప్రతినిధిని నియమించవలసినదే. సహజమార్గ శిక్షణ గురించి అందరికి చెప్పడం, ప్రశిక్షకులను తయారుచేయడం అనేది ప్రతినిధి చేసే పని.

బాబూజీ చెప్పిన మాటలు యొక్క నిజమైన ఆర్థాన్ని గ్రహించినట్లయితే ఆశ్రమం అంటే ఇంత పెద్ద బిల్డింగ్ అనే ఆలోచన సమాప్తమైపోతుంది. బాబూజీ "ప్రతి అభ్యాసీ యొక్క ఇల్లు ఒక ఆశ్రమంగా మారిపోవాలి అని ఆశిస్తున్నాను. ఎందుకంటే ఎవరైనా బాధలు, అశాంతితో ఉన్న వ్యక్తి ఆ ఇంటిలోనికి రాగానే అతనికి శాంతి, ప్రశాంతత లభిస్తుంది" అని అనేవారు.

ఎవరైనా ఎండలో నడచి వచ్చి, ఇంటిలోపలికి రాగానే మనం ఫ్యాన్ వేసి, అతనికి త్రాగడానికి చల్లటి నీళ్ళు ఇచ్చినట్లయితే అతనికి ఎంత సుఖంగా ఉంటుందో అదే విధంగా ఈ ప్రాపంచకమైన విషయాలతో సతమతమై, అశాంతితో ఉన్న వ్యక్తి, ఆ ఇంటిలోనికి రాగానే అతని మనస్సుకు విశ్రాంతి లభిస్తుంది. అతనికి ఆ ఇంటిలో శాంతి లభిస్తుంది. అప్పుడే బాబూజీ చెప్పినట్లుగా ఆ ఇల్లు ఆశ్రమంగా అవుతుంది.

బాబూజీ మహరాజ్ ఆశ్రమాన్ని తమ దివ్యశక్తితో ఛార్జ్ చేస్తారు. అదేవిధంగా వారు మనలను కూడా తమ దివ్యశక్తితో ఛార్జ్ చేస్తున్నారు. కాని అభ్యాసీలు ఆ ఛార్జింగ్ యొక్క ఫలితాన్ని ఉపయోగించుకోవటం లేదు. ఈ మనస్సుతో ఆలోచించినట్లయితే బాబూజీని గురించే ఆలోచన చేయండి, బాబూజీని గురించే చదవండి. వారు చెప్పిన మాటలను గురించి మననం చేయండి. వారు ఏ విధంగా చెప్పారు, ఎంత ఉన్నత స్థాయిలో చెప్పారనే వాటినే మనం ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి. అప్పుడే మీరు సరైన పద్ధతిలో వెళ్తున్నారని గుర్తించబడుతుంది.

బాబూజీ చెప్పింది ఒకటి చాలా చిన్న విషయమే. కాని దానిలో ఎంతో గొప్పశిక్షణ ఇమిడి ఉంది. బాబూజీకి దినేశ్‌చంద్ర అనే పేరుగల 18 సం॥ల కుమారుడు ఉన్నాడు. పరీక్షలో ఫెయిల్ అయ్యాడని అతడు పిస్తోల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జరిగిన తరువాత బాబూజీని పరామర్శించడానికి చాలామంది వచ్చారు. అప్పుడు డా॥ కె.సి.వరదాచారిగారు, "బాబూజీ! ఇంత పెద్ద దురదృష్టకరమైన సంఘటన జరిగింది. మిమ్మల్ని చూడటానికి చాలామంది వచ్చారు. కాని మీరు అసలు ఏడవటమే లేదు. మీలో బాధ, దుఃఖం ఏమీ లేవు" అని అనగానే, బాబూజీ ఎంతో శాంత స్వరంతో, "డాక్టర్‌జీ! దినేష్ జ్ఞాపకం వచ్చిన ప్రతీసారి అతని ఆత్మ ఉన్నత స్థితిని పొందాలని, లాలాజీ సాహెబ్‌ను ప్రార్ధిస్తాను. ఇంక ఇక్కడ ఉన్న వాళ్ళకు సేవ చేస్తున్నాను. అందువలప ఏడవటానికి నా వద్ద సమయం లేనేలేదు" అని అన్నారు.

రాముడు వనవాసానికి వెళ్ళాడు. రాజ్యపాలనను భరతునికి అప్పగించాలి. అప్పుడు భరతుడు, "నేను ఎప్పుడు కూడ ఈ రాజ సింహాసనం మీద కూర్చోను. మీ చరణ పాదుకలను ఈ సింహాసనం మీద ఉంచి, ఈ చరణ పాదుకల నుండి ఆశీస్సులను పొందుతూ నేను ఈ రాజ్యం యొక్క పరిపాలనను చూసుకుంటాను" అని రామునితో అన్నాడు.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! ఈ ప్రపంచంలో దుఃఖం యొక్క సమయం ఎక్కువగా ఉంటుంది, కాని సుఖం యొక్క సమయం తక్కువగా ఉంటుంది. ఎందుకని?" అని అడిగాడు. అప్పుడు బాబూజీ, "భాయీ! నీవు ఉల్టా (తిరగవేసి) చెప్పుతున్నావు. ఈ ప్రపంచంలో దుఃఖం యొక్క సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఉదాహరణకు నీవు 4,5 రోజులు అనారోగ్యంతో ఉన్నావు అనుకో. ఎన్నో రోజుల నుండి అనారోగ్యంగా ఉన్నట్లుగా, బలహీనంగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఎందుకుంటే బాధ, దుఃఖం అనేవి మనకు ఇష్టం లేదు, మనం కోరము కనుక. 'అయ్యో! బాధల్లో ఉన్నాం, కష్టాల్లో ఉన్నాం' అని మరల మరల దుఃఖాన్నే జ్ఞాపకం చేసుకుంటూ సుఖాన్ని త్వరగా మరచిపోతాం" అని అన్నారు. ఇది మన అందరికి అనుభవమైన విషయమే. ఎవరైనా మన బంధువులు చనిపోతే, మొదటి రోజు ఉన్న దుఃఖం, రెండవ రోజున ఈశ్వరుని కృప వలన సహజంగానే తగ్గిపోతుంది. మూడవ రోజున ఆ బాధ, దుఃఖం ఇంకా తగ్గిపోతుంది. ఈ దుఃఖం యొక్క సమయాన్ని తగ్గించింది ఎవరు? ఈశ్వరుడే! అందువలన ప్రతి కష్టంలోను ఈశ్వరుడు మనతోనే ఉండి, దుఃఖాన్ని మన నుండి పారద్రోలుతాడు. కాని మనం మాత్రం సుఖాన్ని చాలా త్వరగా మరచిపోతాం.

ఒకసారి బాబూజీ, "బిటియా! హృదయంలో (పెయిన్) బాధను ఏర్పరచుకో" అని అన్నారు. "గాయం కాకుండా బాధ ఎలా కలుగుతుంది?" అని నేను మనస్సులో అనుకున్నాను. అప్పుడు బాబూజీ, "గాయం అనేది ప్రతిక్షణం అవుతూనే ఉంది. కాని నీవు దానిని గుర్తించడం లేదు. ఎందుకంటే ఆ గాయాన్ని నీవే చేసుకుంటున్నావు. అనగా నీ సంస్కారాలు నిన్ను అనుక్షణం గాయపరుస్తున్నాయి. కాని నీవు దాన్ని ఫీల్ అవడం లేదు" అని అన్నారు. మరల వారు, "బిటియా! ఈశ్వరుని పొందటం కోసం నీలో తీవ్రమైన తపన పెంపొందించుకో, హృదయంలో తీవ్రమైన బాధను ఏర్పరచుకో" అని అన్నారు. శ్రీ బాబూజీ యొక్క ధ్యానం వలన, వారి ప్రాణాహుతి శక్తి మనలోపల ఉన్న గాయాలను (సంస్కారాలను) ఏ విధంగా త్రోసివేస్తుందంటే, అప్పుడు మన హృదయం పరమ పవిత్రంగా మారిపోతుంది.

**ప్రశ్న: మహాప్రళయ సమయంలో సృష్టి అంతమైపోయినప్పుడు, అందరు కూడా ఆ (అల్టిమేట్) అంతిమంలో విలీనమైపోతారా?**

**జవాబు:** సృష్టి అంతా కూడా బాబూజీ యొక్క సంకల్పంతో లయమైపోతుంది. అంతేకాని అప్పుడు అందరు ఆ (అల్టిమేట్) అంతిమంలో విలీనం కారు. 'వారి' సంకల్ప శక్తితో ఈ సృష్టి ఏర్పడింది. మరల ఈ సృష్టి 'వారి' సంకల్పంలోనే లయమైపోతుంది. ఈ విషయాన్నే నేను మీకు చెబుతున్నాను. మానవమాత్రు లందరికి ఈశ్వరప్రాప్తి కలిగించాలనే సంకల్ప శక్తితో బాబూజీ ఈ ధరణి మీద అవతరించారు. అందువలన

బాబూజీ మన వారు కనుక రాబోయే తరాలవారు కూడా బాబూజీ మహరాజ్ యొక్క సంకల్పం నుండియే శక్తిని పొందుతారు.

దృఢ సంకల్పం యొక్క స్థితి ఏ విధంగా ఉంటుంది అనడానికి నేను మీకు ఒక చిన్న ఉదాహరణ చెప్పుతాను. "బాబూజీ నాకు చాలా ఇష్టమైనవారు, ఈ ప్రపంచంలో నాకు అన్నింటి కంటే కూడా 'వారు' చాలా ఇష్టమైన వారు, అనే ఒక సంకల్పం నాలో అభ్యాస కాలంలోనే ఏర్పడింది. ఆ రోజులలో స్త్రీలు బజారుకు వెళ్ళేవారు కారు. ఎవరైనా క్రొత్తవారు ఇంటికి వస్తే మేము పరదాచాటునే ఉండేవాళ్ళం. ఒకసారి చీరలు అమ్మే వ్యాపారి ఒకతను మా ఇంటికి వచ్చాడు. అందులో ఒక చీరను చూడగానే, ఈ చీర చాలా బాగుందనే అలోచన ఒకటి నా మనస్సులోకి వచ్చింది. వెంటనే, ఒక్కసారిగా నాలోని ఆ 'దృఢ సంకల్పం' ఈ ప్రపంచంలో అన్నింటి కంటే కూడా నీకు ఇష్టమైనది 'బాబూజీ' అని అన్నావు కదా! –అని నాతో అన్నది. వెంటనే ఆ చీర మీద ఉన్న ఆకర్షణ తొలగిపోయింది. ఆ 'సంకల్పం' నా దృష్టిని ఆ ఆకర్షణవైపు వెళ్ళకుండా చేసింది.

అప్పుడప్పుడు ఏదైనా పుష్పాన్ని చూసినపుడు, ఈ పుష్పం ఎంత మనోహరంగా, ఆకర్షణీయంగా ఉంది. దీనిలో చాలా సువాసన ఉందే అని అనిపించగానే "సువాసన అనేది కేవలం ఈశ్వరీయ ధారలోనే ఉంది" అనే ఆలోచన వచ్చేసేది. అప్పుడు నాకు ఈ విధంగా అనిపించేది –ఈ పుష్పంలో సువాసన ఉంది. కాని ఉదయం నుండి రాత్రి వరకు మరల మరల ఆ సువాసనను పీల్చినప్పటికీ, ఆ పుష్పంలో ఉన్నదాని కంటే మరింత ఎక్కువ సువాసన మాత్రం లభించదు. ప్రకృతి ఆ పుష్పంలో సువాసనకు ఒక పరిమితిని ఏర్పరచింది. కాని బాబూజీ వలన పొందే పరమానందానికి ఎటువంటి పరిమితీ లేదు. బాబూజీ ద్వారా లభించే ఆ పరమానందం అనంతం. వారిని ఎంత ప్రేమించినా సరే, అది చాలా తక్కువే అని మనకు అనిపిస్తుంది. ఎందుకంటే 'వారు' అనంతం కాబట్టి!

**ప్రశ్న: మన మిషన్‌లో అందరు ఎప్పుడు ఒకటిగా అవుతారు? ఈ గ్రూపులు అనేవి ఉండకూడదు కదా!**

**జవాబు:** మానవునిలో ఎప్పటివరకైతే అహం అనేది ఉంటుందో అప్పటివరకు ఈ గ్రూపులు అనేవి ఉంటాయి అని నేను దృఢంగా చెప్పగలను. బాబూజీ మహరాజ్ మన అందరి కొరకు వచ్చారు. ఈ రోజున కొంతమంది ఒక గ్రూపును తయారుచేస్తారు. కాని భవిష్యత్తులో వాళ్ళందరు కూడా బాబూజీ చరణాల వద్దకు 'వారి' శరణులోకి రావలసిందే. ఎందుకంటే, బాబూజీ శక్తి యొక్క సహాయం లేకుండా ఎవరు కూడా పురోగమించలేరు. మీ ఇంటిలో మీరు ప్రెసిడెంట్ కాకుండా వేరే వాళ్ళు ప్రెసిడెంట్‌గా ఎలా ఉంటారు? శ్రీరామచంద్ర మిషన్ అనే పేరు ఉన్నంతవరకు కూడా ఈ సంస్థ బాబూజీదే! ఏ రోజునైతే బాబూజీ కృప వలన వాళ్ళ మనస్సు, హృదయం క్లీన్ చేయబడి, పవిత్రంగా అవుతాయో, అప్పుడు అన్ని గ్రూపులలోని వారు కూడా బాబూజీ వద్దకు రావలసినదే, వస్తారు. బాబూజీ యొక్క దివ్యశక్తిని ఏ విధంగా మనలో లయం చేసుకోవాలి, బాబూజీ యొక్క బోధనలను ఏ విధంగా మన జీవితంలో ఆచరించాలి అనే సహాయాన్ని బాబూజీ నియమించిన అధ్యక్షుడు చేస్తాడు. ఇక్కడ అందరు కూడా సేవకులు మాత్రమే. "మహా ప్రళయం వరకు నేను నా పనిని పుర్తి చేసాను" అని బాబూజీ అన్నారు. ఇప్పుడు వారి ప్రతినిధిగా

ఎవరు ఉన్నా కూడా, మిషన్‌ను వ్యాప్తి చేయడం, మిషన్ నిర్వహణ, అభ్యాసులను తయారుచేయడం అనే పనినే చేస్తారు.

ఒకసారి ఒక అభ్యాసీ "బాబూజీ! ఎవరైనా బంధువులు, మిత్రులు ఇంటికి వచ్చినప్పుడు నేను వాళ్ళతోపాటుగా దేవాలయానికి వెళ్తాను. ఆ విగ్రహంలో మీరే ఉన్నట్లుగా భావించి, శిరస్సు వంచి నమస్కారం చేస్తాను" అని అనగానే బాబూజీ, "నీవు ఈ తప్పు చేయవద్దు. నీ మిత్రునితోపాటుగా నీవు దేవాలయానికి వెళ్ళు. కాని ఆ విగ్రహంలో నేను ఉన్నానని మాత్రం భావించవద్దు. నేను నీ ఎదుటనే ఉన్నాను. ఒకవేళ లాలాజీ సాహెబ్ నన్ను విగ్రహంలో బంధించినట్లయితే నేను ఈ పని ఎలా చేయగలను? నేను స్వేచ్ఛగా, స్వతంత్రంగా వచ్చాను. అందువలన మీరందరు కూడా అదే విధంగా స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

బాబూజీ మహరాజ్ విషయంలో రిప్రజెంటేటివ్ (ప్రతినిధి) అనే మాట ఎందుకు వచ్చింది అంటే, బాబూజీ అనంతం యొక్క శక్తితో వచ్చారు. వారు భూమా నుండి అనగా అల్టిమేట్ (అంతిమం) నుండి అవతరించారు. వారు మన కోసం ఆ భూమా యొక్క ఆదిశక్తిని మనకు (రిప్రజెంట్) తెలియజేస్తున్నారు. వారు ఆ ఆదిశక్తి అయిన భూమా (అల్టిమేట్) యొక్క రిప్రజెంటేటివ్ (ప్రతినిధి). వేరెవరు కూడా దానికి ప్రతినిధి కాదు. శ్రీ బాబూజీ తన యొక్క రహస్యాన్ని ఎప్పుడూ వెల్లడి చేయలేదు. ఎప్పుడైతే మీరు 'వారి' ప్రేమలో మునిగిపోయి, 'వారి'లో ప్రవేశించినపుడు, బాబూజీ అంటే ఎవరో 'వారి' రహస్యం వెల్లడి అవుతుంది.

అభ్యాసీలపట్ల బాబూజీకిగల ప్రేమ, తల్లి ప్రేమ కంటే కూడా గొప్పది. దీనికి ఉదాహరణ చెబుతాను. మేము లఖింపూర్ నుండి షాజహాన్‌పూర్‌కు వెళ్ళినపుడు బాబూజీ ఇంటిలోపలి గదిలో మేము అందరం వారితోనే కలసి భోజనం చేసే వాళ్ళం. ఒక రోజున రాత్రి పదకొండు గంటలు అయింది, కాని బాబూజీ మాత్రం ఇంకా భోజనానికి రాలేదు. "వారు ఇప్పటివరకు ఏం చేస్తున్నారు బయటకు వెళ్ళి చూసిరా!" అని మా అమ్మ నాతో అన్నది. అప్పుడు నేను బయటకు వెళ్ళి చూడగా బాబూజీ విస్తరాకులలో మిగిలిపోయిన అన్నం, కూరలు తీసి ఒకవైపు పెట్టుతున్నారు. టీ, మంచి నీళ్ళ కోసం వాడినటువంటి మట్టి గ్లాసులు, పగిలిపోయిన వాటి పెంకులను అన్నింటిని జాగ్రత్తగా ఏరి ఒక ప్రక్కన పెట్టుతున్నారు. నేను వెళ్ళి ఈ విషయం మా అమ్మకు చెప్పాను. ఆ తరువాత బాబూజీ లోపలికి రాగానే, మా అమ్మ వారితో, "బాబూజీ! మీరు ఇదేమి పని చేస్తున్నారు. మీరు ఇంత గొప్పవారు, మాకు శిక్షణ కూడా ఇస్తున్నారు. మీరు ఆ ఎంగిలి విస్తరాకులను, పగిలిపోయిన మట్టి పెంకులను ఎందుకు ఏరుతున్నారు? ఆ పని స్వీపర్ చేస్తాడు కదా!" అని అడిగారు. అప్పుడు బాబూజీ, "అమ్మా! ఒకవేళ ఆ పగిలిపోయిన మట్టి పాత్రల పెంకులు ఎవరికైనా గ్రుచ్చుకుంటే, ఆ బాధ నాకు కలుగుతుంది" అని అన్నారు.

ఇంట్లో మిగిలిన ఆహారాన్ని బాబూజీ స్వీపర్‌కు ఇచ్చేవారు. ఎంగిలి ఆహారం ఆవుకు వేసేవారు. ఎందుకంటే, అది ప్రసాదం కనుక, దానిని బయట పారవేసేవారు కాదు.

బసంత్ పంచమికి ముందు రోజున వారు తన చేతికర్రను తీసికొని, వీధిలోని వారందరిని "రేపు మన లాలాజీ సాహెబ్ జన్మదినోత్సవం, మిషన్ యొక్క ఫంక్షన్, మీ పిల్లలను అందరిని కూడా తీసుకొని రండి" అని ఆహ్వానించే వారు. హోమం అయిన తరువాత పిల్లలు అందరిని తన దగ్గర కూర్చోపెట్టుకొని వాళ్ళకు ప్రసాదాన్ని ఇచ్చేవారు. బసంత్ పంచమికి వచ్చిన అభ్యాసీలందరి యొక్క క్షేమ సమాచారాలను అడిగి, అందరి భోజనాలు అయిన తరువాత, చివరకు రాత్రి 11 లేదా 12 గంటలకు బాబూజీ భోజనం చేసేవారు. ఎవరైనా అనారోగ్యంగా ఉంటే లేదా ఎవరైనా పిల్లవాడు ఏడుస్తుంటే, తాను త్రాగవలసిన పాలను వాళ్ళకు ఇవ్వమని చెప్పేవారు.

"బాబూజీ! మీరు తల్లిలాగా మా అందరిని ఇంత గాఢంగా ప్రేమిస్తున్నారు. ఈ లోకం నుండి వెళ్ళిపోయిన తరువాత కూడా, మీరు మమ్మల్ని ఇదే విధంగా ప్రేమిస్తారా?" అని ఒకసారి మా అమ్మ వారిని అడిగింది. అప్పుడు బాబూజీ, "అమ్మా! ఇంతకంటే చాలా ఎక్కువగా ప్రేమిస్తాను. ఇప్పుడు శరీరం ఉంది కదా! దీనికి పలు పనులు ఉంటాయి. ఇప్పుడు నాకు వేరేచోట పని ఉంది. అక్కడికి వెళ్ళాలని ఉంది. కాని వెళ్ళలేకపోతున్నాను. ఈ శరీరాన్ని విడిచిపెట్టిన తరువాత, ఏ బంధనం ఉండదు. ఎక్కడికైనా వెళ్ళాలి అని అనుకోగానే అక్కడికి చేరుకుంటాను. అప్పుడు అందరిని ఇంకా ఎక్కువగా ప్రేమిస్తాను" అని అన్నారు. ఇటువంటి ప్రేమ, ఓదార్పు మనకు ఎవరు ఇస్తారు!

**ప్రశ్న: భూమా నుండి బాబూజీ వచ్చారు కదా! మరి లాలాజీ సాహెబ్ కూడా భూమా నుండియే వచ్చారా?**

**జవాబు:** "సృష్టి ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఎవరూ భూమా నుండి రాలేదు. నీవు ఒక ప్రకృతికార్యం చెయాలి. భూమా నుండి ఆ శక్తిని భూమి మీదకు తీసుకొని రావాలి. నేను ఈ పని నిర్వహించలేకపోతున్నాను" అని లాలాజీ గురువు లాలాజీతో అనగా, లాలాజీ ఆ కార్యభారాన్ని తన మీద వేసుకొని, "మీకు ఇవ్వబడిన ఈ ప్రకృతి కార్యాన్ని నేను పూర్తి చేస్తాను" అని లాలాజీ సాహెబ్, అప్పుడు ఏడు నెలలు తీవ్రమైన ప్రార్థన చేసి, తనను ఏ విధంగా తయారు చేసుకున్నారంటే వారి 'ప్రార్థన' అల్టిమేట్ (భూమా) వద్దకు చేరుకొని, "అటు చూడు, నిన్ను ఎవరో పిలుస్తున్నారు" అని ఆ ప్రార్థన భూమాతో అన్నది. అప్పుడు భూమా శక్తి బాబూజీ రూపంలో భూమి మీద అవతరించింది. లాలాజీ తాను చేపట్టిన ప్రకృతి కార్యంలో విజయం సాధించారు, కనుక వారు సమర్థులు అయ్యారు. సత్ అనగా ఈశ్వరుడు, అనగా ఆ శిక్షణ తెలిసినవారు అని అర్థం. ఈశ్వరీయ శిక్షణ తెలిసినటువంటి శ్రీబాబూజీని వారు మానవాళి కొరకు తీసికొని వచ్చారు, కనుక వారు సద్గురువు అయ్యారు. లాలాజీ సాహెబ్ యొక్క ప్రార్థన (భూమా) అల్టిమేట్‌కు చేరింది. అందువలన లాలాజీ యొక్క స్థానం కూడా భూమానే అయ్యింది. బాబూజీని భూమా నుండి తీసుకొని రావటంవలన లాలాజీ సాహెబ్ యొక్క స్థానం కూడా అక్కడే ఉంది.

ఒకసారి డాక్టర్ కె.సి. వరదాచారిగారు, "బాబూజీ! మీరు మాట్లాడుతున్నప్పుడు అక్కడక్కడ మీ వాక్యంలో క్రియ (వెర్బ్) అనేది ఉండటం లేదు. ఎందుకని?" అని అడిగారు. అప్పుడు బాబూజీ, "అవును. అసలు క్రియ (వెర్బ్) అనేదే లేకుండా, మాట్లాడటానికే నేను ప్రయత్నిస్తున్నాను. నీవు కూడా నాలాగనే ఇలా మాట్లాడటానికి ప్రయత్నిస్తే సులభంగా మాట్లాడుతావు" అని అన్నారు. క్రియ అనేది 'నేను'

అనే దానితో సంబంధం కలిగి ఉన్నది. 'నేను' ఈ పనిని చేస్తున్నాను, అని అంటే సంస్కారం ఏర్పడుతుంది. క్రియ వలన సంస్కారం ఏర్పడుతుంది కదా! మీరు బాబూజీ మహరాజ్ యొక్క స్మరణలో మునిగిపోయి ఏ పని చేసినప్పటికీ మీరు సంస్కారాలకు అతీతంగా స్వేచ్ఛగా ఉంటారు. ఎందుకంటే, అప్పుడు మీరు మీ మనస్సుతో పని చేయటం లేదు. బాబూజీ స్మరణలో ఉండటం వలన ఆ పని దానంతట అదే మీ ద్వారా జరిగిపోతుంది.

"భగవంతుడు ఇంత గొప్ప సృష్టిని సృష్టించాడు కాని అతనికి ఈ ప్రపంచంతో ఎటువంటి ఎటాచ్‌మెంట్ (అనుబంధం) లేదు" అని బాబూజీ అనేవారు. ప్రజలు అరుస్తున్నారు, ఏడుస్తున్నారు, గోల పెట్టుతున్నారు. కాని భగవంతునికి మాత్రం సంస్కారాలు ఏర్పడటం లేదు. ఎందుకంటే, భగవంతుడు ఈ సృష్టి ఏర్పడాలి –అనే ఒకే ఒక సంకల్పంతోనే తన అన్ని పనులను పూర్తి చేసాడు. ఆ సంకల్పం వలన ఈశ్వరీయ శక్తి దానంతట అదే క్రియాశీలమయ్యింది. భగవంతుడు మాత్రం ఆ క్రియ నుండి వేరుగా ఉన్నాడు. అదే విధంగా మీరు కూడా 'వారి' స్మరణలోనే మునిగిపోయి, క్రియ నుండి వేరుగా ఉండి పని చేసినట్లయితే, ఆ క్రియ యొక్క ప్రభావం మిమ్ముల్ని స్పర్శించదు.

ఒకసారి బాబూజీ, "సాధన చేయవలసిన అవసరం ఏమిటి?" అని అడిగి, వారే "ఎప్పటివరకైతే మనలను సృష్టించినటువంటి ఆ భగవంతుని యొక్క చిరునామ లభించదో, అప్పటివరకు మనం సాధన చేయవలసిందే" అని జవాబు చెప్పారు. ఇదే విధంగా బాబూజీ మహరాజ్ యొక్క చిరునామాను మనం ఎప్పుడు తెలుసుకోగలం? ఎప్పుడైతే బాబూజీని స్మరించగానే, మనలోపలి నుండి 'వారి'పట్ల ప్రేమ ఉప్పొంగిపోతుందో అప్పుడు మనకు బాబూజీ చిరునామ దొరికినట్లు అవుతుంది. అప్పుడు మనలో ఇంక ఎటువంటి సంస్కారాలు ఏర్పడటానికి అవకాశం లేదు. మనం బాబూజీ స్మరణలో ఉంటూ ఉండటం వలన మన ఇంటి పని, ఆఫీస్ పని, అన్ని పనులు వాటంతట అవే జరిగిపోతూనే ఉంటాయి. కాని ఆ పనులలో మనం మునిగిపోము. మనం చేసే పనులలో 'నేను' అనేది లేనప్పుడు మనకు ఆనందమే ఆనందం లభిస్తుంది. మనం బాబూజీ స్మరణలో మునిగిపోయి పని చేయుటం వలన మనకు సంస్కారాలు అనేవి ఎందుకు ఏర్పడవు? ఎందుకంటే, "నేను సమస్త మానవాళి కొరకు వచ్చాను. నేను అందర్నీ అనంతానికి తీసుకుని వెళ్ళతాను" అని బాబూజీ అన్నారు. "నేను మీ వాడిని. మీరు మావారు" అనే ఈ ఆలోచన మనలో ఉంది కనుక మనం వారి స్మరణలో ఉండి ఏదైనా పని చేస్తున్నప్పుడు, సంస్కారాలు ఏర్పడినా కాని, 'వారి' ఆ ఆలోచన ఆ సంస్కారాలను తనలో లయం చేసుకుంటుంది. అందువలన మనం ఆ సంస్కారాలను అనుభవించము.

బాబూజీ మహరాజ్ నా మీద రీసెర్చి (పరిశోధన) చేసి అహం యొక్క 16 వలయాల బంధనాలను శాశ్వతంగా ఛేదించారు. బాబూజీ తమ దివ్య పరిశోధన కొరకు, నా కోసం తెరిచినటువంటి డివైన్ డోర్స్ (దివ్య ద్వారాలు) ఎప్పుడూ, ఎవరికీ అవి మూసివేయబడవు. "అయ్యో! ఇప్పుడు బాబూజీ లేరు కదా! మరి మమ్ముల్ని అక్కడికి ఎవరు తీసుకొని వెళ్ళతారు" అని మీరు బాధ పడవలసిన అవసరం లేదు. ఎందుకంటే, బాబూజీ మహరాజ్ తమ దివ్య కృపతో సమస్త మానవాళి కొరకు తెరిచినటువంటి ఆ దివ్య ద్వారాలు

శాశ్వతంగా తెరిచే ఉంచారు. కబీర్ సాధన చేసి ఈశ్వర్ సాక్షాత్కారం పొంది, సత్యపథ్ వద్ద ఆగిపోయాడు. ఎందుకంటే, సత్యపథ్ ద్వారాలు తెరవడానికి అప్పుడు డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుడు) ఎవ్వరూ లేరు. కాని నేడు బాబూజీ మహరాజ్ అందరి కొరకు సత్యపథ్ (సెంట్రల్ రీజియన్ ప్రవేశ ద్వారం) మరియు 'భూమా' ప్రవేశద్వారం, ఈ విధంగా అన్ని దివ్య ద్వారాలను కూడా మానవులందరి కొరకు శాశ్వతంగా తెరిచి ఉంచారు. బాబూజీ రీసెర్చి చేసి ఇక్కడ నుండి అక్కడికి అనగా ప్రారంభం నుండి అంతిమం వరకు గల అనంత యాత్రలోని అడ్డంకులను, ప్రతిబంధకాలను అన్నింటినీ పూర్తిగా తొలగించారు. ఇటువంటి సమయం ఇదివరకు ఎప్పుడూ రాలేదు. రాబోయే తరాలవారికి, యుగయుగాల వరకు కూడా ఈ సమయం (అవకాశం) ఈ విధంగానే ఉంటుంది. బాబూజీ మనకు అనుభూతి ద్వారా ఈ సందేశాన్ని ఇవ్వాలని అనుకుంటున్నారు – "నేను మీ అందరి కొరకు వచ్చాను. మీరు ఎక్కడ కూడా ఆగిపోవడానికి అవకాశం లేదు. దివ్య ద్వారాలన్నీ మీ కోసం తెరిచే ఉన్నాయి. ప్రేమ, భక్తిని పెంపొందించుకొంటూ పురోగమిస్తూనే ఉండండి" అని.

"బాబూజీ మహరాజ్ మీ మీద రీసెర్చి (పరిశోధన) చేసారు. మరి మాకు ఎవరు సహాయం చేస్తారు?" అని కొంత మంది అభ్యాసీలు నన్ను అడుగుతూ ఉంటారు. బాబూజీ మాహరాజ్ రీసెర్చి చేసి మనకు పై సందేశాన్ని ఇచ్చారు. మీ అందరినీ కూడా అక్కడికి తీసుకొని వెళ్ళడానికి ఇంకొక డివైన్ పర్సనాలిటీ (దివ్యపురుషుడు) ఎవరు కూడా భవిష్యత్తులో అవతరించరు. దివ్య ద్వారాలు అన్నీ సమస్త మానవాళి కొరకు శాశ్వతంగా తెరిచి ఉంచారు. ఈ ఆధ్యాత్మిక యాత్రలో ఒక్కొక్కసారి నేను "బాబూజీ! ఇప్పుడు నేను అలసిపోయినట్లుగా అనిపిస్తున్నది. ముందుకు వెళ్ళడానికి నాకు దారి కనిపించడం లేదు" అని వారికి వ్రాసేదాన్ని. కాని ఇప్పటి నుండి మీ విషయంలో ఆ విధంగా ఎప్పుడు కూడా జరగదు. ఎందుకంటే మార్గంలోని ఆటంకాలను, ప్రతిబంధకాలను అన్నింటిని వారు ఏ విధంగా తొలగించారంటే, మీరు నడుస్తు నడుస్తూనే లక్ష్యాన్ని చేరుకుంటారు. ఎక్కడ కూడా మీరు ఆగిపోవలసిన పరిస్థితి ఏర్పడదు.

బాబూజీ మహరాజ్ తమ దివ్య పరిశోధన ద్వారా మానవులందరికి కూడా, "నేను ఇక్కడ అనగా అల్టిమేట్‌లో ఉన్నాను. నీవు భూమి మీద ఉన్నావు. నా దగ్గరకు రావటానికి ఇప్పుడు నిన్ను ఎవరు కూడా ఆపలేరు. నీవు సూటిగా నడచుకుంటూ నా వద్దకు వచ్చేయ్!" అనే దివ్య సందేశాన్ని ఇస్తున్నారు.

చాలామంది మేము అక్కడికి అనగా 'భూమా' వద్దకు చేరుకోలేము. ఎందుకంటే, మాకు ఆ యోగ్యతలేదని అనుకుంటారు. బాబూజీ మనలనందరిని ఉత్సాహపరచడానికిగాను, "నీవు నా దగ్గరికి తప్పకుండా రాగలవు. ఎందుకంటే, నేను మీ కోసమే వచ్చాను. అందువలన నీవు నన్ను తప్పకుండా చేరుకోగలవు" అనే సందేశాన్ని ఇచ్చారు. ఇంకొక గొప్ప విషయం ఏమిటంటే, ఏదైనా మహాత్ శక్తి పైనుండి భూమి మీద అవతరించినపుడు, ఆ దివ్య పురుషుని యొక్క చరణాలు ఈ ధరణిని స్పర్శించినపుడు, ఈ భూమి కూడా ఎల్లవేళలా ఆ దివ్యశక్తితో అనుబంధం (కనెక్షన్) కలిగి ఉంటుంది. మీరు ఈ భూమి మీద 'వారి' స్మరణతోనే నడుస్తున్నపుడు, వారి యొక్క దివ్యస్పర్శ అనేది ఎల్లప్పుడు కూడా మిమ్మల్ని తన ఒడిలోకి తీసుకొని, దివ్యప్రేమతో మిమ్మల్ని లాలిస్తుంది. కనుక మీరు ఎప్పుడూ నిరాశపడకూడదు.

ఒక అభ్యాసీ, "బాబూజీ! నాలో చాలా తప్పులు ఉన్నాయి, అనేకమైన బలహీనతలు, దోషాలు ఉన్నాయి. నేను ఈ ఆధ్యాత్మికతకు ఎలా యోగ్యుణ్ణి అవుతాను?" అని అడిగాడు. అప్పుడు వారు, "భాయీ! ఎంత సమయమైతే నీవు నీ తప్పులను, బలహీనతలను, జ్ఞాపకం చేసుకుంటున్నావో, అంతే సమయాన్ని ఒకవేళ నీవు, నీ తప్పులను దూరం చేసే 'వారి'ని జ్ఞాపకం చేసుకోవడానికి వినియోగించినట్లయితే, నీకు ఎంతో గొప్ప లాభం కలుగుతుంది" అని అన్నారు. బాబూజీ, సమస్త మానవాళిని కూడా అంతిమం (అల్టిమేట్) వద్దకు చేర్చాలనే సంకల్పంతోనే వచ్చారు. అందులో మంచి వాళ్ళు ఎంత మంది ఉంటారు? చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారు. కాని బాబూజీ మన అందరి కోసం వచ్చారు. కనుక ఎప్పుడూ కూడా 'లక్ష్యాన్ని చేరుకోలేము' అనే ఆలోచన మీలో రాకూడదు. బాబూజీ చరణాలను మాత్రం మీరు ఎప్పుడు విడిచిపెట్టవద్దు.

ఎవరైనా ఏదైనా చెప్పినపుడు తమ దృష్టితోనే ఆలకిస్తారు గాని మంచి చెడూ గురించి విచక్షణ వారికి ఉండదు. ఒకవేళ ఆలకించినప్పటికీ వారు విని వదిలేస్తారు. బాబూజీ మన కోసం వచ్చి మనకు ప్రేమను ఎంతగా పంచారో తెలుసుకున్నాకైనా 'వారి'ని అంతగా ప్రేమించటం అలవర్చుకోవాలి.

బాబూజీ మహరాజ్ రాత్రింబవళ్ళు అభ్యాసీల ఉన్నతి గురించే ఆలోచించే వారు, ఆశ్రమానికి వచ్చిన అభ్యాసీల అన్నపానాదుల గురించి కూడా ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. మనమూ అటువంటి ప్రేమ వారిపట్ల కలిగి ఉండాలి.

**ప్రశ్న: బాబూజీ ఒకచోట "నేను పాండవులలో ఒకరిని – యుధిష్టరుడ్నీ కాదు, భీముడినీ కాదు" అన్నారు. మరి మనం అనుకుంటున్నది వారు భూమా నుంచీ వచ్చారని కదా! ఎవరై ఉంటారు?**

**జవాబు:** ఈ ప్రశ్న ఉదయం అడగటం జరిగింది. ఇంకా వివరణ కోసం మళ్ళీ అడిగారు. 'పి' యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే, బాబూజీ ఒక మహత్తర శక్తిగాని, అవతారంగాని కాదని, ఒక సాధారణ వ్యక్తి మాత్రమేనని నలుగురికీ తెలియజెప్పాలి అని. 'పతంజలి నేనే' అన్న బాబూజీ మాటను పట్టుకొని అలా నిరూపించాలని తలచారు. పతంజలికి ముక్తి కలగలేదు. కనుక ఆయన ఇలా జన్మ తీసుకున్నట్లు చెప్పాలని ఉద్దేశ్యం. ఈ విషయం అనగా పతంజలియే బాబూజీ అన్నట్లుగా 'పి' తన పుస్తకంలో కూడా వ్రాశారు. దీనికి జవాబు ఇప్పించాలని నేను కూడా బాబూజీతో చెప్పాను. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాబూజీ, లాలాజీ వద్దకు వెళ్ళి "నేను బ్రైటర్‌వరల్డ్‌లో పతంజలి కోసం వెదికాను, ఎక్కడా కనిపించలేదు" అని అనేసరికి లాలాజీ, "నీలో చూసుకో! శ్రీకృష్ణ భగవానుడుని అడిగితే వారే చూపిస్తారు" అని అన్నారు. దీని అర్థం ఏమిటంటే, ఎవరినైనా వెదకుతున్నారు అంటే, వారిని ఉద్ధరించాలనే సంకల్పం కలిగి ఉన్నారన్న మాట. ఇప్పుడు మనం ఇంకొక రకంగా కూడా ఆలోచించవచ్చు. అది ఏమిటంటే, బాబూజీయే కనుక సాధారణ వ్యక్తి అయి ఉంటే బ్రైటర్‌వరల్డ్‌కు వెళ్ళి చూడటం అసంభవం. అది వారికి సంభవమైనది అంటే గొప్పవారిగానే అంగీకరించాలి కదా! మరి కనీసం బ్రైటర్‌వరల్డ్‌కి అయినా చేరలేనటువంటి వారు అనగా అక్కడికి వెళ్ళేందుకు కావలసిన యోగ్యతనైనా పొందనట్టివారు 'మాస్టర్' అని ఎలా చెప్పుకుంటున్నారు? సాధన

చేయాలి, 'వారి'ని ఆశ్రయించాలి. 'వారి' శరణు పొందాలి. 'వారి' వెంట ప్రయాణించాలి. అప్పుడు క్రమక్రమంగా ఉన్నతి కలుగుతుంది. ఎప్పుడైతే యోగ్యత వస్తుందో అపుడు మనకు ఇవ్వవలసింది ఇస్తారు.

ఇటీవల 'నేనే భగవాన్' అని చెప్పుకునే వారెందరు లేరు! వారు భగవంతుడు కాలేరు. వారు చెప్పుకుంటే మాత్రం మన జ్ఞానం ఏమైపోయింది. సాధన, భక్తి లేకుండానే భగవంతుడైపోతారా!

ఒక ఫంక్షన్‌లో దేవరామ్‌భాయి కమార్తె ప్రసంగిస్తూ, 'పి' గార్ని నా తండ్రి, నా దైవం అని చెప్పుకుంటూ అందుకే మద్రాసు వెళ్తూ ఉంటానని చెప్పుకున్నదట. ఇలాగే అజ్ఞానులు ఉంటారు. మీరాభాయ్, కబీరులాగ భక్తి పారవశ్యంతో ఉన్నవారు, సాధన చేసినవారు ఎవ్వరైనా ఉన్నారా! మనలో పరిపక్వత, పటుత్వం రానిదే ఏదీ సాధ్యపడదు.

'పి'గారితో ఒకచోట సమావేశం జరిగినపుడు చాలామంది ప్రిసెప్టర్లు, అభ్యాసీలు హాజరయ్యారు. వారిలో కొందరు తమను బ్రహ్మాండ మండలంలోకి, మరికొందరు పరబ్రహ్మాండ మండలంలోకి తీసుకు వెళ్ళినట్లు చెప్పారు. నేను వారిని నా ప్రశ్నకు జవాబు చెప్పమని అడిగాను. మీరే గనుక బ్రహ్మాండ, పరబ్రహ్మాండ మండలాలకు వెళ్ళినట్లయితే, అక్కడి స్థితి ఏమిటో, శక్తి ఏమిటో, దానిని ఎవరు ఇస్తున్నారో చెప్పమన్నాను. అపుడు వారు సమాధానం ఇవ్వలేకపోయారు. కాని నవ్వేశారు. కనుక అక్కడి స్థితిని గురించిగాని, శక్తిని గురించిగాని తీసుకు వెళ్ళినవారికీ, వెళ్ళిన వారికీ, ఇద్దరికీ తెలియదు. ఇవన్నీ కేవలం డాంబికాలే.

**ప్రశ్న: ధ్యానం చేస్తున్నప్పుడు ఒక్కొక్కసారి ఊపిరి పీల్చుకోవడం కొద్దిగా కష్టంగా అనిపిస్తుంది. శ్వాస అనేది భారంగా ఉన్నట్లు అనిపిస్తుంది.**

**జవాబు:** బాబూజీ మిమ్మల్ని సూక్ష్మమైన స్థితిలోకి తీసికొని వెళ్ళుతున్నప్పుడు మీరు అక్కడి శ్వాసతోనే, ఆ స్థితిలో జీవిస్తారు. బాబూజీ మిమ్మల్ని ఆ సూక్ష్మస్థితిలో ఉంచడానికి ప్రయత్నిస్తున్నారు. కాని మీ దృష్టి ఇక్కడి శ్వాస మీద ఉంది కనుక ఆ శ్వాస మీకు భారంగా అనిపిస్తుంది. అందుచేత మీ దృష్టి, శ్వాస మీద ఉండరాదు.

ఒకసారి ఫ్రాన్స్ నుండి ఆంద్రే పోరే షాజహాన్‌పూర్‌కు వచ్చారు. అతడు, "బాబూజీ! అప్పుడప్పుడు నాకు (భారం) హెవీగా అనిపిస్తుంది" అని అన్నాడు. అప్పుడు బాబూజీ అతనితో, "నీ (భారం) హెవీనెస్‌ను నాకు ఇచ్చివేయి. నా (తేలికదనం) లైట్‌నెస్‌ను నీవు తీసుకో" అని అన్నారు. మరల బాబూజీ నవ్వుతూ "అంటే నాకు నీ సూట్‌కేస్ కావాలని కాదు దీని అర్థం. అయినా నీ హెవీ సూట్‌కేస్‌ను నేను మోయలేను కూడ'' అని అన్నారు. మన దృష్టి (అటెన్షన్) అనేది ఎల్లప్పుడు కూడా బాబూజీ మీదనే ఉండాలి, అని దీని అర్థం.

ఒకసారి షాజహాన్‌పూర్‌లో ఫంక్షన్ జరిగినపుడు, ఇక్కడ తలుపులు ఏమీ లేవు; భద్రత లేదు. ధ్యానానికి కళ్ళు మూసుకొని కూర్చోగానే ఎవరైనా నా సూట్‌కేస్, వస్తువులను దొంగిలిస్తారో ఏమో అనే ఆలోచన ఒక అభ్యాసీ మనస్సులో కలిగినట్లు ఉంది. ఆ రోజు సాయంత్రం అభ్యాసీలందరు బాబూజీ

ఎదురుగా కూర్చోగానే వారు, "కొంతమంది అభ్యాసీలకు ఎవరైనా తమ సామానులను దొంగిలిస్తారేమోనని చాలా భయంగా ఉంటుంది. కాని ఒకవేళ ఎవరైనా మీ హృదయాన్నే దొంగిలిస్తే అప్పుడు మీరు ఏం చేస్తారు?" అని నవ్వుతూ అన్నారు. అభ్యాసీలపట్ల వారికిగల ప్రేమ అపారమైనది.

పూర్వం అభ్యాసీలు చాలామంది షాజహాన్‌పూర్ వచ్చే ముందు వివిధ ప్రదేశాలను (పుణ్య క్షేత్రాలు, ఇతర ఆధ్యాత్మిక సంస్థలు) చూడటానికి ఒక ప్రోగ్రాం తయారుచేసుకొని, అవి అన్నీ చూసిన తరువాతనే బాబూజీ వద్దకు వచ్చేవారు. ఒకసారి ఇద్దరు, ముగ్గురు అభ్యాసీలు తమ ప్రోగ్రాం గురించి బాబూజీకి చెప్పినప్పుడు వారు, "మీరు ఎన్నో ప్రదేశాలను చూసి ఇక్కడికి వచ్చారు. మీరు ఒక ప్రదేశాన్ని చూసారు. తరువాత రెండవ ప్రదేశం, ఆ తరువాత మూడవది, నాలుగవది –ఈ విధంగా మీరు రకరకాల సంస్థలను, పుణ్య క్షేత్రాలను దర్శిస్తూనే ఉన్నారు. దీని అర్థం ఏమిటంటే, మీ మనస్సు ఎక్కడ కూడా నిలకడగా లేదు. ఎందుకంటే, అక్కడకు వెళ్ళాలి, ఇక్కడికి వెళ్ళాలి అనేదాని గురించే మీ మనస్సు ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటుంది. మీ మనస్సుకు అది ఒక అలవాటుగా మారింది. కాని ఒకవేళ మీరు మీ మనస్సును ఆధ్యాత్మికతలో ఒక్కసారి నిమగ్నం చేసినట్లయితే, మీరు ఎక్కడికి కూడా వెళ్ళవలసిన అవసరం ఉండదు" అని అన్నారు.

ఎవరో స్వామీజీ వచ్చారని తెలియగానే అక్కడికి వెళ్ళడం, ఇంకొక స్వామీజీ వచ్చారని మరొక చోటికి వెళ్ళడం అనే ఈ అలవాటు మీకు ఉండకూడదు. అలాగే ఆ స్వామీజీ ఇలా చెప్పారు, ఈ స్వామీజీ ఇలా చెప్పారు అనేదాని మీద కూడా దృష్టి పెట్టకూడదు. మనం బాబూజీ చెప్పినట్లుగా ధ్యానం చేయాలి. మనం ధ్యానంలో ఆనందాన్ని పొందుతున్నాం. దీనికి వ్యతిరేకంగా ఏ ఆలోచన వచ్చినాసరే, "బాబూజీ నావారు, నేను 'వారి' వాడిని" అని ధృఢంగా భావించాలి. మీ మనస్సు పూజలో నిమగ్నం కావడం లేదని ఎప్పుడూ ఆలోచించకూడదు. ఎందుకంటే, ఇది మనస్సును నిమగ్నం చేసే పూజ కాదు. మనం చేయవలసిన పూజ "బాబూజీ నావారు, నేను 'వారి' వానిని" అనే ఈ రెండు వాక్యాలు మాత్రమే.

నేను నా చిన్నప్పటి నుండి అంటే నాకు నాలుగు సంవత్సరాల వయస్సు నుండి ఎంతోమంది సాధువులను, సన్యాసులను చూసాను. కాని ఎవరివద్ద కూడా ఒక పద్ధతి అనేది లేదు. ఈ రోజు రామాయణం చదువమంటారు. రేపు భగవద్గీతను చదువమంటారు. ఇది చెయ్యాలి, అది చెయ్యాలి అని ఏదో ఒకటి చెప్తూనే ఉంటారు. వాళ్ళ దగ్గర ఎటువంటి సిస్టమ్ (పద్ధతి) అనేది లేదు. మన బాబూజీ మహరాజ్ వద్ద లక్ష్యం ఉంది, సిస్టమ్ (పద్ధతి) ఉంది, శక్తి ఉంది; మనకు ఎంతో అనుకూలంగా ఉంది. మనకు గొప్ప సహాయం లభించింది. కనుక మీరు అందరు కూడా ఈ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలి.

ఒకసారి బాబూజీ, "ఎప్పుడైతే అభ్యాసీలో ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్ (మరచిన స్థితి) ఏర్పడుతుందో, అప్పుడే అతడు ఆధ్యాత్మికతలో ప్రవేశించినట్లు" అని అన్నారు. అపుడు ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మీరు ఫర్‌గెట్ యువర్ సెల్ఫ్ (నిన్ను నీవు మరచిపో) అని అన్నారు కదా! దీనిలో ఏం విశేషం ఉంది?" అని అడిగారు. అప్పుడు బాబూజీ, "ఇప్పటివరకు ధ్యానంలో నన్ను వెదుకుతూ వచ్చావు. ఫర్‌గెట్ యువర్ సెల్ఫ్ అంటే సెల్ఫ్ (నేను) అనే దానిని నీవు మరచిపోయినట్లయితే, అప్పుడు నీ యొక్క సెల్ఫ్ (ఐ) అనేది ఎక్కడ ఉంది అని నేను దానిని గురించి వెదుకుతాను" అని అన్నారు. నీ యొక్క సెల్ఫ్ (ఐ) అనే దానిని

నీవు మరచిపోయినపుడు, అది వారి ఒడిలోకి వెళ్ళుతుంది. వారు దానిని వెదికి తీసుకొని వస్తారు. నిన్ను నీవు మరచిపోవడం అనే స్థితి ఎలా వస్తుంది? అది సులభమైన పని. మీరు ఏ పని చేసినా కూడా మీరు మొదట దానికి 'నేను' అనే దానిని జోడించవద్దు. వంట చేయండి, ఆఫీస్ పని చేయండి, ఇంటి పని చేయండి –కాని 'నేను' అనే దానిని మాత్రం ఆ పనికి జోడించకూడదు. "బాబూజీ మహరాజ్! నా ఎదుటనే ఉన్నారు, వారి సంతోషం కొరకు ఈ పనిని చేస్తున్నాను" అని భావించండి.

అభ్యాసీపట్ల బాబూజీ యొక్క పని ఈశ్వరీయ దేశం నుండి ప్రారంభమవుతుంది. ప్రిసెప్టర్ బాబూజీ యొక్క ప్రేమలో ఎంతగా మునిగిపోయి సిట్టింగ్ ఇస్తాడో, అంతగా ఈశ్వరీయ ధార అతని నుండి ప్రవహిస్తుంది. ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇవ్వడంతోపాటుగా, "బాబూజీ మహరాజ్! వీళ్ళు మీ ప్రేమ యొక్క సాగరంలో మునిగిపోవాలి" అని అభ్యాసీల కొరకు ప్రార్థించి, మీరు కూడా దానిలో స్థిరపడి సిట్టింగ్ ఇచ్చినట్లయితే అందరి హృదయాలు కూడా ఆ స్థితిలో స్థిరపడతాయి. పనిచేస్తున్నకొద్దీ నెమ్మది నెమ్మదిగా ప్రిసెప్టర్‌కు ఆ టెక్నిక్ కూడా అర్థమవుతుంది.

మేము సిట్టింగ్ తీసుకుంటున్నామని అభ్యాసీలు అనుకుంటారు. కాని సిట్టింగ్ అంటే దానిలో ఏమి అర్థం లేదు. "బాబూజీ! నేను మీ యొక్క దివ్య ప్రేమలో మునిగిపోవడానికి ధ్యానంలో కూర్చున్నాను" అని మీరు మనస్సులో ఈ భావాన్ని కలిగి ఉంటే దీని విలువ వందరెట్లు ఎక్కువగా ఉంటుంది. అలాగే అభ్యాసీలు బాబూజీ యొక్క ప్రేమలో మునిగిపోవాలనే సంకల్పంతో ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇచ్చినట్లయితే, దాని విలువ వంద రెట్లు ఎక్కువగా ఉంటుంది.

అభ్యాసీలలో సిట్టింగ్ కొరకు పేరాశ ఉంది. కాని ఆధ్యాత్మికత కొరకు పేరాశ లేదని బాబూజీ అన్నారు. ఇప్పుడు మీరు చేయవలసిన పని ఏమిటంటే, ఆధ్యాత్మికత కొరకు పేరాశను ఏర్పరచుకోవాలి. అనగా ఇంకా ఇంకా కావాలి అనే తపనను పెంపొందించుకోవాలి. బాబూజీ చరణాల వద్ద సామీప్యత కొరకు పేరాశను వృద్ధి చేసుకోవాలి. కాని సిట్టింగ్ కొరకు పేరాశను వృద్ధి చేసుకోవడం కాదు.

బ్రహ్మవిద్య అనేది చదువుకుంటే వచ్చేది కాదు. ఇది వారి విరాట్ హృదయం నుండి మన హృదయంలోకి ప్రసారం చేయబడుతుంది. ప్రిసెప్టర్ ఏ స్థితిలో అయితే మునిగిపోయి ఇతరులకు ట్రాన్స్‌మిషన్ ఇస్తాడో ఆ స్థితి యొక్క ప్రతిబింబం అనేది అభ్యాసీలోకి ప్రవేశిస్తుంది. తరువాత దానిని మరచిపోవచ్చు. కాని ఆ స్థితి యొక్క అక్స్ (ప్రతిబింబం) మాత్రం అభ్యాసీని విడిచిపెట్టదు.

అభ్యాసీలు రెండు రకాలుగా ఉంటారు. మొదటిరకం అభ్యాసీలలో, బాబూజీ ఈ సంస్థను స్థాపించినప్పటి నుండి మేము ఎన్నో సంవత్సరాల నుండి మిషన్‌లో ఉన్నాం, మేము సీనియర్ అభ్యాసీలమని అనుకుంటారు. రెండవ రకం అభ్యాసీలలో ఈ సమయం యొక్క ఎరుక ఉండదు. వీరు మిషన్‌లో చేరినప్పటి నుండి బాబూజీ యొక్క సామీప్యతను రోజు రోజుకు ఎక్కువగా అభివృద్ధి చేసుకుంటారు. వీరికి ప్రిసెప్టర్ ఎదురుగా ఉన్నా లేకపోయినా ప్రాణాహుతి ప్రవాహం మూలం (బాబూజీ) నుండి దానికి అదే వస్తుంది. వీరు చాలా వేగంగా ప్రోగ్రెస్ అవుతారు.

మీ అందరికి శుభాకాంక్షలు; ఎందుకంటే, బాబూజీ మహరాజ్‌కు పూర్తిగా సమర్పితమైనటువంటి ప్రిసెప్టర్ డాక్టర్ సాహెబ్ మీకు లభించారు. వారు మీ మీద ఎంతగా కృషి చేసారంటే, మీరు ఎక్కడ కూర్చున్నా సరే, ఎప్పుడు కూర్చున్నాసరే మీకు బాబూజీ మహరాజ్ నుండి ప్రాణాహుతి శక్తి లభిస్తుంది. ఇలాంటి యోగ్యత కలిగిన ప్రిసెప్టర్ మనకు ఎక్కడ దొరుకుతారు!

బాబూజీ మహరాజ్ అక్కడ అనగా అల్టిమేట్ వద్ద ఉన్నారు. మీరు ఇక్కడ ఉన్నారు. మీరు ధ్యానంలో కూర్చోగానే బాబూజీ సామీప్యతతో నిండిన ట్రాన్స్‌మిషన్ మీకు లభిస్తుంది. దీని అర్థం ఏమిటి? ఈ విధంగా ఎందుకు జరుగుతుంది? ప్రిసెప్టర్స్ చాలా మంది ఉన్నారు. ప్రిసెప్టర్‌గా పని చేయడానికి అనుమతి లభించగానే, ఆ రోజు నుండే నేను ప్రిసెప్టర్‌ను అనే ఫీలింగ్ అతనిలో వస్తుంది. అటువంటి ప్రిసెప్టర్ ఎప్పుడు కూడా సమర్థవంతంగా తన పనిని చేయలేడు. ఏ రోజునైతే ప్రిసెప్టర్‌గా పనిచేయడానికి మీకు అనుమతిని ఇచ్చారో, "ఇప్పుడు నేను సేవకుణ్ణి" అనే ఫీలింగ్ ఎవరిలోనైతే ఉంటుందో, అతడే అందరి కంటే బాగా, చక్కగా ప్రిసెప్టర్‌గా పని చేయగలడు.

మీరందరు కూడా రోజు రోజుకు పురోగతి చెందుతూ, ఇంకా ఎక్కువ ఉన్నతిని పొందాలని బాబూజీ మహరాజ్‌ను ప్రార్థిస్తున్నాను. డాక్టర్ సాహెబ్ యొక్క పేరును, మీ సెంటర్ యొక్క పేరును కూడా ఉన్నతంగా ఉండే విధంగా చేయండి. మీ ప్రోగ్రెస్‌తోపాటుగా, మీ జీవన విధానాన్ని కూడా, ఎలా అంటే ఒక సెయింట్ జీవించే విధంగా అలవరచుకోండి. ఎంతవరకు వీలైతే అంతగా (బ్యాలెన్స్‌డ్) సమతాస్థితిగా ఉండటానికి ప్రయత్నించండి. అందువలన మీ కండిషన్ (స్థితి) అనేది డిస్టర్బ్ కాకుండా ఉంటుంది. ఒక ఆధ్యాత్మిక వ్యక్తి ఎలా ఉంటాడో అదే విధంగా, మీ హృదయాన్ని, మీ ఆలోచనలను, మీ జీవన విధానాన్ని మలచుకోవాలి. ఈ విధంగా తయారు కావటానికి మీరందరు కృషి చేయాలి. విజయవాడ సెంటర్ బాబూజీ మహరాజ్ మనస్సులోను, హృదయంలోను ఇమిడిపోయింది. మీరు ఎక్కడికి వెళ్ళినా సరే, బాబూజీ యొక్క అభ్యాసీ అంటే ఇలా ఉంటారు, అని మిమ్మల్ని చూసి అందరు నేర్చుకోవాలి.

డాక్టరుగారు, తాము ఏ కండిషన్‌లో ఉన్నారో తెలుసుకొనగోరినట్లుగా వారి కుమారుడు సుధేష్ నన్ను అడిగారు. వారు ఉన్న స్థితి అనేది చాలా గొప్పది. అది వెదికినా దొరకనిది. ఎవరైనా తాను స్వయంగా కోల్పోయినప్పుడు అనగా మరపుస్థితి లేదా విస్మృతావస్థలో ఉన్నప్పుడు వారు స్వయంగా తమను తాము గుర్తించలేని స్థితిలో ఉంటారు. అందుచేత స్థితిని గురించి తెలుసుకోవటం సాధ్యం కాదు. "స్థితిని పొందనున్న వారే తమను తాము పోగొట్టుకొన్నప్పుడు ఇంకా స్థితిని గురించి చెప్పేది ఎవరు?" అని బాబూజీ అన్నారు.

ఆధ్యాత్మికత ప్రారంభమైనపుడు మరుపుస్థితి ప్రారంభమవుతుంది. (When the condition of spirituality begins, the condition of forgetfulness begins) ఒక్క నిమిషంపాటు అభ్యాసీకి తాను ఎక్కడ ఉన్నదీ, తాను ఎవరో తెలియనటువంటి స్థితి కలుగుతుంది. ఇదే మరపుస్థితి లేదా విస్మృతావస్థ. అప్పుడు ఆధ్యాత్మికత ప్రారంభమవుతుంది అన్నారు బాబూజీ. "నేను వందలకొద్దీ అర్జునులను తయారుచేశాను, కాని అందులో గాండీవం ధరించగలిగిన ధీరులెందరు?" అని వ్యాఖ్యానించారు బాబూజీ.

మరుపుస్థితి (ఇన్నర్) ఆంతరికంలో ఉంటుంది. బాహ్యంలో కూడా ఉంటుంది కాని గుర్తించలేరు. ఆంతరికంలో బాగా మునిగి ఉండటమే అందుకు కారణం. ఉదయం నుంచి సాయంత్రానికి, సాయంత్రం నుంచి ఉదయానికి ప్రోగ్రెస్ ఉంటూనే ఉంటుంది. ఆంతరికంగా ఉన్నటువంటి అనుభూతి బాహ్యంలోనూ ఉంటుంది కాని ఆంతరికంగా బాగా మునిగిపోయి ఉండటం వలన బాహ్యం యొక్క సంగతి తెలియదు. మరుపుస్థితిలో ధ్యానం ఉండదు. ఆ స్థితి నుంచి బయటకు వచ్చినపుడు మనకు ఆ స్థితిని గురించిన జ్ఞానం కలుగుతుంది. ఒకవేళ ఆ స్థితిని గ్రహించలేకపోయినప్పటికీ ఆ స్థితి కలగలేదని భావించుకోకూడదు. అది తెలియకపోవచ్చు. కనుక మరపుస్థితి ఆరంభమైనప్పుడు ఆధ్యాత్మికత ఆరంభమైనట్లుగా భావించాలి. మనం ఆంతరికంగా మునిగి ఉన్న స్థితిపైన మనస్సు నిలిపి బాహ్యానికి వస్తే ఆ స్థితి యొక్క అనుభూతి తెలుస్తుంది.

చాలామంది అభ్యాసీలకు ఈ స్థితి కలిగి ఉంటుంది. 'అనంత యాత్ర' పుస్తకం చదివిన అభ్యాసీలు నా వద్దకు వచ్చినపుడు తమకు కూడా అటువంటి స్థితి యొక్క అనుభూతి కలిగినట్లు చెప్పారు. కాని దానిపై ధ్యాస నిలపకపోవటం వలన దానిని గ్రహించలేకపోవటమో, దాని ఆనందాన్ని పొందలేకపోవటమో జరిగి ఉంటుంది. ఉదాహరణగా, మనం ఏదో లోతుగా ఆలోచిస్తూ భోజనం ఆరగించామనుకుందాం. ఆ సందర్భంలో మనం ఏమి తిన్నామో, వాటి రుచులు ఏమిటో మన దృష్టిలోకి రావు. అంతమాత్రంచేత మనం భోజనం చేయటం, రుచులు చవిచూడటం జరగకపోలేదు కదా! మనం శ్రద్ధ వహించకపోవటమే కారణం కాని అనుభూతి కలగకపోవటం కాదు. ప్రతి సిట్టింగ్‌లోను ఎంతో కొంత ప్రోగ్రెస్ (ఉన్నతి) ఉంటుంది. కాని దృష్టి నిలపకపోవటంచేత అది అనుభూతికి అందదు.

**ప్రశ్న: ఒక్కొక్కసారి ధ్యానం బాగున్నట్లుగాను, మరొక్కసారి బాగా లేనట్లుగాను అనిపిస్తుంది. అది మన అదృష్టం మీద ఆధారపడి ఉంటుందా?**

**జవాబు:** అటువంటి ఆలోచన సరియైనది కాదు. వ్యతిరేక భావనకు అవకాశం ఇవ్వవద్దని బాబూజీ పదే పదే చెప్పారు. అందుచేత అటువంటి నిరాశ చెందవద్దు. ఆలోచనలు వచ్చాయని చింతించనూ వద్దు. బాబూజీ మనలోనే ఉన్నారు. మన ఎదుటనే ఉన్నారు అనే భావంతో ఉంటే ఆలోచనలు మన దరికి రావు. వారిపై పూర్తిగా దృష్టి నిలిపి, వారి కృపను పొందుతున్నామన్న తలంపు ఉంటే నిరాశ, నిస్పృహలకు, ఆలోచనల అడ్డంకులకు తావుండదు.

**ప్రశ్న: రాముడు, కృష్ణుడు భూమి మీద అవతరించబోయేముందు ప్రకటితమైనట్లుగానే బాబూజీ కూడా ప్రకటితమయ్యారా?**

**జవాబు:** అవును, ప్రకటించబడ్డారు. అందుకు తగిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి. "సహజమార్గ దర్పణంలో దివ్యదేశ దర్శనం" పేరుతో నేను వ్రాసిన పుస్తకంలో దానిని ఉదహరించాను. ఒకరోజు సాయంకాలం, నేను ఆకాశం వంక తదేకంగా చూస్తూ ఉండగా ఒక దివ్యకాంతి కనిపించింది. అందులో వరుసగా రాముడు, కృష్ణుడు, ఓంకారం ఒక్కొటొక్కటిగా కనిపించి అంతర్థానమైపోవటం చూశాను. తర్వాత బాబూజీ రూపం కనిపించింది. బాబూజీ నుంచే ఆ ప్రకాశం వెలువడుతున్నట్లు అనిపించింది. విశ్వమంతా వారే

వ్యాపించి ఉన్నట్లుగా తోచింది. ఆ తరువాత 'ఓం'కారం కూడా వారిలోనే లయమైపోయినట్లు కనిపించింది. ఆ దృశ్యానికి పూర్వం నేను బాబూజీని దర్శించలేదు. వారిని గురించి తెలియదు కూడా. నేను అప్పటికి విగ్రహారాధన చేస్తూ ఉండే దాన్ని.

ప్రకృతి అభ్యర్థన మేరకు, ప్రపంచ మానవాళి కొరకు దివ్యశక్తి మానవరూపం దాల్చబోయేముందు బ్రహ్మాండ మండలంలో అది వ్యక్తమవుతుంది. దేవకికి శ్రీకృష్ణ పరమాత్మ బాలకుని రూపంలో కనిపించారు. ఆ దివ్యశక్తి రూపుల్ని అవతారాలుగా భావిస్తామేకాని జన్మలుగా భావించము. దివ్య మూర్తులకు లేదా అవతారాలకు మరణం ఉండదు. ఆ రూపం ఇక్కడ తయారైనది కాదు. ఏర్పడినది (తయారైనది) బ్రహ్మాండ మండలంలో! వారు స్వయంగా ఈ అవతారం తీసుకొని రారు. ప్రకృతి అవసరార్థం పంపించబడతారు. అంతేగాని కర్మఫలంగా వారి పుట్టుక జరగదు. బాబూజీ రూపం ఆనాడు ఆకాశంలో తిలకించినందువల్లనే నేను మొదటిసారిగా బాబూజీని చూసినపుడు వారే వీరు అని ధృవపర్చుకున్నాను. దైవం వస్తే ఎలా గుర్తించబడతారు అంటే, ముందుగా వారి రూపం కనిపిస్తుంది కనుక, దానినిబట్టి వారు గుర్తించబడతారు.

స్వామి వివేకానంద ఇలా చెప్పారు: ఏదైనా గొప్ప శక్తి వచ్చినపుడు దాని రూపం ఇది అని చెప్పలేం. ప్రకృతి దానికి రూపం కల్పించలేదు. శక్తి పంపించబడుతుంది. మనం గుర్తించటం కోసం ఆకారం తీసుకోబడుతుంది. కౌసల్య, దేవకీ మాతలు బ్రహ్మాండంలో చూసిన రూపంలోనే ఆ శక్తి ఉంది. ఆ శక్తి అలా దివ్య కాంతి రూపంలోనే మనసులో నిలిచి ఉంటే దానిని ఎక్కువ కాలం భరించలేరు. అందుచేత బాలకుని రూపం తీసుకోబడింది. దానినే దృష్టిలో నిలుపుకున్నట్లయితే బాలకుని రూపంలో ఉన్న అవతార మూర్తుల్ని పోషించలేరు. భయం కలుగుతుందేగాని లాలించి సేవించలేరు. అందుచేత ఆ శక్తి రూపాన్ని మర్చిపోయి మానవ రూపాన్ని సేవిస్తారు.

**ప్రశ్న: ఫ్రీడమ్ ఫ్రమ్ ఫ్రీడమ్, లైఫ్ ఇన్ లైఫ్, 'డివైన్ ఈజ్ ఇన్ యు –స్టార్ట్ లివింగ్ ఇన్ హిమ్' – అనగా విముక్తి నుంచి విముక్తి, జీవనంలో జీవనం, దైవం నీలో ఉన్నాడు– వారిలో జీవించ నారంభించు –అని బాబూజీ చెప్పిన వాక్యాలు దయచేసి వివరించండి.**

**జవాబు:** అవి బాబూజీ చెప్పినటువంటి స్థితులు. బాబూజీ మహరాజ్ చెప్పినటువంటి ప్రతి దానినీ నేను నా పుస్తకాల్లో వివరించాను. ఒక్క వాక్యమూ విడిచిపెట్టలేదు. ఫ్రీడమ్ అనగా సాల్వేషన్ అనగా మోక్షం (లేదా పాక్షికమైన ముక్తి) అనగా నిన్ను నీవు మరచిపోవటం. ఫ్రీడమ్ ఫ్రమ్ ఫ్రీడమ్ అనగా లిబరేషన్ అనగా విముక్తి. నిన్ను నీవు పూర్తిగా మరచిపోయి నీ అస్థిత్వం కోల్పోయి దైవంతో కలిసిపోవటం, అనగా ఆత్మ పరమాత్మలో లయమైపోవటం.

లైఫ్ ఇన్ లైఫ్ – జీవనంలో జీవనం, అనగా దైవం లేదా బాబూజీ మనలో ఉన్నారను భావంతో ఉంటాము. వారి మీదనే దృష్టి నిలుపుతాం. సాధనలో పరిపక్వత చెందుతున్నకొద్దీ వారిలోనే మనం ఉన్నామనే భావన లేదా అనుభూతి కలుగుతుంది. మొదట మనలో వారు ఉన్నారు అనుకున్నది క్రమంగా వారిలోనే మనం జీవిస్తున్నామనే అనుభూతిగా మారుతుంది. అదే లివ్ ఇన్ మాస్టర్, అనగా దైవంలో జీవించటం. ఇటీవల ఇది అపార్థానికి దారితీసి 'లివింగ్ మాస్టరు'గా వినబడుతున్నది.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీగారు చెప్పిన మాటలు రికార్డు చేసిన క్యాసెట్ నుంచి పుస్తక రూపంలో వచ్చిన దానిలో ప్రాణాహుతి గురించి చర్చించారు. అందులో ఒక వైన్ సీసా (బిరడా) కార్కుతో మూయబడి ఉ న్నట్లుగాను, అందులో వైన్ పోయాలన్నా, తీయాలన్నా ఆ కార్కు (బిరడా) తీసివేస్తేనేగాని పని జరుగదు. అదే విధంగా చెడు ఆలోచనలు, సంస్కారాలు హృదయం నుంచి తొలగించడానికి సీసాను తలక్రిందులు చేసినట్లు చేయాలి అన్నారు. దయచేసి దానిని వివరించండి.**

**జవాబు:** నీ హృదయాన్ని తెరచి ఉంచు. లేకపోతే పోవాల్సినవి బయటికి పోవు, అనగా సంస్కారాలు తొలగిపోవు అని బాబూజీ చెప్పారు. అభ్యాసీ బాబూజీ నుంచి మంచి స్థితులను, మంచి ఆలోచనలను పొందాలనుకుంటాడు. కాని తనలోని సంస్కారాలను, చెడు ఆలోచనలను మాత్రం బహిరంగపరచకుండా లోలోపలే అణచిపెట్టి ఉంచుతాడు. తన దోషాలను గురించి బాధపడుతూనే ఉంటాడు. అందుచేత దాపరికం లేకుండా హృదయం విప్పి వారికే అర్పితమైపోవాలి. హృదయంలోకి వారిని, వారు ఇచ్చే దానిని ఆహ్వానించాలి. తన తప్పొప్పులు గుర్తించి సరిదిద్దమని వారినే వేడుకోవాలి. అపుడు సంస్కారాలను వారే తొలగిస్తారు.

ఒక ఖాళీపాత్ర ఉందనుకుందాం. దానిలో దేనినైనా నింపాలనుకుంటే మరోపాత్రను అది ఎంత పెద్దపాత్ర అయినా సరే వంచి నింపాల్సిందే! అందుచేత మన హృదయాన్ని ఒక ఖాళీపాత్రలాగా ఉంచితే అందులో దివ్యత్వాన్ని నింపటానికి ఎంతటి దివ్య పురుషుడైనా మనవైపు వంగవలసిందే; అంటే మనల్ని దివ్యత్వంతో నింపవలసిందే. అందుచేత మన హృదయాన్ని ఖాళీగా ఉంచితే ఆ దివ్యత్వం మనవైపు ఒరిగి మనల్ని నింపుతుంది.

బాబూజీని చూడటానికి షాజహాన్‌పూర్ వెళ్ళనవసరం లేదు. కళ్ళు మూసుకుని వారి ధ్యానంలో ఉంటే మనలోపలే సాక్షాత్కరిస్తూ ఉంటారు. మొదటగా బాబూజీని చూడటానికి షాజహానుపూర్ వెళ్ళినపుడు ఆనందం కలుగుతుంది. తర్వాత దాని వలన కలిగిన ఆనందానుభూతి, అనుబంధాల వలన తిరిగి వచ్చేటపుడు వ్యధ కలుగుతుంది. వీడిపోతున్నట్లు అనిపిస్తుంది. కాని బాబూజీ మనలోనే ఉన్నారు, మన ఇంటివద్దనే ఉన్నారని అనుకుంటే, ఎడబాటు, బాధ తొలగిపోయి మనస్సు కుదుటపడుతుంది. ఇది ఎటువంటిదంటే, ఒక ఆడపిల్ల వివాహమైన తర్వాత పుట్టిల్లు వీడి వెళ్ళేటపుడు వ్యధ చెందటం, ఆ తర్వాత అత్త వారింట్లో అందరితో కలిసిమెలిసి బాధ్యతల్లో మునిగి తేలటంతో పుట్టినింటి జ్ఞాపకాలను మర్చిపోవటమూ, మళ్ళీ ఎప్పుడైనా కన్నవారింటి నుంచి కబుర్లు తెలిసినపుడు గతాన్ని జ్ఞాపకం చేసుకున్నట్లుగా ఉంటుంది. మనం బాబూజీ వద్ద నుంచి తిరిగి వచ్చినపుడు కలిగే అనుభూతి అటువంటిదే అయినా మళ్ళీ దైనందిన జీవితంలో మర్చిపోతాం. లాలాజీ గురించిన ప్రార్థనా సమావేశాలకు బాబూజీ నుంచి ఆహ్వానం అందినపుడు మళ్ళీ ఆ సన్నివేశాలు, జ్ఞాపకాలు మదిలో మెదుల్తాయి.

సహజమార్గంలో ప్రవేశించినపుడు **మొదటి సిట్టింగ్‌**లో భగవదాలోచన గురించి నిద్రాణంగా ఉన్న మన ఆత్మ జ్ఞానం జాగృతం చేయబడుతుంది. ఎవరో నీ గురించే వచ్చినట్లు, నీలోనే ఉన్నట్లు అనిపిస్తుంది. చైతన్యం కలిగిస్తుంది.

**రెండవ సిట్టింగ్**లో భగవంతుడుని గురించిన జ్ఞాపకం వస్తుంది. తాను పవిత్రంగా ఉండాలని, భగవంతుడుని పొందాలని, వారిని హృదయంలో నిలుపుకోవాలనే ధ్యాస కలిగి ఆధ్యాత్మికతకు పునాది వేయబడుతుంది.

**మూడవ సిట్టింగ్**లో ఒకరినొకరు తెలుసుకోవటం జరుగుతుంది. ఆత్మ, పరమాత్మల అనుబంధం ఏర్పడుతుంది.

**ప్రశ్న: "భగవంతుడు నీలోనే ఉన్నాడు, 'అతని'లో జీవించ నారంభించు" అని బాబూజీ చెప్పారు. దానిని ఆచరించటం ఎలా?**

**జవాబు:** బాబూజీ మొట్టమొదట తెలిపిన విషయం –దైవం నీలోనే ఉన్నాడు అని. మన నిరంతర స్మరణలో వారిని నిలుపుకొని వారిపైనే ధ్యాస నిలిపితే, వారు మనలోనే ఉన్నారనే భావం దృఢపడుతుంది. మనం తపించినకొద్దీ మనకు వారి సమీప్యత కలుగుతుంది. ఆ తపనలో మరపుస్థితి కలుగుతుంది. మనల్ని మనం మరచిపోయి వారిలోనే జీవించటం ఆరంభమవుతుంది. అందుకుగాను, తమతో ప్రాపంచిక సంబంధం కల్పించుకున్నా సమ్మతమేనని బాబూజీ చెప్పారు.

తల్లిదండ్రులకు దూరాన ఉన్న తమ పిల్లలు వస్తున్నట్లుగా ఉత్తరం వస్తే వారి రాకకోసం ఆదుర్దా, ఆసక్తి వారిని గురించిన ధ్యాస ఉంటాయి. ఎదురుచూపులు చూస్తారు. కాని వారి ఇంటికి రాగానే వారిలోని తపన చల్లారుతుంది. ధ్యాస తగ్గుతుంది.

బాబూజీ అన్నారు, "మీరు నన్ను ఆహ్వానించకపోయినా నేను స్వయంగా వచ్చాను. నన్ను ఆహ్వానించండి, నా గురించి ఆలోచించండి. నేను మీ కొరకే వచ్చాను. మిమ్మల్ని ఉద్ధరించటానికి, మీ పిలుపు లేకుండానే వచ్చిన అతిథిని. అందుచేత నా మీద దృష్టి నిలపటం లేదు" అని.

ఒక అభ్యాసీ తనకు ఆలోచనలు వస్తున్నాయని బాబూజీగారితో చెప్పినవుడు, "నేను పిలుపు లేకుండా వచ్చిన అతిథిని కదా! నన్ను దృష్టిలో పెట్టుకొని సత్కరించవలసిందిపోయి నీవు బయటనే తిరుగుతున్నావు. అందుకే నీకు ఈ ఆలోచనలు వస్తున్నాయి" అని అన్నారు. ఇంక మనం వారిని ఆహ్వానించినప్పుడు కూడా వారి రాకపై శ్రద్ధ వహించకుండా మనం పెడదారిపట్టినా కూడా వారు మనల్ని తమ వారిగానే భావిస్తారు. మనం మన తప్పును తెలుసుకొని, దివ్య భావన పెంచుకొని "నేను మీ ఎదుటే ఉన్నాను. నేను మీ వాడినే" అని అనుభూతి చెందితే వారి కృపకు పాత్రులమవుతాం. ఏ విధమైన ఆలోచనలు ఇంక రావు.

**ప్రశ్న: వ్యక్తిగత సిట్టింగులోగాని, సత్సంగ్‌లోగాని దాదాపు సగం లేదా మూడు వంతుల సమయం తర్వాత నేను మునిగిపోయిన స్థితి తొలగిపోయి పరిసరాల్లోని శబ్దాలు వినిపిస్తాయి, ఎందుచేత?**

**జవాబు:** ఈ ప్రశ్న దైవాన్నే అడగాలి. మీరు సముద్రం ముందు ఉన్నారు. అందులో పాదం మోపితే లాక్కుపోతుంది. పాదం మోపవలసింది మనం. అందులోకి దిగకుండా దానికదే తీసుకుపోదు. బాబూజీయే

ఒక దివ్య సముద్రం. వారిని మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చేసుకుంటూ నిరంతర స్మరణలో వారిని స్పర్శించే విధంగా దీక్ష వహిస్తే ఆధ్యాత్మిక సాగరానికి తీసుకుని వెళ్ళతారు.

**ప్రశ్న: ధ్యానంలో నేను కొన్నిసార్లు కవర్ అయినట్లు, కొన్నిసార్లు ఆ కవరింగ్ నుంచి తొలగిపోయినట్లు అనుభూతి చెందుతాను. ఇది వాస్తవమా లేక భ్రమ అవుతుందా?**

**జవాబు:** కవరింగ్ అవటం అంటే ట్రాన్స్‌మిషన్ వస్తూ ఉంటుంది. ఆ ప్రాణాహుతి మనలోని ఆటంకాలను, అనవసరమైన వాటిని సమీకరించి నిర్మలం గావిస్తుంది. వాటిని ఒక్కసారిగా బయటకు విసిరిపారేసినట్లు అనిపిస్తుంది. అప్పుడు కవరింగ్ నుంచి విడుదలైనట్లు అనుభూతి కలుగుతుంది. దీనిని ఇంటిని శుభ్రపరచే సందర్భంలో చెత్తా చెదారాన్ని ఒక చోటకు పోగుచేసి చేటలోకి ఎత్తి పారబోయటంతో పోల్చవచ్చు.

**ప్రశ్న: అనేక జన్మల తర్వాత ఈ జన్మ ప్రాప్తించింది. ఈ జన్మలో భూమాకు చేరిన తర్వాత వేరుపడి మళ్ళీ జన్మించడం జరుగుతుందా?**

**జవాబు:** మీ ప్రశ్న సరైనది కాదు. సెంట్రల్ రీజియన్ వరకు ఐడింటిటీ (గుర్తింపు) ఉంటుంది. బాబూజీ మహరాజ్ చెప్పిన దాని ప్రకారం కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్) అనగా సప్త వలయాలలో ప్రవేశించాక మన అస్థిత్వమే ఉండదు. అక్కడ ఒకే ఒక్క అస్థిత్వం ఉంటుంది. అది భూమాది మాత్రమే. అక్కడ బాబూజీ దర్శనం కలుగుతూ ఉంటుంది. ఆ బాబూజీ షాజహాన్‌పూర్‌కు చెందిన బాబూజీ మాత్రం కాదు, సమస్తానికి చెందినవారు. భూమా సమస్తమూ తానే అయిన బాబూజీ మహరాజ్‌గా గుర్తించాలి. అస్థిత్వమే కోల్పోయి అందులో ఐక్యమైపోయాక ఇంక జన్మ కలిగే ప్రసక్తే ఉండదు. ఇంతవరకు భూమా గురించి ఎక్కడా, ఎవ్వరూ ప్రస్తావించ లేదు. బాబూజీ మాత్రమే దాని గురించి వివరించగలిగారు. ఇదివరలో ఎవ్వరైనా చెప్పినా అది నామ మాత్రంగానే మిగిలిపోయింది. ఇపుడు బాబూజీ దానిని వెల్లడిచేసి అదే మన యొక్క లక్ష్యంగా తెలియజెప్పారు.

డివైన్ పర్సనాలిటీ పేరు ఉచ్ఛరించటానికీ, సాధారణమైన పేరు ఉచ్ఛరించటానికి భేదం ఉంది. మామూలుగా పేరును పలికినపుడు నాలుక మాత్రమే స్పందిస్తుంది. కాని దివ్య పురుషుని పేరు తలచినపుడు వారితో మనకు సంబంధం ఏర్పడి ఉంది కనుక హృదయంలో స్పందన ఉంటుంది. బాబూజీ మనల్ని అంతిమం చేర్చాలనే సంకల్పంతో వచ్చారు కనుక, ఆ సంకల్పం మన హృదయాన్ని స్పర్శిస్తుంది. 'మాస్టర్' అంటున్నామంటే అందులో భక్తి మేళవించి ఉండాలి. వారితో మనం పెనవేసుకుని ఉంటే, ఆ అనుబంధమే మన హృదయాన్ని ఆ పిలుపుతో స్పందించే విధంగా చేస్తుంది.

**ప్రశ్న: కొన్నిసార్లు ధ్యానంలో ఉన్నప్పుడు హృదయంలో ఏవో ధ్వనులు వినిపిస్తాయి. అది వాస్తవమా లేక భ్రమా?**

**జవాబు:** అది మీ ఊహ మాత్రమే. ధ్యానంలో గాఢంగా ఉన్నప్పుడు మనకు స్పృహయే ఉండదు. ఇంక మాటలు వెలువడే ప్రసక్తికాని, వినబడే ప్రసక్తిగాని ఉండదు. అలాంటి స్థితిలో, స్థితిని వివరించటానికి కూడా మాటలు రావు. దానిని ఒక రకంగా పరీక్షించుకోవచ్చు. మీరు ధ్యానానికి ముందు ప్రార్థన చేస్తూ

ఉన్నట్లయితే ఎప్పుడో ఒకప్పుడు ఆ శబ్దాలు వస్తాయి. ధ్యానానికి ముందు ప్రార్థన చేసుకోమని బాబూజీ చెప్పలేదు. ఉదయం లేవగానే ప్రార్థన చేసి బాబూజీతో "నేను మీ పాదాలవద్దనే శరణు జొచ్చి ఉన్నాను. నిరంతరం మీ స్మరణలోనే ఉన్నాను. నన్ను మీ వాడిగానే స్వీకరించండి" అని విన్నవించుకోవాలి. తరువాత మీరు ధ్యానం చేసుకోవచ్చు. ప్రార్థన ప్రోగ్రెస్‌కు ఉపయోగపడుతుంది.

**ప్రశ్న: స్వయంగా ధ్యానం చేసుకోవటానికి, ప్రశిక్షకుని (ప్రిసెప్టర్) ఎదుట సిట్టింగ్ తీసుకోవటానికి భేదం ఉందా?**

**జవాబు:** ఒక విధంగా చెప్పాలంటే, మన ఇల్లు మనమే శుభ్రపరుచుకోవటానికీ, సేవకుని ద్వారా శుభ్రం చేయించటానికీ ఉన్న తేడాయే ఉంటుంది. ప్రిసెప్టర్ వద్ద సిట్టింగ్ వలన మనలో భక్తి, శ్రద్ధ, ఏకాగ్రత కలగడానికి వారిచేత సంకల్పం చేయబడుతుంది. మన సంస్కారాలు శుద్ధి చేయబడతాయి. ప్రాణాహుతి ప్రవాహం జోరుగా జారీ చేయబడుతుంది.

**ప్రశ్న: ప్రిసెప్టర్ వద్ద తప్పనిసరిగా సిట్టింగ్ తీసుకోవాలా?**

**జవాబు:** వారం రోజుల్లో ఏ ఒక్క రోజైనా ప్రిసెప్టర్ వద్ద సిట్టింగ్ తీసుకోవాలని బాబూజీ చెప్పారు. ఆ రోజుల్లో ఉన్న కొన్ని సాంఘిక కట్టుబాట్లు మూలంగా స్త్రీలు ఒంటరిగా బయటకు వెళ్ళే అవకాశం ఉండేది కాదు. అందుకని బాబూజీతో నేను సిట్టింగ్‌కు వెళ్ళడానికి ఎదురవుతున్న ఇబ్బందిని గూర్చి చర్చించినపుడు "బిటియా! నీవు ఎప్పుడు స్మరిస్తే అప్పుడు నీ ఎదుట ఉంటాను" అని అన్నారు. ఇటువంటి సందర్భంలో బాబూజీ ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటికి వచ్చినపుడు, మేము ఒంటరిగా వెళ్ళలేమని గ్రహించి రెండు కిలో మీటర్ల దూరం స్వయంగా మా ఇంటికి నడచివచ్చి ఈశ్వర్ సహాయ్‌గారి ఇంటికి మాకు తోడుగా నడిచి వచ్చేవారు.

బాబూజీతో చనువుగా మాట్లడే వాళ్ళం. ఓసారి బాబూజీతో "నాకు ఇప్పుడు సిట్టింగ్ తీసుకోవాలని అనిపించటం లేదు" అనగా, వారు "నాకిప్పుడు నీకు సిట్టింగ్ ఇవ్వాలని అనిపించడం లేదు, బహుశా అందుకే నీకు అలా అనిపించి ఉంటుంది" అని అన్నారు.

మరణ సమయంలో భగవంతుని ప్రార్థించాలి, లేకపోతే నరకం ప్రాప్తిస్తుంది –అని చాలామంది చెప్తూ ఉంటారు కదా! అని బాబూజీని ప్రశ్నించాడు ఒక అభ్యాసీ. దానికి సమాధానంగా "నీవు సహజమార్గంలోకి వచ్చావు. నీవు అభ్యాసీవి. మరి నీకు ఆ భయం వద్దు. నీ బాగోగులు నేను చూసుకుంటాను" అని అన్నారు బాబూజీ.

అసలు 'సహజమార్గం'కు మూలం ఏమిటి? అని పరిశీలిస్తే బోధపడేది ఇదే! మనం వారిని తలంచలేదు. ఆహ్వానించలేదు. వారే స్వయంగా మనల్ని తలచుకొని, మనల్ని ఉద్ధరించాలనే సంకల్పంతో దివి నుంచి దిగి వచ్చారు. వారు తమ ప్రేమను పంచి, మన భక్తి ప్రేమలను పొంది ఆనందించాలనే సంకల్పంతో వచ్చారు. అనగా మూలమే అయిన భూమా బాబూజీ రూపంలో భువి మీదకు దిగి వచ్చింది. ఒక అభ్యాసీ బాబూజీని "మీరు ఆ సంకల్పంతో దిగి వచ్చారు. మరి మాలో అక్కడకు చేరాలనే సంకల్పం

ఎప్పుడు కలుగుతుంది" అని అడిగాడు. అందుకు సమాధానంగా "మీలో తపన ఉంటే ఆ సంకల్పం ఏర్పడుతుంది" అని చెప్పారు బాబూజీ.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఒక్కొక్కసారి ఏకాగ్రత ఉంటుంది. ఒక్కోసారి ఉండదు. ఎందుకు అలా ఉంటుంది?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ ఒకసారి కృపాధార ఇవ్వటమంటూ జరిగాక తిరిగి తీసుకోవటమంటూ ఉండదు. మనమే ఆ ధారను స్వీకరించకుండా బయటకు వస్తున్నామన్న మాట. ఒకవేళ సంబంధం తెగింది అని అనుకుంటే మళ్ళీ సంబంధం కలిగించుకోవటానికి ప్రయత్నించి ఏకాగ్రతతో ధ్యాస నిలపటమే మార్గం. ఏదైనా పనిలో నిమగ్నమైనప్పటికీ అదే ధ్యాస, శ్రద్ధ నిలుపుకోవాలి.

ధ్యానం ప్రారంభించబోయేముందు 'స్టార్ట్' (ఆరంభించు) అనే పదం ఎప్పుడూ ప్రయోగించకూడదు. ఈ శబ్దం, సహజమార్గంలో చేరేటప్పుడు ఇచ్చేటటువంటి మొదటి సిట్టింగ్ సందర్భంలోనే ప్రయోగించాలి. మామూలుగా ఈ శబ్దం ప్రయోగించినట్లయితే అభ్యాసీలో అప్పటివరకు తాను ఆ ధ్యాసలో లేనట్లుగా అభిప్రాయం కలుగుతుంది.  మనం ఎప్పుడూ నిరంతర స్మరణలోనే ఉంటాం. కాని తాత్కాలికంగా ప్రాపంచిక కార్యకలాపాల మీదకు దృష్టి మరల్చుతాం. అందుచేత ప్రతిసారీ ధ్యానం చేయించేటప్పుడు, ధ్యానంలో కూర్చోండి అని మాత్రమే చెప్పాలి.

ఒక అభ్యాసీ ధ్యానంలో సువాసనలు అనుభవమవుతూ ఉంటాయని అన్నాడు. అవి భౌతికమైనవి కావు. కొంతమంది సిట్టింగ్‌కు క్రమంగా కాకుండా అప్పుడప్పుడు బలవంతంగా వస్తూ ఉంటారు. వారికి బలవంతంగానైనా కొంత ఇవ్వాల్సి వస్తుంది. బాబూజీ అనేవారు, "అలాంటివారు ఆ మజా (మాధుర్యం) కొరకే వస్తూ ఉంటారు" అని.

జనం అంటూ ఉంటారు "గైడ్ (మార్గదర్శకుడు) లేకుండా ఏమీ చేయలేము" అని. కాని మన లోపలనే డివైన్ గైడ్ దాగి ఉంది. మీకు కోపమో లేక దురాశయో కలిగిందనుకోండి. లోపల ఉన్న గైడ్ అది మంచిది కాదని చెప్పటం జరుగుతుంది. కాని మీరు మీ ఆలోచనలతో ఆ సందేశాన్ని అణిచివేస్తే అది మౌనం వహిస్తుంది. మనలో ఆ డివైన్ గైడ్ తెలియజేసే మంచి చెడులను మనం గ్రహించి మసలుకోవాలి.

మనలోని డివైన్ గైడ్ మనల్ని బాబూజీ చరణాల వద్దకు దారి తీయిస్తుంది.  గృహస్థాశ్రమం కూడా ఒక తపస్సు వంటిదే.  ఆ గైడ్ చెప్పినట్లు మనం పాటించకపోయినట్లయితే గృహస్థ జీవనంలో ఎన్నో సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతాయి. నిబ్బరంతో వాటిని మనం సరిదిద్దుకోవాలి. కోపతాపాల వలన కుటుంబ జీవనం ఛిద్రమైపోతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీ వద్దకు తన కుమారుణ్ని తీసుకుని వచ్చి, అతనికి అతికోపమనీ, ఏ మాటా ఆలకించడనీ, దానితో విసుగు చెందుతున్నామని చెప్పాడు. అంతేగాకుండా, కుర్రవాడి తల్లి అతడ్ని చిన్నప్పుడే అడవిలో తోడేళ్ళ మధ్య వదిలేస్తే బాగుండేదని వాపోతూ ఉంటుందని చెప్పాడు. అందుకు ఆ పిల్లవాడు అక్కడ వదిలేస్తే అవే పెంచేవి గదా, అని కూడా సమాధానం ఇచ్చినట్లుగా బాబూజీకి వివరించాడు. అపుడు బాబూజీ చెప్పారు "మానవుడిలో కూడా కొన్ని జంతు లక్షణాలు ఉంటాయి. అతడ్ని

జంతువుల మధ్య పడేసినట్లయితే, ఆ లక్షణాలే ఇంకా బలపడతాయి. కనుక సహనంతో అతడిని సరిదిద్దితే మానవ లక్షణాలు అలవడతాయి" అని, ఆ పిల్లవానితో "ఆ జంతువుల మధ్య పెరిగితే నీకు వాటి లక్షణాలే వచ్చి ఉండేవి గదా!" అని సున్నితంగా హితువు చెప్పారు. అందుచేత దండించే బదులు క్రమంగా మార్పు తేవటానికి ప్రయత్నించాలి.

బాబూజీ నాకు చిన్న పిల్లలకు నేర్పినట్లు అన్నీ నేర్పారు. నేను వయసుకు పెద్దదాన్నయినా వారు శిక్షణ ఇచ్చే సమయంలో చిన్నపిల్లనే అని అనిపించింది. మనం పిల్లలకు అ,ఆ లు వ్రాయించి నేర్పినట్లుగానే వారు నాకు ప్రతిదీ చూపించి నేర్పబట్టే నేను పుస్తకాలన్నీ వ్రాయగలిగాను. ఇప్పుడైనా నా స్థితి అదే! వారు నేర్పకుండా, చూపించకుండా నేను ఏదీ వ్రాయలేను, ఏమీ చేయలేను. నాది కూడా చిన్న పిల్లల స్థితియే.

సెంట్రల్ రీజియన్ ముఖ్య కేంద్రంలో ఖాళీ (హాలో) అనగా ఒక విధంగా నలుపు ఉంటుంది. అందులోనే పవర్ ఉంటుంది. అన్నిటికన్నాముందు పరిశుద్ధత ఏర్పడుతుంది. బాబూజీ నుంచి ఆధ్యాత్మికత ఆరంభమవుతుంది. ఆ ఆధ్యాత్మికతలో నలుపు (ఖాళీ) ఉంటుంది. దాని చుట్టూరా శక్తి ఆవరించి ఉంటుంది. పవర్, సెంట్రల్ రీజియన్ యొక్క మొదటి సర్కిల్‌లో ఉంటుంది. అక్కడి నుంచి వెళ్ళాలంటే (Powerless Power) శక్తిలేని శక్తితో ప్రయాణించాల్సి ఉంటుంది. ఇంతకుముందు నేను చెప్పినట్లుగానే, బాబూజీ నాకు ప్రత్యక్షంగా చూపటంవల్లనే నాకు తెలిసింది. నేను దేనిని వ్రాసినా, చెప్పినా (కండిషన్) స్థితిని అనుసరించి వ్రాయాలి లేదా చెప్పాలి అని బాబూజీ నన్ను ఆదేశించారు. అందుచేత స్థితిని వారు చూపకుండా, దానిని దర్శించకుండా నేను ఎలా వ్రాయగలను?

మీరు ఇంకా ఇంకా ప్రశ్నలను అడగండి. మీరు తెలుసుకొని ఉంటే, మిమ్మల్ని ఎవ్వరైనా ప్రశ్నిస్తే చెప్పగలిగిన వారవుతారు.

ఒకసారి డా॥ వరదాచారిగారు బాబూజీని "ప్రిసెప్టర్ పర్‌ఫెక్ట్ అవుతారా?" అని ప్రశ్నించారు. దానికి జవాబుగా, "పర్‌ఫెక్ట్ అనదగినది లాలాజీగారి శక్తి ఒక్కటే. అది వారికే సాధ్యం. శక్తి కంటే లాలాజీగారు మిన్నయైనవారు. ఆ పర్‌ఫెక్ట్ పవర్‌నే వారు క్రిందకు తీసుకుని రాగలిగారు కనుక, వారే పర్‌ఫెక్ట్" అని బాబూజీ బదులిచ్చారు.

నేను చాలామంది సాధువులను చూశాను. కాని బాబూజీలో ఉన్నంత సాధుస్వభావం ఎవరిలోనూ గమనించ లేదు. తమ కుటుంబంలో భార్య బిడ్డలతోను, పనివారితోనూ, ఇతరులతోనూ ప్రేమగా, సమభావంతో ఉండేవారు. ఆఖరికి వారి పెంపుడు జంతువులపట్ల కూడా సమాదరణ చూపేవారు. బాధతో ఉన్నవారిని లాలించేవారు. ఇతరుల పిల్లలైనాసరే ఎవరైనా జ్వరంగా గాని, నలతగా గాని కనిపిస్తే తాము త్రాగే పాలను సైతం వారిచేత త్రాగించి అనునయించేవారు. డాక్టర్ని పిలిపించేవారు. దక్షిణ భారతదేశం వెళ్ళిరావడానికి ఒక నెల రోజులు పట్టేది. ఆ సందర్భంలో నౌకర్లు, ప్రెస్ పనివాళ్ళు తిండి సరిగ్గా పెట్టలేదు, లేదా డబ్బు అడిగినంతగా ఇవ్వలేదు అనే నెపంతో పని మానివేసేవారు. వారు తిరిగివచ్చిన తర్వాత ఆ పరిస్థితిని గమనించి, సేవకుల ఇంటికి వెళ్ళి వారిని బుజ్జగించి వారి అవసరాలు తీర్చి మళ్ళీ పనిలో ప్రవేశపెట్టేవారు. బాబూజీ ప్రేమను పంచుకున్న అనుభూతితో వారందరూ ఆనందంగా పని చేసేవారు. అంతేగాకుండా

తమ జంతువుల రుగ్మతలను కూడా గుర్తించి వైద్యం చేయించేవారు. సమస్యలను పరిష్కరించి సానుకూలత ఎలా సాధించాల్సిందీ, శాంతి, ఆనందాలు ఎలా సమకూర్చవలసిందీ వారి చర్యలు ద్వారా మనకు శిక్షణనిస్తారు. ఒకసారి షాజహాన్‌పూర్‌లో బాబూజీతో నేను "నాకు చాలా కోపం వస్తుంది" అన్నాను. అప్పుడు బాబూజీ శాంతంగా "నీవు ఇంకా జీవించే ఉన్నావు కదా!" అన్నారు. వారు పరిస్థితులను ఆ విధంగా శాంతింప జేసేవారు.

ఒకసారి ధ్యాన మందిరంలో ధ్యానంలో కూర్చునేముందు బాబూజీ నన్ను అందరికంటే వెనుక కూర్చోమని ఆజ్ఞాపించి అంతా పరిశీలించమని చెప్పారు. అభ్యాసీల్లో నలుగురు స్త్రీలు ముందు వరసలో కూర్చున్నారు. బాబూజీ నలభై నిమిషాలసేపు సిట్టింగ్ ఇచ్చారు. సిట్టింగ్ అయిపోయాక ఆ నలుగురిని సిట్టింగ్ ఎలా ఉందని అడిగాను. వారు సమాధానంగా చాలా బాగుందని, ఇదివరకు ఇంతటి అనుభూతి కలగలేదని కూడా చెప్పారు. అప్పుడు నేను వారిని ఉదయం ఎవరితోనైనా ఘర్షణపడి వచ్చారా అని అడగ్గా, వారు ప్రక్క ఇంటి వారితో చాలా గొడవపడినట్లు చెప్పారు. దాని ప్రభావం వారు సిట్టింగ్‌లో కూర్చున్నంతసేపూ ఘర్షణలో జరిగే వాద ప్రతివాదాల ఊహతోనే ఆ నలభై నిమిషాల కాలం గడిపివేశారు. బాబూజీ ఎదురుగా ఉన్నప్పటికీ వారు మాత్రం ఆ ఆలోచనల్లోనే మునిగిపోయారు. అందుచేత ఆలోచనలకు మనం పెనవేసుకోకుండా బాబూజీ మన ఎదుట ఉన్నారని భావించుకుంటే అవి మనల్ని వెంటాడవు.

మనం ఎలా జీవించాలి అన్నది ప్రశ్న. సామాన్య మానవుడికీ అభ్యాసీకి తేడా ఏమిటో ఆలోచించండి. దైవ చింతనకు అనేక పేర్లు ఉన్నప్పటికీ బాబూజీ మనల్ని సాధకుడు అనలేదు. అభ్యాసీ అని మాత్రమే అన్నారు. మనలో ఉన్న 'అభా' అనగా దివ్య ప్రకాశం, ఆ దివ్యం మీదనే విశ్వాసం ఉంచి అభ్యాసం చేస్తాం కనుక 'అభ్యాసీ' అని ప్రయోగించారు. దైవం మనలో ఉన్నాడన్న విశ్వాసంతో ఉన్నాం. కనుక మనం అభ్యాసీ అవుతాము. ఈ కలియుగంలో పరిశోధన చేస్తూ బాబూజీ చాలా శ్రమించాల్సి వచ్చింది. దివ్య కాంతి మీ హృదయంలో ఉందని అనుకోమన్నారు. దాని అనుభూతి పొందినప్పుడు, దివ్యం సమీపంలోకి వచ్చినపుడు చూడగలుగుతాం.

**ప్రశ్న: బెహెన్‌జీ! నేను గత 6 నెలలుగా మీ పాదాలకు నమస్కరించి స్పర్శిస్తున్నట్లుగా అనుభూతి చెందుతున్నాను. మీరు దానిని స్వీకరించారా? నేను తలచినపుడు మీ పాదాల సన్నిధికి చేరేటటువంటి స్థితి నాకు కలిగిందా?**

**జవాబు:** అసలు విషయం ఏమిటంటే, ఇక్కడ కస్తూరి లేదు. కనుక కస్తూరిని స్మరించటం జరగదు. మీరు బాబూజీ పాదాలను స్పర్శిస్తే అది నాకు తెలుస్తుంది. మీరు బాబూజీ పాదాలకు ప్రణామం చేస్తే తప్పకుండా వారికి చేరుతుంది. ఎవ్వరైనా, ఎవరికైనా అర్పించటమంటూ జరిగాక అందకపోవటమంటూ ఉండదు. ఎవరైనా నా పాదాలు స్పర్శించినా అది బాబూజీ పాదాలు స్పర్శించినట్లుగానే నాకు అనిపిస్తుంది. వారిని ఆశీర్వదించమని బాబూజీని వేడుకుంటాను.

**ప్రశ్న: మనలోనే బాబూజీ ఉన్నారనుకుంటాము. అందుచేత మన హృదయాన్ని నిర్మలంగా ఉంచాలనుకుంటాం. వ్యక్తిగత సిట్టింగ్‌కు వెళ్ళినపుడు, ప్రిసెప్టర్ మా ఎదుట కూర్చుని ఉండి మాలో క్లీనింగ్ చేయటమూ,**

**ట్రాన్స్‌మిషన్ ఇవ్వటమూ చేస్తున్నారంటే, అది వారిలో ఉన్నటువంటి బాబూజీయే అవి చేస్తున్నారని అనుకుంటాం. ఒకే బాబూజీ మహరాజ్ అందరి అభ్యాసీల ఎదుట ఉన్నట్లుగానే, ప్రతి గోపిక కూడా శ్రీకృష్ణుడు తన ఎదుటనే ఉన్నాడు అన్న భావనకు సరిపోల్చవచ్చునా? వ్యక్తిగత సిట్టింగ్‌లో, బాబూజీ మహరాజ్ హృదయంలో శాశ్వతంగా ఉండటం వలన మరొక బాబూజీ మహరాజ్ సిట్టింగ్ ఇస్తూ ఉంటారా?**

**జవాబు:** బాబూజీ ఉనికి యొక్క అనుభూతి ఆంతరికమైనది. శ్రీకృష్ణుని ఉనికి యొక్క అనుభూతి బాహ్యమైనది. అంటే బాబూజీ యొక్క పని ఆంతరికమైనదికాగా శ్రీకృష్ణుని పని బాహ్యమైనది. గోపికలకు ఆ భావం లేదు. మునులు, ఋషులు శ్రీకృష్ణుని సేవించటానికి జన్మ తీసుకున్నారు. శ్రీకృష్ణుని చర్యలో ట్రాన్స్‌మిషన్ ఉండదు. అసలు ఆ సమయంలో ట్రాన్స్‌మిషన్ అనే ప్రసక్తే లేదు. అనంతం నుంచి వచ్చిన బాబూజీ మహరాజ్‌కు మాత్రమే అది ఉంది. శ్రీకృష్ణుడు పోరు సలపటానికే వచ్చాడు. బాబూజీ చెప్పారు "ఏ ప్రిసెప్టర్ అయినా సరే అతడు అభ్యాసియే!" అని. ట్రాన్స్‌మిషన్ ఇచ్చే సమయంలో మూలం నుంచి వచ్చే ఆ శక్తిని ప్రవహింపజేసినంతవరకే ప్రిసెప్టర్, కాని తరువాత అభ్యాసియే. అనగా శక్తిని లింక్ (అనుసంధానం) చేయటమే అతని పని. నేను సైతం అభ్యాసీనే. ఆ శక్తితో క్లీనింగ్ చేయటం, ప్రాణాహుతి ఇవ్వడమే ప్రిసెప్టర్ పని. ప్రిసెప్టర్ అయినంతమాత్రాన అభ్యాసీలో మార్పు ఉండదు. నేనూ అలాగే ఉన్నాను మార్పు లేకుండా. ప్రాణాహుతి ఇచ్చే విధానంతో ఇంతముందు ఎవ్వరూ రాలేదు. బాబూజీ మాత్రమే ప్రాణిమాత్రులందరినీ అంతిమానికి తీసుకుని వెళ్ళాలనే సంకల్పంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. మనం బాబూజీ మన హృదయంలో ఉన్నారని అనుకుంటాం. అపుడు మన ఆంతరికమంతా నిర్మలమవుతుంది. ఇతరుల విషయంలో అలా జరగదు. కనుక బాబూజీకి శ్రీకృష్ణునికి సాపత్యం (పోలిక) లేదు. మనలో భగవంతుని పొందాలనే కోరికను జాగృతం చేసి, అక్కడికి చేర్చే సంకల్పంతో బాబూజీ వచ్చారు కనుక, వారు ప్రాణాహుతి ద్వారా శక్తి నిస్తున్నారు. ఇదివరలో రాజయోగం ఉంది, తర్వాత మరుగున పడిపోయింది కదా అని మీరు అంటున్నారు. కాని అప్పుడు ట్రాన్స్‌మిషన్ లేదు. దానిని ఎవ్వరూ, ఎప్పుడూ తీసుకొని వచ్చి ఉండలేదు. రాముడు కాని, కృష్ణుడు కాని ఎవ్వరికీ ప్రాణాహుతి నివ్వలేదు.

ఇందుకు ఒక వృత్తాంతం చూద్దాం. భీష్ముడు పాండవులలో ఒకరినైనా చంపుతానని ప్రతిన చేశాడు. అదే జరిగితే మిగిలిన పాండవులు కూడా నైరాశ్యంతో ప్రాణత్యాగం చేస్తారు. అది కృష్ణుని దృష్టికి ఎప్పుడైతే వచ్చిందో ఆయనొక పథకం వేశాడు. దాని ప్రకారం ద్రౌపది వద్దకు వెళ్ళాడు. తాను చెప్పినట్లు చేయమని ఆదేశించాడు. కృష్ణుడు పాండవులకు ప్రాణప్రదం కనుక ఆయన మాట వారికి శిరోధార్యమే. ద్రౌపది అంగీకరించింది. కృష్ణుడు ఆమెను ఒక నవవధువు రూపంలో, నూతన వస్త్రాభరణాలు ధరించి, మేలిముసుగుతో సిద్ధంగా ఉండమని, తాను రాత్రి రెండు జాముల సమయానికి వస్తానని చెప్పాడు. ఆమె సమ్మతించింది. ఆ సమయానికి కృష్ణుడు వచ్చి ఆమెను వెంటబెట్టుకుని భీష్ముడు ఉన్న శిబిరానికి తీసుకొని వెళ్ళాడు రహస్యంగా. తన అడుగుజాడల ఉనికి లేకుండా జాగ్రత్తపడ్డాడు భీష్ముడు గుర్తించకుండా ఉండటానికి. తెల్లవారు ఝామున నాలుగు ఘడియలకు భీష్ముడు ధ్యానం చేసుకొని కళ్ళు తెరుస్తాడు కనుక ఆ సమయానికి

ద్రౌపదిని ముసుగు వేసుకుని, ఆమెను గుర్తించలేనట్లుగా భీష్ముని ఎదుట కూర్చోమని ఆజ్ఞాపించాడు. ఆయన కళ్ళు తెరవగానే నమస్కరించి పాదాలు స్పర్శించమని చెప్పాడు. భీష్ముడు తపస్సు ముగించి కళ్ళు తెరిచేసరికి ఒక నవ వధువు తన ఎదుట కనిపించగానే "దీర్ఘ సుమంగళీ భవ!" అని ఆశీర్వదించాడు. అప్పుడు ఆమె నమస్కరించి ముసుగు తీసేసరికి భీష్ముడు ద్రౌపదిని గుర్తించాడు. ఆమె సుమంగళిగా ఉంటే పాండవులను చంపటం జరగదు కనుక ఇది కృష్ణుని మాయగా, వ్యూహంగా గుర్తించాడు. కనుక కృష్ణుడు భీష్ముని తన శక్తితో మార్చలేదు, యుక్తితో మాత్రమే సాధించాడు. ఇది భౌతికపరమైనదేగాని, ఆధ్యాత్మికపరమైనది కాదు. ఒక రకంగా తంత్రం మాత్రమే.

**ప్రశ్న: శ్రీకృష్ణుడు అర్జునునికి విరాట్ దర్శనం కల్పించారు గదా! అదేమిటి?**

**జవాబు:** బాబూజీ మనల్ని ఉన్నతికి తీసుకుని వెళ్తున్నప్పుడు మనకు అంతర్‌దృష్టిని ఇస్తారు. దానితో మనం మన గతిని, స్థితిని చూడగలుగుతాం. శ్రీకృష్ణుడు తన దివ్యశక్తితో అర్జునుడిని బ్రహ్మాండ మండలంలోకి తీసుకువెళ్ళి అక్కడి దృశ్యాన్ని చూపించాడు. ఈ భౌతిక ప్రపంచంలో జరగబోయే సంఘటనలు ముందుగా బ్రహ్మాండ మండలంలో కనబడతాయి. అక్కడ ఈ కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవుల మరణ దృశ్యాన్ని అర్జునునికి చూపించి, వాళ్ళు ఇప్పటికే మరణించి ఉన్నారు కనుక నీవు నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు –అని బోధిస్తాడు. అది చూపించాక అర్జునుడు మళ్ళీ భూమి మీదికి దిగిపోయాడు. మామూలు మనిషిగా అయిపోయాడేగాని అక్కడ, ఆ స్థితిలో అతను ఉండలేకపోయాడు. అది అతని తాత్కాలిక స్థితి మాత్రమే. కాని బాబూజీ మనకు ఒక స్థితిని కల్పించారంటే, అది మనకు శాశ్వత అనుభూతిగా మిగిలిపోతుంది కాని తొలగిపోదు. బాబూజీ మనల్ని బ్రహ్మాండ మండలం, పరబ్రహ్మాండ మండలం, హిరణ్యగర్భ, హృదయ మండలాల్లో ఎక్కడకు తీసుకుని వెళ్ళినా దానిలో మనకు స్థిరత్వం కల్పిస్తారు వారి ప్రాణాహుతి శక్తి ద్వారా. శ్రీకృష్ణుడు తన శక్తితో తాత్కాలికంగా అర్జునునికి దివ్యదృష్టిని కల్పించాడు, కనుక బ్రహ్మాండ మండలంలోని దృశ్నాన్ని చూడగలిగాడే కాని అక్కడ ఉండలేకపోయాడు. కృష్ణుడు అతడికి ప్రాణాహుతి శక్తి నివ్వలేదు.

ఈ కలియుగాన్ని చూశాక బాబూజీకి పరిశోధన చేయటానికి చాలా శ్రమపడవలసి వచ్చింది. దైవం నీలో ఉన్నాడు, దివ్య ప్రకాశం నీలో ఉందని అనుకోమని మనకు చెప్పారు. మొదటగా ఏమి చెప్పారంటే, దివ్య ప్రకాశం నీలో ఉందని భావించమన్నారు. దానిని నీ అంతర్నేత్రాలతో చూడమన్నారు. ఎప్పుడైతే నీవు దివ్య ప్రకాశం చూడగలుగుతావో, అది నిన్ను సమీపిస్తున్నట్లుగా తిలకిస్తావో, అప్పుడు దైవం నిన్ను సమీపిస్తున్నట్లు భావించుకుని దర్శించుకోమని చెప్పారు. అర్జునుడు ఒకసారి దర్శించి మళ్ళీ యధాస్థితికి వచ్చాడు. కాని మనం దర్శించినది అలా కొనసాగుతూనే ఉంటుంది. మనం సహజమార్గంలో చేరిన మొదటిరోజు నుంచే శ్రీ బాబూజీ మనల్ని ఆ దివ్యత్వం దర్శించటానికి తయారుచేస్తూ ఉంటారు.

**ప్రశ్న: దైవం అవతార రూపంలో దిగి వచ్చినపుడు, ఆ శక్తి శిశువు జన్మించకపూర్వమే ప్రవేశిస్తుందా లేక శిశువు జన్మించిన తర్వాతనా?**

**జవాబు:** అవతారం అనేది శక్తి నుంచే వస్తుంది. శక్తి విరాట్‌లో ఉంటుంది. అది ముందు కనిపిస్తుంది. తర్వాత బాలుని రూపాన్ని తీసుకుంటుంది. బాలుడు పెరుగుతున్నకొద్దీ శక్తి కూడా తగినంతగా పెరుగుతూ

ఉంటుంది. ప్రారంభంలో అది పరిమితంగా ఉంటుంది. అపరిమితమైన శక్తి ఒక్కసారిగా ప్రవేశిస్తే దానిని భరించటం కష్టమవుతుంది కనక, అది క్రమంగా పెరుగుతుంది. అనంతం నుంచి వచ్చిన బాబూజీ యొక్క శరీరం తట్టుకునేందుకుగాను లాలాజీ వారిలో లయమై తగిన జాగ్రత్త వహించి వారిని సంపూర్ణంగా తయారు చేశారు. ప్రిసెప్టర్ శక్తితో రాలేదు. సాధన చేసినకొద్దీ శక్తి సంపద పెరుగుతూ ఉంటుంది. ఒక్క పెట్టున అది రాదు.

బాబూజీతో ఒక సూఫీ మహాత్ముడు "మీ శక్తి (Open) విస్తరించబోతుంది" అని అన్నారు, అలాగే లాలాజీ కూడా చెప్పారు. మేమంతా అక్కడే ఉన్నాము. అపుడు బాబూజీ అన్నారు –అదేమిటో మీకే తెలియాలి అని. దాని అర్థం ఏమిటంటే, బాబూజీ ఆ శక్తిపైన ఆధిపత్యం పొంది తనదిగా చేసుకొని సామర్థ్యం పెరుగుతున్నట్లు భావించాలి. అపుడింక వారి భారం వహించాల్సిన పని లాలాజీకి కూడా తగ్గిపోతుంది. వారికి వారే సమస్తం అవుతారు.

**ప్రశ్న: మేము అభ్యాసీలం. మా పేరెంట్స్ అభ్యాసీ కారు. ఈ సహజమార్గంలోని మాధుర్యం మాకు తెలిసింది. అందుచేత వారిని కూడా చేరమని చెప్పినా చేరటం లేదు. వారిని అభ్యాసీలుగా మార్చటం ఎలా? వారికి ముక్తి లభించాలని మా కోరిక.**

**జవాబు:** వారు కూడా అభ్యాసీలుగా చేరాలని, వారిలో మార్పు రావాలని మీరు బాబూజీని ప్రార్థించండి. మీ ప్రిసెప్టర్సను కూడా అందుకొరకు ప్రార్థించమని అర్థించండి. అలా చేయటంవలన వారిలో మార్పు వస్తుంది. కాని బలవంతం చేసినట్లయితే వారిలో మొండివైఖరి బలపడుతుంది. ప్రతిఘటన పెరుగుతుంది. దానివలన మార్పు రాదు. ఇంకా దూరమైపోతారు. వారే స్వయంగా గ్రహించగలగాలి.

**ప్రశ్న: బెహెన్‌జీ! చిన్న పిల్లలు మన ప్రక్కన పండుకున్నప్పుడు క్లీనింగ్ చేసుకోవచ్చా?**

**జవాబు:** క్లీనింగ్ చేసుకోవటానికి అభ్యంతరం లేదు. చంటిపిల్లలను దగ్గరగా కూర్చోబెట్టుకున్నా ఇబ్బంది లేదు. ప్రాణాహుతి వలన వారికి చెడు జరగదు. కాని సత్సంగ్ జరిగేటపుడు వారిని దగ్గర అనగా గ్రూపు మధ్య కూర్చోబెట్టుకుంటే వారు ఏడ్వవచ్చు. దాని వలన ఇతరులకు ధ్యాన భంగం కలుగుతుంది. అటువంటి సందర్భంలో వారిని బయటనే ఉంచాలి. ప్రిసెప్టర్స్ కూడా వారికి ఆ విధంగా సలహా ఇవ్వాలి. పిల్లలకు సూటిగా ప్రాణాహుతి ఇవ్వకూడదు. దానివలన ఆ శక్తికి తట్టుకోలేక వారికి మతిభ్రమ కలిగే ప్రమాదం ఉంటుంది. తల్లి స్వయంగా ఇంటి దగ్గరైనా ధ్యానం చేసుకోవచ్చు లేదా గ్రూపు నుంచి బయటకు వెళ్ళి ఎక్కడైనా చేసుకోవచ్చు.

**ప్రశ్న: వ్యక్తిగత (Individual) సిట్టింగ్‌లోగాని, గ్రూపు సిట్టింగ్‌లోగాని ప్రిసెప్టర్ కళ్ళు మూసుకొని ట్రాన్స్‌మిషన్ ప్రారంభించిన తర్వాత మరొక అభ్యాసీ ప్రవేశించి సిట్టింగ్‌లో జాయిన్ కావచ్చునా?**

**జవాబు:** అది మంచి పద్ధతి కాదు. ఒకవేళ జాయిన్ కావలసి వస్తే, ఇతరులెవ్వరికీ భంగం కలగని విధంగా ప్రిసెప్టర్‌కు నిశ్శబ్దంగా మీ సమస్య చెప్పి, వారి దృష్టికి తెచ్చి కూర్చోవచ్చు. ప్రిసెప్టర్‌కు మీ ఉనికి తెలియకుండా మీరు కూర్చున్నా ప్రయోజనం ఉండదు. ప్రిసెప్టర్ దృష్టిలో ఉన్న వారికే ప్రాణాహుతి ఇవ్వడం జరుగుతుంది

కనుక, వారికి తెలియకుండా ప్రవేశించిన వారికి ఫలితం ఉండదు. ఆ విధంగా వారికి తెలియపరచి కూర్చుండే అవకాశం లేనపుడు తరువాతి సిట్టింగుకు వేచి ఉండటమే అవసరం. ప్రిసెప్టర్‌ను కూడా ఇబ్బందికి గురిచేయనివారవుతారు.

**ప్రశ్న: 'ఓమ్' శబ్దానికి వివరణ ఇవ్వండి.**

**జవాబు:** 'ఓమ్' శబ్దం గురించి నేను ఒక్కటి మాత్రం చెప్పగలను. అది ఏమిటంటే, 'ఓమ్' అనేది శక్తికి రూపం (సంకేతం). అది బాబూజీలో లయమైపోయింది. కనుక సహజమార్గ అభ్యాసీలకు, దాని గురించి తెలుసుకోవాల్సిన పనిలేదు. అది ఒక ధ్వని మాత్రమే.

**ప్రశ్న: క్లీనింగ్, మెడిటేషన్ ఒకేసారి (ఒకదాని వెంట ఒకటి) చేయవచ్చునా?**

**జవాబు:** మీరు మెడిటేషన్ చేస్తున్నారంటే, క్లీనింగ్ కూడా దానంతట అదే జరుగుతుంది. అపవిత్రంగా ఉన్నచోట దైవం ఉండదు గదా! ధ్యానం, క్లీనింగ్ వేర్వేరుగా చేసుకోవాలి. వాటి ఉద్దేశ్యాలే వేరు. ధ్యానంలో, మనం "బాబూజీ మనలో ఉన్నారు" అనుకోవటం మాత్రాన్నే నిర్మలత్వం ఏర్పడుతుంది. ప్రాణాహుతి స్వీకరించబడుతుంది. క్లీనింగ్‌లో సంస్కారాలు తొలగించబడతాయి. మన దినచర్యలో ఏవైనా కొన్ని విషయాలు మనల్ని ప్రభావితం చేస్తాయి. మనస్సు దాని మీదనే లగ్నమవుతుంది. అందువలన అవి సంస్కారాలుగా ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుచేత క్లీనింగ్ ద్వారా ఆ సంస్కారాలను ప్రక్షాళనం చేసుకొని నిర్మలంగా ఉండటానికి సాయంత్రం వేళ క్లీనింగ్ చేసుకోవాలని బాబూజీ చెప్పారు. నిరంతర స్మరణ ఉంటే క్లీనింగ్ దానంతట అదే జరుగుతుంది. బాబూజీకి క్లీనింగ్ శబ్దం రుచించేది కాదు. ఒకసారి నలుగురు అభ్యాసీలు తాము రోజులో అనేకసార్లు క్లీనింగ్ చేసుకుంటున్నట్లు చెప్పారు. అపుడు బాబూజీ వారితో – లోతుగా ఐదు నిమిషాలు ధ్యానంలో కూర్చోమనీ, ఒక్కసారి మాత్రమే క్షాళన చేసుకోమని సలహా ఇచ్చారు. వారు ధ్యానంచేసుకొని వెళ్ళిపోయాక – వీళ్ళు గతజన్మలో క్లీనర్లు అయి ఉంటారు. అందుచేతనే వీరికి పదే పదే క్లీనింగ్ ధ్యాస ఏర్పడిందని చెప్పారు.

**ప్రశ్న: ఇంతమంది కూర్చుని ఉన్నాం. ఇందులో కొందరు ప్రిసెప్టర్స్ అయి ఉండవచ్చు గదా! వారిని ఎలా గుర్తించటం?**

**జవాబు:** మనమందరమూ ప్రిసెప్టర్స్‌మే. మిషన్ గురించి బాగా అర్థం చేసుకొని దాన్ని ఇతరులకు చెప్పగలిగిన వారే ప్రిసెప్టర్స్. వారు కళ్ళు మూసుకొని ప్రాణాహుతి ప్రసారం చేస్తే ప్రిసెప్టర్స్, కళ్ళు తెరిస్తే అభ్యాసీలు. ఎందుకంటే, బాబూజీ ప్రాణాహుతిని ఇచ్చినంతసేపే వారు ప్రసారం చేస్తారు. ఆ తర్వాత అభ్యాసీలైపోతారు, కనుక నేను కూడా అభ్యాసీనే.

ఒకసారి బాబూజీ వద్దకు ఒక అభ్యాసీ వచ్చాడు. తాను చాలా దూరం నుంచి వచ్చానని, ప్రిసెప్టర్ కావాలని అనుకుంటున్నానని చెప్పాడు. అందుకు బాబూజీ "నీవు ప్రిసెప్టర్‌వు కావాలని అనుకుంటున్నావా" అని ప్రశ్నించి, చూద్దాంలే అని చెప్పి పంపించారు. అతడు వెళ్ళిన తర్వాత, నేను (సిస్టర్ కస్తూరిగారు), వరదాచారిగారు, ఇంకా కొందరు కూర్చుని ఉండగా బాబూజీ ఇలా అన్నారు: "మనిషి గాడిదగా కావాలని

అనుకుంటున్నాడు. అభ్యాసీ తేలికవుతాడు. ప్రిసెప్టర్ భారం వహిస్తాడు. గాడిదకు వెన్ను మీద బరువు ఉంటేనే తృప్తిగా ఉంటుంది. బరువు ఏమీ లేకపోతే చిందులు వేస్తుంది. ఆ విధంగా ఈ మానవుడు గాడిదగా కావాలని అనుకుంటున్నాడు" అని హాస్యోక్తిగా చెప్పారు.

**ప్రశ్న: పది సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు ప్రార్థన చేసుకోవచ్చునా?**

**జవాబు:** పది సంవత్సరాల వయస్సు వారే కాదు, ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న వారు కూడా చేసుకోవచ్చు. పది సంవత్సరాల వయస్సు ఉన్న వారు విద్యార్థులుగా ఉంటారు కనుక వారు బాగా చదువు సంధ్యలు నేర్చుకోవాలని ప్రార్థించవచ్చు. ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు తాము ఉత్తమంగా, పవిత్రంగా తయారుకావాలని ప్రార్థించవచ్చు.

ఇంకా ప్రశ్నలు అడగండి. మీరు అడగటం వలన నాకు ఇబ్బంది లేదు. మీరు సాధన గురించి ఎక్కువగా తెలుసుకుంటే దీన్ని గురించి తెలుసుకోవాలనుకునే వారికి మీరు బాగా చెప్పటం సాధ్యపడుతుంది. అందుచేత మీరు నాకు ఇబ్బంది అని ఏమీ అనుకోవద్దు.

రోజు రోజుకూ ప్రిసెప్టర్స్ బాధ్యత పెరిగిపోతుంది. ఎందుకంటే, ప్రతి సెంటర్‌లోనూ అభ్యాసీల సంఖ్య పెరుగుతుంది. అలా పెరుగుతున్నకొద్దీ అభ్యాసీ లందరినీ అనంతానికి చేర్చాలనే ప్రయత్నంలో ప్రిసెప్టర్స్ కృషి చేయవలసి ఉంటుంది కనుక వారి బాధ్యత పెరుగుతుంది.

**ప్రశ్న: అభ్యాసీలు కానివారు కూడా బాడ్జి ధరించి వస్తున్నారు, వారిని గుర్తించటం ఎలా?**

**జవాబు:** గుర్తించవచ్చు. అది కష్టం కాదు. అభ్యాసీల మధ్య ఒక విధమైన ఆకర్షణ ఉంటుంది. దానినిబట్టి మరియు ప్రవర్తనను బట్టి తెలుసుకోవచ్చు. రాముని వద్దకు అతడు ఎవరో తెలుసుకుని రమ్మని సుగ్రీవుడు హనుమంతుణ్ణి పంపించాడు. హనుమంతునికి రాముడు ఎవరో తెలియదు. రామునికి హనుమంతుడు ఎవరో తెలియదు. వారిద్దరిలోని దివ్య శక్తిని ఒకరికొకరు గుర్తించటం ద్వారా ఆకర్షితులై ప్రశ్నించుకోవటమే మరచిపోయారు.

మీరట్ నుంచి ఒకామె ప్రతి సంవత్సరం ఆశ్రమంలో ఉత్సవాలకు హాజరువుతూ ఉండేది. ఇలా అయిదారు సంవత్సరాలుగా ఆమె వస్తూనే ఉంది. ఆమెకు బాడ్జి లేకపోయినా బాబూజీ ప్రశ్నించవద్దని చెప్పారు. భోజన సమయంలో బాబూజీ ఆమె ప్రక్కనే కూర్చొని, ఆమె ప్లేటులోని చల్లబడిన రొట్టెలు వారు తీసుకొని వేడి వేడి రొట్టెలు ఆమెకు వడ్డించేవారు. అలాగే రాత్రి సమయంలో కూడా తాము త్రాగబోయే వేడి వేడి పాలు ఆమెకు సగంపోసి ఇచ్చేవారు. ఇదంతా చూసి ఈశ్వర్ సహాయ్‌గారు, ఇతరులు కూడా బాబూజీకి ఆమెపట్ల ఉన్న ప్రత్యేక శ్రద్ధను గమనించి ఆమె భాగ్యశాలి, బాబూజీ ప్రేమకు పాత్రురాలైందని అనుకునేవారు. ఈర్ష్య పడేవారు. ఒకసారి ఈశ్వర్ సహాయ్‌గారు ఉండబట్టలేక బాబూజీని ఈ విషయమై ప్రశ్నించారు. అపుడు బాబూజీ "ఆమె భోజన ప్రియురాలు. ఆమెకు మంచి భోజనం ఉంటే తృప్తి చెందుతుంది. ఆధ్యాత్మిక విషయాలపై ఆమెకు శ్రద్ధలేదు. నేనూ ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి పెట్టకుండా ఆమె కోరుకున్న దానిని ఇచ్చి, ఆమెకు తృప్తి కలిగించి ఇంటికి పంపుతున్నాను" అని అన్నారు.

నేను ఒకసారి మద్రాసు ఆశ్రమానికి వెళ్ళాను. అపుడు బాడ్జి మూలంగా బ్లౌజు చిరగటం వలన, దానిని మార్చుకొని బాడ్జి లేకుండా నేను సమావేశంలోకి వెళ్ళుతూ ఉండగా బాడ్జిలేదని అడ్డగించటం జరిగింది. అపుడు నాకు తెలిసిన పాత అభ్యాసీలు నన్ను గుర్తించి ప్రవేశం కల్పించారు. అపుడు నేను అడిగాను – బాబూజీ సమయంలో బాడ్జి లేకపోయినా అభ్యాసీలు గుర్తించబడేవారు. ఇక్కడ బాడ్జి లేనంతమాత్రాన అభ్యాసీలను గుర్తించలేకపోతున్నారు గదా! అని.

బాడ్జి ప్రయాణంలో కాని, మరొక క్రొత్త చోటుకు వెళ్ళినపుడు అక్కడి వారు అభ్యాసీలను గుర్తించి ఆహ్వానించటానికి ఉపయోగపడుతుంది. మధురమీనాక్షి ఆలయంలో ధోవతి, ఉత్తరీయంతో మాత్రమే ప్రవేశించాలనే నిబంధన ఉండేది. నేను వెళ్ళినపుడు అది మారిపోయి షర్టు తీసి భుజం మీద వేసుకుంటే సరిపెట్టుకునే పద్ధతి వచ్చింది. ఇలా ఎందుకు జరిగింది అని ప్రశ్నిస్తే – పూర్వం జందెం ఉన్న వారికే (బ్రాహ్మణులకే) ప్రవేశం ఉండేది. వారిని గుర్తించటం కోసం షర్టు తొలగించమనటం జరిగేది. ఇప్పుడైతే బ్రాహ్మణులు కూడా (యజ్ఞోపవీతం) జందెం వేసుకోవటం లేదు గదా! అన్నారు. షర్టు వేసుకుంటే అర్హులు కానపుడు షర్టు తీసివేస్తే అర్హులవుతారా అని నేను వివరం అడిగినపుడు ఈ సంగతి చెప్పారు.

మనం వారి ప్రేమలో ఆధ్యాత్మికంగా చైతన్యవంతులమయ్యాం. మనం అలసిపోయినప్పటికి వారు హుషారుగానే ఉన్నారు. మన చేయి పట్టుకొని తీసుకొని వెళ్ళుతున్నారు. ఇంకేమీ ఆలోచించకుండా వారితో సాగిపోవటమే మన కర్తవ్యం. సద్గురువు అంటే మనం 'వారి'ని మరచిపోయినప్పటికీ మనల్ని మరచిపోకుండా అనంతం వరకు చెయ్యి పట్టుకొని తీసుకుని వెళ్ళేవారు. మనలో అహం ఏ మాత్రం లేకుండా విడిచిపెట్టాలి. సదాచారపరులు ఎవ్వరంటే, అహంను పూర్తిగా వదిలివేసిన వారు మాత్రమే. సహజమార్గంలో చేరాక నిస్పృహను దరికి రానివ్వకూడదు. 'వారి' మీద విశ్వాసం ఉంచాము. వెనుదిరిగి చూడకూడదు. వారి వెంట సాగిపోవాల్సిందే కాని, మనం ఎక్కడ ఉన్నాం, ఏ రీజియన్‌లో ఉన్నాం అని ఆలోచించకూడదు. వారు ఎక్కడ ఉంటే అక్కడే మనం ఉంటాము. వారు ఏ రీజియన్‌లో ఉంటే అ రీజియన్‌లోనే మనం ఉంటాము.

**ప్రశ్న: "ఈశ్వరుడు తాను మనలోపలే ఉండి మనల్ని ముందు ఉంచాడు. ఈశ్వరుడ్ని నీ ముందున బయట ఉంచి, నువ్వు లోపలే ఉండటానికి ప్రయత్నించు" అన్నారు బాబూజీ. అది ఎలా?**

**జవాబు:** మీకు మీ పేరు తెలుసు. ఈశ్వరుడ్ని పేరు విన్నారు కాని తెలుసుకోలేదు. ఈశ్వరుడు మనలోనే ఉన్నాడని బాబూజీ చెప్పారు. ఆయన్ని పొందాలంటే నిన్ను నీవు మరచిపోవాలి. మనం వెనక్కి తగ్గితే (అనగా అహం తగ్గిపోతే) ఆయన ముందుకు వస్తారు. నీవు నీ ఉనికిని మర్చిపోయి బాబూజీ జ్ఞాపకంలోనే ఉండాలి.

**ప్రశ్న: బెహెన్‌జీ! గీతోపదేశం ఏడు నిమిషాల్లో ఏడు శ్లోకాల్లో మాత్రమే శ్రీకృష్ణుడు చెప్పటం జరిగింది, అని బాబూజీ చెప్పారు గదా! ఆ శ్లోకాలు ఏవి?**

**జవాబు:** గీత నేను చదవలేదు, బాబూజీ కూడా చదవలేదు. నాకు గీతోచ్చారణ కూడా తెలియదు.

ఒకసారి లఖీంపూర్‌లో గీతా జయంతి ఉత్సవాలు జరిగాయి. అందులో పాల్గొనడానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుండి అనేకమంది సాధువులు వచ్చారు. ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున అక్కడ జన సమూహం ఉంది. అక్కడి స్వామివారికి బాబూజీ దివ్య పురుషులని తెలుసు. వారిని కూడా ఆహ్వానించారు. మేమందరం కూడా వెళ్ళాము. ఆ సభలో నన్ను 20 నిమిషాలు సమయం ఇచ్చి, ప్రసంగించాలని కోరారు. గీతోచ్చారణగాని, గీతా శ్లోకాలుగాని అవగాహనలేని నేను ఏమి మాట్లడాలో తెలియక ఇరుకునపడ్డాను. బాబూజీతో చెప్పాను నా నిస్సహాయత గురించి. అపుడు వారు నాతో "వీరు ప్రసంగించమని కోరారు కనుక ప్రసంగించు, జనానికి అర్థమైనా కాకపోయినా ఫర్వాలేదు" అని అన్నారు. నా వంతు వచ్చింది. భయం వేసింది. తప్పదు కనుక మైకు వద్దకు వెళ్ళాను. నాకు స్పృహ లేదు. అలా నా ప్రసంగం వారిచ్చిన 20 నిమిషాలకు బదులు 40 నిమిషాలు కొనసాగింది. ఇంతలో ఇంక చాలు, ఆపండి అన్న శబ్దం వినిపించింది. అప్పుడే నేను ఎక్కడి నుంచో ఊడిపడినట్లుగా అనిపించింది. తర్వాత నేను బాబూజీ వద్దకు వచ్చి కూర్చొని నేనేమి మాట్లాడాను అని అడిగాను. అపుడు వారు, "జనమంతా స్పృహలోనే లేరు, పూర్తిగా దివ్యత్వంలోనే మునిగిపోయారు. ఇంక విషయం ఏమి గ్రహించి ఉంటారు?" అని అన్నారు. సభాధ్యక్షులు, స్వామీజీ అందరూ ప్రశంసించారు. మా నాన్నగారైతే ప్రసంగానికి ముందు "నీవేమి మాట్లాడగలవు" అన్నారు. అధైర్యపడ్డాను. ప్రసంగించానేగాని నేనేమి మాట్లాడానో, నాకేమీ తెలియదు. నేను ఈ సంగతి చెప్పినపుడు అక్కడే ఉన్న లాలాజీగారి సోదరుడు, "ఇలా జరుగుతుందని నాకు తెలుసు, అందుకే నేను మౌనంగా ఉండిపోయాను" అని అన్నారు. ఇంతకీ చెప్పాల్సింది ఏమిటంటే మాట్లాడిందీ, మాట్లాడించిందీ కూడా బాబూజీయే. నేను ఏమి మాట్లాడాను అని అడిగినపుడు అధ్యక్షుల వారు నోట్ చేసుకున్న వాక్యం ఇది.

**గీతా గీత్ నహీ జో గావో బార్ హజార్ ఏకై బార్ నివార్‌కర్ కహానీకి లే సంసార్.**

అనగా గీతను పదే పదే చదవటం కాదు. అందులోని సారం ఒకసారి జీర్ణించుకుంటే మళ్ళీ మళ్ళీ పఠించాల్సిన పని లేదు –అని. గీతలో ఏడు శ్లోకాలు కూడా లేవు – ఇదే గీత అంటే. కనుక దివ్యత్వంలో మునిగి ఉండటమే ముఖ్యం.

**ప్రశ్న: విదేహముక్తి, జీవన్ముక్తి, ఆత్మ సాక్షాత్కారం, మోక్షం – వీటిలోగల భేదం ఏమిటి?**

**జవాబు:** విదేహముక్తి, మోక్షం అనేవి రెండూ ఒక్కటే. జీవుడు తాను జీవించిన కాలంలో అనగా మరణానికి ముందు పొందిన ఆధ్యాత్మిక అనుభూతి, విస్మృతస్థితి లేదా ఆనందం వలన కొంత పరిమిత కాలం అంటే అది వంద సంవత్సరాలు కావచ్చు, మరేమైనా కావచ్చు –ఆత్మ నిలకడగా ఉండి, తర్వాత మళ్ళీ జన్మ తీసుకుంటుంది. ఆత్మ పరమాత్మలో లయమవ్వలేదు కనుక, జన్మ తీసుకోవాల్సి ఉంటుంది.

ముక్తి అనగా ఆత్మతత్త్వం పరమాత్మతత్త్వంలో విలీనమైపోతుంది. ఇదే జీవన్ముక్తి లేదా (లిబరేషన్) ముక్తి అని బాబూజీ చెప్పారు. ఆత్మ అనేది ఉన్నంతవరకు నీవు ఉన్నట్లే. రియాలిటీ (సత్యత్వం) ప్రారంభమవ్వటంతోనే ఆధ్యాత్మికత అంతమవుతుంది. రియాలిటీ (సత్యత్వం లేక వాస్తవికత) తర్వాత

డివినిటీ (దివ్యత్వం), దాని తర్వాత ఈశ్వరీయత కలుగుతాయి. అనగా (దివ్య దేశం) గాడ్లీ రీజియన్‌లో ప్రవేశం కలుగుతుంది.

ఆత్మ సాక్షాత్కారం అంటే ఈ స్థాయిలో 'నేను' అనేది ఉండదు. 'నేను' అని ప్రయోగించినపుడు అది జీవుని శరీరాన్ని స్పర్శించదు. ఈ పదం యొక్క దృష్టి బాబూజీ మీదనే ఉంటుంది కాని, మీ దేహానికి చెందదు. మీ శరీరంతోగాని, పేరుతోగాని దానికి సంబంధం ఉండదు. అనగా రియల్ సెల్ఫ్ (సత్యత్వం)లో 'నేను' అనేది ఉండదు. ఇదే ఆత్మ సాక్షాత్కారం.

**ప్రశ్న: శరీరంలోని ఏ భాగం నుండి ప్రాణాహుతి ప్రవేశిస్తుంది? ఎక్కడ నుండి పని చేస్తుంది?**

**జవాబు:** అది శరీరం యొక్క ప్రతి కణంలోనూ ప్రవేశిస్తుంది. మొట్టమొదట హృదయ మండలంలో ప్రవేశిస్తుంది. ఈ అనంతశక్తి అనంతం నుంచి వస్తుంది. దీనికి పరిమితి లేదు. నెమ్మది నెమ్మదిగా ప్రతి కణం, ప్రతి అణువులోనూ ప్రవేశిస్తుంది. అంతటా నిండుకొని ఉంటుంది. అణువణువూ నేత్రమైపోయి వారి దర్శనం కోసం తపిస్తూ ఉంటుంది. పూర్తి మనస్సుతో ఆహ్వానిస్తే హృదయం మాత్రమే కాదు. శరీరంలోని ప్రతి అణువూ ఆ శక్తిని సంగ్రహిస్తుంది. నీవు పొందుతున్నావు అంటే అది నీ శరీరమంతా పొందుతున్నట్లే. హృదయం అంటే మొత్తం శరీరం అని భావించుకోవాలి.

బాబూజీ మహిమలు ప్రదర్శించరు. కాని మనల్ని కాపాడుతారు. అది ఎలాగో చూడండి. ఒకసారి బాబూజీ, నేను మద్రాసు వెళ్ళాం ఉపన్యసించటానికి. డాక్టర్ వరదాచారిగారు కూడా వచ్చారు. వారిని అక్కడి వారు చాలామంది ఎరుగుదురు కనుక అందరూ వారిని పలకరిస్తున్నారుగాని, మమ్మల్ని పట్టించుకున్నవారే లేరు. సమావేశంలో హిందీలో మాట్లాడరాదు అని ప్రకటన వ్రాసి ఉంది. బాబూజీ నాతో హిందీలో మాట్లాడరాదు అని వ్రాసి ఉంది, ఏం చేస్తావు అన్నట్లుగా మాట్లాడారు; సరే, కానివ్వండి అన్నాను.

సభ ప్రారంభమైంది. వరదాచారిగారు కూడా ప్రసంగించాల్సి ఉంది. వారికి ప్రసంగించేటపుడు ఒక గులాబీని చేతిలో తీసుకొని త్రిప్పుతూ మాట్లాడటం అలవాటు. దాని ప్రకారం ఒక గులాబీని టేబుల్ మీద ఉంచారు. బాబూజీకి ఆ విషయం తెలిసి, వారు వచ్చేలోగా గులాబీని తీసి జేబులో దాచుకున్నారు. వరదాచారిగారు అలవాటు ప్రకారం దాని కోసం తడుముకున్నారు కాని అది కనిపించలేదు. ఏదో జరిగినట్లు గ్రహించారు. ప్రసంగం పూర్తియ్యాక బాబూజీ వరదాచారిగారిని – గులాబీ కోరలేదేమిటి? గులాబి నీకు అవసరం కనుక అడుగుతావనుకున్నాను, అన్నారు. అపుడు వరదాచారిగారు దాని అవసరం లేకుండా మిమ్మల్ని చూస్తూ మాట్లాడేశాను.

నా వంతు వచ్చేసరికి బాబూజీని అడిగాను, "బాబూజీ! నేను హిందీలోతప్ప ఇంకే భాషలోను మాట్లాడలేనుగదా, నా పరిస్థితి ఏమిటి?" అని. వారు "బిటియా! నీవు ఏ భాషలోనైనా మాట్లాడు. ఎవ్వరూ గుర్తించలేరు" అన్నారు. నేను ప్రారంభించాను, ఏమి మాట్లాడానో తెలియదుగాని ట్రాన్స్‌మిషన్ ముంచేసింది. సహజమార్గం యొక్క రమ్యత ఇదే. ఇంతలో సమయ పాలనకు గంట మ్రోగింది. ప్రసంగం ముగించాను.

బాబూజీ అడిగారు “బిటియా! నీవు ఎలా మాట్లాడావు?” అని. “బాబూజీ! నాకు అసలు నేనేమి మాట్లాడానో నాకు తెలియలేదు” అన్నాను. ఆ సభకు అధ్యక్షులుగా ఉన్న చీఫ్ జస్టిస్‌గారు, వరదాచారిగారి స్పీచ్ బాగుందని, నా స్పీచ్‌లో భాష, భావం మాటేమోగాని ట్రాన్స్‌మిషన్ మాత్రం చాలా గొప్పగా వచ్చిందని ప్రశంసించారు.

ప్రసంగం పూర్తయ్యాక జనం అందరూ చప్పట్లు చరుస్తూ ఉంటే అప్రయత్నంగా నేను కూడా చప్పట్లు కొట్టాను. నా పొరపాటును గ్రహించి బాబూజీతో చెప్పాను. వారు అన్నారు: “బిటియా! దానిని నేనుతప్ప మరెవ్వరూ చూడలేదులే, అందరూ ట్రాన్స్‌మిషన్‌లో మునిగిపోయారు” అని. ప్రసంగానికి వారిచ్చిన విషయం – “సహజమార్గంలో ట్రాన్స్‌మిషన్”. ఆపద సమయంలో బాబూజీ మనల్ని ఎలా కాపాడుతారో అనటానికి ఉదాహరణ ఇది. అంతేగాని మహిమ కాదు, మనపట్ల కృప మాత్రమే! తల్లి బిడ్డను ఒడిలో పెట్టుకుని ఎలా కాపాడుతుందో, తన బిడ్డల తప్పులను హృదయంలో ఎలా దాచుకుని సాకుతుందో అలాగే బాబూజీ మనల్ని కంటికి రెప్పలా కాపాడుతారు. మన దోషాల్ని పరిగణించరు, మన్నిస్తారు. వారిపై విశ్వాసం ఉంచుకుని, శరణు పొందితే ఎల్లవేళలా కాపాడుతూ ఉంటారు. మనకు ఉన్నతి కల్పిస్తారు. వారిపై శరణాగతి లేదా వారే దిక్కు అనే భావం పెంచుకోవాలి. వారిపైనే ఆధారపడి ఉండాలి.

ఒకసారి ఇంటి వద్ద సత్సంగం జరిగింది. పిల్లలూ, పెద్దలూ అందరూ ఉన్నారు. ఇంటిముఖం పట్టేముందు ఒక్కసారిగా జోరుగా వర్షం కురవనారంభమైంది. అప్పుడు బాబూజీని స్మరించి – “అందరూ తడిసిపోతారు, వర్షం ఆగితే బాగుంటుంది” అని అనుకున్నాను. వర్షం తగ్గటం, అందరూ ఇళ్ళకు చేరాక మళ్ళీ కురవటం జరిగింది. మరోసారి ఇటువంటి సందర్భమే వచ్చినపుడు – ప్రార్థన చేస్తే వర్షం తగ్గకపోగా ఇంకా పెరిగింది. అపుడు ఇంక తగ్గాలనే ప్రార్థన మానేశాను. అందుచేత అంతా వారికే సమర్పితం చేసుకోవాలిగాని మనం అనుకూల భావంతో ప్రయత్న పూర్వకంగా చేయకూడదు.

ఇంకో విషయం ఏమిటంటే, సూక్ష్మత్వం యొక్క లోతుల్లో కూడా ఎంతవరకైతే అహం (స్వల్పంగానైన) నిలిచి ఉంటుందో అప్పటివరకు ఆ అహం ఎప్పుడైనా బయటపడ్తుంది. అనగా తెలివి ఉంటుంది. నేను ఒకసారి బాబూజీకి వ్రాసిన ఉత్తరంలో ఇలా వ్రాశాను: “బాబూజీ! నన్ను గురించి ఎవ్వరైనా చెడుగా మాట్లాడినా సరే, నిందించినా సరే నాకేమీ బాధ అనిపించదు. కాని నన్ను ఎవరైనా ప్రశంసించినపుడు కొంత ఆనందం కలుగుతుంది” అని. బాబూజీ దానికి సమాధానంగా ఏమి వ్రాశారంటే, “నీవు సూక్ష్మత్వంలో కూడా ఎంతో సూక్ష్మంగా అహం దాగి ఉండటం వలన యదార్థం వ్రాశావు. దానికి కారణం నీవు ఇంకా జీవించి ఉండటమే” అని. బాబూజీ నుంచి ఆ లేఖ నన్ను చేరేసరికి అది కూడా మాయమైంది. అన్నింటికీమించి వారి కృప మనపట్ల ఉంటుంది. అభ్యాసీ యొక్క బాగోగులు, దృష్టి అన్నీ వారి సంకల్పంలో ఉంటాయి. వారు మనల్ని ఎల్లవేళలా గమనిస్తూనే ఉంటారు. మనల్ని వెన్నంటి వారి గైడెన్స్ ఉంటుంది. అందుచేత వారిని దర్శించటానికి షాజహాన్‌పూర్ వెళ్ళనవసరం లేదు. మనం తలచినప్పుడల్లా వారే మన దగ్గరకు వచ్చి దర్శనమిస్తారు. కొంతమంది తాము షాజహాన్‌పూర్ వెళ్ళలేకపోయామని అనుకుంటారు. మనం వెళ్ళినా వెళ్ళకపోయినా వారే వస్తున్నారు.

బాబూజీ తనకు వచ్చిన ఉత్తరాలను ఎవరితోనైనా చదివించుకొని జాబు వ్రాయటమో, వ్రాయించటమో చేసేవారు. లఖీంపూర్‌లో ఒక లాయరుగారు ఉండేవారు. ఆయన మాకు గౌరవనీయుడు. ఆయన మమ్మల్ని కూడా బాగా ప్రేమించేవారు. ఒకసారి వారు షాజహాన్‌పూర్ వెళ్తున్నానని చెప్తే, నేను నా కండిషను గురించి వ్రాసిన లేఖ వారిచేత బాబూజీగార్కి అందించటానికి పంపాను. బాబూజీ అక్కడ ఉన్న వారితో ఆ ఉత్తరం చదివించుకొని, ఆ కండిషన్ చాలా బాగుంది అన్నారు. ఆ లాయరుగారు ఉత్తరం చదివేటప్పుడు ఆ స్థితులన్నీ నోట్ చేసుకున్నారు. లఖీంపూర్ తిరిగొచ్చాక ఆ కండిషన్స్‌ను తిరగరాసి తన అనుభవానికి వచ్చినట్లుగా బాబూజీకి లేఖ పంపారు. బాబూజీ నుంచి మంచి ప్రశంస వస్తుందని ఎదురు చూశాడు. బాబూజీ నుంచి అందిన ఉత్తరంలో ఇలా ఉంది: “నీవు వ్రాసిన ఉత్తరం అందింది. ఇటీవల నీ మెదడు ఖరాబయినట్లుంది. ఇక్కడకు వస్తే నీ మెదడు బాగుచేసే మంచి డాక్టర్ ఉన్నారు. కనుక ఒకసారి షాజహాన్‌పూర్ రావాలి” అని. ఈ విషయాన్ని ఆ లాయరుగారే నాకు స్వయంగా చెప్పారు. కనుక మీరు ఇటువంటి తప్పులు చేయకుండా జాగ్రత్తపడండి.

**ప్రశ్న: మన సిస్టమ్ గురించి అభ్యాసీలు కానివారు ఎవరితోనైనా చర్చించవచ్చునా? మన సిస్టమ్ గూర్చి మంచి విషయాలు చెప్పవచ్చునా?**

**జవాబు:** మన సిస్టమ్ గురించి చెప్పవచ్చు, చర్చించవచ్చు. కాని మన సిస్టమ్‌లో చేరమని బలవంతం చేయవద్దు. ఇటువంటి సిస్టమ్ మరొకటి లేనేలేదా అని వాదించటానికి వారివద్ద చాలా విషయాలు ఉంటాయి. మీరు మీ కండిషన్ గురించి, బాబూజీ గురించి చెప్పినట్లయితే వారిలో కొంత అనుకూలత, అనుబంధమూ కలుగుతాయి. వారిలో మార్పును గమనించకుండా త్వరగా సహజమార్గంలో చేర్చటానికి వత్తిడి చేస్తే వారిలో కాఠిన్యం పెరిగి దూరమైపోతారు. అందరూ ఎప్పటికైనా ఈ విధానంలోకి రావలిసిందే. ఎందుకంటే, అది బాబూజీ సంకల్పం. ఎవరిలోనైనా సహజమైన మార్పు రావాలి.

**ప్రశ్న: విరాట్ హృదయం అంటే ఏమిటి?**

**జవాబు:** హృదయం (హార్ట్) అనగా భౌతికమైనది. అది పరిమితమైనది. కాని విరాట్ హృదయం అపరిమితమైనది, అనంతమైనది. బాబూజీ అనంతం నుంచి వచ్చారు కనుక విరాట్ హృదయం కూడా అనంతమైనది. బాబూజీ చెప్పారు: “మీ కోసం నా హృదయం పూర్తిగా తెరచి ఉంచాను. దానిని మీ హృదయంతో భర్తీ చేయండి” అని. హృదయమనగానే శరీరంలో ఒక భాగంగానే తలంచకుండా మొత్తం శరీరమంతా హృదయంగానే భావించాలి. దానిని అనంత శక్తితో నింపాలి. అపుడే అది విరాట్ హృదయం అవుతుంది.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు తాము ఎలా వచ్చిందీ పరిచయం చేసుకున్నారు. కాని బాబూజీ అలా చేయలేదు. బాబూజీ మహరాజ్‌కు, అనంతం యొక్క శక్తిని ఎవ్వరూ తాకలేరని అనగా గుర్తించలేరని తెలుసు.

ఒకరోజు బాబూజీ, గదిలో విశ్రాంతి తీసుకునే సమయంలో నేను వరండాలో కూర్చుని ఉన్నాను. నా మనసులో వారి చరణాలు స్పర్శించాలనే అలోచన కలిగింది. కాని ఆడపిల్లలు వారి పాదాలు తాకరాదనే నియమం మూలంగా అలా చేయలేకపోయాను. నేను గదివైపు నడచేసరికి వారు బయటకు వచ్చి, “నీవు నా చరణాలు తాకకపోయినా నీకు అన్నీ ఇస్తున్నాను. ఇంక ఆ కోరిక యొక్క అవసరం ఏముంది” అన్నారు. అపుడు వారి చరణాలనే కాదు, లోకంలో సమస్తమూ వారి చరణాలుగాను, నేను ఏది స్పర్శించినా అది వారి చరణాలుగానే అనుభవమైంది. అందుచేత వారు సర్వవ్యాపియేగాని ఒకచోటుకు పరిమితమైన వారు కారు.

ఒకసారి బాబూజీ చమత్కారంగా ఇలా అన్నారు: “ఇపుడు ధరలన్నీ పెరిగిపోయాయి. జీతాలు పెరిగిపోయాయి. నాకు మాత్రం జీతం పెరగలేదు” అని. జీతం అంటే వారి దృష్టిలో వారికి మనం చూపాల్సిన విశ్వాసం, వారిపట్ల కలిగి ఉండాల్సిన ప్రేమ మరియు భక్తి. కనుక వారికి ప్రేమను, భక్తిని అధికంగా పంచి వాటి విలువతో కూడిన జీతాన్ని పెంచుమన్నారు. అంతేగాని ధనం కాదు.

శ్రీ బాబూజీ అభ్యాసీలను ఎల్లపుడూ క్రమం తప్పకుండా ధ్యాన సాధన చేయమనేవారు. అలా సక్రమంగా చేస్తే సదా మీ సేవలో ఉంటానని చెప్పేవారు. ఒక అభ్యాసీ నుంచి ప్రేమ, భక్తి ఉన్నవాడు –బాబూజీ వద్దకు వచ్చి సిట్టింగ్ తీసుకునేవాడు. కాని సక్రమంగా వచ్చేవాడు కాదు. ఇతరులతో కాలక్షేపం చేస్తుండేవాడు. ఒకసారి స్నేహితులతో కాలం వెళ్ళబుచ్చుతూ ఉండగా, బాబూజీ వచ్చి ఎదురుగా కూర్చొని సిట్టింగ్ ఇస్తున్నట్లుగా అనుభూతి చెందాడు. వెంటనే ధ్యానంలో కూర్చున్నాడు. అనగా బాబూజీ ఆ విధంగా తనపై భక్తి, ప్రేమ, విశ్వాసాలు ఉన్న వారిని, వారు మరచిపోయినప్పటికీ అలక్ష్యం చేయరు. వారికి తమ సేవలు అందిస్తూనే ఉంటారు.

లాలాజీ ఆదిగురువు, సమర్థ సద్గురువు అని కీర్తించబడ్డారంటే ఆ బిరుదులు వారికి వారి గురువులు కాని, మరెవ్వరు కాని ఇచ్చినవి కావు. ప్రకృతియే వారికి ప్రసాదించింది.

తమ గురువు ఆదేశానుసారం ఏడు మాసాల దృఢ దీక్షతో తపమాచరించి తమ ప్రార్ధనను అనంతానికి చేర్చి ఆదిశక్తిని స్పందింపజేయగలిగారు కనుక, భూమాశక్తిని భూమి మీదకు అవతరింపజేస్తానన్న తమ ప్రతినను సార్ధకం చేశారు కనుక లాలాజీ ఆదిగురువు అయ్యారు.

ఆ ఆదిశక్తిని అంతిమం నుంచి అనగా భూమా నుంచి తీసుకుని వచ్చి సమస్త మానవాళిని ఉద్ధరించే ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు కనుక సమర్థుడు అనబడ్డారు. ఈ కార్యక్రమంలో వారు చేపట్టిన తపో విధానమే నిరుపమానమైనది.

ఆ విధంగా భూమి మీద అవతరించిన శక్తి, ఏ రూపంలో వచ్చిందీ గుర్తించి, ఆరు రోజుల బాలునిగా ఉన్న బాబూజీయే ఆ శక్తి స్వరూపుడు అని నిర్ధారించుకొని, భూమా నుంచి శక్తిని ఆహ్వానించి వారిలో ప్రవేశపెట్టారు. తరువాత బాబూజీని తయారు చేసి సమస్త మానవాళికి ఈశ్వరుని ప్రాప్తింపజేయటానికి శిక్షణ నిచ్చారు కనుక సద్గురువు అయ్యారు. వీటిని బాబూజీ కూడా ధృవపర్చారు.

హైదరాబాదు అభ్యాసీలను గురించి కుశలమడుగుతున్న సందర్భంలో శశిధావన్ ఎలా ఉన్నారు అని నేను అడిగినపుడు, అభ్యాసీ ఒకరు – "ఆమె, తాను చాలా తప్పు చేశానేమో, బాబూజీ నన్ను ఇలా శిక్షిస్తున్నారని అనుకుంటున్నది" అని చెప్పారు. అపుడు నేను  ఇలా వివరించాను:

దైవంగాని, సెయింట్స్‌గాని ప్రేమను పంచుతారేగాని కష్టాలు పంచరు. వారు ఎప్పుడూ తమ కృపను మాత్రమే అనుగ్రహిస్తారు. దైవం దిగి వచ్చేది అందరి కష్టాలను తనవిగా తీసుకుని అందరికీ సుఖసంతోషాలు పంచటానికి మాత్రమేగాని శిక్షించటానికి కాదు. ఏ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు, తట్టుకునేందుకు బాబూజీ శక్తిని ఇస్తారేకాని శిక్షించరు. ఒక అమ్మాయి అత్తవారింట్లో అన్ని పనులు తనకు పురమాయించినపుడు ఇదే భావాన్ని స్మరించుకుని బాబూజీయే శక్తి నిస్తారని విశ్వసించింది. ఆ తర్వాత ఆ పనులు అప్రయత్నంగానే వాటంతట అవే జరిగిపోయాయి. కనుక బాబాజీ యొక్క ధ్యేయాన్ని మన మందరం గుణపాఠంగా స్వీకరించాలి.

దశ నియమాలు (టెన్ కమాండ్‌మెంట్స్) పుస్తకంలో ఈ విషయాలు వ్రాశాను. ఈ విషయంలో లోతుగా ఆలోచిస్తే అవగాహనకు వచ్చింది ఏమిటంటే, మనం మనకు కలుగుతున్న ప్రశాంతతను అశ్రద్ధ చేస్తున్నామన్న మాట. మనకు ఏది అనుభవమవుతున్నా దానిని బాబూజీ మహరాజ్‌గారే ఇస్తున్నారన్న భావంతో ఉంటే, అపుడు మన దృష్టి వారి మీదనే నిలిచి ఉంటుంది. అపుడు మనకు ఆ బాధలు, కష్టాలు తలంపుకు రావు, వేధించవు.

సర్వదా, సర్వత్రా బాబూజీ యొక్క స్మరణ కలిగి ఉంటే చాలు, పుస్తకాలు చదవలేదని దిగులుపడనవసరం లేదు. నేను బాబూజీ పుస్తకాలు చదవలేదు. నేను బాబూజీకి వ్రాసిన ఒక లేఖలో "నాకు పుస్తకాలు చదివే తీరిక ఉండటం లేదు" అని వ్రాశాను. దానికి సమాధానంగా "నాకు చాలా ఆనందంగా ఉంది. నీవు పుస్తకాల మీద ఆధారపడకుండా నీ స్వంత అనుభవంతో పురోగమిస్తున్నావు. నీకు సత్ఫలితం కలుగుతూ ఉంటుంది" అని బాబూజీ వ్రాశారు.

బాబూజీ సంస్థ యొక్క వార్షికోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహించేవారు కారు. బసంత్ పంచమి రోజున అనగా లాలాజీగారి జన్మదినంతోపాటు సంస్థ యొక్క కార్యకలాపాలు కూడా సమీక్షించేవారు. సెంటర్లు ఎన్ని ఉన్నాయో, అభ్యాసీలు ఎంతమంది ఉన్నారో, ఎలా నిర్వహించబడుతున్నాయో తెలిపేవారు. సంస్థకు వచ్చిన విరాళాలకు, ఆఖరికి ఒక్క రూపాయి, రెండు రూపాయలకు కూడా రసీదులు ఇచ్చి సంస్థ ఖాతాకు జమ చేసేవారు. జమా ఖర్చులు కూడా ఆ రోజునే వెల్లడించేవారు.

ప్రిసెప్టర్స్ ఎప్పుడూ భక్తి, ప్రేమ సామీప్యతలను కలిగి ఉండి అభ్యాసీలకు శిక్షణ నివ్వాలి. వాటి ప్రభావంతో అభ్యాసీలు ఉన్నతి పొందుతారు. కొంతమంది ప్రశిక్షకులు అభ్యాసీలతో "నీవు బ్రహ్మాండ మండలంలో ఉన్నావు" అని చెబుతారు. వారు మాస్టర్ కాదు అలా చెప్పటానికి. అలా కాకుండా వారు అభ్యాసీలలో భక్తి, ప్రేమలను, దైవ సామీప్యతను పెంపొందునట్లు తయారుచేయాలి. ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీతో తమ ప్రిసెప్టర్ తనను బ్రహ్మాండ మండలంలోకి తీసుకొని వెళ్ళినట్లుగా చెప్పాడు. అప్పుడు

బాబూజీ "అయితే ఆయన నాకంటె పెద్దవాడన్న మాట. నేనయితే నా ఇంటిని ఇవ్వగలను. షాజహాన్‌పూర్ ఊరు నాది కాదు కనుక నేను దానిని ఇవ్వలేను. బ్రహ్మాండ మండలం ఈశ్వరుని సొత్తు. ప్రిసెప్టర్ ఎలా ఇవ్వగలడు?" అని ప్రశ్నించారు. అందుచేత ప్రిసెప్టర్ చెప్పే ఇలాంటి మాటలకు తలొగ్గకుండా, ప్రేమ, భక్తిని పెంచుకొని బాబూజీ యొక్క సామీప్యతను పొందటానికి ప్రయత్నించాలి.

డాక్టర్ పార్థసారధిగారు, వి. పాండురంగారావుగారు మీకు ప్రిసెప్టర్స్ కావటం మీ అదృష్టం. వారు అభ్యాసీల పురోభివృద్ధికి బాగా కృషి చేస్తున్నారు. మీరు ధ్యానంలో నిమగ్నమై ఉంటే మీ దృష్టి ఇక్కడ ఉందని నేను గ్రహిస్తాను. అలాగే ప్రిసెప్టర్స్, బాబూజీ మహరాజ్ తలంపులోనే మునిగి ఉంటే, వారు ప్రాపంచక విషయాలు కాకుండా ఆధ్యాత్మిక విషయాలు ఏవైనా సాధించగలరు. వారి జ్ఞాపకమే కాదు, దానితోపాటు ప్రేమ, భక్తి, విశ్వాసాలు కూడా జోడించి తాము పురోగతి చెందుతూ, అభ్యాసీలను బాబూజీ మహరాజ్‌కు సమర్పించినట్లయితే కావలసినదంతా వారే చూసుకుంటారు. ఆ విధంగా ప్రిసెప్టర్స్ పని పూర్తయినట్లే. స్మరణతోపాటు భక్తి ప్రేమలు కలిగి ఉంటే దాని ఫలితం ఎటువంటిదో మీరు గ్రహిస్తారు.

ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇస్తున్నపుడు, లోతుగా ధ్యానంలో మునిగి ఉండగా ఏ స్థితినైతే తాను పొందుతాడో దానిని అభ్యాసీ కూడా అనుభూతి చెందుతాడు. అంతేకాని ప్రిసెప్టర్ "నేను ఇస్తున్నాను" అని అనుకున్నట్లయితే అది అతనికి సాధ్యం కాదు. బాబూజీ మహరాజ్ ఇచ్చే ఈ దివ్యం ఏ ఒక్కరి కోసమో కాదు, కస్తూరి కోసమూ కాదు – అందరికీ, ప్రతి ఒక్కరికీ. బాబూజీ అంతిమం నుంచి ఈ అవని మీదకు లాలాజీ ప్రార్థన మూలంగా అవతరించారు, ఎందుకు? అందరికీ ఆధ్యాత్మికతను, సాక్షాత్కారాన్ని, సంతోషాన్ని ఇవ్వటానికి మాత్రమే కాదు, అంతిమానికి తీసుకుని వెళ్ళడానికి ఉద్దేశించి వచ్చారు.

బాబూజీ యొక్క ప్రేమను పొందటానికి, వారు ప్రేమతో చెప్పిన ఆధ్యాత్మిక విషయాలు గ్రహించటానికి మీరు ఇంత దూరం వస్తున్నారు. మీకు ప్రేమ, ఉన్నతిని ఎంత ఎక్కువగా ఇవ్వవలసి ఉందో అంత ఎక్కువగా అనుగ్రహించమని బాబూజీని ప్రార్థిస్తూ ఉంటాను.

మేము ఎక్కువగా షాజహాన్‌పూర్ వెళ్తుండే వాళ్ళం. ఎవరైనా అలా ఎందుకు వెళ్తున్నారని అడిగితే "మాకు బాబూజీ అంటే ఇష్టం. అక్కడికి వెళ్ళితే బాగుంటుంది" అని మాత్రమే చెప్పే వాళ్ళం. అప్పటికి ఆధ్యాత్మికత అంటే ఏమిటో తెలియదు, తెలిసింది బాబూజీ మాత్రమే. బాబూజీ "అభ్యాసీలు నా వద్దకు వస్తున్నారు కాని నన్ను చూడటం లేదు" అనేవారు. షాజహాన్‌పూర్ నుంచి తిరిగి వెళ్ళిన తర్వాత బాబూజీని మనలో దర్శించగలిగామంటే, షాజహాన్‌పూర్ వెళ్ళిరావటంలోని ఉద్దేశ్యం సఫలీకృతమైనట్లే. మీరు సమర్పించే అన్ని బహుమతులకంటే, మిమ్మల్ని మీరు సమర్పించుకోవటమే మేలైన బహుమతి.

**ప్రశ్న: అభ్యాసీలు ఒక్కటిగా ఉండకుండా గ్రూపులుగా విడిపోయారు, ఎలా?**

**జవాబు:** అందరూ శ్రీరామచంద్ర మిషన్‌కు చెందిన వారే. ఒక రాముడు, ఒక కృష్ణుడు అవతరించారు. అంతిమం నుండి అవతరించినవారు బాబూజీ ఒక్కరే. కనుక ఇద్దరు మాస్టర్లు లేరు. రామకృష్ణ మిషన్ అదే

పేరుతో కొనసాగుతుంది కాని వివేకానంద మిషన్‌గా లేదు. తప్పుగా ప్రచారం చేసి పెడదారి పట్టిస్తున్నారు. ప్రపంచంలోని ప్రజలందరూ ఏనాటికైనా శ్రీ రామచంద్ర మిషన్‌లోకి రావాల్సిందే.

**ప్రశ్న: బెహెన్‌జీ, 'అనంత యాత్ర' 5 భాగాలేనా, ఇంకా ఉన్నాయా?**

**జవాబు:** నా చేతులు కలం కోసం వెదుకుతాయి. కాని వ్రాసేది వారే. అనగా మనం వ్రాయటానికి కలం ఒక సాధనం ఎలాగో బాబూజీ వ్రాయించటానికి నేను ఒక సాధనం మాత్రమే. వ్రాసేది, వ్రాయించేది వారే. ప్రపంచంలోని మానవులందరూ ఈ పుస్తకాల ద్వారా బాబూజీ గురించి తెలుసుకోవాలి. బాబూజీ నుంచి వచ్చిన ఉత్తరాలన్నింటినీ చదివి, ఆనందించి భద్రపరుచుకునే దానిని. కాని అప్పటి కంటే కూడా ఈ పుస్తకాలు నేను వ్రాసే సందర్భంలోనే వారు అప్పుడు ఉత్తరాల్లో నాకు వ్రాసిన విషయాలు పూర్తి అవగాహనకు వచ్చాయి.

**ప్రశ్న: నేను ప్రతిరోజు ధ్యానం చేస్తున్నాను. ధ్యానంలో ఒకే స్థితి ఉంటుంది. నేను పురోగతి చెందుతున్నట్లు గ్రహించటం ఎలా?**

**జవాబు:** "మనకు సామీప్యతానుభావం కలుగుతున్నట్లయితే (Feeling of Nearness) పురోగమిస్తున్నట్లు భావించాలి" అని బాబూజీ చెప్పారు. నేను బాబూజీకి "నాకు ఆ ఆలోచన ఉంది కాని సామీప్యతానుభూతి కలగటం లేదు" అని వ్రాశాను. అందుకు వారు "దైవం నీలో ఉన్నాడు. ఆయన నీవాడే అని అనుకుంటే అదే పురోగతికి మార్గం" అని అన్నారు. అనుమానం అనేది పెద్ద అవరోధం అని బాబూజీ చెప్పారు. అందుచేత "వారు నీలోనే ఉన్నారు, నీవారే" అని అనుకుంటే వారు నీకు సహకరిస్తారు. మేలు చేస్తారు. ప్రోగ్రెస్ ఉంటుంది కాని దానిని గ్రహించలేకపోవచ్చు. అంతమాత్రాన పురోగతిలేదని భావించకూడదు. ఉదాహరణకు, ఒకరిని నీ కొడుకు అని, మరొకరిని నీ సహోదరుని కొడుకు అనుకున్నపుడు, నీ కుమారుని మీద ఎలా అభిమానం ఉంటుందో అలాగే బాబూజీని నా బాబూజీ అనుకుంటే ప్రేమ పెరిగి పురోగతి మరింతగా పురోగమిస్తూనే ఉంటుంది. మన సంస్థలో సంశయం అన్నదానికి తావులేనేలేదు. దానిని తలెత్తనీయ వద్దు. (మన సంస్థలో అది మరణించింది. మళ్ళీ దానిని బ్రతికించవద్దు.)

**ప్రశ్న: నాకు ఇష్టంలేని పనిని ఎవరైనా చేస్తే నాకు కోపం వస్తుంది. ఇంట్లోవారు –నీవు ధ్యానం చేస్తూ ఉంటావు గదా, నీకు కోపం ఎందుకు వస్తుంది, అని ప్రశ్నిస్తారు. దానిని ఎలా అరికట్టాలి.**

**జవాబు:** బాబూజీ చెప్పారు, "అందరినీ ప్రేమించ నారంభిస్తే ద్వేషం తగ్గిపోతుంది. ద్వేషాన్ని పూర్తిగా జయిస్తే మిగిలేది ప్రేమ మాత్రమే" అని. నీవు ఇతరులు ఎవ్వరికైనా అయిష్టమైన పనులు చేయకపోతే వారికి నీపై కోపం రాదు. వారు అందుకు ప్రతిగా నీకు అయిష్టమైన పనులు చేయకపోతే నీకూ కోపం రాదు. అందుచేత అందరినీ ప్రేమించటం వలన ద్వేషమూ, కోపమూ తగ్గిపోతాయి.

**ప్రశ్న: ఆత్మ, మైండ్ (మనస్సు)లకు మూలస్థానాలు ఏమిటి?**

**జవాబు:** ఆత్మకు మూలస్థానం పరమాత్మ. మైండ్‌కు మూలస్థానం హిరణ్యగర్భ కేంద్రం, అనగా మైండ్ రీజియన్. మనం హిరణ్యగర్భ కేంద్రాన్ని దాటడమంటే మైండ్ రీజియన్ దాటినట్లు అవుతుంది. ఆత్మ

పరమాత్మలో విలీనమైపోయినపుడు ఎవరైనా ఆత్మ గురించి చర్చించటం జరిగితే నాకు చికాకు గలిగేది. ఈ విషయాన్ని బాబూజీకి వ్రాసినపుడు “భౌతిక ప్రపంచానికి చెందిన కస్తూరి చనిపోయింది. ఇప్పుడు ఉన్నది నా కస్తూరి” అని వ్రాశారు. నా ఆత్మ బాబూజీలో విలీనమైపోయింది కనుక ఎవరైనా ఆత్మ అని అంటే అది బాబూజీని తాకుతుంది. నా ఆత్మ బాబూజీయే కనుక, ఈ ‘నేను’ లేను కనుక ఆత్మ – నాది – దైవం అని ఏమి పలికినా అవి బాబూజీలోనే లయమైపోతాయి.

ఈశ్వర్ సహాయ్‌గారు, “ఆత్మ లేకుండా అభ్యాసీ ఏ విధంగా జీవించి ఉంటాడు” అని బాబూజీని ప్రశ్నించారు. దానికి సమాధానంగా బాబూజీ ఇలా చెప్పారు. “భౌతిక శరీరం పంచతత్వాలతో కూడి ఉంటుంది. ఆ పంచతత్వాలు చెల్లాచెదరైనపుడు భౌతిక శరీరం నశించిపోతుంది. ఆ శరీరమేలేనపుడు ఆత్మకు రోగమూ లేదు, మరణమూ లేదు. ప్రపంచంలో సెయింట్ (saint) అనబడే వారు జీవన్ముక్తులు. వారి ఆత్మ పరమాత్మతో అనుసంధానమై ఉంటుంది. వారి శరీరానికి కావలసిన శక్తి, పరమాత్మ శక్తి నుంచి సమకూరుతూ ఉంటుంది. అదే విధంగా బాబూజీలో లయమైన అభ్యాసీలకు శక్తి వారి నుంచే లభిస్తుంది.”

**ప్రశ్న: నా భర్త ఇంట్రొడక్షన్ సిట్టింగ్స్ తీసుకొని కూడా సత్సంగ్‌కు రావటం లేదు, ధ్యానం చేయటంలేదు, దానికి పరిష్కారం ఏమిటి?**

**జవాబు:** వారికి ఇష్టం లేకపోయినా బలవంతంగా వారిని ధ్యానానికి పురికొల్పినప్పుడు ఇలా జరుగుతుంది. సత్సంగ్‌కు వెళ్ళకపోయినా, వెళ్ళు, వెళ్ళు అని బలవంతం చేయకూడదు. బలవంతం చేయటం వలన విముఖత్వం పెరుగుతుంది. పిల్లలనైనా, పెద్దలనైనా, వారి ఇష్టం లేకుండా చేర్పించటం మంచిది కాదు. వారిలో ఆ భక్తి భావం కలగాలని ప్రార్థన చేయటమే మన పని. కొన్ని సందర్భాలలో ఆడవారి స్వార్థం కూడా ఉండవచ్చు. భర్తను కూడా చేర్చితే మద్రాసు కలిసి వెళ్ళవచ్చనీ, అవీ ఇవీ చూసి రావచ్చనీ అభిప్రాయం ఉండవచ్చు. ఆడవాళ్ళు వినమ్రత కలిగి ఉండాలి. పూజకు వెళ్ళదలచినపుడు ఇంట్లో పెద్దవారికి తమ అభిప్రాయం వెల్లడించి వారి అనుమతి తీసుకుని వెళ్ళటం మంచిది. ధ్యానమనేది మనసుకు చెందినదికాని చేతలకు కాదు.

బాబూజీ మన సంస్థను గృహస్థ సంస్థగా అభివర్ణించారు. గృహంలో అశాంతి ఉంటే పూజలో కూడా ప్రశాంతత ఉండదు. విగ్రహారాధన ఇష్టం లేకపోయినా, తల్లిదండ్రులు కాని, అత్త మామలు కాని ఇంట్లో ఏదైనా పూజా కార్యక్రమం ఏర్పాటు చేసినపుడు స్వయంగా పాల్గొనాలి. వారి మనస్సును బాధ పెట్టకుండా యాంత్రికంగానైనా ప్రవేశం కల్పించుకొని బాబూజీపైనే ధ్యానం నిలిపి కుటుంబీకులతో సహకరించాలి. అపుడు వారు కూడా మీ కోరికను మన్నిస్తారు. అందరూ కలిసిమెలిసి జీవించటంలో ప్రశాంతత తాండవిస్తుంది.

**ప్రశ్న: గృహంలో అందరూ పూజలో పాల్గొనాలంటే ఏం చేయాలి?**

**జవాబు:** బాబూజీ ఎదుట కూర్చుని, “నా ఇల్లు మీ కృపతో నిండిపోవాలి” అని ప్రార్థించండి. మీ ప్రార్థనలో “అందిరిలోనూ పరివర్తనం రావాలి” అని విన్నవించండి. ప్రేమతో సాధించండి.

**ప్రశ్న: బాహ్య సమయం, అంతర్గత సమయం ఒకటేనా?**

**జవాబు:** సమయమనేది ఇక్కడ ఉంటుంది కాని అక్కడ ఉండదు. ప్రపంచాన్ని నడిపించటానికి ప్రకృతికి సమయం అవుసరమవుతుంది. కాని సృష్టికర్తకు కాలంతో నిమిత్తం లేదు. మనకు దిన రాత్రులు ఉంటాయి. సాయంకాలం క్లీనింగ్ ఉంటుంది. అక్కడ అవేమి ఉండవు.

**ప్రశ్న: అభ్యాసీలు, తాము పురోగమనం చేస్తున్నదీ లేనిదీ తెలుసుకుంటే కొంత ప్రోత్సాహకరంగా ఉంటుంది గదా! మన గమనం సరియైన మార్గంలోనే ఉందని తెలుసుకోవటం ఎలా?**

**జవాబు:** ధ్యానం వలన మన ప్రవర్తనలోను, ఆలోచనా విధానంలోను మన దృక్పథం, మన దృష్టి (అటెన్షన్)లోనూ కొంత ఔన్నత్యం కలుగుతాయి. అటువంటి మార్పు కలగనపుడు మన ధ్యానం సక్రమంగా లేదని గ్రహించుకోవచ్చు. ఉదాహరణకు, ధ్యానం చేయకముందు మనలో కోప స్వభావం ఉండి ఉండవచ్చు. ఎవరితోనైనా మాట్లాడేటపుడు త్వరగా ప్రతిస్పందించి ఎదురుచెప్పే స్వభావం ఉండవచ్చు. ధ్యానం అలవర్చుకొన్నాక అది తగ్గుముఖంపట్టి సామరస్యంగా వ్యవహరించే తీరు కలుగుతుంది. ఇటువంటి మార్పులు భౌతికంగా మన దృష్టికి వచ్చాయి అంటే మనలో ఆధ్యాత్మిక ప్రగతి కలుగుతుందని భావించవచ్చు.

**ప్రశ్న: నిర్లిప్తత అనగా నేమి? అది ఒక స్థితియా (కండిషన్)?**

**జవాబు:** నిర్లిప్తత అనేది ఒక భావం కాదు. అది ఒక స్థితి మాత్రమే. ఏదైనా ఒక పని చేసేటప్పుడు, అందులో లీనం కాకుండా నిమిత్తం మాత్రంగా (without involvement) అనగా అంటీ అంటనట్లుగా ఉండు స్థితియే నిర్లిప్తత.

**ప్రశ్న: (ఎగో) అహం, (సటిల్ ఎగో) 'సూక్ష్మ అహం'కు భేదం ఉందా?**

**జవాబు:** చాలా భేదం ఉంది. 'నేను' అనిగాని, ఏ పనినైనా 'నేను చేస్తున్నాను' అనిగాని చెప్తున్నామంటే అందులో స్థూల అహం ఉంటుంది. అనగా మనం రోజంతా చేసే పనిలో నేను చేస్తున్నాను అనటం సహజం. ఇందులో ఉన్న స్థూల అహంను మనం తొలగించుకోవచ్చు. కాని సూక్ష్మ అహంను తొలగించటం కష్టం. "నన్ను ఎవరైనా తూలనాడుతున్నారు, కించపరుస్తున్నారు అంటే అది నాకు కష్టమనిపించదు. కాని నా కండిషన్ (స్థితి) ఇది అని చెప్పటంలో కొంత స్థూలత్వం ఉన్నట్లే కదా!" అని బాబూజీకి వ్రాశాను. బాబూజీ నాకు వ్రాసిన జాబులో "దానిని జయించటం కష్టం" అని వ్రాశారు. అంతర్గతంగా 'నేను' అన్న భావం ఉందంటే అక్కడ కస్తూరి ఉన్నట్లే. అక్కడ మనస్సు పని చేస్తుంది. కాని బాబూజీ నుంచి నాకు జాబు వచ్చాక నాలో మరెప్పుడూ అటువంటి భావం, అనగా సూక్ష్మ అహం ఉన్నదన్న భావం కలుగలేదు. బాబూజీ ఒక సందర్భంలో తపజ్జ, తపజ్జు అను రెండు శబ్దాలు ప్రయోగించారు. తపజ్జ అనగా ట్రాన్స్‌మిషన్ (ప్రాణాహుతి). తపజ్జు అనగా వారి ప్రేమపూరిత నేత్రాలు. తపజ్జ, తపజ్జుతో సంధానమై ఉంటుంది. అనగా ప్రాణాహుతి, వారి యొక్క ప్రేమమయ నేత్రాల నుంచి ప్రసరించబడుతుంది. కనుక ఆ సూక్ష్మ అహం తొలగిపోతుంది.

'బాధ' అనేది ఎవరికీ కనిపించేది కాదు, చూడగలిగేది కాదు. అది ఒక అనుభూతి మాత్రమే. అంతరంగంలోని బాధ 'నేను' అనుకోవటం వలన అనగా సూక్ష్మ అహం వలన అనుభూతి పొందుతాం. బాహ్యమైన దానిని మనస్సుతో స్వయంగా నియంత్రించుకోగలం కాని, అంతర్గతమైన దానిని నియంత్రించలేము. దానిని దివ్యత్వం (డివైన్) మాత్రమే నియంత్రించగలదు. అందుకు నిరంతర స్మరణ అవసరం. బాబూజీ ఉనికి యొక్క అనుభూతిలోనే మునిగి ఉన్నట్లయితే వారి అనుగ్రహంతో అది జయింపబడుతుంది. ఆలోచనల గురించి విచారించ వద్దు. బాబూజీ మనలోనే ఉన్నారన్న భావనలో మునిగి ఉంటే అన్ని స్థితులు వస్తాయి. ఇచ్చేవారు, ఇవ్వబడినవీ అన్నీ మనలోనే ఉంటాయి. ఇంక బయటి వాటికి స్థానం ఉండదు.

అప్పుడప్పుడు పిలవకుండానే వచ్చే ఆలోచనల గురించి మనం ఆలోచిస్తూ ఉంటాం. అప్పుడు బాబూజీ మనలోనే ఉన్నారు, మనవారు అని తలచుకుంటే అవి దూరమైపోతాయి.

బాబూజీ,"లాలాజీ సాహెబ్ ఇంత పెద్ద ఆధ్యాత్మిక ఖజానాను నాకు ఇచ్చి వెళ్ళారు. ఎవ్వరూ తీసుకొనకపోతే దీనిని ఖర్చు చేయటం ఎలా?" అని బాబూజీ ఉద్వేగంగా అన్నారు.

బాబూజీ ఒకసారి అభ్యాసీలకు ఏదో బోధిస్తూ ఉండగా ఒక అభ్యాసీ ధ్యాన ముద్రలో ఉండిపోయాడు. అపుడు బాబూజీ "నేను ఎదుటనే ఉండగా, ఆ అభ్యాసీ కళ్ళు మూసుకుని ఏమి చేస్తున్నాడు" అని అన్నారు. అందుచేత పెద్దవారు ఏదైనా చెప్పేటప్పుడు ఆలకించాలిగాని ధ్యాన ముద్రలో కూర్చోకూడదు.

బాబూజీ నుంచి మనం నేర్చుకోవాల్సినవి చాలా ఉన్నాయి. మనమంతా ఒకే కుటుంబానికి చెందినవారం. ఒకరి కష్టసుఖాలు మరొకరితో చెప్పుకోవచ్చు. బాబూజీ కూడా మన కష్టాలను ఆలకించటానికి సిద్ధంగా ఉండేవారు. ఎవరికైనా కష్టాలు కలిగినపుడు బాబూజీకి విన్నవించితే వారు ఆలకిస్తారు. అలా అని దానిని అదే పనిగా అలవాటు చేసుకోకూడదు.

ధ్యానానికి పూర్తిగా ప్రిసెప్టర్‌పైనే ఆధారపడకూడదు. ఆయనొక సహాయకుడు మాత్రమే. హృదయంలో దైవాన్ని ఆధారంగా చేసుకొని సాధన చేయాలి.

**ప్రశ్న: బాబూజీ రూపం నిలుపుకుని ధ్యానం చేయవచ్చా?**

**జవాబు:** చేయకూడదు. ధ్యానంలో మొదట రూపాన్ని దర్శించాలి. తరువాత క్రమంగా రూపం అదృశ్యమైపోతుంది. అదృశ్యమైపోయిన రూపాన్ని మళ్ళీ దృష్టిలో ఉంచుకోవటానికి ప్రయత్నించకుండా 'వారి' ఉనికి ఉన్నదనే భావంతోనే ఉండాలి. బాబూజీ ఒక ఉదాహరణ చెప్పారు. "నీతో ఇక్కడ ఉన్న సహోదరుడు నిన్ను విడిచి మరే ప్రాంతానికైనా వెళ్ళాడనుకో. అప్పుడు అతని రూపాన్ని కాకుండా నీ సహోదరుడన్న భావంతో అతని జ్ఞాపకాన్ని కలిగి ఉంటావు కదా!"అన్నారు. కనుక రూపమన్నది ఒక ఆచ్ఛాదనం (కవరింగ్) మాత్రమే. కలిగి ఉండాల్సింది జ్ఞాపకం మాత్రమే.

**ప్రశ్న: ధ్యానంలో బాబూజీ అకస్మాత్తుగా దర్శనం ఇస్తుంటారు. అది మానసిక కల్పనా లేక యదార్థమా?**

**జవాబు:** అది అప్రయత్నంగానే వస్తుంది. కాని బాబూజీ దర్శనం కలగలేదు కదా అని దానిని కల్పించుకునే ప్రయత్నం చేయకూడదు. అప్రయత్నంగా కనిపించిన రూపం యదార్థమే.

నేను ఒకసారి బాబూజీని "ఇంతమంది అభ్యాసీలు సమూహంగా ఉన్నారు కదా! మీరు ఏ అభ్యాసీని ఎలా గుర్తిస్తారు" అని అడిగాను. దానికి వారు ఏమి జవాబిచ్చారంటే, "నేను ప్రాణాహుతి ఇవ్వటం ప్రారంభించాక నా ఆలోచనలోకి వారు వచ్చినపుడు వారు నా ఎదుటకు వస్తారు. నేను ఆ విధంగా వారిని గుర్తిస్తాను" అని అన్నారు. కనుక మనం వారిని మైండ్‌తో కాకుండా హృదయపూర్వకంగా ప్రేమతో జ్ఞాపకంలో ఉంచుకున్నట్లయితే వారు మనల్ని తమ జ్ఞాపకంలో నిలుపుకుంటారు.

**ప్రశ్న: బాబూజీని మనస్సులో స్మరించుకొని ఆఫీసులో పనికి ఉపక్రమిస్తాము. పనిలో నిమగ్నమైపోయి అవకాశం లభించగానే మళ్ళీ బాబూజీని స్మరించుకుంటాము. అప్పుడది నిరంతర స్మరణ అవుతుందా?**

**జవాబు:** నిరంతర స్మరణ అనగా మధ్యలో మరచిపోయి పునః స్మరణకు తెచ్చుకోవటం కాదు. అంటే వారి స్మరణ ఖండించబడినదిగా ఉండకూడదు. మీరు పనిలో మానసికంగా మునిగిపోయి అందులో లీనమై కొన్ని గంటలు పనిచేస్తారు. కాని విరామం చిక్కగానే వారిని స్మరించుకుంటారు. అటువంటి సందర్భంలో "నేను మిమ్మల్ని మరచిపోయాను. ఇపుడు జ్ఞాపకం చేసుకుంటున్నాను" అని తలచకుండా, "నేను మిమ్మల్ని మరువలేదు, నా హృదయంలో ఎప్పుడూ మీరే ఉన్నారు" అని తలచుకుంటే వారి స్మరణ ఏకధాటిగా అనగా నిరంతరంగా ఉన్నట్లవుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ బాబూజీతో "నేను కారు డ్రైవింగ్ చేస్తూ మీరే నడుపుతున్నట్లుగా భావించుకున్నాను" అన్నాడట. అపుడు బాబూజీ అతనితో "నా మాస్టర్ కృప వలన నీవు ప్రమాదానికి గురి కాకుండా బయటపడ్డావు. ఎందుకంటే నాకు డ్రైవింగ్ రాదు. నీవు నన్ను డ్రైవర్‌గా చేసుకొన్నావు!" అని చమత్కరించారు.

**ప్రశ్న: అభ్యాసీ వంద మైళ్ళ దూరాన ఉన్నప్పటికి ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇవ్వ వచ్చునా?**

**జవాబు:** బాబూజీ ఒకసారి చెప్పారు "అభ్యాసీ ఎక్కడ ఉన్నా ట్రాన్స్‌మిషన్ చేరుతుంది" అని. ఇందులో ముఖ్యమైనది ఏమిటంటే "వారిపైన నీ ధ్యాసను, నీ దృష్టిని ఎంతగా నిలుపుకున్నావు అన్నదే. నీవు హైదరాబాదులో ఉన్నా ప్రాణాహుతి వస్తుంది. ఇంకెక్కడ ఉన్నా వస్తుంది."

**ప్రశ్న: మనం ధ్యానానికి ఒక సమయం నిర్ణయించుకుని, తప్పనిసరిగా ఏదో పని మీద బయటకు వెళ్ళాల్సివస్తే ప్రాణాహుతి వస్తుందా?**

**జవాబు:** నిర్ణయించుకున్న సమయం ప్రకారం ట్రాన్స్‌మిషన్ వస్తుంది. దానిని స్వీకరించగలిగితే సంతోషం పొందుతారు. ఒకవేళ సిట్టింగ్ చేయకపోయినా ప్రాణాహుతి వస్తుంది కాని దాని అనుభవాన్ని ఆస్వాదించలేరు.

**ప్రశ్న: మన సంస్థలో కుండలినీ శక్తి యొక్క ప్రస్తావన ఉన్నదా? బాబూజీ దానిని ఎప్పుడైనా ఉపయోగించారా?**

**జవాబు:** బాబూజీ ఉపయోగించలేదని మీరు ఎలా అనుకుంటున్నారు. బాబూజీ మనకు దివ్య సాక్షాత్కారం లక్ష్యంగా కల్పించారు. కుండలిని మన లక్ష్యం కాదు. కాని మనం గాడ్లీ రీజియన్ (దైవ కేంద్రాన్ని) చేరుకున్నపుడు, అన్ని శక్తి కేంద్రాలు తెరవబడతాయి. ఆరు చక్రాలు (షట్‌చక్రాలు) తెరుచుకుంటాయి. దైవ సాక్షాత్కారం కోసం తపన పెరిగి దాని వలన ఒత్తిడి అధికమవుతుంది. రావణుడు, కుంభకర్ణుడు

ఈ కుండలినీ శక్తి కోసం తపస్సు చేశారు. రావణుడైతే ఈ శక్తి కోసం నలభై వేల సార్లు తపస్సు చేశాడు. మీ ప్రవర్తన సరియైనది కానపుడు, ఆ శక్తిని దుర్వినియోగం చేయటం జరుగుతుంది. అప్పుడు మీ కీడును మీరే కొనుక్కున్నట్లవుతుంది. అక్కడి ఆ శక్తిని దివ్యంవైపుగా కేంద్రీకరించాలి. ఒకసారి బాబూజీని సరోజిని మహిషి అనే మహిళా మంత్రి "బాబూజీ, మీరు మా కుండలిని శక్తిని ఎందుకు మేల్కొల్పరు" అని అడిగితే, బాబూజీ అన్నారు కదా, "దానిని మేల్కొల్పినట్లయితే నీవు శూర్పణఖవో, రావణాసురుడివో లేక కుంభకర్ణుడివో అయిపోతావు. ఆ శక్తిని సమతుల్యంగా ఉంచాలే కాని, అదుపు లేకుండా ఉపయోగించకూడదు. గతి తప్పితే సర్పంలాగ కాటు వేస్తుంది" అని అన్నారు.

సరైన మార్గంలో దివ్యత్వం కొరకు సాధన చేస్తే అన్ని కేంద్రాలు వాటంతటవే తెరచుకుంటాయి. వాటి అనుభూతి, అవగాహన మనకు రావు. బాబూజీ నాకు ఒకసారి వ్రాసిన జాబులో "4,5 నెలలకు పూర్వం నీలో కుండలినీ శక్తిని జాగృతం చేశాను" అని వ్రాశారు. కాని నాకు దానిని గురించిన జ్ఞానం లేకపోవటంతో నాకేమీ తెలియలేదు. ఈ శక్తిని స్థాయికి తగని వారిలో తెరిస్తే సర్పంలా తోచి భయంతో పరుగులు తీస్తారు. ఒకసారి ఒకామె నిర్మలాదేవి వద్దకు వెళ్ళి తనలో కుండలిని శక్తిని మేల్కొల్పమని అడిగితే, ఆమెను ధ్యానంలోకి దింపి ఆరు నెలలు సాధన చేయించింది. ఆ మహిళ ఆ బాధను తాళలేక ధ్యానంలో అక్కడ వత్తిడిని భరించలేక నా వద్దకు వచ్చింది. నేను మంచి వైద్యుని సంప్రదించమని సలహా ఇచ్చి పంపాను. కొంత మంది, కుండలినీ శక్తిని మేల్కొల్పామనే భావన కలిగిస్తారు. కాని దానిని మేల్కొల్పడం ఎవరికీ సాధ్యం కాదు.

సహజమార్గ విధానం అనేది ఒక ఆధ్యాత్మిక విద్యాలయం వంటిది. దానికి మాస్టర్ బాబూజీ. ఇందులో ఒక ప్రాధాన్యత ఉంది. అది ఏమిటంటే మనల్ని అభ్యసింపజేయటానికి దేవుడే దిగి వచ్చాడు. ఆయనే మనకు ప్రిన్సిపాల్. అదే ఈ సంస్థ యొక్క ఘనత. సాక్షాత్కారం పొందాలనుకునే వారు మాత్రమే ఈ సంస్థలోకి వస్తారు.

**ప్రశ్న: మన ప్రార్థన బాబూజీకి ఎలా చేరుతుంది? చేరిందని నిర్ధారణ చేసుకోవటం ఎలా?**

**జవాబు:** మనం చెప్పుకునే ప్రార్థన పైనుంచి (అనంతం నుంచి) వచ్చిందని బాబూజీ మహరాజ్ చెప్పనే చెప్పారు. మీరు ఆధ్యాత్మికతలో మునిగి ప్రార్థన చేస్తే అది ఉన్నతమైన స్థానం నుంచి శక్తితో వచ్చింది కనుక 'వారి'కి తప్పక చేరుతుంది. అనగా ఆ ప్రార్థన వారి నుంచే, వారి శక్తితోనే వచ్చింది కనుక ప్రార్థనతో వారు అనుసంధానమై ఉంటారు. ఆ ప్రార్థన అందరి కోసం వచ్చింది. వారు అందరి కోసమే వచ్చారు కనుక మన ప్రార్థన తప్పనిసరిగా వారిని చేరుతుంది. ఇందులో అపనమ్మకం అనవసరమైనది, విశ్వాసం అత్యవసరమైనదిగా ఉంటాయి. నీ హృదయంలో వారి ఉనికి ఉంది. కనుక నీ ప్రార్థన వారిని స్పర్శిస్తుంది. మన ప్రార్థనలోని మొదటి వాక్యంలో ఈశ్వర సాక్షాత్కారం మన లక్ష్యం. ఈశ్వరుని పొందాలనే కోరిక బలీయమైనపుడు ప్రాపంచికమైన కోర్కెలు బలహీనపడతాయి. ధ్యానంలో గాఢంగా మునిగి సాధన చేస్తే ప్రతిదీ నీలోనే కలుగుతుంది.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు –ఏ అవతారులు బాబూజీ చెప్పినట్లుగా చెప్పలేదు. బాబూజీ మాత్రం "జనులు నన్ను కలుసుకోవాలని తలంచినా తలంచకపోయినా నేను మాత్రం మిమ్మల్ని అందర్నీ కలుసుకోవాలనే వచ్చాను" అని అన్నారు. వారే స్వయంగా మన కోసం వస్తే, అంతకంటే ఇంకేమి కావాలి!

**ప్రశ్న: మనం త్వరగా పురోగమించాలంటే ఏమి చేయాలి?**

**జవాబు:** మన ఆలోచనలను బాబూజీతో అనుసంధించుకోవాలి. మీరు వ్యాపారం చేస్తున్నట్లయితే, దాని అభివృద్ధికి తగిన ఆలోచనలు కలుగుతూ ఉంటాయి. అలాగే మీ ప్రోగ్రెస్ గురించి ఆలోచిస్తూ ఉన్నట్లయితే దివ్యానికి చెందిన ఆలోచనలు మీలో కలుగుతూ ఉంటాయి. దైవంతో సంబంధం పెంచుతూ ఉంటాయి. అపుడు మీకు సామీప్యతా భావం ఏర్పడుతుంది. బాబూజీ దీనినే ఒక్క వాక్యంలో చెప్పారు. "సామీప్యతానుభవం కలగటమంటే పురోభివృద్ధి యొక్క అనుభవం కలిగినట్లే (The feeling of nearness is the feeling of progress)". సామీప్యతానుభూతియే పురోభివృద్ధి చెందుతున్నామన్న దానికి నిదర్శనం. మీరు గ్రహించినా గ్రహించకపోయినా పురోగతి ఉంటుంది. సాక్షాత్కారం కోసం తపన ముఖ్యం.

**ప్రశ్న: శ్రీరాముడు, శ్రీకృష్ణుడు అవతారాలుగా వచ్చినపుడు ప్రజలు వారినే భగవంతునిగా పూజించారు. మన సంస్థలో అనేక శాఖలు ఏర్పడ్డాయి. ఎందుకు?**

**జవాబు:** శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వచ్చారు. కాని వారు ఆధ్యాత్మికత గురించి మాట్లాడలేదు. మనది ఆధ్యాత్మిక సంస్థ. మానవ మాత్రులకు సాక్షాత్కారం మాత్రమే కాకుండా అంతిమం వరకు చేర్చటం దీని ఆశయం. బాబూజీ అనంతం 'భూమా' నుంచి వచ్చారు కనుక ఆనంత శక్తిని కలిగి ఉన్నారు. సంస్థ యొక్క ఆశయం ఎంత ఉన్నతమైనదైతే సంకల్ప బలం వలన అంత ఎక్కువ శక్తిని వినియోగించటం జరుగుతుంది. మన సంస్థలో ఉన్న ప్రాణాహుతి శక్తి అనేది మరే సంస్థలోను లేదు. బాబూజీ చెప్పారు "విరాళాలు విరివిగా సేకరించటం, దానితో ఎక్కువగా ఆశ్రమాలు నిర్మించటం, భారీ సంఖ్యలో అభ్యాసీలుగా చేర్చటం నా అభిమతం కాదు. మానవమాత్రులకు సాక్షాత్కారం కల్పించటమే నా లక్ష్యం కాని, ఇతరత్రా కాదు. నేను కోరుకునేది – అంతిమం చేరాలనే తపన కలిగిన నిజమైన అభ్యాసీలను మాత్రమే" అని.

**ఒక అభ్యాసీ బాబూజీతో "నాకు సాక్షాత్కారం కోసం తపన కలగటం లేదు" అని అన్నాడు. అపుడు బాబూజీ "మంచిదే, నీకు సాక్షాత్కారం పొందాలనే తపనలేదు. కాని నాకు దానిని ఇవ్వాలనే తపన ఉంది. నీవో నేనో ఎవ్వరైతేనేమి, పని జరిగిపోతుంది" అని అన్నారు.**

**ప్రశ్న: మనకు ఏదైనా గడ్డుసమస్య వచ్చినపుడు, పరిష్కారమార్గం ఏమిటి?**

**జవాబు:** అత్యవసరమైన పరిస్థితుల్లో అనగా ఇబ్బందులను ఎదుర్కొనలేకపోయినప్పుడు బాబూజీని ప్రార్థించి మీ కష్టాలను విన్నవించుకొని ఆదుకోమని వేడుకోవచ్చు. అటువంటి సమయంలో మిషన్ ప్రార్థన "ఓ మాస్టర్! నీవే మానవ జీవితానికి యదార్థ లక్ష్యం.." కాకుండా, "బాబూజీ! మేము ఈ కష్టాలను ఎదుర్కొవాల్సి వచ్చింది. దయచేసి సహాయం చేయండి" అని బిడ్డ తన తల్లికి ఏ విధంగా తన కష్టాలను తీర్చమని అడుగుతుందో ఆ విధంగా బాబూజీని వేడుకోవాలి.

ప్రార్థనలోని చరణాలలో దివ్యశక్తి సమకూడి ఉంది. ఈ ప్రార్థన అనేది ఆధ్యాత్మిక ప్రగతి కోసమే కాని ప్రాపంచికమైన కోర్కెలు తీర్చమని కాదు. కాని ఒక పొరపాటు చేస్తున్నారు. ధ్యానం చేసే ముందు ప్రార్థన చెప్పుకుంటున్నారు. అలా ధ్యానానికి ముందు ప్రార్థన చేయకూడదని బాబూజీ చెప్పారు. ధ్యానం చేశాక ధ్యానం అయిపోందని అనుకోకుండా అదే భావంతో, అదే అనుభూతితో రోజుంతా పని చేసుకోవాలి. రాత్రి పరుండబోయే ముందు ప్రార్థన చెప్పుకొని – నేను ధ్యానం ప్రారంభించాను. నేను మీ చరణాల చెంతనే ఉన్నాను. నాలో పురోగతి దినదినాభివృద్ధి చెందాలి. మీ కృపతో నేను ఉన్నతి పొందాలి అని వేడుకొంటూ నిద్రించినట్లయితే మీరు వారి పాదాల వద్ద శరణు పొంది ఉంటారు. ఈ విధంగా ఆచరించి మార్పును గమనించండి.

**ప్రశ్న: శ్రీకృష్ణుడు చెప్పిన రాజయోగానికి ఈ సంస్థ చెప్పే దానికి భేదం ఏమిటి అని అడుగుతున్నారు. ఏమి చెప్పాలి?**

**జవాబు:** ప్రాణాహుతియే ముఖ్యమైన భేదం. మరొకటి క్లీనింగ్ – మన దినచర్యలో మనం చేసిన దానిలో ఏవైనా తప్పులుఉన్నట్లు మన మనసుకు హత్తుకున్నట్లయితే అవి మన ఆత్మపై సంస్కారాలుగా ఏర్పడకుండా ఉండటానికి సాయంత్రం క్లీనింగ్ చేసుకుంటాం. రాత్రికి నిశ్చింతంగా, నిష్కల్మషంగా నిద్రిస్తాం కనుక ఆత్మ పవిత్రంగా ఉంటుంది.

**ప్రశ్న: ధ్యానంలో స్పృహ (ఎరుక) ఏ స్థాయిలో ఉంటుంది?**

**జవాబు:** ఈ ప్రశ్నకు అభ్యాసీ నుంచే సమాధానం రావాలి. మైండ్ రీజియన్‌లో, ధ్యానం చేసేటపుడు అందులో మునిగి ఉండాలనే సంకల్పంతో ఉంటాము. అపుడు మీరు ఆ గాఢతలో ఉన్న దానిని బట్టి మీకు కలిగే అనుభూతి ఏమిటో మీకు తెలుస్తూ ఉంటుంది. దానిని అభ్యాసీయే చెప్పాలి. అది ఇతరులచేత చెప్పబడేది కాదు. ఆ అనుభూతి యొక్క స్పృహ ఏ స్థాయిలో ఉందో మీకు స్వయంగా తెలుస్తుంది. ధ్యానంలో కూర్చునేటప్పుడు ఈ భావం (కాన్షస్‌నెస్ లేదా స్పృహ)తో  కూర్చోండి. ఎలాగంటే – దైవం నీలోనే ఉన్నాడు, వారితో నీకు (కనెక్షన్) సంబంధం ఉంది– అని. వారిని పొందాలనే తపనతో అందులోనే మునిగిపోయి ఉండాలి (లేదా తల్లీనమై ఉండాలి).  ఇందులో భక్తి (Devotion) మాత్రమే ముఖ్యం. అది ఎంతగా ఉంటే అంతగా అనుభూతి ఉంటుంది. పాత క్రొత్త అభ్యాసీలనే భేదం ఉండదు. ఉండేదల్లా భక్తి, భక్తుడు మాత్రమే.

సుషుప్తావస్థలో ఏ కాన్షస్‌నెస్ (ప్రజ్ఞ) అయితే ఉంటుందో అదే స్పిరిట్యుయల్ కాన్షస్‌నెస్. అనగా అర్ధచేతనా స్థితిలో (సుషుప్తావస్థలో) ఏ స్పృహనైతే కలిగి ఉంటామో దానినే ఆధ్యాత్మిక చేతనా స్థితి / ఆధ్యాత్మిక స్పృహ అంటాము.  మొదటి సిట్టింగ్‌లో అది మేల్కొల్పబడుతుంది.

**ప్రశ్న: నేను గతంలో చాలా కాలం క్రితం పరిచయ సిట్టింగ్స్ పొందాను. మళ్ళీ ఇప్పుడు తీసుకోవాలా?**

**జవాబు:** అవసరం లేదు. మొదటిగా ఉపదేశమిచ్చేపుడు మూడు సిట్టింగులు ఇవ్వటం జరుగుతుంది. **మొదటి సిట్టింగ్**లో మనలో ఉన్న భౌతిక చైతన్యం అనగా “ఈ పని చేయాలి, ఆ పని చేయాలి” అనేటటువంటి చైతన్య స్థానంలో ఆధ్యాత్మిక చైతన్యం అనగా దైవాన్ని దర్శించాలి అనేటటువంటి చైతన్యం

మేల్కొల్పటం జరుగుతుంది. **రెండవ సిట్టింగ్‌లో** ఆ భావం ధృవపరచబడుతుంది. **మూడవ సిట్టింగ్‌లో** ప్రయత్నం ప్రారంభమవుతుంది. అభ్యాసీ యొక్క పురోగతి సాగుతుంది. భౌతికమైన పూజలో (విగ్రహారాధనలో) ఇది చేయాలి, అది చేయాలి అనేటటువంటి భౌతిక చైతన్యం మాత్రమే ఉంటుంది, కాని సుషుప్తస్థితి కలగదు.

**ప్రశ్న: ఈశ్వర సాక్షాత్కారమంటే మన బాబూజీని దర్శించటమా లేక అంతిమ సాక్షాత్కారమా?**

**జవాబు:** ఈశ్వర సాక్షాత్కారం, అంతిమ సాక్షాత్కారం ఒకటి కాదు. ఈశ్వర సాక్షాత్కారమే కాదు అంతిమం చేరటం కూడా మన లక్ష్యంగా నిర్ణయించారు బాబూజీ. అంటే బాబూజీ కేవలం ప్రవచించే వారు మాత్రమే కాదు. అందుకు కావలిసిన శక్తి ప్రాణాహుతి ద్వార ఇచ్చి అంతిమానికి తీసుకుని వెళ్ళటానికే వచ్చారు బాబూజీ. మానవుడు తన తపనతో మొదట ఈశ్వర సాక్షాత్కారం పొందటం, తరువాత అంతిమం చేరటం కర్తవ్యంగా భావించాలి. షాజహాన్‌పూర్ వెళ్ళి బాబూజీని చూసి సాక్షాత్కారం జరిగిపోయిందని భావించకూడదు.

**ప్రశ్న: బాబూజీలో లయం కావటానికి, అంతిమంలో లయం కావటానికి భేదం ఉందా?**

**జవాబు:** చాలా భేదం ఉంది. బాబూజీ మహరాజ్ నీ ఎదుట ఉన్నారు. బాబూజీ మహరాజ్‌ను అంతిమం నుంచి లాలాజీ అవనీతలం మీదకు తీసుకుని వచ్చారు. బాబూజీ అంతిమ శక్తికి సార్వభౌముడు (మాస్టర్). ఇటువంటి పనిని ఇంతవరకూ ఎవ్వరూ చేయలేకపోయారు. ఏ అవతార పురుషుడూ చేయలేని పనిని అనగా అంతిమం చేర్చటాన్ని బాబూజీ మాత్రమే చేయగలిగారు. బాబూజీలో లయం కావటం ఒక ఎత్తు అయితే అంతిమంలో లయం కావటం మరొక ఎత్తు. బాబూజీలో లయమయ్యాక అంతిమానికి ప్రయాణం ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఇంకా 4,5 స్థితులు ఉంటాయి.

మీ ముందు ఒక దివ్య మహాసముద్రం ఉంటుంది. మీరు లోతుగా దివ్య స్థితిలోనికి వెళ్ళినపుడు మీ శరీరం దాని ఉపరితలం మీదనే ఉండిపోతుంది. మీరు బాబూజీలో లయమైపోయి ఉంటే వారే మిమ్మల్ని అంతిమానికి తీసుకువెళ్తారు. అనగా సాక్షాత్కారం తర్వాత వారు మీ ముందు నిలిచి అంతిమం చేర్చటానికి సిద్ధంగా ఉంటారు. దానికి ముందు స్థితిలో అంతా శూన్యంగానే ఉంటుంది. నీవుగాని మరెవ్వరుగాని ఉండరు. తర్వాత ఆ శూన్యమే బాబూజీగా దర్శనం కలుగుతుంది. తర్వాత వారే అంతిమానికి చేర్చుతారు. మీ ధ్యానం ఎంత లోతుగా ఉంటే వారి దర్శనం అంత బాగా ఉంటుంది. మీరు లయమైపోయిన తర్వాత ఇంక మీరు వేరనిపించదు. వారిని మీరు ఎంతగా దృష్టిలో నిలుపుకుంటారో వారు మిమ్మల్ని తమ దృష్టిలో అంత గాఢంగా నిలుపుకుంటారు.

**ప్రశ్న: పిల్లలతో ఎప్పుడు ధ్యానం చేయించవచ్చు?**

**జవాబు:** 5 సంవత్సరాల వయస్సు వరకు వారికి ఏ సంస్కారాలు అంటవు. ఆ వయస్సులో ధ్యానం చేయాల్సిన పని లేదు. ప్రార్థన చేయించవచ్చు. పిల్లలకు ప్రార్థన చేస్తే మేలు కలుగుతుందనిగాని, పరీక్షల్లో విజయం కలుగుతుందనిగాని ఆశ కల్పించకూడదు. ఒకవేళ మీరు కల్పించిన ఆశ ఫలించకపోతే విశ్వాసం సన్నగిల్లటమేకాక విముఖత్వం పెరుగుతుంది. ధ్యానం అనేది మన కోరికలు తీర్చుకోవటానికి కాదు. దైవాన్ని పొందటానికి.

రామకృష్ణ మఠంలో ఒకసారి ఆచార్య చతుర్‌సేన్ శాస్త్రి అనేవారు ప్రసంగిస్తున్నారు. ఆయన మంచి ఉపన్యాసకుడు. ఆయన తన ఉపన్యాసంలో "భగవంతుడు మనకు గాలి, నీరుతోపాటు జన్మనిచ్చాడు. కనుక మనం దైవాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. కృతజ్ఞతతో ఉండాలి" అని ఏవేవో చెబుతూ ఉంటే, ఎదుట కూర్చుని ఉన్న రామకృష్ణగారు లేచి వచ్చి బయట కూర్చున్నారు. అపుడు ఉపన్యాసకుడు తన వలన ఏదో తప్పు జరిగి ఉంటుందని గ్రహించి సభానంతరం రామకృష్ణుని వద్దకు వెళ్ళి "స్వామి! నా వలన తప్పు జరిగిందా! తమరు బయటకు వచ్చేశారు, ఎందుకు?" అని అడిగాడు. అప్పుడు ఆయన "దేవుడు అవి ఇచ్చాడు, ఇవి ఇచ్చాడు అని చెప్తున్నావు. అవి ఇవ్వకపోతే ఈశ్వరుడు ఎలా అవుతాడు. మనకు అవసరమైనవి సమకూర్చకపోతే తండ్రి తండ్రే కాదు" అని అన్నారు. అందుచేత దైవభక్తికి ఆశలు, అవసరాలతో ముడిపెట్టకూడదు.

ఇంతకుపూర్వం రామకృష్ణునిగాని, శంకరాచార్యులనుగాని, రామానుజాచార్యులనుగాని ఎవరిని 'మాస్టర్' అని సంబోధించలేదు, అంటే అప్పుడు అలా జరగలేదు. అది ఇప్పుడే, బాబూజీ విషయంలోనే జరిగింది. నేను ఈ విషయం గురించి నా పుస్తకంలో వ్రాశాను. అది చదివితే మీకు సరియైన అర్థం తెలుస్తుంది "ఓ మాస్టర్" అన్న పదంలో సాక్షాత్కారం కోసం లక్ష్యం ఉంది. ఈ శబ్దం బాబూజీ సమయంలోనే వాడకంలోకి వచ్చింది. బాబూజీ అనంతశక్తికి అధిపతి. వారిని అలా తయారుచేసి, వారు సంపూర్ణ శక్తిమంతులుగా నిరూపితమయ్యాక, లాలాజీ బాబూజీని ఒకే ఒక్కసారి 'మాస్టర్' అని వ్యవహరించారు. బాబూజీ సర్వశక్తిమంతులు, ఏదైనా సాధించగలరు అని చెప్పటానికి బాబూజీ చెప్పిన మాట "లాలాజీ సాహెబ్ అనుమతించితే నేను వేలకొద్దీ ప్రపంచాలను సృష్టించగలను" అన్నది అందుకు తార్కాణం.

బాబూజీ, "మీలోనే దైవం నెలకొని ఉన్నాడు, మీ ఎదుటనే ఉన్నాడు" అని చెప్తుంటే మీరు ఇంకా ఏవేవో ఆలోచనలు పెట్టుకోకుండా మీరు తలంచేవి అన్నీ దైవానికి చెందినవిగా ఉండాలి. మనం సాధకులం కనుక, అనంత శక్తితో అవతరించిన బాబూజీ మహరాజ్ గురించి మాత్రమే మనం ఆలోచించాలి. మీరు నన్ను 'ఓ సిస్టర్' అని సంబోధించారనుకుందాం, నేను ఇక్కడ నా రూపంలోనే ఉంటాను, మీరు అక్కడ మీలాగానే ఉంటారు. 'నేను' అనేది కేవలం గొంతు నుంచే వెలువడుతుంది కాని హృదయం నుంచి కాదు. భేదం గురించి ఆలోచించ వద్దు. అది కల్పించబడుతుంది. వారికి తోచింది వారు చేస్తున్నారు, బాబూజీ చెప్పినట్లుగా మనం చేస్తున్నాం.

ట్రాన్స్‌మిషన్ పవర్ (ప్రాణాహుతి శక్తి) బాబూజీ యొక్క ప్రత్యేకత. ఆ శక్తి మనలోని అవాంఛనీయమైన వాటిని తొలగించి వేస్తుంది. బాబూజీపట్ల ప్రేమ పెంచుకుంటే ధ్యానంలో ఏమి పొందుతున్నామో మీకు తెలుస్తుంది. అందరూ బాబూజీలుగా అవుతారు. అపుడు అనంతానికి కూడా భ్రమ కలుగుతూ ఉంటుంది: "నేను ఒక్క బాబూజీని పంపాను, ఇంతమంది బాబూజీలు ఎక్కడి నుంచి వచ్చారు" అని. అందువలన బాబూజీ అంటే మన బాబూజీకే చెల్లుతుంది.

**ప్రశ్న: ధ్యానంలో మాకు కొన్ని అనుభూతులు వస్తూ ఉంటాయి. అవి నిజమా లేక అభూత కల్పనలా?**

**జవాబు:** మీరు ఇక్కడ వ్రాస్తున్నారు అంటే నిజమే కదా. ఊహా కల్పితంగా ఎందుకు భావిస్తారు. మీరు చూడనిదైతే ఊహ అవుతుంది.

**ప్రశ్న: ఇద్దరు అభ్యాసీలు ప్రేమతో బాబూజీ గురించి మాట్లాడుకుంటున్నప్పుడు హుక్కా వాసన వచ్చిందని అన్నారు, నిజమేనా?**

**జవాబు:** అప్పుడప్పుడు అలా జరుగుతుంది. 'వారు' భౌతికంగా లేకపోయినా వారి ఉనికిని తెలియజేయాలని ప్రకృతి తలంచినపుడు అటువంటి సందర్భం వస్తుంది. ఒక్క కస్తూరికే కాదు. యావత్ ప్రపంచానికి వారి ఉనికిని తెలియజేయటానికి ప్రకృతి అటువంటి సంఘటన కల్పిస్తుంది.

డా॥ కె.సి. వరదాచారిగారు ప్రప్రథమంగా బాబూజీని కలుసుకున్నపుడు "ఇన్ని సంస్థలు, ఎందరో సాధువులు ఉండగా నూతనంగా ఈ సంస్థను ఎందుకు ప్రారంభించారు" అని అడిగారు. "అందురూ చెప్పేవారే కాని చేసేవారు లేరు. ప్రకృతికార్యం అసంపూర్ణంగా ఉండిపోయింది. దానిని పూర్తి చేయటానికి ఈ సంస్థను ప్రారంభించాను. ఎన్నో సంవత్సరాల తపస్సు చేత పొందే ఫలితాన్ని ఈ సాధన ద్వారా స్వల్పకాలంలోనే పొందవచ్చు. ఈ సహజమార్గ విధానంలో సాధన, సిద్ధి రెండూ ఉన్నాయి" అని చెప్పారు బాబూజీ. ఇటువంటిది మరి ఏ ఇతర విధానంలోనూ లేదు. "శ్రీరామ, శ్రీకృష్ణ" అన్నపుడు నోటితో ఉచ్ఛరించటమేగాని అనుభూతి ఉండదు. 'బాబూజీ' అని ఒక్కసారి ఉచ్ఛరించినా లోపల అనుభూతి కలుగుతుంది. బాబూజీ మహరాజ్ మానవాళి సంతతినీ అంతిమం చేర్చటానికి దిగి వచ్చిన దివ్యపురుషుడు, అని చెప్పటానికి ఇదే నిదర్శనం. "రామ్, రామ్" అని వందసార్లు పలికినా ఆ శబ్దమేగాని మరేమి ఉండదు. కాని "బాబూజీ, బాబూజీ" అని ఐదుసార్లు పలికేటప్పటికే అంతర్గతంగా అనుభూతి కలిగి ఆపైన ఉచ్ఛరించలేము.

**ప్రశ్న: క్లీనింగ్ ద్వారా జబ్బులు నయమవుతాయా?**

**జవాబు:** అది సంభవం కాదు. క్లీనింగ్ వలన మనలోని దుష్కర్మల సంస్కారాలు ఏవైతే మన సాధనలో పురోగతికి ఆటంకపరుస్తాయో అవి తొలగించబడుతాయి. అంతేగాని భౌతికమైన శారీరక బాధలు తొలగించబడవు. ఆ దివ్యశక్తిని ప్రార్థించటమే మంచిది. సంకల్పం ద్వారా కేంద్రం యొక్క దివ్యశక్తి సహాయపడుతుంది. ఒక ప్రిసెప్టర్, అతని భార్య జబ్బుగా ఉన్నప్పుడు సంస్థ యొక్క డబ్బును ఉపయోగించుకున్నాడు. చారీజీ ఆ సందర్భాన్ని బాబూజీతో చెప్పి ఆ ప్రిసెప్టర్‌ను తొలగించమని కోరారు. అపుడు బాబూజీ "దివ్యశక్తిని ఇవ్వటమే కాని తిరిగి తీసుకోవటం జరగదు. ఆ శక్తి అతనిలో నిలబడి ఉంటుంది. కాని దానిని ఉపయోగించలేడు" అని చెప్పారు.

**ప్రశ్న: ధ్యానం, ప్రక్షాళన ఒకటేనా?**

**జవాబు:** కాదు. ధ్యానంలో బాబూజీని స్మరించి దివ్యత్వం కోసం నిరీక్షిస్తాము. క్లీనింగ్ రోజుకు ఒక్కసారి, సాయంత్రవేళ, మనం చేసిన తప్పిదాలు గాఢంగా అనుభూతి కలిగించే వాటిని సంస్కారాలుగా ఏర్పడకుండా తొలగించుకుంటాము. కాని సంస్కారాలను బుద్ధి పూర్వకంగా సృష్టించుకోకూడదు.

బాబూజీ సంకల్పం చాలా విలువైనది. ఆ సంకల్పం ద్వారా వారి శక్తి దానంతట అదే అన్ని పనులు చేస్తుంది. అయినప్పటికీ "నాకు పని లేకపోయినా తీరిక లేదు" అని బాబూజీ చెప్పారంటే అది వారి ఔన్నత్యం. అనగా భౌతికంగా వారేమీ చేయకపోయినప్పటికి సంకల్పం ద్వారా తీరిక లేకుండా సృష్టి కార్యాలు నిర్వహిస్తూ ఉంటారు.

బాబూజీ ఒకసారి ఇంటి బయట కూర్చుని ఉండగా, లోపల ఉన్న ఈశ్వర్ సహాయ్‌గారు, తదితర అభ్యాసీలకు ప్రాణాహుతి పొందిన అనుభూతి కలిగింది. ఈ విషయం ప్రస్తావించి ఈశ్వర్‌సహాయ్‌గారు బాబూజీతో "అక్కడ ఉన్న మీ కుర్చీ, బల్ల, బట్టలు ద్వారా మాకు ప్రాణాహుతి వచ్చింది" అన్నారు. దానికి బదులుగా బాబూజీ "నేను రోజంతా ఆ కుర్చీలో కూర్చుంటాను, ఆ గదిలోనే ఉంటాను కనుక అవి అన్నీ దివ్యశక్తితో సమకూడి ఉన్నాయి. అందువలన మీరు అనుభూతి చెందారు" అన్నారు. ఈ మాటలు విన్న ఉమాశంకర్ అనే ప్రిసెప్టర్, తన బట్టలు అక్కడ పెట్టి అభ్యాసీలను ధ్యానం చేయమని పురమాయించి స్నానానికి వెళ్ళాడు. దానిని గమనించిన బాబూజీ అతడిని పిలిచి "నీవు సీతాపూర్ నుంచి వచ్చావా లేక అనంతం నుంచి వచ్చావా? నేను ప్రాణాహుతి నిచ్చింది నీకుగాని, నీ దుస్తులకు కాదు. మహనీయులు చేసే ప్రతి పనిని అనుకరించకూడదు" అని బుద్ధి చెప్పారు.

**ప్రశ్న: 1974 లో బాబూజీ అస్వస్థతగా ఉన్న సందర్భంలో కొందరు మీ పేరును ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టటానికి సూచించారట కదా!**

**జవాబు:** నాకు ఆ విషయం తెలియదు. కాని లాలాజీగారి మనుమడు బాబూజీగారితో ఈ విషయం ప్రస్తావించి "సిస్టర్ కస్తూరికి ఆ బాధ్యతను అప్పగించమని నా కోరిక" అని చెప్పినపుడు బాబూజీ వెంటనే స్పందించి "ఈ విషయంలో ఆమె పేరు చెప్తే ఆమె వెంటనే మరణిస్తుంది. నేను ఆమె కోసమే ఉన్నాను, ఎప్పటికీ ఉంటాను" అని అన్నారు. ఎన్నో కమిటీలు ఉండేవి. వాటిలో నా పేరు ప్రతిపాదించబడేది. కాని నేను బాబూజీతో చెప్పాను "నాకు మీరు చెప్పేది, వారు చెప్పేది తెలియదు. ఆ పనుల గురించి తెలియదు. నేను అభ్యాసీలకు సేవ చేయటం మినహా మరేమీ చేయలేను" అని. ఈ సహజమార్గ సంస్థలో నేనొక సభ్యురాలను మాత్రమే.

నేను నా పుస్తకంలో వ్రాశాను. శ్రీరామచంద్ర మిషన్ యొక్క నిజమైన అర్థం ఏమిటో నాకు ఇప్పుడే అర్థమైంది. నేను ఇప్పటివరకు శ్రీరామచంద్ర మిషన్ అనేది ఒక సంస్థగానే భావించాను. కాని నేను ఆ పుస్తకంలో వ్రాసిన తర్వాత దానిని తిరిగి చదువుకున్నపుడు దాని అంతరార్థం ఏమిటో తెలుసుకొని ఆశ్చర్యపోయాను. ఇది ప్రతిమానవుని కొరకు భగవత్ సాక్షాత్కారం, లయావస్థను ప్రసాదించటం కోసం స్థాపించబడింది. నాకు ఏయే అనుభూతులు, స్థితులు కలుగుతాయో అవి అన్నీ కూడా అభ్యాసీలందరికీ కలిగించాలి అని అలా వ్రాయబడింది. శ్రీరామచంద్ర మిషన్ యొక్క విశిష్టత ఇది. శ్రీరామచంద్ర మిషన్ అనేది కేవలం పేరు కొరకు కాదు. ఇతర సంస్థల్లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ అంటూ ఎన్నో పదవులు ఉంటాయి. కాని ఈ సంస్థలో ఉన్నది ప్రేమ, భక్తి అత్యంత విలువైనవి. ప్రకృతి నంతటినీ దివ్యత్వంలో నింపటానికే ఇది ఉద్దేశించబడింది. కత్తితో ఒకటిని రెండుగా చేస్తాము. కాని ఈ సంస్థ ద్వారా 'రెండు'

కలపబడి ఒకటిగా అవుతాయి. అనగా ఆత్మ పరమాత్మలు ఐక్యమై ఒక్కటి కావటమే విశేషం. ప్రపంచం అంతా దీనివైపు దృష్టి సారిస్తుంది.

**ప్రశ్న: దయచేసి అల్టిమేట్ గురించి వివరించండి.**

**జవాబు:** నేను నా పుస్తకాల్లో అల్టిమేట్ గురించి కూడా వ్రాశాను. దానికి సప్త ద్వారాలు (సెవన్ రింగ్స్ – ఏడు వలయాలు) ఉన్నాయి. అందులో మొదటి ద్వారం చేరేసరికి దివ్యత్వం తెలుస్తూ ఉంటుంది. అది వారి నివాసం. అక్కడే వారు ఉంటారు. ఎంతగా వెదికినా వారు కనిపించరు కాని అక్కడే ఉన్నారు. బాబూజీ తమ పుస్తకాలలో ఏమీ వ్రాయలేదని ఎవ్వరూ అనలేరు. అంతిమం చేరటం సాధ్యం కాదని కూడా ఎవ్వరూ అనలేరు. వారు ఆ పని చేయగలనని నిరూపించారు. వారికి ఆ శక్తి, సంకల్ప బలమూ ఉన్నాయి.

**ప్రశ్న: నేను చాలా సంవత్సరాల క్రితం అభ్యాసీగా చేరాను. కాని మధ్యలో అవాంతరం వచ్చినా పది సంవత్సరాల నుంచి సాధన చేస్తున్నాను. కనుక మరల ప్రిసెప్టర్ ద్వారా పరిచేయ సిట్టింగ్ తీసుకోవాల్సి ఉంటుందా?**

**జవాబు:** మీరు మరల పరిచేయ సిట్టింగ్స్ తీసుకోవాల్సిన అవుసరం లేదు. అభ్యాసీకి సహాయపడటానికే ప్రిసెప్టర్ యొక్క అవుసరం ఉంటుంది. "ప్రిసెప్టర్ కోసం అభ్యాసీ వేచి ఉండాల్సిన పనిలేదు. శక్తి అనంతమైనది. అభ్యాసీకి ఏదైనా కండిషన్ ఇవ్వాల్సినప్పుడు, అందుకోసం నేను ప్రిసెప్టర్ కోసం వేచి ఉండను. శక్తి నేరుగా అభ్యాసీని చేరుతుంది" అని బాబూజీ చెప్పారు. సిట్టింగ్ ఇచ్చే సమయంలోతప్ప మిగతా సమయంలో ప్రిసెప్టర్ కూడా అభ్యాసియే. శక్తి అపరితమైనది. దానిని ఎవరైనా పొందవచ్చు.

**ప్రశ్న: బాబూజీ ప్రిసెప్టర్లను తయారుచేశారు. చారీజీ ప్రిసెప్టర్లను చేశారు. మీరు ప్రిసెప్టర్లను తయారుచేశారు. ఏమైనా తేడా ఉంటుందా?**

**జవాబు:** తేడా (లేదా వైవిధ్యం) ఏమీ ఉండదు. కాని పవర్‌లో తేడా ఉంటుంది. వారు పొందిన శక్తినిబట్టి ఆ అపరిమితమైన శక్తిని రాబట్టడంలో హెచ్చుతగ్గులు, వేగం, నిదానం ఉంటాయి.

సంస్థ నుంచి ఏ అభ్యాసీని ఎవరూ తొలగించలేరు. అలాగే ఏ ప్రిసెప్టర్‌ను ఎవరూ తొలగించలేరు. ప్రెసిడెంట్ అంటే అర్థం ఏమిటి? సహజమార్గ సంస్థ యొక్క ప్రెసిడెంట్ అంటే అభ్యాసీల ఆధ్యాత్మికోన్నతికి, పురోగతికి పాటుపడాలి. ఆ బాధ్యత నిర్వర్తించటం చాలా కష్టం. అందుకే బాబూజీ అన్నారు "You die yourself" అని. అనగా 'నీవు' మరణిస్తే బాబూజీ నెలకొని ఉంటారు. ఎవరూ హాని చేయలేరు. బాబూజీ అందరికీ మంచి చేయటానికే అవతరించారు. ఇది మనందరికీ తెలుసు. బాబూజీ చెప్పారు, "ప్రజలు ఆధ్యాత్మికతను గురించి భయపడరు కాని ప్రాపంచిక విషాయాల గురించి భయపడతారు" అని. శ్రీరామచంద్ర మిషన్ నుంచి తొలగిస్తారు అని భయపడ్డారు. శ్రీరామచంద్ర మిషన్ నా ఇల్లు అయినపుడు, నా ఇంటి నుంచి నన్ను ఎవరూ తొలగించలేరు. చాలామంది తాము చారీజీ, నారాయణ ప్రిసెప్టర్స్‌గా చెప్పుకుంటారేగాని బాబూజీ ప్రిసెప్టర్స్‌గా చెప్పుకోరు. దీనికి కారణం వారికి విశ్వాసం లేకపోవటమే. బాబూజీతో కనెక్షన్ ఉంటే శక్తి అంతిమం నుంచి దానంతట అదే వస్తుంది. వారి కోరిక కూడా అదే. బాబూజీ ఎప్పుడు

ఎవ్వరినీ ఆజ్ఞాపించేవారు కారు. ఈశ్వర్ సహాయ్‌గారిని కూడా మీ ప్రోగ్రామ్ ఏమిటి అని అడిగేవారు కాని ఆజ్ఞాపించేవారు కారు.

అభ్యాసీలు ఇక్కడ ఉన్నవారే కాదు, ఎక్కడ ఉన్న వారైనాసరే, అందరి యొక్క ప్రతి అణువూ దివ్యత్వంతో నిండిపోయి ఉంది. అందరూ బాబూజీ కృపకు పాత్రులయ్యారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! పురోగతి ఉందా లేదా అని ఎలా తెలుసుకోవటం?**

**జవాబు:** "భగవత్ సాక్షాత్కారం గురించి చెప్పేవారుగాని, దానిని గురించి చెప్పేటటువంటి విధానంకాని ఏమి కనిపించలేదు" అని బాబూజీ అన్నారు.

"భగవత్ సాక్షాత్కారమేకాదు అంతిమ సాక్షాత్కారం పొందటానికి 'సహజమార్గం' రూపొందింది. మీలో అవిశ్వాసానికి తావులేదు. మీకు ట్రాన్స్‌మిషన్ వస్తూ ఉంది, అంటే నేను మీతో ప్రత్యక్షంగా ఉన్నట్లే. మీ ప్రోగ్రెస్ ఉన్నదా లేదా అని మీకు సందేహం కలుగుతుంది అంటే మీరు సరియైన అభ్యాసం చేస్తున్నారా లేదా అని ఆలోచించాల్సి వస్తుంది" అని బాబూజీ చెప్పారు. అంటే సిన్సియర్ (sincere) అభ్యాసీయై ఉండాలి. అనగా సక్రమమైన అభ్యాసీ అని అర్థం. మీరు ఎవరి కొరకైతే తపిస్తున్నారో వారు అనగా బాబూజీ యొక్క సామీప్యతానుభూతి పొందటం. దీని వలన సాక్షాత్కారం స్వల్పకాలంలో సాధ్యపడుతుంది. అందుచేత దైవం మీలోనే ఉన్నాడన్న తలంపు కలిగి ఉండి మీ దృష్టిని వారితో సంధింపజేసుకోవాలి. అలా చేయగలిగినట్లయితే ప్రోగ్రెస్ అవుతోందా లేదా అనే ప్రశ్నే తలయెత్తదు. బాబూజీని మీలో దర్శించగలిగినట్లయితే మీతో పరిచయం చేసుకున్న వ్యక్తికి మీ అంతర్యామిగా ఎవరో ఉన్నట్లుగా అనుభూతి కలుగుతుంది. బాబూజీ ఇలా చెప్పారు: "సహజమార్గ విధానంలో ప్రార్థన అన్నది దివ్యశక్తితో కూర్చబడింది" అని. మన దృష్టిని దైవంవైపు సారించినట్లయితే, ఆ దైవం వచ్చినపుడు మనం ఆ దివ్యత్వంలో మునిగిపోతాం, అప్పుడు ధ్యానం ప్రారంభమవుతుంది. కనుక సహజమార్గ విధానంలో ప్రవేశించి, నిర్దేశించినట్లుగా సాధన చేసినట్లయితే పురోగతి ఉందో లేదో అన్న సంశయం సమసిపోతుంది.

**అభ్యాసీ: నేను ప్రతి సత్సంగ్‌కు హాజరవుతూనే ఉన్నాను. సిట్టింగ్స్ తీసుకుంటున్నాను.**

**జవాబు:** ప్రతి ఆదివారం సత్సంగ్‌కు హాజరు కావటం ఒక నియమంగా పాటిస్తూ ఉండవచ్చు. సత్సంగ్ అనేది కేవలం హాజరు కావటమే కాదు. మనం ధ్యానంలో నిమగ్నమై జీవిస్తున్నపుడు దైవం తన నిజరూపంలో వస్తాడు. ధ్యానంలో కూర్చోగానే ఫలితం ఒక్కసారిగా వచ్చేస్తుందని అనుకోకూడదు. నీవు ధ్యానంలో కూర్చున్నప్పుడు తప్పనిసరిగా ఆనందాన్ని పొందుతావు. ధ్యానంలో ఏమీ అనుభూతి రావటం లేదని ఎవ్వరూ అనలేరు. కొందరికి అది ఆనంద రూపంలోను, మరి కొందరికి సూక్ష్మత్వ రూపంలోను అనుభూతి కలగవచ్చు. కనుక ఆ అనుభూతి ద్వారా బాబూజీ మహరాజ్‌కు అనుసంధానమైతే అనగా "బాబూజీ! మీరు ఇక్కడే ఉన్నారు. నేను మీ ఎదుటనే ఉన్నాను" అని తలంచినట్లయితే బాబూజీతో సామీప్యాతానుభూతి కలుగుతుంది.

ఒకసారి ఒక ఫోటోగ్రాఫర్ బాబూజీని ఫోటో తీస్తున్న సందర్భంలో వారు ఫోటోగ్రాఫర్‌ను "నీకు నా చిరునవ్వు (smile) కనిపిస్తోందా" అని అడిగారు. అప్పుడతను చూడగలిగాను అనగానే బాబూజీ "నీవు చెప్పింది నిజమే. నీ హృదయంలో నేను (smile) చిరునవ్వుతో ఉన్నట్లు కన్పించినట్లయితే నీలో సహజమార్గం ఉన్నట్లు. నీవు తలచుకున్నపుడు నా హృదయం స్పందించి నాకు తృప్తి కలుగుతుంది" అని అన్నారు. కనుక నీవు ఏ ఆచోచనతో పనిచేస్తున్నా "బాబూజీ సమీపంలో ఉన్నారు" అని అనుభూతి చెందాలి. అపుడు బాబూజీ అభ్యాసీని గుర్తిస్తారు. బాబూజీ యొక్క దివ్యదృష్టి నిజమైన అభ్యాసీలను గుర్తిస్తుంది. నీవు పరిపక్వత చెందటానికి ప్రయత్నిస్తే బాబూజీ యొక్క అనుగ్రహం తప్పక లభిస్తుంది. డాక్టర్‌గారు మీ అందరి అభివృద్ధికి బాగా కృషి చేస్తున్నారు. సెంటర్స్‌లో అభ్యాసీలు తక్కువగా ఉన్నారని ఎవరో చర్చించినపుడు –"ప్రేమ, సామీప్యతను అభ్యాసీల హృదయాలలో పెంచవలసిన బాధ్యత ప్రిసెప్టర్లకు ఉంది" అని బాబూజీ చెప్పారు.

ప్రిసెప్టర్ అభ్యాసీల ఉన్నతి కొరకు బాబూజీని ప్రార్థించాలి. అలా చేసినపుడు ప్రిసెప్టర్స్ కూడా ఉన్నత స్థాయికి పురోగమించటమే కాకుండా అభ్యాసీలు కూడా ఉన్నతి నొందుతారు. వారు కూడా బాబూజీ యొక్క సామీప్యతను ఎంతగా పొందగలిగితే అంతగాను అభ్యాసీలకు కూడా సామీప్యతానుభవం కలిగించగలరు.

**ప్రశ్న: కొంతమంది సహజమార్గంలో చేరి వదిలిపెట్టిపోతారు, ఎందుకని?**

**జవాబు:** బాబూజీ ఇలా చెప్పారు: "నేను ఎప్పుడూ దారి తప్పను. అభ్యాసీ దారి తప్పవచ్చు. కాని అభ్యాసీ ఒకసారి సహజమార్గంలో అభ్యాసం చేశాక, అతడు మూడు జన్మల వరకూ హృదయం చైతన్యవంతం కావడానికి ప్రాణాహుతిని పొందుతాడు" అని. కనుక అభ్యాసీ, తనకు తాను "సహజమార్గం విడిచిపెట్టి వెళ్ళాను" అని అనుకోకుండా ఉంటే అతను అభ్యాసీగానే ఉంటాడు. "నేను బాబూజీతో సిట్టింగ్ మానివేశాను" అన్నప్పుడు వారు "మానివేశాను లేదా వదిలివేశాను" అనే మాటను వదిలిపెట్టమన్నారు, ఆ మాటను సరిదిద్దుకోమన్నారు. మనం వదిలిపెట్టవచ్చు. కాని బాబూజీ మహరాజ్ మన కోసమే అనంతం నుండి దిగి వచ్చినపుడు మనల్ని వారు ఎందుకు వదిలిపెట్టారు! అలాంటి ఆలోచన రాకూడదు.

**ప్రశ్న: ప్రతిరోజు ప్రిసెప్టర్ వద్ద సిట్టింగ్ తీసుకోవచ్చా?**

**జవాబు:** మీరు సిట్టింగ్ తీసుకోవచ్చు. కాని బాబూజీ మహరాజ్ ఏమి చెప్పారంటే, ప్రతిరోజూ సిట్టింగ్ తీసుకోండి కాని ప్రిసెప్టర్ మీదనే ఆధారపడ వద్దు, "నా ఎదుట కూర్చుని సిట్టింగ్ తీసుకోండి" అన్నారు. వారు చెప్పినది మంచి సలహా. ఎందుకంటే పురుషులకైనా, స్త్రీలకైనా ప్రతిరోజూ సిట్టింగ్‌కు వెళ్ళాలంటే సాధ్యపడకపోవచ్చు. కనుక తీసుకోవచ్చునా లేదా అనే ప్రశ్న అనవసరం. మీరు తీసుకోవాలి అనుకోవాలేగాని రాత్రి అనక పగలనక రోజంతా వారు సిద్ధంగానే ఉంటారు, ప్రాణాహుతి ప్రవహిస్తూనే ఉంటుంది. మీరు భోజనం చేస్తూనే చేయవచ్చా లేదా అని ఆలోచించరు కదా! దివ్య పురుషుడు బాబూజీ అభ్యాసీలను ఎన్నటికీ మరువరు. ఒక అభ్యాసీ బాబూజీని అడిగాడు, "ఒక వ్యక్తి మరణించేటపుడు దైవాన్ని గుర్తు చేసుకోకపోతే మళ్ళీ మళ్ళీ జన్మలు తీసుకోవలసి ఉంటుంది అన్నారు కదా!" అని. ఆ మాటకు సమాధానంగా "ఒక వేళ నీవు మరచిపోయినా నేను మరచిపోను" అన్నారు బాబూజీ.

ఆంతరికంగా వారు మీకు ఎదురుగా కనిపిస్తున్నారంటే అది వాస్తవమే. "నేను మీవాడను" అని అనుకోవటం ఆలోచనాపరంగా కాకుండా అనగా కృత్రిమంగా కాకుండా హృదయం నుంచి అనుభూతితో కూడినదిగా ఉండాలి.

మనం బాబూజీ మహరాజ్ చరణాలను ఆశ్రయించి ఉన్నాం. వారి సంకల్పమే మనల్ని అక్కడకు చేర్చుతుంది. మనకు అక్కడకు చేరాలనే సంకల్పం ఉంది. ఎవరైతే సహజమార్గ విధానంలో హృదయ పూర్వకంగా చేరి 'వారి'ని ప్రేమిస్తారో వారు సాక్షాత్కారాన్ని పొందుతారు.

ఒక అభ్యాసీ నన్ను అడిగాడు, "మీరు డివైన్ పర్సనాలిటీ గురించి వ్రాస్తున్నారు, చెబుతున్నారు. అసలు డివైన్ పర్సనాలిటీ అంటే అర్థం ఏమిటి? మీరు వ్రాసినది బాబూజీ మహరాజ్ మాత్రమే డివైన్ పర్సనాలిటీ అని. నేను మిమ్మల్ని డివైన్ పర్సనాలిటీ అంటాను" అని తన అభిప్రాయం చెప్పాడు. దానికి సమాధానం ఏమిటంటే – బాబూజీచేత ఎవరైతే అంతిమంకు పంపబడతారో వారు డివైన్ పర్సనాలిటీ కారు. బాబూజీ నన్ను తయారు చేయటం మాత్రమే చేశారు. అలా రూపొందించబడిన వారు డివైన్ పర్సనాలిటీ కారు (అనబడరు).

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ మహరాజ్‌లో పూర్ణ లయావస్థను పొందటం ఎలా?**

**జవాబు:** నీవు దైవాన్ని స్మరించినపుడు, లేదా బాబూజీ మహరాజ్‌ను హృదయంతో స్మరించినపుడు నీ హృదయంలో ఏదో స్పందన, అనుభూతి కలుగుతాయి. అదే కావాలని మనసులో తలచుకుంటే హృదయంలో స్పందన కలగదు. ఏ విధమైన ఫీలింగ్ రాదు. కనుక హృదయంలో స్మరించినట్లయితే నీ యొక్క అహం (నేను) తొలగిపోయి బాబూజీ మహరాజ్ అక్కడ దర్శనం ఇస్తారు. లయావస్థ కూడా అక్కడ ఉంటుంది. ఈ సందర్భంలో నా స్వానుభవం గురించి చెబుతాను. నా తల్లిగారు చనిపోయినపుడు నేను ఏడుస్తున్నాను. ఎప్పుడైతే నేను నా హృదయంలోకి తొంగిచూశానో అపుడు బాబూజీ మహరాజ్ మాత్రమే కనిపించారు. కనుక నేను మానసికంగా ఒక కుటుంబ సభ్యురాలుగా ఆలోచించినపుడు, ఇతరుల రోదన విని నేను కూడా దుఃఖించాను. అంటే ఇక్కడ మనస్సుతో సంబంధం కలిగి ఉండటం వలన అలా జరిగింది. దైవాన్ని స్మరించినట్లయితే అనుభూతి దివ్యమైనదిగా ఉంటుంది. హృదయం దివ్యత్వాన్ని ఆకర్షిస్తుంది, మనస్సు భౌతికత్వాన్ని ఆకర్షిస్తుంది. కనుక దైవ స్మరణ హృదయాన్ని తాకితే, మానసిక ఆలోచన భౌతిక బాంధవ్యపరమైన అనుభూతిగా ఉంటుంది. అదే సమయంలో బాబూజీని స్మరించుకున్నట్లయితే మనం వారితో సంబంధం కలిగి ఉంటాం.

ఒక అభ్యాసీ వస్తూ ఉండేవాడు. అతడు ప్రిసెప్టర్ దగ్గర సిట్టింగ్ తీసుకోకుండా, ధ్యానం తనకు తానుగా చేస్తూ ఉండేవాడు. అది గమనించిన మరొక అభ్యాసీ అది పద్ధతి కాదని చెప్పాడు. కాని వాస్తవానికి అతనికి ట్రాన్స్‌మిషన్ అందుతూనే ఉంది. అందుకు కారణం అతని హృదయంలో బాబూజీ ఉండటమే. దాని ఫలితంగా, అతను సిట్టింగ్‌లో కూర్చున్నప్పుడు ఏ విధంగా ప్రాణాహుతి పొందే వాడో అదే విధంగా ప్రాణాహుతిని నేరుగా పొందుతున్నాడు. ప్రాపంచిక విషయాలకు మనస్సు ఆకర్షితమవుతుంది. హృదయం

భగవంతునికి అర్పితమవుతుంది. హృదయ పూర్వకంగా అంకితమైన అభ్యాసీలకు ప్రాణాహుతి దానంతట అదే వస్తుంది. అర్పితం కాని వారికి ఆ విధంగా ట్రాన్స్‌మిషన్ ఇవ్వాలనే ఆదుర్దా ఉండదు.

**ప్రశ్న: 'అహం'ను తొలగించుకోవటానికి ఏమి చేయాలి?**

**జవాబు:** 'అభ్యాసం' ద్వారానే సంభవం. అది ఎలాగంటే, మనం రోజంతా చేసే ప్రతి పనినీ "నేను చేస్తున్నాను, చేశాను" అని అనుకుంటూ ఉంటాము. 'నేను' అన్నప్పుడు అహం అవుతుంది. అలా కాకుండా మన దృష్టిని మరల్చి అంతర్ముఖం చేస్తే బాబూజీ మహరాజ్‌ను చూస్తాం. మనం చేసే పనికి కర్త మనం కాకుండా మన ఆంతరికంలోని దివ్యత్వానికే ఆపాదించబడుతుంది. అపుడు 'నేను' (అహం) తొలగి దివ్యార్పితమే అవుతుంది. ఇలా అర్థం చేసుకోవచ్చు: అహమ్‌లో 'అ' అనగా లేదు అని అర్థం. 'హమ్' అనగా 'మనం' లేదా 'నేను' – చివరకు 'నేను లేను' అన్నట్లవుతుంది. ఈ విధంగా ప్రయత్నిస్తే 'నేను' అనగా అహం తొలగిపోయి దివ్యత్వమే చోటు చేసుకుంటుంది.

**ప్రశ్న: మనకు ప్రాణాహుతి వస్తూ ఉంటుంది అయినా ఇంకా ఏదో కావాలని ఉంటుంది, అది ఏమిటి?**

**జవాబు:** మీకు సిట్టింగ్ తీసుకోవాలనే తాపత్రయం (వ్యామోహం) ఉంది. అనగా సిట్టింగ్ అనేది మనసులో స్థావరం చేసుకుంటుంది. అది ఒక వ్యామోహమవుతుంది. అందుచేత హృదయంలో దైవాన్ని స్మరించాలి. వారిపైనే ధ్యాస నిలుపుకోవటానికి ప్రయత్నించాలి. సిట్టింగ్ అనే భావం యొక్క స్థానంలో దైవాన్ని నిలుపుకొని 'నీవే కావాలి' అని కోరుకోవాలి.

విజయవాడ నుంచి మొదటి బ్యాచ్‌లో రావటానికి సిద్ధపడిన కృష్ణకుమారిగారు దేహం చాలించారు, ఆమెకు ఆశీర్వచనం ఇవ్వమని నన్ను కోరారు. ఇటువంటి సందర్భంలో బాబూజీ ఇలా చెప్పారు: "నేను మీ కొరకే ఉండగా ప్రత్యేకించి అనుగ్రహం గురించి ఆలోచన అనవసరం. ఏదో కొంతకావాలని కోరుకుంటే అనంతంగా పొందగలిగిన దానిని కుదింపు చేసుకున్నట్లే అవుతుంది" అని. కనుక బాబూజీ ఉన్నారు, మనకు ఎంత కావాలో ఏమి ఇవ్వాలో వారే ఇస్తారు.

**ప్రశ్న: బాబూజీ మహరాజ్ యొక్క కృపతో మేము దివ్యత్వంలో మునిగి ఉండిపోవాలని అనుకుంటున్నాం, ఎలా?**

**జవాబు:** మీ ప్రశ్నలోనే సమాధానం ఉంది. బాబూజీ ఉన్నారని అనుకుంటే దివ్యత్వం అక్కడ ఉన్నట్లే. అక్కడ మీరు ఉన్నట్లే. మీరు వారి ధ్యానంలోనే (స్మరణ) ఉంటే ఆ దివ్యత్వంలో మునిగి బయటకు రాలేరు. అందుకుగాను బాబూజీనే జ్ఞాపకం ఉంచుకొని మిగతా జ్ఞాపకాలను వదిలిపెట్టండి. మీరు ఏ పనిచేస్తూ ఉన్నప్పటికి మీ హృదయం బాబూజీ మహరాజ్‌లోనే మునిగి ఉండేటట్లు చేయండి. ఇలా ఆలోచించటమే పద్ధతి.

సిట్టింగ్‌లో చాలా బాగుంది అని అనుకుంటారు. ఊహ అనేది ప్రాపంచికమైనది అనగా మానసికమైనది. ఫీలింగ్ అనగా అనుభూతి అనేది హృదయానికి చెందినది. ట్రాన్స్‌మిషన్ చాలా బాగుంది అని అనిపిస్తే అది మానసిక భావం. అలా కాకుండా ఆంతరికంగా ఆనందానుభూతి కలిగితే అది దివ్యత్వానికి చెందినదవుతుంది. అనగా మనసుతోటిది మాట అయితే, ఆంతరికానిది అనుభూతి అని గ్రహించాలి.

**ప్రశ్న: మన ప్రార్థనలో 'ఓ మాస్టర్!' అని సంబోధిస్తున్నామంటే దానిలోని 'మాస్టర్' శబ్దం గురువుకి చెందుతుందా, దివ్య పురుషునికి (డివైన్ పర్సనాలిటీకి) చెందుతుందా?**

**జవాబు:** బాబూజీ మనకు జీవితంలో సాక్షాత్కారమే లక్ష్యంగా నిర్ణయించి దానికోసం సాధన చేయమన్నారు. కనుక నీవు సాక్షాత్కారం కోసం భగవంతునితో సంబంధం కలిగి ఉంటావు. హైదరాబాదులో నన్ను ఒక అభ్యాసీ అడిగాడు "మేము చారీజీతో సంబంధం (కనెక్షన్) కలిగి ఉన్నాం" అని. అప్పుడు నేను "బాబూజీ అని చెప్పటం లేదు. కాని దివి నుంచి శక్తి దిగి వచ్చినపుడుగాని, ప్రార్థన వచ్చినపుడుగాని చారీజీ లేరు, మరెవ్వరూ లేరు. బాబూజీయే ఉన్నారు. దీనిని నీవు అంగీకరిస్తావు గదా! బాబూజీ మహరాజ్ దివ్యశక్తితో దివి నుంచి ఒక సంకల్పంతో దిగి వచ్చారు మన కోసం. అటువంటి దివ్య పురుషుడు దిగి వచ్చినపుడు మనకు లక్ష్యంగా చెప్పిన సాక్షాత్కారాన్ని మనకు అనుగ్రహించటమే కాకుండా అంతిమానికి కూడా తీసుకువెళ్తారు. కనుక మాస్టర్ అను సంబోధన దైవంతో సంబంధం కలిగి ఉంటుంది. మనకు సాక్షాత్కారం దానంతట అదే లభిస్తుంది" అని అన్నాను.

గురువు శబ్దం కూడా సరితూగినది కాదు. గురువు అనగా శిక్షణ నిచ్చేవారు. ప్రతి మిషన్‌లోనూ శిక్షణ అనేది ఉంటుంది. గురుతత్వాన్ని లేదా గురువు తనాన్ని (గురుడం) తుడిచి వేయటమే తమ ఉద్దేశ్యమని బాబూజీ తమ పుస్తకాల్లో వ్రాశారు. గురువు అనేది మన సహజమార్గ విధానంలో సరియైనది కాదు. బాబూజీ మహరాజ్ మన సహజమార్గ విధానంలో – ప్రార్థన, ప్రాణాహుతి, ధ్యానం, దశ నియమాలు, క్షాళన, సాధన వంటి వాటిని మనకు బోధించారు. గురువు అనగా టెక్నిక్ అనగా మెళకువ. దీనిని బాబూజీ మహరాజ్ మనకు తమ పరిశోధన ద్వారా బోధించారు. వారిని స్మరిస్తూ ప్రేమించటమే మన సంస్థలో ముఖ్యాచరణ. ఈ విధానంలో సాక్షాత్కారం కొరకైన మార్గంలో అనవసరమైనవి, అవరోధం కల్పించేవీ, అన్నీ తొలగించబడతాయి. భగవత్ సాక్షాత్కారం అనే దాని వివరం పొందినప్పటికీ అది ఈ గురువు అనగా టెక్నిక్ ద్వారానే. బాబూజీ, స్వయంగా తాను ఎప్పుడూ గురువు కోసం అన్వేషించలేదనీ, ఏ టెక్నిక్ అయితే తనను ఆ లక్ష్యానికి తీసుకువెళ్తుందో దాని కోసమూ, ఎవరైతే తనకు దానిని తెలియజేయగలరో వారి కోసమే అన్వేషించానని చెప్పారు. లాలాజీ గురించి చెబుతూ వారిని తండ్రి అనిగాని, తల్లి అనిగాని అనడానికి బదులు సహోదర భావంతో అలాగే అందరినీ సోదరులుగానే భావిస్తాను అని అన్నారు. చాలామంది అభ్యాసులు ప్రిసెప్టర్‌ను తమ తొలిగురువు అనిగాని, మాస్టర్ అనిగాని అంటూ ఉంటారు. ట్రాన్స్‌మిషన్ ప్రిసెప్టర్ ద్వారా వస్తుంది అంతవరకే! కనుక శక్తి అయినా, ముక్తి అయినా మనకు లభించేది ప్రాణాహుతి ద్వారానే కనుక, భావించదలచుకుంటే దానినే గురువుగా భావించుకోమన్నారు బాబూజీ. ఆ శక్తి అంతా వారిదే కనుక గురువు అనే మాటను విడిచిపెట్టి తల్లీ, తండ్రీ అన్నీ వారేనని భావించినట్లయితే అనంతమైన దానితో మీకు సంబంధం ఏర్పడుతుంది.

ఒకసారి బాబూజీని దర్శించటానికి కొంతమంది వచ్చారు. సహజమార్గ విధానాన్ని గురించి వివరించాక అది చాలా మంచిదని అంగీకరించారు. అది శక్తితో సుసంపన్నమైనదని గ్రహించారు. మన సిస్టమ్‌లో గురువు అనే భావననే తొలగించామని బాబూజీ చెప్పారు.

నేను స్థితుల గురించి, గురువు, సద్గురువు, డివైన్ పర్సనాలిటీ అంటే ఎవరో నేను నా పుస్తకాల్లో వ్రాశాను. నేను బాబూజీకి ఇలా వ్రాశాను: “మీరు నాకు దివ్యమార్గం ఇది, అది అని చూపినంతవరకు గురువు అనీ; సాక్షాత్కారాన్ని కలిగించిన తర్వాత సద్గురువు” అని వ్రాశాను. అనగా “మమ్మల్ని దివ్యదేశానికి తీసుకుని వెళ్ళి దైవంతో పరిచయం చేయగలవారు సద్గురువు. సత్ అనగా దైవం. గురు అనగా దివ్యదేశానికి (గాడ్లీ రీజియన్) తీసుకుని వెళ్ళగల టెక్నిక్, అది (ఆ మెళకువ) తెలిసినవారు సద్గురువు. కాని ఇప్పుడు నేను అలా వ్రాయలేను. ఎందుకంటే భూమా యొక్క శక్తికి నిలయమైన కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్) నుంచి మీరు దిగి వచ్చారు కనుకనే నన్ను అక్కడకు తీసుకుని వెళ్ళగలిగారు. అది సామాన్యులకు సాధ్యం కాదు కనుక మీరు డివైన్ పర్సనాలిటీ అని నా మనస్సులో మెరిసింది. కాబట్టి మీరు డివైన్ పర్సనాలిటీగా నాకు ఆరాధ్యులు”, అంటూ వ్రాశాను. వారు తమ శక్తితో నన్ను సెంట్రల్ రీజియన్ యొక్క కేంద్రానికి తీసుకుని వెళ్ళారు. నేను షాజహాన్‌పూర్ వెళ్తే, తల్లీ తండ్రీ సమస్తమూ నాకు వారే. ఈ విషయాలు ఇంతవరకూ ఎవరికీ తెలియదు. ఈ దివ్య రహస్యాలు వారు వ్రాయిస్తేనే వ్రాశాను. నాకేమీ తెలియదు. వారు అంతిమం నుంచి వచ్చారు కనుకనే అక్కడివరకు ఉన్న స్థితులు వారికి తెలుసు. నాకు మార్గదర్శకులు వారే, వారు ఎలా నడిపిస్తే అలా నడవటమే నాకు తెలుసు. బాబూజీ మహరాజ్ గురించి ఎవ్వరికీ ఏమీ తెలియదు, కాని అందరి సంగతీ వారికి తెలుసు.

అహం యొక్క పదహారు వలయాలు దివ్య దేశం (గాడ్లీ రీజియన్) యొక్క ముఖ్య కేంద్రంలో మునిగిపోతాయి. అది దాటించి మనల్ని కేంద్ర మండలం (సెంట్రల్ రీజియన్) యొక్క ముఖద్వారమైన సత్యపథ్‌వద్ద ప్రవేశపెడ్తారు. అక్కడ కొంచెంసేపు మాత్రమే నిలిపి ఉంచి కేంద్ర మండలంలో ప్రవేశించటానికి మనల్ని సిద్ధపరుస్తారు. మనల్ని వారు తమ ‘సంకల్పం’లోకి తీసుకోవటం ద్వారా ఇలా జరుగుతుంది. అక్కడి ప్రయాణాన్ని బాబూజీ ‘స్విమ్మింగ్’ అనగా ‘ఈదటం’ అని అన్నారు. అక్కడ నడవటానికి ఆధారం అనేది లేదు. కనుక వారి సంకల్పంతో ఈదటం (లేదా తేలిపోతూ ఉండటం) మాత్రమే ఉంటుంది. ఈ స్విమ్మింగ్ ప్రారంభమయ్యాక అక్కడ మన గుర్తింపు (ఐడెంటిటీ లేదా ఉనికి) కరిగిపోతూ ఉంటుంది. ఈ స్థితిలో మన గుర్తింపు లేదా ఉనికి పూర్తిగా కనుమరుగైపోతుంది. మన ఉనికి తన ఉనికిని గుర్తించలేకపోయినట్లు అవుతుంది. ఇది మనకు వారు ఇచ్చిన కానుక. ఈ స్థితి కలిగించటం ద్వారా వారు డివైన్ పర్సనాలిటీ అని గ్రహించటానికి నిదర్శనంగా తీసుకోవాలి. సమస్తమూ వారిదే, సమస్తమూ వారే కనుకనే ఇది సాధ్యపడింది. వారి యొక్క ఈ పని అనిర్వచనీయంగా ఉంటుంది. బాబూజీ “నేను ఒక పని చేయదలచాను” అన్నప్పుడు నాకు అర్థం కాలేదు. వారు నన్ను దివ్యదేశం యొక్క ముఖ్యకేంద్రంలో మునక వేయించి తీసినపుడు వారి శక్తి మహిమ నాకు తెలిసింది. అది దైవశక్తి కేంద్రం, అందులో మునిగి రావటం ఎవరికీ సాధ్యపడదు. ఇంక మన గుర్తింపును తమ సంకల్పంలోకి తీసుకొని వారు అంతిమం చేరటమే మన లక్ష్యంగా నిర్ణయించారు కనుక, మనల్ని అక్కడికి చేర్చటానికి తమ పని ప్రారంభిస్తారు. తమ సంకల్పంలో మనల్ని నిలుపుకుంటారు. మన వెంటే వారు ఉంటారు. తమ శక్తితో మనల్ని భూమాకు చేర్చుతారు. వారు లాలాజీతో తమ లక్ష్యం నెరవేర్చటానికి ఒక అవకాశం ఇవ్వమని అడుగుతూ

ఉండేవారు. వారు తీసుకున్న అవకాశంతో సాధించిన మహత్కార్యం ఇది. వారి శక్తి లేకుండా ఈ స్థితులు పొందటం నాకు ఎలా సాధ్యం కాదో, అలాగే వారి సంకల్పం, శక్తి లేకుండా వారు నాకు సాక్షాత్కరింపజేసిన వాటిని వ్రాయటం నాకు సాధ్యమయ్యే పని కాదు. ప్రతిదీ వ్రాయమని వారు నన్ను ఆదేశించారు. అంతేకాదు, వారు ఏమన్నారంటే "నీవు వ్రాస్తూ వెళ్ళు, వ్రాసేటపుడు నీకు అదేమిటో తెలియదు. వ్రాత ముగిశాక దానిని నీవు చదివినప్పుడు మాత్రమే నీకు అది అర్ధమవుతుంది" అని అన్నారు. అంటే వారి శక్తితోనే నా చేతిలో కలం వ్రాసింది. బాబూజీ అటువంటి దివ్యశక్తి సార్వభౌముడు కనుక వారికే అర్పించి మనల్ని మనం మరిచిపోవాలి (Forget yourself). ఈ మరుపుస్థితి అనేది మన సహజమార్గ విధానంలో మాత్రమే ఉంది. తన అహం లేదాఉనికిని మరిచిపోవటమనేది మరి ఏ విధానంలోను లేదు. ఎందుకంటే ఈ విధానమే కాదు, యావత్ సృష్టి, వారి సంకల్పం లోనిదే కనుక, మనం ఏదిచెప్పినా, దేన్ని అనుభూతి చెందినా, ఏది పొందినా వారితో అనుసంధానమై ఉంటేనే సంభవమవుతుంది. బాబూజీ చెప్పింది ఒక్కటే "నాతో సంబంధం కలిగి ఉండండి, మీ పని నేను చూసుకుంటాను" అని. వారు శక్తి సంపన్నులు, వారి సంకల్పంతో జరగనిదంటూ ఉండదు. వారిని విశ్వసించి, సమర్పితం కావటమే మన పని.

అభ్యాసుల మనసులో చాలా ప్రశ్నలు ఉదయిస్తూ ఉంటాయి. ఒకసారి ఒక అభ్యాసీ "మనం సిట్టింగ్ తీసుకుంటున్నపుడు చాలా తేలికైపోతాం. మన బరువు నంతటినీ బాబూజీ ఎలా తీసుకువెళ్తారు" అని అడిగాడు. అందుకు సమాధానంగా "బాబూజీ బలహీనులు కారు, వారు అత్యంత శక్తివంతులు" అని చెప్పాల్సి వచ్చింది. బాబూజీ యొక్క ప్రాణాహుతి శక్తికి మించినది లేదు.

బాబూజీ ఒకసారి చెప్పారు "నీవు మూడు జన్మల వరకైనా నన్ను మరచిపోలేవు. ఎప్పుడైనా ధ్యానం చేస్తావు" అని. మనం వదిలిపెట్టాలనుకున్నా వారు వదలరు, మనం మరచిపోయినా వారు మరచిపోరు. మంచివారు, చెడ్డవారు అనే ప్రసక్తే లేదు. ఒకే ఒక ఆలోచన, "నేను మీవాడను, మీరు నావారు" అనుకోవటమే సత్ఫలితాన్ని ఇస్తుంది.

సందేహాలు అన్నింటికీ సమాధానాలు వారి పుస్తకాల్లోనే వ్రాయబడి ఉన్నాయి. మీరు ఏదైనా ప్రశ్న అడిగినపుడు వారు నా ఎదుట ఉంటారు. ఆ ప్రశ్న నన్ను తాకదు. అది సూపర్ కాన్షస్ మైండ్ (అనగా అధిచేతనా మనస్సు)ను తాకి సమాధానం అక్కడి నుండే వస్తుంది. ఆ అధిచేతనా మనస్సు పొందశక్యం ఎలా అవుతుందంటే బాబూజీలో లయావస్థ పొందినప్పుడు అలా జరుగుతుంది. అక్కడి నుండి జవాబుకు అనుగుణంగా నోరు మెదపటం, చెవులు వినటం మినహా మన మెదడుతో (అనగా స్వంత ఆలోచనతో) చెప్పేదేమీ ఉండదు. ఏది వ్రాయాలన్నా వ్రాయలేము. ఈ అధిచేతనా మానసిక స్థితిని నేను 52 సంవత్సరాలకు పూర్వం పొందాను. నేను ఏది వ్రాయగలిగినా ఆ స్థితి మూలంగానే. అది ఒక దివ్య మనస్సు లేదా దేవుడు ఇచ్చిన మైండ్. బాబూజీ నాకు దానిని అలా ఇచ్చారు: "ఏదో ఒక దానిని నీలో ఉంచటం జరిగింది" అని బాబూజీ చెప్పారు. నేను ఈ స్థితి గురించి వారికి వివరించినపుడు "ఆ స్థితిని పొందినప్పుడు నీ ఆలోచన, మనస్సు పురోగతి చెంది ఏ మార్పునైనా చేయగలవు. అది వాస్తవమైన స్థితియై ఉండాలి" అని.

అభ్యాసీ ఒకరు “బాబూజీ మహరాజ్ మీతోనే ఉన్నారు, మీ ద్వారానే పని చేయిస్తారు (with you, work through you) అని ఎలా చెప్పగలరు” అని చక్కని ప్రశ్న వేశారు.

దివ్య పురుషులు మనకోసం భూమి మీదకు దిగి వస్తారు. బాబూజీ అంతిమం (అనంతం) నుంచి దిగి వచ్చారు. మనం వారి శరీరాన్ని చూస్తున్నాం. భగవంతుడు అంతటా ఉన్నాడు. దివ్య పురుషుని రూపంలో అవతరించవలసి వచ్చినపుడు ‘వారి’ శరీరాన్ని ప్రకృతియే రూపొందిస్తుంది. ప్రకృతి అంతటా ‘వారు’ ఉన్నారు. ‘వారి’ని స్మరించినపుడు, ‘వారి’ యొక్క సామీప్యతను మీరు పొందగలిగినపుడు ఒక్క కస్తూరియే కాదు, ఎవ్వరైనా చూడగలుగుతారు. మీరు ఆ స్థితికి చేరినప్పుడు మీకు వారు అన్నీ ఇస్తారు. అప్పటి మీ స్థితియే దైవం అంటే వీరేనని తెలియజేస్తుంది, మీరు దర్శించగలుగుతారు.

“లాలాజీ, స్వామి వివేకానంద, శ్రీకృష్ణ భగవాన్, కబీరు వంటి వారు విముక్తాత్మలయ్యాక వారు విధి విధానాల సూచనలు ఎలా ఇస్తున్నారు” అని చాలా మంది ప్రశ్నిస్తారు. విముక్తాత్మలు (లిబరేటెడ్ సోల్స్) సూచనలు ఇవ్వలేని మాట వాస్తవమే. కాని కొన్ని ఆత్మలు, దివ్య పురుషులు భూమి మీదకు వచ్చినపుడు విధి విధానాలు చెబుతారు (డిక్టేట్ చేస్తారు). శ్రీకృష్ణుని కాలంలో చాలా మంది ఋషులు భూమి మీదకు వచ్చారు. అవతార పురుషులు అవతరించబోయే ముందు వీరు సావధానంగా ఉండి వారిని సేవించటానికి జన్మ తీసుకుంటారు. ఆ విధంగా జన్మ తీసుకుని వారిని సేవించి ఆనందం, పరమానందం పొందుతారు. డివైన్ పర్సనాలిటీకు సేవచేసే నిమిత్తం విముక్తాత్మలు వారితో సంబంధం కలిగి ఉంటారు. బాబూజీ ఇంటిలో దొంగలు ప్రవేశించినపుడు లాలాజీ ఆ విషయాన్ని బాబూజీకి చెప్పి హెచ్చరించిన విషయం మీకు తెలుసు. ఇదొక ఉదాహరణ!

ఒక అభ్యాసీ తనకు సిట్టింగ్‌లో వచ్చిన దానిని ఇలా వివరించాడు: “ఒక ఎత్తైన ప్రదేశం, ఏటవాలుగా ఉన్న దారిలో, బాబూజీ తమను అనుసరించమని చెప్పారు. నేను వారిని అనుసరించి నడుస్తున్నాను. కొంత దూరం వెళ్ళాక ఆగి వెనుదిరిగి, ‘నీవు అలసిపోలేదా’ అని అడిగారు. అప్పుడు నేను ‘మీరు నాతో ఉన్నారు, నేను మీతో ఉన్నాను’ అని చెప్పాను.” దానికి నేను ఇలా చెప్పాను: దీనినిబట్టి నీ పురోగమనం సాఫీగా జరుగుతున్నట్లు భావించు. వారిని అనుసరించి నీవు నడుస్తున్నావంటే అది మంచి స్థితి. ఆ స్థితికి చేరాక లయావస్థ కలుగుతుంది. నీవు నీ యొక్క అనుభూతిని చెప్పిన దానినిబట్టి అది నీ యొక్క స్థితికి అద్దం పడుతుంది. అంటే నీవు వారినే అంటిపెట్టుకుని పురోగతి చెందుతున్నట్లు తెలుసుకోవాలి. ఒక స్థితికి చేరాక, ముందు ఉన్న స్థితి గురించి ఆలోచించాలి. ఇంకా ముందుకు తీసుకుని వెళ్ళటానికి ‘త్వరగా రా’ అని బాబూజీ ప్రోత్సహిస్తారు.

బాబూజీ తమ పుస్తకాల్లో చాలాసార్లు చెప్పారు: “అనుభూతి అనేది హృదయం యొక్క భాష” అని. ఎందుకంటే, మీకు అనుభవమవుతున్న మార్పు దివ్యశక్తి వలన కలుగుతుంది కనుక. ఆ మార్పు మీకు దివ్యశక్తియే తెలియజేస్తుంది. మీరు దానితో సంబంధం కల్పించుకుంటారు. అప్పుడు మీరు అనుభూతి చెందటమేకాని చేసేది ఏమీ ఉండదు, అనగా మీరు వారిని సమీపిస్తున్నట్లు భావం.

53 సంవత్సరాలకు పూర్వం నేను బాబూజీకి "నేను అంతటా ఉన్నట్లు అనుభూతి చెందుతున్నాను" అని నా స్థితి గురించి వ్రాసినపుడు వారు ఏమి జవాబిచ్చారంటే, "నీవు అంతటా ఉన్నట్లు అనుభూతి చెందటం మంచిదే. నీ రూపం నిలిచే ఉంటుంది. నీవు మాత్రం అంతటా ఉన్నట్లు అనుభూతి చెందుతావు" అని వ్రాశారు. ఈ స్థితి నాలో లయమైనప్పుడు నేను మాట మార్చవలసి వచ్చింది. ఎందుకంటే, నేను అంతటా వ్యాపించిపోతున్నట్లు అయ్యింది. భౌతిక జగత్తులో రూపం ఉన్న మూలంగా నేను ఇలా అనుభూతి చెందుతున్నానని వ్రాయగలను, చెప్పగలను. ఎప్పుడైతే రూపం మాయమైపోతుందో అప్పుడు ఎదుట ఉన్న తల్లీ, తండ్రీ అందరూ రూపం లేనివారుగా ఒక్కటిగా అయిపోతారు. నేను వ్రాసిన గీతంలో "షాజహాన్‌పూర్‌లో బాబూజీ నా ఎదుట కుర్చీలో కూర్చుని ఉన్నప్పటికీ వారుగాని, కుర్చీగాని కనిపించటం లేదని, వారిని చూడాలని నాకు కోరికగా ఉంది" అని చెప్పినపుడు, నన్ను తీసుకుని వెళ్ళి అక్కడ ఉంచినట్లు, వారిని మానవ రూపంలో దర్శించగలిగినట్లు వ్రాశాను. బాబూజీ యొక్క సహజమార్గం అటువంటిది. స్థితులన్నీ వాటంతట అవే కలుగుతూ ఉంటాయి. వారి మీదే శ్రద్ధ నిలిపి, వారిని అంటి పెట్టుకుని ఉంటే అంతా మీదే అవుతుంది.

ఒక సన్నని దారి (లేన్) ఉంటుంది. దాని తర్వాత విస్తరణ ఉంటుంది. అలా ఉన్న ఆ మధ్య భాగమే కాస్మిక్ రీజియన్. మనం ధ్యానం ప్రారంభించాక అది తేటతెల్లం (క్లియర్) అవటం ప్రారంభమవుతుంది. గతంలో ఆ కాస్మిక్ రీజియన్‌లో ప్రవేశించటమనేది చాలా దుర్లభంగా ఉండేది. బాబూజీ మహరాజ్ మన కోసం భూమి మీదకు, ఆ మార్గం నుంచే అంతిమం నుండి దాని శక్తితో దిగి వచ్చారు. కనుక ఆ మార్గం ఏర్పడి సుగమం అయ్యింది. అంతిమం నుంచి బాబూజీ మూలంగా ఏర్పడిన ఆ మార్గం భూమిని తాకి మనం ప్రయాణించటానికి సులభమైపోయింది. మరో విషయం ఏమిటంటే, అహం యొక్క 5 వలయాలు దాటిన తర్వాత మనం, ఎదురుగా ఉన్న దైవాన్ని గుర్తించటం జరుగుతుంది. అప్పటివరకూ మనం దైవం అంతటా ఉన్నాడని అనుకుంటూ ఉంటాం, అది కూడా ఎక్కడో దూరంగా ఉన్నాడని. ఎప్పుడైతే మనం అహం (మాయ) యొక్క 5 వలయాలు దాటి వెళ్తామో అప్పుడు దైవం దగ్గరగా ఉన్నాడని అనిపించటం, ఆ దైవాన్ని గుర్తించటం జరుగుతుంది. ఇదే మొట్టమొదటగా చూడటం కనుక లీలగా చూడటం జరుగుతుంది. ఆ తర్వాత దైవసాక్షాత్కారం యొక్క స్థితి ఏర్పడి, తర్వాత మనం గుర్తించటం సునాయాసమవుతుంది.

**ప్రశ్న: (హార్ట్ రీజియన్) హృదయ మండలంలోకి చేరుకున్నట్లు ఎలా తెలుసుకోగలం? అక్కడి నుండి ప్రోగ్రెస్ వేగంగా జరుగుతుందా?**

**జవాబు:** నీకు ఎప్పుడైతే సామీప్యతానుభవం కలుగుతుందో, అప్పుడు నీవు అక్కడ ఉన్నట్లు భావించుకోవచ్చు. ఇంకొక రకంగా చెప్పాలంటే, మనల్ని మనం మరచిపోతున్నకొద్దీ వారికి దగ్గర అవుతాము.

కొందరు "బాబూజీ రూపం మీద ధ్యానించ వచ్చా?" అని అడుగుతారు. బాబూజీ ఆ పద్ధతిని నిషేధించారు. ఎందుకంటే, అది నిలకడగా ఉండదు. వారు మనతో కలసిమెలసి ఉంటారు. మనమూ వారితో కలిసి వారి వెంటే నడుస్తూ ఉంటాం. ప్రోగ్రెస్ దానంతట అదే అవుతుంది. వారు విశ్వం అంతటా వ్యాపించి ఉన్నారు. విశ్వమంతా వారిదేనని చెప్పారు. అంటే ప్రకృతియే వారి పూర్ణశరీర రూపమవుతుంది.

మీరు కళ్ళు మూసుకుని ధ్యానంలో కూర్చుంటారు. వారి రూపాన్ని ఊహించుకుంటారు. మీ లోపలికి దృష్టి మరల్చి ధ్యానం చేస్తారు. కాని కొద్దిసేపటికే వారి రూపం మీ దృష్టిలో ఉండదు. కేవలం బాబూజీ అనే ధ్యాస మాత్రమే ఉంటుంది. అనగా వారి ఉనికి మాత్రమే ఉంటుంది. ఇది మీ అందరికీ అనుభవమైన విషయమే. ఎందుకంటే మీరు బాబూజీ రూపంతో అంటి పెట్టుకుని లేరు. కాని వారి దివ్యత్వంతోనే సంబంధం కలిగి ఉన్నారు. ప్రార్ధన అనేది ఒక సాధనమే కాని అంతిమం కాదు. వారివైపు ఆకర్షితులు కావటానికి మొట్టమొదట రూపం చూడనిస్తారు. తర్వాత రూపం కరిగిపోయేటట్లు చేసి సాక్షాత్కారం కలిగిస్తారు. "ధ్యానంలో మాస్టర్‌ను చూడటం మన లక్ష్యం కాదు" అని బాబూజీ చెప్పారు. అంతిమం నుంచి వచ్చిన 'వారి' శక్తి గురించి 'వారి' ధ్యేయం గురించి ఆలోచించాలి కాని 'వారి' రూపం గురించి కాదని అర్థం చేసుకోవాలి. నిజంగా భగవంతునికి రూపం లేదు. దానిని మనం కల్పించుకుంటాము, అంతే. ఆ దివ్యకార్యం ఎలా ఉంటుందో చూడండి. మనం షాజహాన్‌పూర్ వెళ్తాం. బాబూజీని అనగా వారి రూపాన్ని చూస్తాము. తిరిగి వచ్చిన తర్వాత వారి రూపం అక్కడే ఉంటుంది కాని మన హృదయంలో వారు ఉంటారు.

**అభ్యాసీ: అయితే ఒక రూపం కనిపించి తర్వాత కరిగిపోతుంది.**

**జవాబు:** నీవు ఏ రూపం చూస్తావు? నీవు చూసేది వారి ఉనికిని మాత్రమే. నేను చాలా కాలం క్రితం మద్రాసు వెళ్ళినపుడు సభలో ఒక ఉపన్యాసకుడు " "నా భగవంతుడు మద్రాస్‌లో ఉన్నాడు. నా గురుదేవులు మద్రాస్‌లో ఉన్నారు. ప్రతిరోజు వెళ్ళి నేను వారిని కలుసుకుంటాను" అని సంబోధించాడు. నేను నా అవకాశం రాగానే ఇలా అన్నాను: "మీది చాలా సులువైన మార్గం. రైలు టికెట్ కొనుక్కోవడానికి డబ్బులు ఉంటే చాలు. మీరు మాస్టర్, దైవం వద్దకు చేరగలరు. మీకు మీ భగవంతుడు దొరుకుతాడు. కాని అది మాకు చాలా కష్టమైన పని. మేము బాబూజీ కోసం వెదుకుతున్నాం. ఇక్కడ మాత్రం జీవితాంతం 'నేను' అనే దానిని వధించాలి. అహంను సంహరించాలి. అహం అనేది పూర్తిగా కరిగిపోవునట్లు చేయాలి. ఏ రోజునైతే అహం అనేది ఉండదో, పూర్తిగా జీరో అవుతుందో, ఆ రోజునే 'బాబూజీ' లభిస్తారు" అని అన్నాను.

అహం (నేను) అనేది లోపల ఉంటుంది. కాని ఎవరైనా ధ్యానం ఆపండి అన్నపుడు మీరు కళ్ళు తెరుస్తారు. అప్పుడు కూడా మీ లోపల ఫీలింగ్ అనుభూతి ఉంటుంది. సమయం వచ్చినపుడు ఆంతరికంలో ఉన్నది బాబూజీ మహరాజ్‌యే అని గుర్తిస్తారు.

**ప్రశ్న: పరిశోధన ఎలా చేశారు?**

**జవాబు:** వారు చేసిన పరిశోధన ఇతరులు ఎవ్వరూ చేయలేదు. మన కోసం వారు చాలా సహజమైన విధానాన్ని రూపొందించారు. వారు పరిశోధించి చెప్పినది అంతా వాస్తవం. మనం అంతర్ముఖం కావాలి. కాని మనం ఇంకా అందుకు ప్రయత్నించటం లేదు. అంతర్ముఖం కావటం అంటే భక్తి కలగాలి, పెరగాలి. మీరు అంతరంగంలో ధ్యానం చేస్తున్నారంటే మీరు క్రమంగా లోపల జీవించబోతున్నారన్న మాట. ఇదే వారి పరిశోధన. ఇదే సహజమార్గం, సరళమైన మార్గం. సహజమైనది ఎలా అంటే నిచ్చెన వేస్తారు. దారి

చూసుకుంటారు, పైకి వెళ్ళతారు. ఆ మార్గాన్ని ఎవరూ తయారుచేయలేదు. అది సహజంగా ఏర్పడింది. అంతిమం నుంచి వచ్చిన శక్తి సహజమైనది, కాని సరళమైనది కాదు కనుక దానిని సాధన ద్వారా పొందలేము. కాని బాబూజీ మహరాజ్ యొక్క ప్రాణాహుతి సహజమైనది, సరళమైనది.

బాబూజీ మహరాజ్, మానవుణ్ని సంపూర్ణ మానవునిగా తయారుచేయాలనే దివ్య సంకల్పంతో వచ్చారు. ఇంతకుపూర్వం వచ్చిన అవతార పురుషులు రాముడు, కృష్ణుడు అటువంటి సంకల్పంతో రాలేదు. ప్రత్యేకమైన పనిని నిర్వహించటానికి మాత్రమే వచ్చారు. రాముడు, కృష్ణుడు పవర్‌తో వచ్చారు. ఆ పవర్‌తో వారు ఉద్దేశించిన వారిని సంహరించారు. కాని వారికి ఒక మిషన్ అంటూ లేదు. బాబూజీ అత్యంత శక్తితో వచ్చారు. మనల్ని ఉద్ధరించటానికే వచ్చారు. అంటే దైవం మన ఎదుట ఉన్నారన్న మాట. మనం పైకివెళ్ళటానికి వారు మెట్లు నిర్మించారు. ఇంక మనం ముందుకు సాగాలి. సహజమార్గం అంటే ఇదే; సహజమైనది, సరళమైనది. సహజమార్గ విధానం మైండ్‌కు అనగా బుద్ధికి కష్టమనిపిస్తుంది కాని హృదయానికి మాత్రం చాలా సులభమైనది. ఎందుకంటే, అది అనుభూతి ద్వారా తెలుస్తుంది. ఒకరు బోధిస్తే అర్థమయ్యేది కాదు. దైవంలో ఆకర్షణ ఉంది. శక్తి ఉంది. ఇద్దరి మధ్యా ఏదో తెర ఉన్నట్లు అనిపిస్తుంది. కాని మనలో శక్తి లేదు. ఎప్పుడైతే మనం ఆకర్షితులమై అటువైపు నడుస్తామో, అప్పుడింక ఏ తెరచాటూ ఉండదు, భ్రమా ఉండదు.

ఒక సందర్భంలో ఒక మంచి వక్త మాట్లాడుతూ కవితా ధోరణిలో "సాగరం అనేది సంసార్ (ప్రపంచం) అయినట్లయితే కాగితపు పడవ అనేది దేహం అని దృష్టిలో పెట్టుకుంటే, సాగరంలో కాగితపు పడవ సాఫీగా సాగిపోతుంది. కాని ఈ భౌతిక జీవితం చాలా కష్టమైనది, సాధన చాలా శ్రమయైనది" అని అన్నాడు. అపుడు నాకు అనిపించింది సాగరంలో కాగితపు పడవ సాఫీగా ఎలా సాగిపోతుందా అని. అందుచేత భవ సాగరం దాటటానికి దైవంపట్ల కేవలం విశ్వాసమే ముఖ్యం. అది పెంచుకుని వేగంగా దాటవచ్చు.

సహజమార్గ విధానం చాలా సరళమైనది. అంతకంటే సులభమైనది, బాబూజీ మహరాజ్ దర్శనం! ఎందుకంటే, వారు మనలోనే ఉన్నారు. వారిని మీరు ఎలా చూడాలి అంటే, మీ దివ్య నేత్రంతో మీలోన చూడండి. వారు కనిపిస్తారు. కనుక ఈ స్థితి మీరు పొందితే వారిని చూస్తారు. వారు ఉన్నారు అని మీరు చెప్తారు. వారు మీ ఎదుటనే ఉంటారు. ఈ విధానంలోని అందం ఇదే. అపుడు మీరు స్వయంగా వారు మన వారేనని సహజంగానే చెబుతారు.

**ప్రశ్న: ఆ ఫీలింగ్‌లో అలా చూస్తే ఏమీ కాదా?**

**జవాబు:** చాలా లిమిటేషన్ (పరిమితి) ఉంటుంది. ఏదైనా దృశ్యాన్ని తీసుకొని వచ్చి ఎదుట నిలబెట్టితే భరించడం కష్టం. అపుడు ప్రార్థించాలి. లాలాజీ సాహెబ్ ప్రార్థించారు –ఒకే ఒక్కసారి బాబూజీ రూపం చూపించమని. అపుడు వారి ముందు ప్రత్యక్షమైన రూపం చూసి వారు భరించలేకపోయారు. అలా ఎందుకంటే, భౌతికత్వం లేదా మాయ దివ్యత్వాన్ని భరించలేకపోవటమే. మానవ శరీరంతో కాకుండ వారిని ఆ శక్తి రూపంలో చూస్తే తట్టుకోలేరు. అందుచేత ఏ సౌందర్యమైతే నీకు దర్శనమైందో దానిని

నీ ఎదుట నుంచి తొలగిపోకుండా చూసుకోవాలి. అపుడు అందులో ఆకర్షణ ఉంటుంది. నాకు బాబూజీని చూడటానికి షాజహాన్‌పూర్ వచ్చేయ్ వచ్చేయ్ అని పిలుస్తున్నట్లు ఉండేది. ఇప్పుడైతే ఆ సౌందర్యం నా ఎదుట నుంచి తొలగిపోదని అనిపిస్తుంది. ఇదే వాస్తవికత (రియాలిటీ).

బాబూజీ మహరాజ్ గురించి ఎవరూ తెలుసుకోలేరు. నేను తెలుసుకోగలిగిందల్లా ఇంతే – వారు నాకు తెలియజేసినది అంతా నేను వ్రాయాలి అందరి కోసం. అందుకు వారు చెప్పదలచింది ఏమిటో నా ముందు ఉంచుతారు. వ్రాయటానికి మాటలు కూడా వారే ఇచ్చి నా చేత వ్రాయిస్తారు. వారు చెప్పేది అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఒకసారి బెంగుళూరులో ఒక సంఘటన జరిగింది. డాక్టర్ వరదాచారిగారు, చారీజీ, రాజుగారు, బాబూజీ అందరూ ఉన్నారు. బాబూజీ ఆలోచనలో ఉన్నారు. వరదాచారిగారు అడిగారు 'ఏమిటి' అని. అపుడు బాబూజీ అన్నారు – బిటియా కస్తూరికి పాయింట్ తెరచుకుంది. అందుచేత నేను ఆలోచిస్తున్నాను –అని. ఆ విషయం నాకేమీ తెలియదు. నేను రాత్రి నిద్రించి ఉదయం లేచేసరికి వరదాచారిగారు వచ్చి "నీకు ఏమి ఫీలింగ్ వచ్చింది" అని అడిగినపుడు, నాలో కలిగిన ఫీలింగ్‌ని (అనుభూతిని) నేను ఏమి వ్రాసుకున్నానో దానిని చెప్పాను. అప్పుడు నాకు ఆ సంగతి చెప్పారు. ఆ పాయింట్ తెరచుకొని దానిని దాటేటప్పుడు ఆత్మ వీడిపోయి ప్రాణాపాయం కలుగుతుంది. కనుక బాబూజీ నన్ను తమ హృదయంలో దాచుకుని దానిని దాటించారు. వివేకానందుడు 35 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు ఇదే సంఘటన జరిగింది. "ఆ సమయంలో నేను ఉండి ఉంటే అతడి ఆత్మను కాపాడి, దేహం విడిచిపోనిచ్చే వాడిని కాదు" అని బాబూజీ అన్నారు. వరదాచారిగారు బాబూజీని పవర్ (శక్తి)ని ఎందుకు ఇచ్చారని అడిగితే పవర్ పోతే ఆత్మ కదల్లేదని చెప్పారు. వారు చేసిన పరిశోధన సమస్త మానవాళి కోసం ఈ విధంగా ఉంది. మనం నిశ్చింతగా నిద్రిస్తున్నాం. వారు నిద్రించకుండా నిశిరాత్రి కూడా శ్రమిస్తున్నారు. వారు ఏ విధంగా ప్రయోగం చేస్తారో మనకు తెలియదు. ప్రతిరోజు ఉదయం ధ్యానంలో కూర్చోగానే ఏదో స్వచ్ఛత, ప్రశాంతత అనుభవమవుతుంది, వారు మనకు అనుగ్రహించిన దాని మూలంగా.

**ప్రశ్న: ఒక్కొక్కసారి ధ్యానంలో నాకు సువాసన అనుభూతికి వస్తూ ఉంటుంది, అదేమిటి?**

**జవాబు:** ఆ సువాసన అగరుబత్తి వలన కలిగింది కాదు. నీవు దైవ సామీప్యతను పొందుతున్నట్లు అది సంకేతం. ఆ సువాసన పూల వాసనతోగాని, అగరువత్తుల వాసనతోగాని పోల్చటానికి వీలుపడదు. అది దివ్య సుగంధం! దానికి సరితూగేది ఏదీ ఉండదు! ఈ అనుభూతి అందరికీ అవసరం లేదు.

**ప్రశ్న: బాబూజీ ఏమి చేస్తారు, ఎలా చేస్తారు?**

**జవాబు:** మనం ఒక విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. మనం మన సాధన మీద ఆధారపడకుండా వారి కృప మీద ఆధారపడటం అలవర్చుకోవాలి. మనలో "ధ్యానం చేయలేదు, అది చేయలేదు, ఇది చేయలేదు" అనే వ్యధ ఉన్నట్లయితే వారి నుంచి పొందనున్న కృపలో కొంతభాగం తగ్గిపోతుంది. మరచిపోయాను అని అనుకున్నప్పుడు "నేను మీ శరణు పొంది ఉన్నాను" అని హృదయంతో చెప్పుకోవటం మంచిది. మీరు ఒక

టీచర్ అనుకుందాం. ఒక విద్యార్థికి గ్రేస్ మార్కులు వేసి పాస్ చేస్తారు. అలాగే వారు కూడా మనకు వారి గ్రేస్ (కృప)తో మేలు చేస్తారు.

మెహర్‌బానీ అంటే దయకు, గ్రేస్ అంటే కృపకు కొంత వ్యత్యాసం ఉంది. లోతుగా ఆలోచిస్తే దయ అనేది అర్థించటంలో వచ్చేది, కాని కృప అనేది అయాచితంగా వచ్చేది అనుకోవచ్చు. “నేను మీ ఎదుట కూర్చున్నాను” అని మనం అనుకుంటే వారంతట వారు ఇవ్వక తప్పదు. అభ్యాసీలు ఎవరైనా బాబూజీతో “మీరు మాపట్ల చాలా (మెహర్‌బానీ) దయ చూపారు” అని అన్నపుడు బాబూజీ వారితో “మీరు దయతో నా వద్ద శిక్షణకు వచ్చారు. నేను మీకు సేవ చేయటానికే వచ్చాను. నేను లాలాజీ కృపను కోరుకుంటాను” అనేవారు. ఈ విధంగా సూక్ష్మ అంతరం ఉంటుంది మాటల్లో. బాబూజీ మనకు ఇవ్వటానికే వచ్చారు కాని మన నుంచి ఏమీ ఆశించి కాదు.

గురుసేవ అనే దానిని వారు నిరసించేవారు. అలా సేవించబడు వారిని గురుపశువు అన్నారు. అంటే అలాంటి వారు గురువు అనబడే వారికి ఒక విధమైన బానిసలుగా అయిపోతారు. వారికి స్వేచ్ఛ ఉండదు. మన ఆత్మ కోరుకునేది బంధనాల నుంచి విముక్తి పొందాలని కదా! నిజమైన గురువు బంధనాల నుంచి విముక్తి కలిగించి ముక్తిని కలిగిస్తాడు.

ఉన్నత స్థాయికి చేరినప్పుడు కూడా కోపం వస్తుంది. అది దైవీకమే. అయినా దానిని సహనంతో సమతుల్యం చేయాలి. ఒక డివైన్ కండిషన్‌లో ఉన్నప్పుడు కోపానికి గురైతే కండిషన్‌కు భంగం కలుగుతుంది. దానిని మళ్ళీ యథాస్థితికి తీసుకు రావటానికి శ్రమ పడవలసి వస్తుంది. అందుచేత అటువంటి పరిస్థితి కలిగినపుడు పట్టీపట్టనట్లుగా ఉండాలి. సహనం వహించాలి. స్థితికి భంగం కలిగి పట్టుతప్పినపుడు బాబూజీని స్మరించి మళ్ళీ ఆ స్థితి కోసం తపించాలి. మీ హృదయం దాని కొరకు తల్లడిల్లుతుంది కూడా.

ఎవరైనా మన గురించి చెడుగా అన్నా, మనం ఏదైనా చెడుగా విన్నా, వెంటనే స్పందించి దానికి ప్రతిగా ఏమీ అనకూడదు. ఒకవేళ మన సంకల్పంతో కాని, మాటల్లో కాని ఏమైనా చెడు లేదా కీడు ఉంటే అది వెంటనే కాకపోయినా నిదానంగానైనా దాని పరిణామం ఉంటుంది. అందుచేత సహనశీలత లేదా సహిష్ణుతను వెంటనే సాధించలేకపోయినా క్రమంగానైనా అలవర్చుకోవాలి. మన సిస్టమ్‌లో తపస్సు లేదన్నారు బాబూజీ. మనకు తపస్సు అంటే జీవన విధానమే.

**ప్రశ్న: బెహన్‌జీ! బాబూజీ ఎవరినైనా, ఎందుకైనా కోపగించటం మీరు చూశారా?**

**జవాబు:** బాబూజీని ఈశ్వర్ సహాయ్‌గారు “మీకు ఎప్పుడూ కోపం రాదా!” అని అడిగినపుడు నేనూ అక్కడే ఉన్నాను – వెంటనే వారు పకపక నవ్వారు. అప్పుడు ఆ సన్నివేశం చూసి ప్రకృతి అంతా ఆ నవ్వుతో నిండి పోయిందా అనిపించింది. వారు ఇతరుల మనస్సు గాయపరిచేలా ఎప్పుడూ మాట్లాడే వారు కాదు. అలా నేను ఎప్పుడూ చూడలేదు. వారి సహనం కూడా మనకు ఆదర్శమే.

నేను ఎప్పుడూ లాలాజీ సాహెబ్ గురించి తెలుసుకుంటూ ఉంటాను. బాబూజీ మహరాజ్ నాకు సర్వస్వం. నేను కేంద్ర మండలం ముఖ్య కేంద్రం యొక్క మొదటి సర్కిల్ (వలయం)కు చేరేసరికి నా

ఆలోచనలు అన్నీ కడిగివేసినట్లు అయి, ఒక నూతన ఆలోచన కలిగింది. ఇక్కడ అంతిమం యొక్క అంశ లేదా భాగం అంటే బాబూజీ అని తెలుసు. ఒక్కసారిగా నేను లాలాజీ సాహెబ్ పేరు మరచిపోయినట్లయ్యింది. బహుశా నేను ఎప్పుడూ ఇక్కడే ఉండటం వలన అనుకుంటాను. ఇది యదార్ధం. నేను ఆశ్చర్యపోయాను. లాలాజీ సాహెబ్ అంతిమం నుంచి బాబూజీని దిగి రావాలని ప్రార్ధించారు. వారు మరుగునబడ్డారు. బాబూజీ మహరాజ్ అంతిమం నుంచి దిగి వచ్చారు. ఇక్కడ 'వారి' ప్రేమ తెలియటం లేదు. లాలాజీ సాహెబ్ ప్రేమ కనిపించింది. లాలాజీ సాహెబ్ ఈ ప్రపంచంలోకి అంతిమం నుంచి శక్తిని సమస్త మానవాళి సాక్షాత్కారం పొందేటందుకు అవకాశం కలగటానికి దిగి రావాలని ప్రార్ధించారు. కనుక ఆ ఆదిశక్తి నుంచి అనగా సృష్టిశక్తి నుంచి ఎవరైతే ఆ శక్తితో దిగి వస్తారో ఈ సృష్టిని వారే నిర్వహించగలుగుతారు. ఇది ఒక స్థితిగా నాకు తోచింది. ఏమి వ్రాశానో నాకు తెలియదు. నేను అక్కడికి చేరినపుడు మాత్రమే నా గుర్తింపు (ఐడెంటిటీ) ఉంది. ఇది తురీయావస్థ (పార్షద్). దీనిని ఎవరైనా పొందవచ్చు.

**ప్రశ్న: ఆ శక్తిని ఎవ్వరూ ఇప్పటివరకు ఇక్కడకు ఎందుకు తీసుకురాలేదు?**

**జవాబు:** అవసరం కలిగినప్పుడే తేవటం జరుగుతుంది.

**ప్రశ్న: ఆ అవసరం ఏమిటి?**

**జవాబు:** శక్తి దిగి రావాలని ప్రకృతికి ఆలోచన కలిగినప్పుడు. ఆలా ఎప్పుడు అంటే, ప్రకృతిలో సమతుల్యం లోపించినప్పుడు, అలాగే మానవ జీవితంలో కూడా క్రమబద్ధత లోపించినప్పుడు, దైవాన్ని మరచిపోవటం వలన గుర్తింపజేయటానికి, ప్రకృతిలోని అలజడి (డిస్టబెన్స్) నివారించటానికి – ప్రకృతియే వారి రాక కోసం అర్ధించినప్పుడు శక్తి దిగి రావటం జరుగుతుంది. ఇదే దీని సారాంశం.

శక్తి యొక్క ముఖ్య కేంద్రమే కేంద్ర మండలం. ఇక్కడ (ఈదటం) స్విమ్మింగ్ మాత్రమే ఉంటుంది. మనకు శక్తి ఉండదు. ఎవరో లాక్కుని వెళ్తున్నట్లు ఉంటుంది. ఇక్కడ మనల్ని మునక వేయించి పైకి లేపుతారు. ఇప్పటి వరకు ఉన్న ఐడింటిటీ (గుర్తింపు) కాస్తా మాయమైపోతుంది. గుర్తింపు తన గుర్తింపును గుర్తించలేనట్లయిపోతుంది. ఈ స్థితిలో నా గురించి నాకు ఏమీ తెలియదు. కొన్ని కుదుపులు కలిగినప్పుడు మాత్రమే నేను ఇక్కడ జీవిస్తున్నాను అని అనిపిస్తుంది. బాబూజీ మహరాజ్ మూలంగానే మనం భౌతికంగా జీవిస్తాం. ఈ స్థితిలో (ఐడెంటిటీ) గుర్తింపు లయమైపోతుంది.

ఇది పార్షద్ అనగా తురీయావస్థ. దీని తర్వాత మహాపార్షద్ అనగా తురీయాతీత అవస్థ ఉంటుంది. ఈ తురీయాతీత స్థితి తర్వాత ఇంక వ్రాయటమంటూ ఉండదు. పార్షద్ అనేది సెంటర్ (కేంద్రం) యొక్క ముఖద్వారం. దీనినే సత్యపథ్ అంటాము. ఇక్కడ బాబూజీ మహరాజ్ నన్ను వేచి ఉండేటట్లు చేశారు. ఇంతలో ఎవరో లోపల ఉండి చాలా సూక్ష్మత్వం (very lighter) చెందేటట్లు నన్ను చేశారు. అప్పుడు నేను దైవ క్షేత్రంలో ప్రవేశించినట్లు అయింది. ఇది చాలా ముఖ్యశక్తి కలిగిన ప్రదేశం. అహం యొక్క పదహారు వలయాలు ఇందులో లయమైపోయాయి. ఈ దైవ క్షేత్రంలోకి తీసుకువచ్చాక

ఈ శక్తిలో మునక వేయించారు. అపుడింక శక్తి యొక్క అనుభూతి ఉండదు. శక్తి లేకుండా పురోగమనం సాధ్యం కాదు. ఇక్కడ ఉన్న మాయా మండలం యొక్క ఆరు వలయాలలో ఐదింటిని దాటాక ఇంక దాని ప్రభావం ఉండదు. స్వతంత్రమైపోవటం జరుగుతుంది. మాయ అనగా విస్తృతం కావటం. మీరు కావాలని కళ్ళు తెరచినట్లయితే మీకు ఏమీ కనిపించదు. ఇది మాయ యొక్క ఆవరణ. అభ్యాసీ, బాబూజీ కళ్ళతో చూడటమంటే ఇదే!

ఇంక ఇక్కడ నుంచే నేను చూసేది ఏదైనా బాబూజీ కళ్ళతోనే చూసినట్లవుతుంది. వారు ఇందులో మునక వేయించాక అంతా మరచిపోవటమే జరుగుతుంది. ఈ దివ్యదృష్టి కొంతమేర ఉన్నాక ఇంకా ఆపైన దృష్టి అనేది ఉండదు.

హృదయం అనగా విరాట్, అంటే హృదయ మండలం దాటాక కళ్ళు మూయటం జరిగితే మీ ఊహకు ఏదీ అందదు. కళ్ళు తెరిస్తే బాగున్నట్లనిపిస్తుంది.

మొట్టమొదట అహం పరిధిని దాటాక (గుర్తింపు) ఐడెంటిటీని కోల్పోవటం, ఆ తర్వాత శక్తి కోల్పోవటం జరుగుతుంది. ఈ శక్తిలేని శక్తి కేంద్రంలో కూడా ఏదో శక్తి ఆకర్షిస్తున్నట్లుగాను, అది గుంజుకుపోతున్నట్లుగాను అనిపిస్తుంది. ఏదో మగత అలముకున్నట్లుగా ఉండి ఎవరో లాక్కుపోతున్నట్లుగా, ఎవరో కాదు బాబూజీయే లాక్కుపోతున్నట్లుగా తోస్తుంది. ఇలా ఎందుకంటే, అభ్యాసీ అక్కడకు చేరాలని వారి సంకల్పం కనుక వారి శక్తితో అక్కడికి గుంజుకుపోవటం జరుగుతుంది. బాబూజీ చెప్పినట్లుగా ఇక్కడింక ప్రాణాహుతిగాని మరేమీ కూడా ఉండదు, అక్కడికి చేర్చేటందుకు వారి శక్తి మినహా.

ఇటీవల బాబూజీ నాకు శిక్షణ నిస్తున్నారు. వారి యొక్క బోధన ప్రారంభమైందని అనిపిస్తుంది. (Babuji Maharaj teaches me now-a-days. It seems my teaching began.) నేను విజయవాడలో ఉన్నప్పుడు నాకు ఇలా అనిపించింది: నా అభ్యాస కాలంలో బాబూజీ షాజహాన్‌పూర్‌లోనే ఉండేవారని అనుకున్నాను. కాని వారి ఉనికి విజయవాడలో కూడా ఎప్పుడూ ఉంటోందనిపించింది. వారు అకస్మాత్తుగా ఇలా ఎందుకు తలపింపజేశారో నాకు తెలియదు. ఇపుడు నేను సెంట్రల్ రీజియన్ వద్దకు చేరేసరికి, ఆ కేంద్రం యొక్క పవర్ ఆ ముఖద్వారం వద్దనే ఉండి, చాలా దగ్గరకు రాగానే లాగేసి కేంద్ర ప్రాంతంలో చేర్చినట్లుగా కనిపించింది. కనుక ఇప్పుడు మీరు అక్కడకు చేరుకోగలిగితే ఆ శక్తి మిమ్మల్ని, మీ ప్రయత్నం లేకుండానే లోపలికి ప్రవేశింపజేస్తుంది. ఆ ద్వారం తెరచి ఉంచబడింది కనుక మీరు స్వేచ్ఛగా లోనికి ప్రవేశించవచ్చు. ఒకవేళ అక్కడికి చేరాక మీరు ఆగాలనుకున్నా ఆగలేరు. ఇది నాకు ఇప్పుడు బోధించారు. నాకు ఏమి తెలియదని నాకు తెలుసు. ఇది అంతా బాబూజీ మహరాజ్ శిక్షణయే! అప్పుడు నాకు మాత్రమే సాధ్యపడినప్పటికీ ఇప్పుడు అది అందరికీ సాధ్యమే.

“భగవంతుని కొరకు హృదయం తెరిచి ఉంచండి” అని బాబూజీ చెప్పారు. ఆలోచనలు వస్తున్నాయని, ఏమీ పొందలేక పోతున్నామని వెనుకంజవేయవద్దు. అంతా వారి నిర్ణయానికి వదిలివేయండి. మీరు చేయవలసింది చేయండి, వారు చేయవలసింది వారు చేస్తారు. ఆ శక్తి మీకు వస్తుంది. అలోచనల గురించి విచారించకుండా నిర్విచారంగా సరితూకంతో జీవించండి.

**ప్రశ్న: నేను లయావస్థ చెందేటప్పుడు బాబూజీని సూక్ష్మ రూపంలో చూశాను. ఆనందం కలిగింది. ఏమైనా భేదం ఉందా?**

**జవాబు:** లయావస్థలో నీవు లోలోతుగా వెళ్తున్నప్పుడు ఆనందంగాని, ఏ అనుభూతిగాని ఉండవు. బాబూజీ అనగా దివ్యత్వం యొక్క వెచ్చదనం ఉంటుంది.  తపన ఉండదు. నిశ్శబ్దం ఉంటుంది.

**ప్రశ్న: నేను నా ఎదుట బాబూజీ యొక్క విశ్వరూపాన్ని చూశాను. వారు నన్ను తమ ఒడిలోకి తీసుకుని ముద్దాడారు. అపుడు నా వయస్సు 4,5 సంవత్సరాలుగా కనిపించింది.**

**జవాబు:** దానినిబట్టి వారి ప్రేమ వ్యక్తమవుతుంది.  వారు అందరినీ ప్రేమిస్తారని అర్థం. అది దివ్య ప్రేమగా గుర్తించాలి. చాలా మంచి అనుభవం.

బాబూజీ ఆనందంగా ఉన్నప్పుడు, ఎవరు ఎక్కడ ఉన్నా అందరూ ఆనందానుభూతి పొందుతారు. వారు ఉదాసీనంగా ఉంటే మీరు కూడా అలాగే మారిపోతారు. వాతావరణం అంతటా ఈ మార్పులు చోటుచేసుకుంటాయి.

ఎవరిలోనూ చెడు చూడకండి, ఎవ్వరినీ చెడుగా అనకండి. అందరూ బాబూజీకి చెందినవారే అయినపుడు ఇతరులను చెడుగా ఎలా చూడగలుగుతారు?

మనం ఎప్పుడూ ఉన్నతికొరకే ఆలోచించాలి. వారు మనల్ని తీసుకుని వెళ్ళటానికే వచ్చారు. "నేను సర్వసిద్ధంగా ఉన్నాను. నన్ను మీరు ఎలా కావలసి ఉంటే అలా తయారు చేయండి" అని మనం అనుకోవాలి. సాధన అంటే ఇదే.

షాజహాన్‌పూర్ నుంచి అభ్యాసులు తిరిగి వాళ్ళ ఇంటికి వెళ్ళేటప్పుడు బాబూజీ మహరాజ్ చెప్పేవారు, "మీ సమస్యలు, కష్టాలు నాకు వదిలి సంతోషంగా వెళ్ళండి" అని. బాబూజీ మీకు కూడా ఇలాగే అభయమివ్వాలని ప్రార్థిస్తాను.

**ప్రశ్న: మన మిషన్‌లో 6,7 మంది సెయింట్స్ ఉన్నారని అనుకుంటున్నాను. ఎంతమంది ఉంటారు?**

**జవాబు:** మన మిషన్‌లో ప్రస్తుతం 70 మంది దాకా సెయింట్స్ ఉంటారు. పూర్వం ఋషులు తమ స్వయంకృషితో ఆ స్థితిని పొందేవారు. కాని బాబూజీ తమ దివ్యశక్తి సహాయంతో అభ్యాసీల్ని సెయింట్స్‌గా తయారు చేస్తున్నారు. భవిష్యత్తులో అసంఖ్యాకమైన సెయింట్స్‌గా వస్తారు; ఇది సత్యం. ఎందుకంటే, నేను బాబూజీ  చెప్పిన మాటల్ని 'వారి' భవిష్యత్ దృష్టిలో చూసి చెబుతున్నాను. "ప్రతి ఇంటిలో  నుండి ఒకరైనా సెయింట్‌గా తయారు కావాలని నా కోరిక" అని బాబూజీ అనేవారు. కనుక ప్రతి ఇంటి నుండి ఒక సెయింట్ వస్తాడు. ఈ విధంగా ప్రపంచంలోని ప్రతి ఇంటిలో ఒక సెయింట్ ఉంటే, ఆ సంఖ్యను లెక్కపెట్టలేనంత మంది సెయింట్స్ భవిష్యత్తులో వస్తారు.

**ప్రశ్న: సెయింట్ యొక్క స్థితి ఏమిటి?**

**జవాబు:** ఒకసారి నేను "బాబూజీ! నా శరీరంలోని అణువణువు, కణకణం కూడా (సామ్యావస్థ) బ్యాలెన్స్‌డ్ కండిషన్‌లో ఉంది" అని వారికి వ్రాశాను. అప్పుడు వారు "బిటియా! నాకు చాలా ఆనందంగా ఉంది.

ఎందుకంటే, ఇప్పుడు మిషన్‌లో నాకు ఒక సెయింట్ లభించినట్లు. నీ ప్రకృతి (స్వభావం) మాత్రమే (సమతుల్యం) బ్యాలెన్స్‌గా ఉండటమే కాకుండా, నీలోని అణువణువూ ఆ (సామ్యావస్థ) బ్యాలెన్స్‌డ్ కండిషన్‌లో ఉన్నట్లుగా నీవు గమనిస్తావు" అని వ్రాశారు. పూర్వకాలంలో ఋషులు కొన్ని సందర్భాలలో తమ తపశ్శక్తిని కోల్పోయారు. ఎందుకంటే, వాళ్ళు దానిని తమ స్వయంకృషితో సాధించారు కనుక. కాని మన మిషన్‌లో సెయింట్స్ బాబూజీ దివ్యశక్తి సహాయంతో తయారు చేయబడతారు. కనుక ఆ (సామ్యావస్థ) బ్యాలెన్స్‌డ్ కండిషన్ కోల్పోయే ప్రశ్నేలేదు.

"ఏమైనా ప్రశ్నలు ఉంటే అడగండి" అని బాబూజీ ఒకసారి, తన ఎదుట కూర్చొని ఉన్న అభ్యాసులను అడిగారు. కాని అందరూ నిశ్శబ్దంగానే ఉండిపోయారు. అప్పుడు వారు, "ఈ పూర్తి సమయం అంతా కూడా మీ కోసమే ఉన్నది. మీరు ఏది కావాలనుకుంటే అది, ఎంత తీసుకోగలిగితే అంత నా వద్ద నుండి తీసుకోండి" అని అన్నారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్‌జీ, "బాబూజీ! మీరు ఈ 'తీసుకోగలిగితే' అనే పదాన్ని తొలగించండి. ఎందుకంటే మీ నుండి తీసుకునే సామర్థ్యం మాలో ఎవరికీ లేదు. 'తీసుకోగలిగితే' అనే ఈ శబ్దాన్ని తీసివేసి, తీసుకుని వెళ్ళండి! తీసుకోండి! తీసుకోండి! అని మీరు మాతో అనాలి" అని అన్నారు.

ఇప్పుడు మీకు ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. కెపాసిటీ అనగా వారి నుండి తీసుకునే సామర్థ్యం. అంటే ఏమిటి? మీకు మరియు బాబూజీకి మధ్య దూరం ఎంత ఎక్కువ ఉంటే, 'వారి' నుండి మీరు తీసుకునే సామర్థ్యం అంత తక్కువగా ఉంటుంది. బాబూజీ యొక్క సామీప్యత (నియర్‌నెస్) అభివృద్ధి అయినకొద్దీ, మీలో తీసుకునే సామర్థ్యం ఎక్కువ అవుతుంది. (మీరు భగవంతునికి ఎంత దగ్గరగా వెళ్ళితే, అంతగా శక్తి మీకు వారి నుండి లభిస్తుంది) బాబూజీ మహరాజ్ యొక్క సామీప్యత ఎంత ఎక్కువైతే, అంత శక్తి మీకు లభిస్తుంది. మీరు బాబూజీ ఎదుటనే ఉంటే, 'వారి' నుండి తీసుకునే సామర్థ్యాన్ని కూడా మీకు వారే ప్రసాదించి, మిమ్మల్ని తనలో లయం చేసుకుంటారు.

మీరు డెన్మార్క్‌లో ఉన్నారు. షాజహాన్‌పూర్‌లో బాబూజీ సిట్టింగ్ ఇస్తున్నారు. డెన్మార్క్‌లో ఉన్న మీకు కూడా 'వారి' ప్రాణాహుతి అందుతున్నది. ఎందుకంటే, బాబూజీకి అభ్యాసులకు మధ్య దూరం అనేది లేదు. అంటే బాబూజీ అంతటా సమస్తమూ వ్యాపించి ఉన్నారని అర్థం.

**ప్రశ్న: "ఓపెనింగ్ యువర్ సెల్ఫ్ టు రియాలిటీ ఈజ్ లవ్!" అని బాబూజీ అన్నారు కదా! దాని అర్థం ఏమిటి?**

**జవాబు:** "నీ హృదయాన్ని నా ఎదుట తెరచి ఉంచు" అని బాబూజీ అన్నారు. ఈ స్థితి ఏమిటంటే, "నేను ఈ పని చేస్తున్నాను, నేను ఆ పని చేస్తున్నాను" అని మీరు అంటున్నప్పుడు, ఆ 'నేను' అనే ఫీలింగ్ మిమ్మల్ని స్పర్శించదు. ఎందుకంటే, ఆ 'నేను' అనేది బాబూజీకి కనెక్ట్ చేయబడింది. సెల్ఫ్ (నేను) అనేది లేదు. అది 'వారికి' సమర్పించబడింది.

**ప్రశ్న: మీరు "బాబూజీ అల్టిమేట్ (భూమా) నుండి అవతరించారు" అని చెబుతున్నారు. దీనిని ఎలా నమ్మాలి?**

**జవాబు:** నీ సందేహం సరైనదే. ఈ స్థాయిలో నీవు అల్టిమేట్‌ను గురించి అర్థం చేసుకోలేవు. నీవు ఉన్నత స్థాయిలోకి వెళ్ళినప్పుడు కొద్దిగా అర్థం అవుతుంది. నీవు ఇంకా ఉన్నత స్థాయికి అంటే 'అక్కడి'కి చేరుకున్నట్లయితే ఆధ్యాత్మికత అంటే ఏమిటో అర్థం అవుతుంది. నీవు ఆ అల్టిమేట్ (భూమా) స్థితికి చేరుకుంటే అప్పుడు నీకు అల్టిమేట్ గురించి అర్థమవుతుంది. ఒకసారి చారీజీ, "బాబూజీ మహరాజ్! మీరు అల్టిమేట్ గురించి చెబుతున్నారు. కాని, నేను వీటిని అర్థం చేసుకోలేను. నా మనస్సు మీ మాటల్ని అర్థం చేసుకోలేదు" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "భాయీ! నేను నీకు ఈశ్వర సాక్షాత్కారం అనే లక్ష్యం ఇచ్చాను. ఎందుకంటే, భగవంతుని గురించి నీవు అర్థం చేసుకోగలవు. కనుక నీవు భగవంతుడిని చేరినప్పుడు ఇంకా అల్టిమేట్ అనేది ఒకటి ఉన్నదని నీకు అర్థమవుతుంది" అని అన్నారు. నిజానికి బాబూజీ సహాయం లేకుండా మీరు ఈశ్వరప్రాప్తిని పొందలేరు. మీరు ఈశ్వర సాక్షాత్కారాన్ని పొందిన తరువాత 'సత్యపథ్' వస్తుంది. అప్పుడే మీరు సెంట్రల్ రీజియన్‌లో ప్రవేశాన్ని పొందగలరు. ఈశ్వరీయ సాక్షాత్కారాన్ని మనం సాధన ద్వారా బాబూజీ సహాయంతో పొందగలం. కాని అంతిమ సాక్షాత్కారం (అల్టిమేట్ రియలైజేషన్) అనేది కేవలం బాబూజీవల్లనే మనకు సాధ్యమవుతుంది. ఎందుకంటే, ఆ అల్టిమేట్ (భూమా) నుండియే బాబూజీ అవతరించారు. ఇప్పటివరకు 'భూమా' నుండి ఎవరూ అవతరించలేదని చెప్పడానికి ఇది ఒక నిరూపణ. ఏ మతంలోను, ఆధ్యాత్మిక సాహిత్యంలోను, ఎక్కడ కూడ సెంట్రల్ రీజియన్ గురించి వ్రాయబడలేదు. ఒకసారి లాలాజీ సాహెబ్, "నీవు ఈ విశ్వానికే మాస్టర్‌వు, అల్టిమేట్ పవర్ (అంతిమ శక్తి) యొక్క మాస్టర్ కూడా నీవే" అని బాబూజీతో అన్నారు.

**ప్రశ్న: నాకు ఎటువంటి అనుభవాలు కూడా రావటం లేదు!**

**జవాబు:** మనస్సుతో ఆలోచించడం మానివేస్తే, హృదయంలో ఫీలింగ్ (అనుభూతి) కలుగుతుంది.

మిషన్ బ్యాడ్జీలు అనేవి లాలాజీ శతాబ్ది ఫంక్షన్ నుండి అమలులోకి వచ్చాయి. ఎవరు అభ్యాసీ, ఎవరు అభ్యాసీ కాదు అనేది, ఇదివరకు వాళ్ళ ముఖాన్ని చూసి గుర్తుపట్టేవారు. కాని ఈ రోజున కేవలం బ్యాడ్జీ ఉంటేనే అభ్యాసీ అని గుర్తిస్తున్నారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! మీ ఇంటిలోకి వస్తే, షాజహాన్‌పూర్‌లోనే ఉన్నట్లుగా ఉంటుంది.**

**జవాబు:** అవును! ఎందుకంటే, షాజహాన్‌పూర్ బాబూజీయే ఇక్కడ ఉన్నారు కనుక. హిందీలో షాహ్ అంటే చక్రవర్తి, జహాం అంటే ప్రపంచం అని అర్థం. ఈ ప్రపంచం అంతా కూడా ఆ చక్రవర్తిదే (అనగా బాబూజీదే). ఎక్కడికి వెళ్ళినా అది షాజహాన్‌పూర్‌యే. ఈ ప్రపంచం అంతా కూడా షాజహాన్‌పూర్ అయి ఉన్నది.

అభ్యాసీ కానటువంటి ఒక వ్యక్తి నా (సోదరి కస్తూరిగారి) దర్శనం కొరకు వచ్చినప్పుడు, నేను అతనితో "ఇప్పుడు నీవు నన్ను చూడటానికి వచ్చావు. మళ్ళీ ఎప్పుడైనా ధ్యానం చేయడానికి ఇక్కడికి

రావాలి. ఈ ఇంటి తలుపులు ఎప్పుడు కూడా తెరిచే ఉంటాయి" అని అన్నాను. బాబూజీ మహరాజ్ మనలను అందర్నీ తీసుకొని వెళ్ళటానికే అల్టిమేట్ నుండి అవతరించారు కనుక, ఆలస్యంగానైనా ప్రపంచంలోని మానవులు అందరూ సహజమార్గ సాధనలో చేరవలసినదే.

ఒకసారి నేను "బాబూజీ! నేను ఇక్కడి గాలితో జీవించడం లేదు. నేను 'అక్కడి' స్థితిలోని దైవీయ శ్వాసతోనే జీవిస్తున్నట్లు, నేను అక్కడే నివసిస్తూ అప్పుడప్పుడు భూమి మీద పని చేస్తూ ఉన్న ఈ కస్తూరిని పైనుండి చూస్తున్నట్లు అనిపిస్తుంది" అని వారికి వ్రాశాను. ఈ ప్రపంచానికి, అక్కడి దైవీయ ప్రపంచానికి చాలా తేడా ఉంది. మనం బాబూజీ యొక్క ధ్యానంతోనే ఇంత ఆనందాన్ని పొందితే, మరి అక్కడ 'వారి'తోనే, 'వారి' ఆ దివ్య ప్రపంచంలోనే జీవిస్తే ఇంకెలా ఉంటుంది! అంతేకాదు, 'వారు' అభ్యాసీని అటువంటి ఉన్నత స్థితిలోకి తీసుకొని వెళ్ళిన తరువాత కూడా, ఆ అభ్యాసీని ఈ భూమి మీద ఎలా జీవించి ఉండే విధంగా చేస్తారు అనేది అద్భుతమైన పరిశోధన.

మీకు కష్టాలు, బాధలు వచ్చినప్పుడు, వాటిని తొలగించమని బాబూజీని ప్రార్థిస్తారు. కాని అది సరైన పద్ధతి కాదు. మీరు హృదయ పూర్వకంగా బాబూజీ చరణాలకు శరణాగతి (సరెండర్) అయినట్లయితే ఆ పరిస్థితులు (బాధలు, దుఃఖాలు) మీ అనుభూతిలోకి రావు. ఆ పరిస్థితులలో మీరు కేవలం బాబూజీని మాత్రమే అనుభూతి చెందుతారు. ఆ కష్టాలను ఫీల్‌కారు. ఒకవేళ మీరు ఆ కష్టాలను, దుఃఖాలను అనుభూతి చెందుతున్నారంటే మీరు బాబూజీతో కాకుండా ఆ పరిస్థితులతోనే కనెక్షన్ కలిగి ఉన్నారని అర్థం. బాబూజీపట్ల ప్రేమ, భక్తి అధికమైనపుడు 'వారి' సామీప్యత, 'వారి'తో కనెక్షన్ ఏర్పడినపుడు ఈ స్థితి సహజంగానే దానంతట అదే అందరికీ ఏర్పడుతుంది. బాబూజీ మహరాజ్‌ను మీ ఎదుటనే ఉంచుకోండి. 'వారి'ని మీ మనస్సులోను, మీ హృదయంలోను ఉంచుకోండి. 'నేను' (ఐ) అనే దాన్ని గురించి ఆలోచించకుండా, కేవలం 'బాబూజీ'ని గురించి మాత్రమే ఆలోచించండి. అప్పుడు ఈ స్థితి మీలో కలుగుతుంది.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఋషులకు మరియు సెయింట్స్‌కు గల భేదం ఏమిటి?**

**జవాబు:** ఋషిని తపస్వి అని అంటారు. వాళ్ళు తపస్సు చేసి స్వప్రయత్నంతో ఋషులుగా తయారవుతారు. విశ్వామిత్రుడు, వసిష్టుడు ఋషులు. ఋషులలో నేను ఋషిని అనే ఎఱుక, అహం ఉంటుంది. అందువలన అప్పుడప్పుడు వాళ్ళ ఋషిత్వం కలతబారుతుంది. కాని సెయింట్ ఎప్పుడు కూడా కలత చెందదు. ఎప్పుడూ బ్యాలెన్స్‌డ్ (సామ్యావస్థ) కండిషన్‌లో ఉండి, తనను గురించి తాను పూర్తిగా మరచిపోయిన స్థితిలో ఉంటాడు. సెయింట్స్ అందరు కూడా భగవంతుని యొక్క భక్తులు. సంత్ మీరాబాయి, సంత్ కబీర్, సంత్ తులసీదాస్, సంత్ సూరదాస్‌లు సెయింట్స్. వీరికి (దైవం) డివైన్‌తో కనెక్షన్ ఉంటుంది. సెయింట్స్ దైవం (డివైన్) పాలనలో ఉంటారు. కాని ఋషులు 'ఐ' (నేను) అనే దాని ద్వారా నడపబడతారు.

**ప్రశ్న: యోగి అంటే ఎవరు?**

**జవాబు:** హిందీలో 'యోగ్' అంటే కనెక్షన్ (కలయిక) అని అర్థం. యోగి, (డివైన్) గాడ్‌తో కనెక్షన్ ఏర్పరచుకుంటాడు. నీవు బాబూజీతో కనెక్షన్ ఏర్పరచుకుంటే నీవు కూడా ఒక యోగివి అని అర్థం.

**ప్రశ్న: "నిన్ను నీవు మరచిపోవాలి" అని మీరు అంటున్నారు కదా! ఒకవేళ నన్ను నేను మరచినట్లయితే, ఆ మరచిన స్థితిలో ఇంటి పనులను చక్కగా చేసుకోగలనా?**

**జవాబు:** మనలను మనం మరచిపోవడానికి ప్రయత్నం చేయడం లేదు. మనం బాబూజీని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. నీ మనస్సు నీతోనే ఉంటుంది. కాని నీ హృదయం 'వారి' స్మరణలో మునిగిపోతుంది. అప్పుడు నీవు అన్ని పనులను చాలా సమర్థవంతంగా నిర్వహించగలవు. కాని ఆ పనులు ఎలా జరిగాయో, ఎవరు చేసారో అనేది నీకు తెలియదు.

ఎప్పుడైతే బాబూజీ మహరాజ్ ఎల్లవేళలా, అనుక్షణం మన కళ్ళెదుటనే ఉంటారో, అప్పుడు మనలో ధైర్యం కలిగి ఎవరికి కూడా భయపడం. ఎవరి ముందు కూడా తలవంచం. అందరిపట్ల గౌరవం, నమ్రత కలిగి ఉంటాము. కాని లోపల మాత్రం, కేవలం ఒక్క బాబూజీ మహరాజ్ ఎదుటనే మన శిరస్సు వ్రాలిపోయి ఉంటుంది. బాబూజీ మహరాజ్ యొక్క సామీప్యత అధికమైనకొద్దీ మనలో ఎటువంటి భయం అనేది ఉండదు. ఎందుకంటే 'వారు' మన హృదయంలోనే ఉన్నారు. అనుక్షణం 'వారి' దివ్యశక్తినే అనుభూతి చెందుతున్నాం కనుక.

**ప్రశ్న: బెహెన్‌జీ! భక్త మీరాబాయిని మీరు సెయింట్ అని అన్నారు. రాధ కూడా సెయింట్ కాదా!**

**జవాబు:** రాధ సెయింట్ కాదు. ఆమె శక్తి రూపం. శక్తి అనేది దైవానికి సహాయం చేయటం కోసం వస్తుంది. రాధ లిబరేటెడ్ సోల్ (ఉన్నత స్థాయికి చెందిన విముక్తాత్మ) అని బాబూజీ చెప్పారు. లిబరేటెడ్ సోల్స్‌కు ఎటువంటి బంధనాలు కూడా ఉండవు. వాళ్ళు పరమానందంలో, ఇంకా చెప్పాలంటే దాని కంటే అతీతమైన దివ్యానందంలో ఉంటారు. ఎవరైనా అవతార పురుషుడు భూమి మీద అవతరించినపుడు ఆ దివ్య పురుషునికి సహాయం చేయడానికి, వాళ్ళు తమ స్థానాన్ని విడిచిపెట్టి, భూమి మీదకు వస్తారు. కాని బంధనం ఏర్పడదు.

ఒకసారి నేను, "బాబూజీ! ఎప్పుడైనా నా గురించి నాకు జ్ఞాపకం రాగానే, నాకు ఇప్పుడు కస్తూరి కనబడటం లేదు, ఇక్కడ కస్తూరీ లేదు. కేవలం మీ శక్తి మాత్రమే ఉంది. మీ శక్తి పేరే కస్తూరీ అన్నట్లుగా అనిపిస్తుంది" అని వ్రాశాను. దీనికి బాబూజీ "ఇప్పుడు నీవు శక్తి యొక్క రూపంలోనే జీవిస్తున్నావు" అని వ్రాశారు. (ఈ స్థితిలో బాబూజీ మరియు శక్తి (కస్తూరీ) రెండు ఉన్నాయి. కాని ఇంకా విలీనం కాలేదు.)

ఒకసారి బాబూజీ ఈశ్వర్ సహాయ్‌గారితో "భాయీ! నేను ఎంతో మంది అర్జునులను తయారు చేశాను. అర్జునునకు తన గురించి తెలుసు. కాని ఇతరులకు తమ స్థితి గురించి తెలియదు. ఎందుకంటే అర్జునునిలో ఉన్నటువంటి ఆ కనెక్షన్, ఆత్మ సమర్పణ అనేవి లేవు" అని అన్నారు. మీరు ధ్యానంలో ఉన్న సమయంలో మాత్రమే బాబూజీతో కనెక్షన్ కలిగి ఉంటున్నారు. ధ్యానం అయిన వెంటనే ఆ ధ్యాన స్థితి నుండి విడిపోతున్నారు. ఎల్లవేళల మీరు ధ్యానంలో పొందిన స్థితిలోనే మునిగిపోయి, అన్ని పనులు చేస్తున్నట్లయితే, మీ సిస్టమ్ అంతా కూడా ఆ స్థితితోనే అలంకరించబడుతుంది. మీరు ఆ ఆధ్యాత్మిక

స్థితిలోనే మునిగిపోయి జీవించడానికి వీలుగా ఇప్పుడు బాబూజీ మహరాజ్ మొత్తం వాతావరణాన్నే క్లీన్‌చేసి దివ్య వాతావరణంగా మార్చివేస్తున్నారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! మీరు చాలా బ్యాలెన్స్‌డ్‌గా, చెప్పాలంటే మీరు సంపూర్ణమైన బ్యాలెన్స్‌డ్ స్థితిలో కనబడుతున్నారు. కాని మీరు మాట్లాడుతున్నప్పుడు మాత్రం మీలో ఒక విధమైన ఉద్వేగం (ఎమోషన్) కనబడుతున్నది.**

**జవాబు:** మీరు ఏదైనా ప్రశ్న అడిగితే, వెంటనే దానికి సంబంధించిన ఫీలింగ్ నాలో కలుగుతుంది, తరువాత అది వెళ్ళిపోతుంది. ఆ ఫీలింగ్ అనేది లేకుండా నేను మీ ప్రశ్నకు జవాబు చెప్పలేను. ఒకసారి నేను "బాబూజీ! ఇప్పుడు నాలో ఏ ఒక్క ఆలోచనగాని, దేనిని కాని దాచుకోవడానికి చోటులేదు" అని వ్రాశాను. చిన్నపిల్లవాడు ఏదైనా తప్పుచేస్తే, మందలించాలంటే, ఆ కోపం నాలో ప్రవేశిస్తుంది, తన పనిని తాను చేసి, ఆ వెంటనే నాలో నుండి అది వెళ్ళిపోతుంది.

ఒకసారి డా॥ కె.సి. వరదాచారిగారు షాజహాన్‌పూర్ నుండి తన ఇంటికి అనగా తిరుపతికి వెళ్ళే ముందు, "బాబూజీ! దయచేసి నన్ను జ్ఞాపకం ఉంచుకోండి" అని కోరారు. అప్పుడు బాబూజీ, "నేను ప్రయత్నిస్తాను. నేను నా మాస్టర్ లాలాజీ సాహెబ్‌నే జ్ఞాపకం పెట్టుకోవడం మరచిపోయినట్లయితే ఇంకెవ్వరిని మాత్రం జ్ఞాపకం ఉంచుకోగలను. ఒకవేళ నేను నా లాలాజీ సాహెబ్‌ను ఎప్పుడైనా జ్ఞాపకం చేసుకోగలిగినట్లయితే అప్పుడు నిన్ను కూడా జ్ఞాపకం చేసుకుంటాను" అని అన్నారు. మరల వారు "నిరంతర స్మరణ అంటే ఏమిటి? స్మరణ యొక్క జ్ఞాపకం కూడా రాకూడదు" అని అంటూ ఇంకా ఇలా అన్నారు: "లాలాజీ సాహెబ్ నాకు అప్పగించిన పని (అందర్నీ అనంతంకు చేర్చే) పూర్తి చేయడానికి వారిని నా సంకల్పంలో, స్మరణలో నిలుపుకున్నట్లే మిమ్మల్ని అందర్ని కూడా ఉద్ధరించే సత్కార్య సంకల్పం నెరవేరడానికి నా హృదయంలో నిలుపుకుంటాను. మరవనే మరవను" అని.

బాబూజీయే నా కలం పేరు 'సంధ్య' అని పెట్టారు. సంధ్య అంటే సాయంకాలం – అంటే వెలుతురూ కాదు, చీకటీ కాదు. రియాలిటీ – సత్య స్థితికి చిహ్నం అన్న మాట.

**ప్రశ్న: బెహెన్‌జీ! సహజమార్గ్ అనేది ఒక పాఠశాల. మీరు మా టీచర్, బాబూజీయే సిలబస్. మేమందరం విద్యార్థులం. విద్యార్థులలో తెలివైనవారు, సగటువారు, (డల్) బుద్ధిమాంద్యులూ ఉంటారు కదా! అందరిని అనంతానికి ఎలా తీసుకుని వెళ్తారు?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ సిలబస్ కాదు. బాబూజీయే అన్నింటికి సమాధానం (జవాబు). 'వారు' సమస్త విశ్వానికి మాస్టర్. అంతిమ శక్తి యొక్క మాస్టర్ కూడా వారే. బాబూజీ మనకు సిలబస్‌ను ఇచ్చారు. మీరు సహజమార్గ్‌లో చేరినట్లయితే, ఉదయం ధ్యానం, సాయంత్రం క్లీనింగ్, రాత్రి ప్రార్థన– అనేవి దీనిలోని పాఠ్యాంశాలు అని గ్రహిస్తారు. ఈ సిలబస్‌ను ఆచరణలో పెట్టి, నిరంతర స్మరణను పెంపొందించుకుంటే, అప్పుడు నీవు ఆధ్యాత్మికత అనే ఈ శిక్షణా విధిని పూర్తి చేయగలవు. ఇక్కడ టీచర్స్ (ఉపాధ్యాయులు) ఎవరూ లేరు. మేము హెల్పర్స్ అనగా సహాయం చేసే వాళ్ళం మాత్రమే. ఆధ్యాత్మికతలో చాలా మంది టీచర్స్ ఉండరు. కేవలం ఒకే ఒక టీచర్ (మాస్టర్) బాబూజీ మాత్రమే. 'వారి' నుండే మాకు

శక్తి లభిస్తుంది. దానినే మేము మీకు ప్రసారం చేస్తాం. "అభ్యాసీకి సిట్టింగ్ ఇచ్చే సమయంలోనే నీవు ప్రిసెప్టర్‌వు. మిగతా సమయంలో నీవు కూడా అభ్యాసీవే. అంతేకాని 24 గంటలూ నీవు ప్రిసెప్టర్‌వి కావు" అని బాబూజీ అనేవారు. మీరందరు విద్యార్థులు కారు. ఇక్కడ మన అందరం కూడా సోదరీ సోదరులం. ఇక్కడ 1వ తరగతి, 2వ తరగతి, 3వ తరగతి అనేవీ లేవు. ఇందులో చేరడం మాత్రమే మనం చేయవలసినది. మీరు సహజమార్గ్ అనే రైలులో కూర్చున్నారు. అంటే మీరందరూ గమ్యస్థానాన్ని చేరుకుంటారు, అని అర్థం. ట్రైన్ టికెట్ కూడా మన దగ్గర లేదు. మన టికెట్ బాబూజీ మాహరాజ్ జేబులోనే ఉంది. కనుక మన అందరం స్వేచ్ఛగా ఉన్నాము.

**ప్రశ్న: బెహెన్‌జీ! మందకొడి, సగటు మరియు తెలివైన విద్యార్థుల్లాగ అభ్యాసీలు కూడా రకరకాలుగా ఉంటారు కదా! వాళ్ళందరినీ ఏ విధంగా అనంతానికి తీసుకుని వెళ్ళతారు?**

**జవాబు:** అనంతానికి తీసుకుని వెళ్ళేది బాబూజీ. ఎలా తీసుకుని వెళ్ళాలి అనేది 'వారి'కి తెలుసు. సహజమార్గ్ యొక్క విశేషం ఏమిటంటే, బాబూజీ ఎప్పుడు కూడా మనలను దండించరు. 'వారు' ఎల్లప్పుడూ మనలను ప్రేమిస్తారు. నీవు మందకొడిగా ఉంటే వారు ప్రసాదించిన స్థితుల యొక్క అనుభూతిని, ఆనందాన్ని గమనించలేవు. కాని వారు అందరికి కూడా తమ దివ్య కృపను ప్రసాదిస్తారు. "నీవు నా వాడివి" అని బాబూజీ మహరాజ్ మనతో అన్నారు. దీని అర్థం ఏమిటంటే, "బాబూజీ మహరాజ్ నా వారు, నా వారే!" అనే కదా! "బాబూజీ నా వారు" అనే యథార్థాన్నీ, 'వారి' ప్రేమను నీవు అనుభూతి చెందాలి. అప్పుడే నీవు బాబూజీని ప్రేమతో స్మరిస్తున్నావని అర్థం. "బాబూజీ నా వారు" అని నోటితో అన్నప్పుడు, హృదయం దాన్ని అందుకుని అనుభూతి చెందాలి. అపుడు నీవు, వారిని నీ స్మరణలో ఉంచుకున్నట్లవుతుంది.

ఒకసారి ఒక అభ్యాసీ,"బాబూజీ! నేను మీ స్మరణలోనే, మీ జ్ఞాపకంలోనే ఉండి ఆహారాన్ని తింటాను" అని అనగానే, వారు "భాయీ! నీవు నా స్మరణలోనే ఉండి తింటున్నావు అని చెబుతున్నావు. కాని నీ భోజనం యొక్క రుచి నాకు చేరడం లేదు. ఆహారం యొక్క రుచిని నీవే తీసుకుంటున్నావు. ఒకవేళ నీవు నిజంగానే నా స్మరణలో లీనమై భోజనం చేస్తే, నీ హృదయంలో నీవు ఆధ్యాత్మికత యొక్క సరిక్రొత్త ఆహారాన్ని పొందుతావు. అప్పుడు ఆ ఆహారం యొక్క రుచి నాకు చేరుతుంది" అని అన్నారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! లక్నోలోను, తిరుపతిలోను మీవద్ద సిట్టింగ్ తీసుకున్నప్పుడు పొందిన ఆ అనుభూతి చాలా బాగుంటుంది. ఆ స్థితి కొన్ని రోజులవరకు మాత్రమే ఉంటుంది. అది చాలా కాలం అంటే ఎల్లప్పుడు ఉండాలంటే ఎలా?**

**జవాబు:** బాబూజీ ప్రసాదించిన ఆధ్యాత్మిక స్థితి అనేది నిరంతరం ఉంటుంది. కాని మీ మనస్సు, మీ ఆలోచనలు అనేవి ఆ కండిషన్‌తో కనెక్ట్ కాలేదు. అందువలన మీరు ఆ స్థితి యొక్క అనుభూతి పొందలేకపోతున్నారు. ధ్యానంలో ఆధ్యాత్మికతను పొందారు అంటే (అసలియత్) రియాలిటీను పొందారని అర్థం. కాని మీ మనస్సు దానితో కనెక్ట్ కాలేదు, కాబట్టి మీరు ఆ ఆధ్యాత్మికత యొక్క రుచిని అనగా ఆనందం, అనుభూతిని పొందలేకపోతున్నారు. ఇప్పుడు, ఇక్కడ మీరు బాబూజీ ద్వారా ఏదైతే పొందుతున్నారో,

అది అంతా కూడా మీదే. "ప్రతి సిట్టింగ్‌లోను నీవు ఏ ఆధ్యాత్మికతనైతే పొందుతున్నావో, అది అంతా నీదే" అని బాబూజీ అనేవారు. మీకు ప్రసాదించబడిన స్థితిని ఎన్నడు కూడా బాబూజీ మరల వెనుకకు తీసుకోరు. ఆ స్థితి మీ స్వంతం అయ్యింది. ఆ స్థితి నిరంతరం ఉంటుంది. మీరు చేయవలసిందల్లా, మీ మనస్సు, ఆలోచనలను ఆ కండిషన్‌తో కనెక్ట్ చేయండి. ఆ కండిషన్‌ను మరల మరల గుర్తుకు తెచ్చుకొని బాబూజీ స్మరణలో ఉండండి.

"మూడు సిట్టింగ్‌లు తీసుకుని, ఎవరైనా అభ్యాసీ ధ్యానం చేయకపోయినా గాని, మానివేసిన గాని, ఆ మూడు సిట్టింగ్‌ల యొక్క ప్రభావం మూడు జన్మల వరకు ఉంటుంది" అని బాబూజీ చెప్పారు. బాబూజీ యొక్క శక్తి మరల ఆ అభ్యాసీని సహజమార్గ్ సాధన కొరకై మేల్కొలుపుతుంది.

**ప్రశ్న: కుటుంబంలో ఎవరైనా అభ్యాసీలు కానివారు ఉంటే వారిని మన మనస్సులో బాబూజీకి అర్పించితే సరిపోతుంది కదా!**

**జవాబు:** అభ్యాసీలు కానివారిని బాబూజీ చరణాలకు అర్పించి, ప్రార్థన చేయాలి. ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నా భార్య అభ్యాసీ కాదు. మీ కృప వలన ఆమె కూడా సత్సంగ్‌లో చేరితే, మీ వద్దకు రావడానికి, మిషన్ ఫంక్షన్‌లలో పాల్గొనడానికి నాకు చాలా సులభంగా ఉంటుంది" అని అన్నాడు. కాని ఇది సరైనది కాదు. కేవలం ఆధ్యాత్మికత కొరకే 'వారి'ని ప్రార్థించాలి.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ మహరాజ్ మీ మీద రీసెర్చి (పరిశోధన) చేశారు. ఆ రీసెర్చి గురించి మీరు పుస్తకాలలో వ్రాశారు. ఈ గ్రంథులు, బిందువులు, వలయాలు ఇవి అన్నీ కూడా మానవ శరీరం లోపలనే ఉన్నాయా?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ రీసెర్చి చేసి హార్ట్ రీజియన్, మైండ్ రీజియన్, అహం యొక్క 16 వలాయలు, సెంట్రల్ రీజియన్ మొదలైన వాటిని గురించి తెలిపారు. 'వారు' చేసిన రీసెర్చి యొక్క గొప్ప ఫలితం ఏమిటంటే, ఇక్కడి నుండి అక్కడివరకు అనగా అల్టిమేట్ (భూమా) వరకు చేరుకోవడానికి మార్గ మధ్యంలో ఉన్నటు వంటి బంధనాలను, ఆటంకాలను అన్నింటిని కూడా 'వారు' శాశ్వతంగా తొలగించారు. రాబోయే తరాలవారికి, యుగయుగాల వరకు కూడా 'వారు' ఈ బంధనాలను అన్నింటిని పూర్తిగా తొలగించారు. కనుక ప్రారంభం నుండి అనంతం వరకుగల మొత్తం స్థితులు అన్నీ కూడా ఇప్పుడు మనవే. ఈ శరీరం పరిమితమైనది. ఈ స్థితులు అన్నీ కూడా శరీరానికి అతీతమైనవి. ఒక స్థితిలో, మీరు అంతటా వ్యాపించి ఉన్నట్లుగా మీరు అనుభూతి చెందుతారు. బాబూజీ మహరాజ్ అంతటా వ్యాపించి ఉన్నారు కనుక, మీలోని 'నేను' అనేది 'వారి'తోనే కనెక్షన్‌ను కలిగి ఉండటంవలన మీరు అంతటా వ్యాపించి ఉన్నట్లు ఫీలింగ్ పొందుతారు. ఆ వ్యాపించినది శరీరం కాదు. మీరు ప్రోగ్రెస్ అవుతూ ఉన్నప్పుడు ఒక దశలో మీ ఉనికి అనేది ఉండదు. అక్కడ కేవలం దివ్యశక్తి మాత్రమే ఉంటుంది. ఆ దివ్యశక్తి ద్వారానే మీ శరీరం అన్ని పనులు చేస్తుంది.

**ప్రశ్న: మానవునికి, స్వర్గానికి మధ్యన సరిహద్దు ఎందుకు ఉంది? మనం స్వర్గంలో ఎందుకు ఉండటం లేదు?**

**జవాబు:** మనం ఇప్పుడు సత్సంగ్‌లో ఉన్నాము. ఇది స్వర్గం కాదని నీవు ఎలా చెప్పగలవు. ఇది స్వర్గం కంటే కూడా అతీతమైనది అని నేను చెప్పగలను. స్వర్గంలోని సంతోషం పరిమితమైనది. కాని మనం అపరిమితమైన ఆనందం వైపుకు అనగా అనంతం వైపుకు వెళ్ళుతున్నాం. స్వర్గంలోని దేవుళ్ళు, దేవతలు అందరు తమ తమ పరిమితుల నుండి అనగా బంధనాల నుండి విముక్తి పొందటానికి ఈ భూమి మీద మానవులుగా జన్మించాలని కోరుకుంటారని హిందూ పురాణాలలో వ్రాయబడి ఉంది. అది యదార్థం.

**ప్రశ్న: బ్లెస్సింగ్స్ (ఆశీస్సులు) అంటే ఏమిటి?**

**జవాబు:** మిషన్‌లో చేరడానికి ముందు మరియు ఇప్పుడు మీరు ఎలా ఉన్నారో గమనించండి. మనం బాబూజీని స్మరిస్తున్నాం   కాని, ఏమీ కష్టపడటం లేదు. ధ్యానంలో కూర్చోగానే మనకు దైవం నుండి లభించే ప్రాణాహుతి శక్తి వలన ఆనందం లభిస్తుంది. కనుక డివైన్ (దైవం) నుండి ఏదైతే లభిస్తున్నదో అదే బ్లెస్సింగ్స్ (ఆశీస్సులు).

ఒకసారి అస్సాం నుండి వచ్చిన ఒక అభ్యాసీ, తనకు ఇండివిడ్యువల్ సిట్టింగ్ (వ్యక్తిగత సిట్టింగ్) కావాలని బాబూజీని అడిగాడు. అప్పుడు బాబూజీ అతనికి సిట్టింగ్ ఇచ్చారు. ఆ తరువాత రోజున మరల ఇండివిడ్యువల్ సిట్టింగ్ ఇవ్వమని బాబూజీని అడిగాడు. "భాయీ! నేను ఇండివిడ్యుయాలిటి (వ్యక్తిత్వం అనగా అహం)ను సమాప్తం చేయడానికే ఇక్కడికి వచ్చాను. కాని నీవేమో ఇండివిడ్యువల్ సిట్టింగ్ కావాలని అడుగుతున్నావు" అని అన్నారు బాబూజీ.

డా॥ వరదాచారిగారు మొదటిసారి షాజహాన్‌పూర్‌కు వచ్చినప్పుడు ఆయన, తన ఫిలాసఫీ గురించి, విస్‌డమ్ (జ్ఞానం) గురించి చాలా విషయాలు బాబూజీతోను, అక్కడ కూర్చొని ఉన్న అభ్యాసులతోను చెబుతున్నారు. బాబూజీ నిశ్శబ్దంగా అన్నీ వింటున్నారు. చివరకు బాబూజీ ఆయనతో, "నీవు గొప్ప జ్ఞానివి. నాకు అంతగా జ్ఞానం లేదు. అయినా కాని నేను నీకు దివ్య జ్ఞానాన్ని ప్రసాదించగలను" అని అన్నారు.

బాబూజీ ఈశ్వర్ సహాయ్‌గారితో "భాయీ! అరే రాత్రి అయ్యిందా!" అని చాలసార్లు అనేవారు. బాబూజీ వరండాలో కూర్చొని మాతో మాట్లాడుతూ చాలా రాత్రి అయ్యిందనే విషయాన్ని కూడా మరచిపోయేవారు. మేము ఎంతో గొప్ప, అత్యున్నతమైన డివైన్ పర్సనాలిటీ (దివ్య పురుషుని)తో కలిసి జీవించాము.  'వారి'కి సర్వస్వం తెలుసు, కాని వారు మాత్రం ఏమి తెలియని వారిలాగానే ఉండేవారు.

**ప్రశ్న: స్వామి వివేకానందను కూడా సెయింట్ అని అంటారా?**

**జవాబు:** "గొప్పవారిని గురించి, మహాత్ముల స్థితిని గురించి ఎప్పుడు కూడా మాట్లాడవద్దు" అని బాబూజీ నాతో చెప్పారు. బాబూజీకి సమస్తం తెలుసు. నేను అందరిపట్ల గౌరవం, మర్యాదలు కలిగి ఉంటాను. స్వామి వివేకానందజీ లిబరేటెడ్ సోల్ (ఉన్నత స్థాయికి చెందిన విముక్తాత్మ) అని బాబూజీ చెప్పారు. లిబరేటెడ్ సోల్ గురించి ఎవరు చెప్పగలరు!

**ప్రశ్న: బెహెన్‌జీ! మీరు నిజంగా బాబూజీని హృదయ పూర్వకంగా ప్రార్థించినట్లయితే ఒక్క సిట్టింగ్‌లోనే మీరు మాకు లిబరేషన్ (ముక్తి) ఇవ్వవచ్చు కదా! మరల మరల సిట్టింగ్స్ ఇవ్వడం ఎందుకు?**

**జవాబు:** మీరు చేసే ఆ ప్రార్థన ఎలా ఉండాలంటే, ఆ ప్రార్థన తరువాత మీరు ఆ (గాడ్) డివైన్‌తోనే నిరంతరం కనెక్షన్‌ను కలిగి ఉన్నట్లయితే అప్పుడు ఇన్ని సిట్టింగ్స్ యొక్క అవసరం లేదు. డివైన్‌తో మీకు ఆ కనెక్షన్ ఏర్పడటానికే ఈ సిట్టింగ్స్ యొక్క అవసరం ఏర్పడింది.

**ప్రశ్న: బెహెన్‌జీ! కనెక్షన్ ఏర్పడిందని, సిట్టింగ్స్ అవసరం లేదని మనం ఎలా తెలుసుకోగలం?**

**జవాబు:** ఒకసారి నేను, "బాబూజీ! ధ్యానంలో కూర్చోగానే నా హృదయం కుంగిపోతూ ఉంది. దానిని భరించలేకపోతున్నాను. కాని వంట పని లేదా ఏదైనా ఇంటి పనిలో లీనమై ఉన్నప్పుడు మాత్రం ఎంతో ఆనందంగా ఉన్నటువంటి స్థితిని నేను అనుభూతి చెందుతున్నాను" అని వ్రాశాను. అప్పుడు వారు, "బిటియా! నీవు దేని కొరకైతే ధ్యానాన్ని ప్రారంభించావో, దాని ఫలితం నీకు లభించింది. ఇప్పుడు నీకు దైవంతో కనెక్షన్ ఏర్పడింది. ఇప్పుడు నీవు పూజ చేయవలసిన అవసరం లేదు. ఒకవేళ నీవు పూజలో కూర్చుంటే ఆ కనెక్షన్ డిస్టర్బ్ అయినట్లు అనిపిస్తుంది. ఆ నిరంతర ప్రవాహం ఆగిపోయినట్లు అనిపిస్తుంది" అని వ్రాశారు.

మనలో కలిగే ఇంకొక స్థితి ఏమిటంటే, మీరు ఏదైనా పనిలో లీనమై ఉన్నప్పుడు, ఒక్కసారిగా మీకు, "బాబూజీ నన్ను గుర్తు చేసుకుంటున్నారు, బాబూజీ నన్ను గుర్తు చేసుకుంటున్నారు" అని మీకు అనిపిస్తుంది. అంటే మీకు బాబూజీతో కనెక్షన్ ఏర్పడిందని దాని అర్థం.

**ప్రశ్న: బాబూజీ మనలను జ్ఞాపకం చేసుకుంటారని, ఒక్కసారిగా నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంది.**

**జవాబు:** అప్పుడప్పుడు, ఆ విధంగా అనిపించడం కాదు. ఆ స్థితి నిరంతరం ఉంటుంది. కాని మిమ్మల్ని మీరు ఒకవేళ జ్ఞాపకం చేసుకోకపోతే, ఆ స్థితిని మీరు భరించలేరు. అందువల్లనే బాబూజీ మనకు మన ఎరుకను గురించి గుర్తుచేస్తారు. "నీవు ఇంకా జీవించే ఉన్నావు" అని బాబూజీ ఆ విధంగా మనకు గుర్తు చేస్తారు.

సహజమార్గం యొక్క సౌందర్యం ఏమిటంటే, మనం ప్రారంభంలోనే ఆ అనంతాన్ని చూస్తాము. ఆ తరువాత సాధన ద్వారా అనంతాన్ని చేరుకుంటాము. మొదటిసారిగా మనం ధ్యానంలో కూర్చోగానే మనకు ఆ దైవం నుండి అనగా అనంతం నుండి ప్రాణాహుతి శక్తి లభిస్తుంది. అప్పుడు మనకు దైవంతో మొదటి కనెక్షన్ ఏర్పడుతుంది. ఇప్పుడు మనం ఈ కనెక్షన్‌ను పట్టుకొని నెమ్మది నెమ్మదిగా అనంతాన్ని చేరుకుంటాము.

**ప్రశ్న: బెహెన్‌జీ! నిన్నటివరకు సత్సంగ్‌లో చాలా బాగుంది. ఆనందంగా ఉంది. కాని ఈ రోజు ఉదయం నుండి ఖాళీగా ఉన్నట్లు అనిపిస్తోంది, ఏమీ ఉత్సాహం లేదు.**

**జవాబు:** ప్రతి స్థితిలోను, దానికి సంబంధించిన శక్తి కూడా ఆ స్థితితోనే ఉంటుంది. ధ్యానంలో మీకు ఒక స్థితి కలిగినపుడు, ఆ స్థితి యొక్క శక్తి మీ మీద పని చేయడం ప్రారంభిస్తుంది. ఆ స్థితి యొక్క శక్తి పని

చేస్తున్నంత సమయమూ మీకు చాలా ఆనందంగా అనిపిస్తుంది. ఎప్పుడైతే ఆ స్థితి మీలో పూర్తిగా లయమవుతుందో, అప్పుడు మీకు ఎటువంటి ఫీలింగ్ లేదా అనుభూతి లభించదు. మీకు ఖాళీగా అనిపిస్తుందంటే, ఆ స్థితి మీలో లయమైపోయిందని అర్థం.

ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! నాకు ధ్యానంలో చాలా ఆలోచనలు వస్తున్నాయి" అని అనగానే, వారు, "భాయీ! –నేను మిషన్‌లో చేరాను– అని, నీవు నాతో అన్నావు. అంటే నిన్ను లక్ష్యం (గాడ్) వద్దకు తీసుకుని వెళ్ళే గ్యారంటీ (హామీ) పూచీ నాది. నీకు ధ్యానంలో ఆలోచనలు వస్తే –ఈ ఆలోచనలు నావి కావు. నేను నీ వాడిని– అని అనుకో" అని అన్నారు.

**ప్రశ్న: వేరే మతాలలోను, ఇతర సంస్థలలోను కొంతమంది నిజమైన జిజ్ఞాస కలిగినవారు ఉంటారు. వాళ్ళను మన సహజమార్గ్ పద్ధతిలోకి తీసుకుని రావాలంటే ఎలా?**

**జవాబు:** ఇది మన పని కాదు. కాని మనం వాళ్ళ కొరకు ప్రార్థన చేయవచ్చు. "మన మిషన్ ఈ ప్రపంచం అంతటా వ్యాపిస్తుంది. ప్రపంచంలో కేవలం ఒక్క శ్రీరామచంద్ర మిషన్ మాత్రమే ఉంటుంది" అని బాబూజీ అన్నారు. కనుక ప్రపంచంలో శ్రీరామచంద్ర మిషన్ ఒక్కటి మాత్రమే ఉంటుంది. అది దైవ సంకల్పం. అప్పుడు అన్ని సంస్థలు కూడా శ్రీరామచంద్ర మిషన్‌లో విలీనం కావలసినదే. ప్రజలు అందరు కూడా మన మిషన్‌లో చేరవలసినదే. ఇక్కడ ధ్యానంలో కూర్చొని, కేవలం మనమే దివ్యశక్తిని పొందుతున్నామని అనుకుంటున్నాము. కాని మీరు జాగ్రత్తగా పరిశీలించినట్లయితే సమస్త విశ్వం కూడా ఇప్పుడు బాబూజీ యొక్క ప్రాణాహుతి శక్తిని గ్రోలుతూంది.

**ప్రశ్న: డెన్మార్క్‌లో కూడా ప్రాణాహుతి ప్రవహిస్తోందా?**

**జవాబు:** అవును. అక్కడే కాదు ప్రపంచమంతటా వ్యాపిస్తుంది. ఎక్కడ ఆధ్యాత్మికత ఉంటే బాబూజీ అక్కడ ఉంటారు. "ఆధ్యాత్మికతకు డెన్మార్కు దేశం నిలయం అవుతుంది. (Denmark will be the home of spirituality.)" అని బాబూజీ చాలా సంవత్సరాల క్రితం చెప్పారు.

**ప్రశ్న: ఖాళీగా ఉన్నట్లు మరియు అశాంతిగా అనిపిస్తూ ఉన్నది.**

**జవాబు:** ఖాళీగా అనిపించడం అంటే హృదయానికి ప్రాణాహుతి శక్తి ఇంకా, ఇంకా కావాలని అర్థం. అశాంతి అనేది భరించలేని విధంగా ఉంటే, "నేను బాబూజీ చరణాలవద్ద ఉన్నాను. ఈ అశాంతి బాబూజీ వద్దకు వెళ్ళుతూ ఉన్నది" అని భావించండి.

ఒకసారి బాబూజీ ఈశ్వర్ సహాయ్‌గారితో "భాయీ! నేను అందరిని ప్రేమిస్తాను. కాని నన్ను ఎవరూ ప్రేమించడం లేదు. దీనికి కారణం ఏమిటి?" అని అడిగారు. ఈశ్వర్ సహాయ్‌జీ చాలా తెలివైనవారు. అప్పుడు ఆయన "బాబూజీ! ఈ ప్రశ్న డివైన్ (దైవం) నుండి వచ్చింది, కాబట్టి జవాబు కూడా డివైన్ నుండి రావలసిందే. నేను దీనికి జవాబు చెప్పలేను" అని అన్నారు. అప్పుడు బాబూజీ, "దైవం అందరిని ప్రేమించే సమయం ఇది. దివ్య ప్రేమ అనేది వెనుకకు తిరిగి రావడం అంటే అది చాలా చెడ్డ విషయం.

ఇప్పుడు ఈ ధరణి అంతా కూడా ఆ దివ్య ప్రేమను గ్రహిస్తూ ఉన్నది. అంటే ఆధ్యాత్మికత అనే పుష్పం ఇప్పుడు భూమి మీద వికసిస్తూ ఉన్నది. ఇది చాలా మంచి విషయం" అని అన్నారు. అయినా ఆ డివైన్ (దైవం)ను ఎవరు ప్రేమించగలరు?

బాబూజీ ఎప్పుడూ "నీవు చెడ్డవాడివి, నీవు మంచివాడివి" అని అభ్యాసీల గురించి ఆలోచించలేదు. వారు ఎవరిలోను లోపాలను చూసేవారు కారు. అందరిని ప్రేమించే వారు. "నేను చెడ్డవానిని, నాలో చాలా బలహీనతలు ఉన్నాయి" అని మీరు ఎప్పుడు కూడా నిరుత్సాహపడరాదు, నిరాశ పడరాదు. ఎందుకంటే, ఈ విధంగా నెగటివ్‌గా ఆలోచిస్తూ నిరాశపడితే, మీరు బాబూజీతో కనెక్షన్ ఏర్పరచుకోలేరు. "నీవు నన్ను స్మరించుకుంటున్నావు అంటే నీ బాధ్యతను నీవు నాకు ఇచ్చినట్లే. నేను నీ వాడిని" అని బాబూజీ అభ్యాసీలతో అనేవారు. అందువలన మీరు ఎప్పుడు కూడా నిరాశపడకూడదు. అటువంటి ఆలోచనలు వచ్చినప్పుడు "బాబూజీ! నేను మీ వాడిని, నా గురించి నాకు ఏమి తెలియదు. నాకు ఒక్కటే తెలుసు మీరు నావారు" అని భావించండి. మీ గురించి మీరు మరచిపొండి.

**ప్రశ్న: బెహెన్‌జీ! ఇక్కడ మీ సన్నిధిలో ఈ వాతావరణం మాకు చాలా ప్రత్యేకంగా, ప్రశాంతంగా, ఆనందంగా అనిపిస్తుంది. ఇదే అనుభూతి మాకు వేరే ప్రదేశాలలో కూడా ఉంటుందా? ఇక్కడ మాత్రమే ఇలా ఉంటుందా?**

**జవాబు:** ఇప్పుడు, ఇక్కడ మీరు బాబూజీ గురించే వింటున్నారు, మాట్లాడుతున్నారు. మీ దృష్టి అంతా కూడా బాబూజీ మీదనే ఉంది. మీరు ఈ (దివ్య) వాతావరణంలోనే మునిగి ఉన్నారు కనుక మీకు చాలా ఆనందంగా ఉంది. బాబూజీ మహరాజ్ కృప అంతటా ఉంది. ఇంటికి వెళ్ళిన తరువాత మీరు చేయవలసిన పనులు చాలా ఉంటాయి. మీ మనస్సు ఆ పనులలో లీనం కావడం వలన అక్కడ మీరు ఈ అనుభూతిని గమనించలేకపోతున్నారు. బాబూజీ కృప మీ ఇంటిలోను, మీ ప్రదేశంలోను అంతటా ఉన్నది. ఈ వాతావరణాన్నే మీరు ఎక్కడైనా అనుభూతి చెందగలరు. ఇదే వాతావరణాన్ని మీ ఇంటి వద్ద కూడా సృష్టించుకోవడం ఎలా? ఉదయం ఒక గంట ధ్యానం చేసి, లేచిన తరువాత మీరు ధ్యానం అయిపోయిందని అనుకోవద్దు. రోజంతా కూడా ఆ ధ్యానం యొక్క మూడ్‌లోనే ఉండి అన్ని పనులు చేయండి. ధ్యానం యొక్క మూడ్ అంటే బాబూజీని గురించి ఆలోచించడం 'వారి'తో కలిసి జీవించడం అని అర్థం.

**ప్రశ్న: ఈ సహజమార్గంలో చేరడానికి నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల యొక్క ఋణం ఎలా తీర్చుకోవాలి?**

**జవాబు:** వారి కొరకు బాబూజీని ప్రార్థించండి. మా కొడుకు లేదా కుమార్తె చాలా మంచి మిషన్‌లో చేరారు అనే ఫీలింగ్ మీ తల్లిదండ్రులలో కలిగే విధంగా మీరు ప్రేమతో వ్యవహరించాలి. మీ ప్రవర్తన, నడవడిక అనేది ప్రేమ పూర్వకంగా ఉండాలి. మీ జీవన విధానంలో మార్పు అనేది ఉండాలి. దానినిబట్టి వారు కూడా ఆకర్షించబడతారు.

**ప్రశ్న: ధ్యానంలో ఉన్నప్పుడు నాకు సంబంధం లేనటువంటి కొన్ని ఆకారాలు, ఊహా చిత్రాలు కనబడుతున్నాయి. ఏమి చేయాలి?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ ప్రతి దానికి, అన్నింటికి కూడా జవాబు చెప్పారు. మీకు ధ్యానంలో ఆలోచనలు వచ్చినా లేదా ఏవైనా ఆకారాలు, ఊహా చిత్రాలు, దృశ్యాలు కనిపించినా వాటిని గురించి మీరు పట్టించుకోవద్దు. "నేను బాబూజీ మహరాజ్ చరణాల దగ్గర కూర్చొని ఉన్నాను, 'వారి' ధ్యానంలో ఉన్నాను" అని భావించి మీ దృష్టిని బాబూజీ మీదనే ఉంచినట్లయితే, అవి అన్నీ కూడా తొలగిపోతాయి. మీరు చూస్తున్నవి మీకు ఎప్పుడూ సంబంధం లేనివైనా సరే అలాగే చేయండి.

ఒకసారి షాజహాన్‌పూర్‌లో బాబూజీ ఇంటి వద్ద, ఫంక్షన్ అయిపోయిన తరువాత అభ్యాసీ లందరు ఒకరినొకరు అడిగి అడ్రస్ (చిరునామా) లను వ్రాసుకొంటున్నారు. ఇదంతా చూస్తున్న బాబూజీ చివరికి, ఈశ్వర్ సహాయ్‌గారితో "భాయీ! అందరి అడ్రస్‌లను వ్రాసుకుంటున్నారు. కాని ఎవరూ నా అడ్రస్ అడగడం లేదు. ఎందుకని?" అని అడిగారు. అప్పుడు ఈశ్వర్ సహాయ్‌జీ "బాబూజీ! మీరు లేనటువంటి ప్రదేశం ఏదీ లేదు కదా! మీరు ఈ విశ్వంలో అంతటా ఉన్నారు. మీ అడ్రసును మేము ఎలా అడుగగలం? మీ అడ్రస్ మీకే తెలుసు!" అని అన్నారు. అప్పుడు అక్కడే ఉన్న నేను, "బాబూజీ! లాలాజీ సాహెబ్ యొక్క హృదయమే మీ అడ్రస్" అని వారితో అన్నాను. "అవును! నీవు కరెక్ట్‌గా చెప్పావు. లాలాజీ సాహెబ్ హృదయమే నా ఇల్లు. అదే నా అడ్రస్" అని బాబూజీ అన్నారు. అప్పుడు నేను చాలా సంతోషపడ్డాను. కాని ఆ రోజున నేను చెప్పిన జవాబు యొక్క అసలు యధార్థత (రియాలిటీ) నాకు ఇప్పుడు అర్థమవుతుంది.

మన అందరం సహజమార్గ సిస్టమ్‌లో చేరాము. ఈ సహజమార్గ అనేది సత్యపథ్‌తో కనెక్షన్ కలిగి ఉంది. ఎంబ్లమ్ (బ్యాడ్జి) మధ్యభాగంలో 'సహజమార్గ' అని వ్రాయబడి ఉన్నది. ఎప్పుడైతే మీరు 'సహజమార్గ'ను దాటి పైకి వెళ్ళతారో, అనగా సత్యపథ్ నుండి రియాలిటీ (అసలీయత్) అనేది ప్రారంభమవుతుంది. సత్యపథ్ చేరిన తరువాత మీకు, ఇక్కడ నుండే డివైన్ పవర్ (దివ్యశక్తి) యొక్క నిరంతర ప్రవాహం, శాశ్వత ప్రవాహం మీ అనుభవంలోకి వస్తుంది. మన మిషన్ యొక్క ఎంబ్లమ్ (బ్యాడ్జి) సామాన్యమైనది కాదు. దానిలో అన్ని స్థితులు కూడా, సంపూర్ణంగా చూపించబడ్డాయి. డెన్మార్క్ అభ్యాసీకి ఈ సిస్టమ్‌లో చేరకముందే ఈ దృశ్యం కనిపించినట్లు చెప్పారు.

**ప్రశ్న: బెహెన్‌జీ! కలలో నేను ఎక్కడికో వెళ్ళినట్లు, తిరిగి వచ్చినప్పుడు ఎంత వెదికి చూసినా కూడా నా ఇల్లు కనబడనట్లు అనిపించింది. ఇటువంటి కలలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ విధంగా ఎందుకు జరుగుతుంది? ధ్యానం సరిగ్గా చేయలేకపోవటంవల్లనా? లేదా నా స్థితి సరిగ్గా లేదా?**

**జవాబు:** ఫర్‌గెట్‌ఫుల్ స్టేట్ (మరచిన స్థితి) మీలో మొదలైనదని దీని అర్థం.

సహజమార్గ సాధనలో చేరిన ఒక సంవత్సరం తరువాత, నేను "బాబూజీ! నాకు పగలంతా ఒక స్వప్నంలాగ, రాత్రి అంతా నేను నిద్రపోతున్నప్పుడు యదార్థంగా, రియల్‌గా అనిపిస్తుంది" అని వారికి వ్రాశాను. అప్పుడు బాబూజీ "బిటియా! ఈ ప్రపంచం ఒక స్వప్నం వంటిది అని మన పురాణాలలో

చెప్పబడినది. పగలంతా స్వప్నంలాగ, రాత్రి అంతా యథార్థంగా అనిపించడం అనేది వాస్తవం. దీనిని గురించి పురాణాలలో చెప్పిన వారికి ఈ స్థితి లభించలేదు, కాని నీకు ఇప్పుడు కలిగిన స్థితి అదే" అని జవాబిచ్చారు.

**ప్రశ్న: ధ్యానం చేస్తూన్నప్పుడు కొన్నిసార్లు శరీరం నుండి, తల నుండి పొగలు వెలువడుతున్నట్లు, వేడిగా ఉన్నట్లు అనిపిస్తుంది.**

**జవాబు:** అప్పుడు కొన్ని సెకండ్లు మీ కళ్ళు తెరచి, మీ ఎదురుగా కూర్చొని ఉన్న బాబూజీ మహరాజ్‌ను చూసి, మరల ధ్యానం చేయండి.

**ప్రశ్న: ధ్యానం చేస్తున్నప్పుడు నాకు తెలియకుండానే నా తల అటు, ఇటు ఊగిపోతున్నది!**

**జవాబు:** మీ శిరస్సు అటు ఇటు ఊగిపోవడం అనేది ప్రాణాహుతి ప్రభావంవలన కాదు. మీకు తెలియకుండానే అది మీకు ఒక అలవాటుగా మారింది. మీరు కళ్ళు తెరచి ధ్యానం చేయండి. "బాబూజీ మహరాజ్ నా ఎదురుగా కూర్చొని ఉన్నారు. వారే సిట్టింగ్ ఇస్తున్నారు. బాబూజీ మహరాజ్ నా లోపల ఉన్నారు. నాలోని అణువణువు కూడా వారి డివైన్ గ్రేస్ (దివ్య కృప)తో ప్రకాశవంతం చేయబడింది" అని ఈ విధంగా మీరు కళ్ళు తెరచి ధ్యానం చేయాలి. అప్పుడు అది సరిచేయబడుతుంది.

ఒకసారి బాబూజీ వరండాలో కూర్చొని ఉన్నప్పుడు, ఒక ప్రిసెప్టర్ తన శిరస్సును అటూ, ఇటూ త్రిప్పుతూ అభ్యాసీకి సిట్టింగ్ ఇవ్వడం గమనించారు. అప్పుడు బాబూజీ ఈశ్వర్ సహాయ్‌జీతో, "భాయీ! సిట్టింగ్ ఇస్తూ ఉన్నప్పుడు, ప్రిసెప్టర్ ఈ విధంగా తల ఊపడం అనేది చాలా చెడ్డ విషయం, అంటే ఆ ప్రిసెప్టర్ డివైన్ పవర్ (దివ్య శక్తి) నుండి పనిని తీసుకోవడం లేదు. తన అలవాటు (తల అటు ఇటు ఊపడం) నుండి పనిని తీసుకుంటున్నాడు" అని అన్నారు. ప్రిసెప్టర్ సిట్టింగ్ ఇస్తూ ఉన్నప్పుడు తన తల అటూ ఇటూ కదులుతున్నట్లుగా అనిపిస్తే, వెంటనే అతడు కొన్ని సెకండ్లపాటు కళ్ళు తెరవాలి.

ప్రిసెప్టర్ క్లీనింగ్ చేస్తూ ఉండటం వలన అలా జరుగుతుందా?

కాదు. మీరు మీ ఇంటిని ఊడ్చేటప్పుడు చీపురుతో ఆ పనిని చేస్తారు కాని, తలను అటూ ఇటూ ఊపడం వలన కాదు.

**ప్రశ్న: బెహెన్‌జీ! బాబూజీ మీద ప్రేమను ఎలా అభివృద్ధి చేసుకోవాలి?**

**జవాబు:** ప్రేమను అభివృద్ధి చేసుకోలేము. బాబూజీతో ఎటాచ్‌మెంట్ (అనుబంధం)ను అభివృద్ధి చేసుకోగలం. "ప్రేమ అనేది కేవలం దైవం నుండి మాత్రమే వస్తుంది. మీరు దైవంతో ఎటాచ్‌మెంట్ ఏర్పరచుకోవాలి" అని బాబూజీ మహరాజ్ అనేవారు. ఎటాచ్‌మెంట్ అంటే బాబూజీ గురించి ఆలోచించడం, 'వారి' నిరంతర స్మరణలో ఉండడం, మీరు ఏ పనిని చేసినా, 'వారి' సంతోషం కొరకే ఆ పనిని చేస్తున్నామని భావించడం. ఈ విధంగా ప్రతి పనిని, ప్రతి దానిని కూడా బాబూజీకి కనెక్ట్ చేయాలి. అప్పుడు మీకు దైవం నుండి దివ్య ప్రేమ లభిస్తుంది. అంటే మీరు నిరంతర స్మరణలో ఉన్నారని అప్పుడు చెప్పగలరు. ఎవరో

మాతాజీని దర్శించడానికి వేలకొద్దీ జనం నేతలతోసహా వచ్చారు. వారికి ఆధ్యాత్మిక ప్రతిఫలం ఏమైనా లభిస్తుందా!

బాబూజీ మహరాజ్ తన దైవీయ సంపదను అంతా కూడా నిరంతర స్మరణ ద్వారా అభ్యాసీలకు ప్రసాదిస్తారు. ఇతర సంస్థలలో గురువు తన స్పర్శ ద్వారా శిష్యునికి ఆశీస్సులు ఇస్తారు. కాని బాబూజీ మహరాజ్, స్పర్శ ద్వారా కాకుండా, తన సంకల్ప శక్తితో మనకు దివ్య శక్తిని ప్రసాదిస్తారు. అందువల్లనే బాబూజీకి, ముఖ్యంగా స్త్రీలు వారికి పాదాభివందనం చేయడమంటే అసలు ఇష్టం లేదు.

**ప్రశ్న: భగవంతుడు ఈ విశ్వాన్ని సృష్టించాడు. మానవులందరు కూడా 'వారి' బిడ్డలే. కాని కొందరు సుఖంగా, కొందరు దుఃఖంతో ఉన్నారు. అందరూ ఎందుకు ఆనందంగా లేరు?**

**జవాబు:** భగవంతుడు ఎప్పుడూ మనకు కష్టాలు, దుఃఖాలు ఇవ్వరు. ఒకవేళ భగవంతుడు కష్టాలు, బాధలను ఇచ్చేవాడు అయితే, భగవంతుని స్మరించినపుడు నీకు బాధలు, కష్టాలు కలగాలి. కాని భగవంతుని స్మరించినపుడు నీవు ప్రశాంతతను, ఆనందాన్ని పొందుతున్నావు. కనుక భగవంతుడు బాధలను ప్రసాదిస్తాడని నీవు ఎలా చెప్పగలవు? ఒకసారి బాబూజీ నాకు ఈ విధంగా ఉత్తరం వ్రాశారు. ఈ కష్టాలు, దుఃఖాలు అనేవి మానవ సంకల్పం వలన ఏర్పడుతున్నాయి. భగవంతుడు అందమైన సృష్టిని, మనస్సును, సర్వస్వాన్ని మానవునికి ప్రసాదించి, అతడు మాత్రం మానవుని హృదయంలోపలనే ఉండిపోయాడు. ఇప్పుడు మానవుడు తాను లోపలికి వెళ్ళి భగవంతుని బయటకు తీసుకుని రావాలి. అప్పుడు అంతటా కూడా కేవలం ఆనందం, శాంతి మాత్రమే ఎల్లప్పుడు కనిపిస్తుంది. అందువల్లనే బాబూజీ మనలను హృదయం లోపల ధ్యానం చేయమని చెప్పారు. ఈ శరీరం అశాశ్వతమని తెలిసినా కూడా ఇదే సర్వస్వమని, ఈ శరీరంతోనే అనుబంధాన్ని పెంచుకొని జీవిస్తున్నాం. ఇప్పుడు చేయవలసినది ఏమిటంటే, మీరు భగవంతుని లోపల, భగవంతునితో జీవిస్తూ, అన్ని పనులు చేయాలి. అప్పుడు మీకు బాధ, దుఃఖం అనేవి అనుభూతిలోకి రావు. ఎల్లవేళల శాంతి, ఆనందం మాత్రమే ఉంటాయి.

ఒకసారి బాబూజీ, "నేను నిన్ను ఎల్లవేళల గుర్తు పెట్టుకొని ఉంటున్నాను. కాని నీవేమో ఎల్లప్పుడు నన్ను మరచిపోయి ఉంటున్నావు. 'నేను మీ వాడిని' అని నీవు నన్ను గుర్తుపెట్టుకో. నిరంతర స్మరణ ద్వారా నీకు సమస్తం లభిస్తుంది" అని ఒక అభ్యాసీతో అన్నారు.

లాలాజీ సాహెబ్ ప్రార్థన వలన బాబూజీ మహరాజ్ అల్టిమేట్ (భూమా) నుండి ఈ ధరణి మీద అవతరించారు. అందువలన మన అందరం బాబూజీ, లాలాజీ సాహెబ్ యొక్క కుమారుడని అనుకుంటున్నాం. కాని ఇక్కడ బాబూజీ అంటే లాలాజీ కుమారుడు కాదు. బాబూజీ అంటే ఆ అల్టిమేట్ (అంతిమం) యొక్క కుమారుడు అని, బ్రైటర్‌వరల్డ్ (కేంద్ర మండలంలోని తేజోమయ లోకం)లో ఉన్న స్వామి వివేకానందజీ నాతో అన్నారు. అది నేను నా పాటలో వ్రాశాను. బ్రైటర్‌వరల్డ్‌లో ఉన్నత స్థాయికి చెందిన విముక్తాత్మలు పరమానందంలో మునిగి ఉంటారు. అల్టిమేట్ (భూమా) అనేది బ్రైటర్‌వరల్డ్ కంటే అతీతమైనది, లిబరేటెడ్ సోల్సు ఎవ్వరూ కూడా భూమా నుంచి శక్తిని దింపడానికి సాహసించలేకపోయినప్పుడు లాలాజీ ముందుకు వచ్చి తాను సాధిస్తానని చెప్పి బాబూజీని తీసుకుని వచ్చారు.

ఒకసారి బాబూజీ, "మరణం అంటే ఏమిటి?" అని మరల వారే ఇలా చెప్పారు: "మరణం అంటే దుస్తులను మార్చినట్లు శరీరాన్ని మార్చడం, అనగా పాత వస్త్రాన్ని తీసివేసి కొత్త వస్త్రాన్ని ధరించినట్లు" అని చెప్పారు. జీవించి ఉండగా ధ్యానంలో భంగం కలుగుతూ ఉంటుంది. మరణించిన తర్వాత మహాకాశంలో భంగపాటు ఉండదు. ఎందుకంటే, మెదడు (మనసు) ఉండదు కనుక. ఇప్పటివరకు మనం ఈ మాటల యొక్క అర్థాన్ని మాత్రమే తెలుసుకున్నాం. కాని మీరు ప్రోగ్రెస్ అవుతూ ఆ స్థితికి చేరుకున్నప్పుడు ఈ మాటల యొక్క యథార్థం మీకు అర్థమవుతుంది.

**ప్రశ్న: త్వరగా ప్రోగ్రెస్ కావాలంటే, అతిత్వరగా బాబూజీలో లయం కావాలంటే ఏం చేయాలి? కుండలినీ శక్తి జాగృతం కావాలా?**

**జవాబు:** కుండలిని అనిగాని, షట్‌చక్రాలు అనిగాని ఏమీ తెలియకపోయినా వాటంతటవే తెరచుకుంటాయి. బాలెన్స్‌డ్ స్థితి ఏర్పడాలి. ఆహారం అంతా ఒక్కసారిగా భుజించడం ఎలా? బాబూజీ మహరాజ్‌ను హృదయ పూర్వకంగా ప్రేమించడంతప్ప వేరే మార్గం లేదు. నేను మీకు బాబూజీ గురించి చెబుతున్నప్పుడు నా ఎదుట, నా లోపల కేవలం బాబూజీ మహరాజ్ మాత్రమే ఉంటారు. ఆ విధంగా బాబూజీ మహరాజ్ నా లోపల, నా సమక్షంలో లేకుండా నేను కనీసం ఒక్క అక్షరం కూడా వ్రాయలేను. ఒక్క మాట కూడా మాట్లాడలేను. బాబూజీని త్వరగా చేరుకోవాలంటే ఇది ఒక్కటే మార్గం. బాబూజీ మనతోనే ఉన్నారు, మనలోనే ఉన్నారు. మన ఎదురుగా ఉన్నారు. కనుక మీరు ఎల్లప్పుడు కూడా 'వారి'తోనే, వారిలోనే, వారి ఎదురుగానే ఉండటానికి ప్రయత్నించండి.

బాబూజీని స్మరించడం అనేది రెండు రకాలు. ఒకటి మనస్సుతో స్మరించడం. ఇంకొకటి హృదయంతో స్మరించడం. "బాబూజీ! నేను చాలాసార్లు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటున్నాను. రోజంతా మీ స్మరణలోనే ఉంటున్నాను" అని నేను మోడీనగర్‌లో ఉంటున్నప్పుడు ఒకసారి బాబూజీకి ఉత్తరం వ్రాశాను. అప్పుడు వారు, "బిటియా! అప్పుడప్పుడు నీవు నాకు జ్ఞాపకం వస్తున్నావు" అని వ్రాశారు. కాని అప్పుడు బాబూజీ వ్రాసింది నాకు అర్థం కాలేదు. చాలా సంవత్సరాల తరువాత నేను మోడినగర్‌లో ఉంటున్నప్పుడు ఉత్తరం వ్రాశాను. "బాబూజీ మహరాజ్! ఇప్పుడు మీరు గుర్తుకు రాగానే వెంటనే నేను షాజహాన్‌పూర్‌లో మీ ఎదుటనే ఉన్నట్లుగా అనిపిస్తుంది" అని వ్రాశాను. దానికి వారు "బిటియా! నీవు నా స్థితి గురించి వ్రాస్తున్నావు. నేను నిన్ను గుర్తు చేసకోగానే, నేను మోడీనగర్‌లో నీ ఎదుటనే ఉన్నట్లుగా నాకు అనిపిస్తుంది" అని జవాబు వ్రాశారు. బాబూజీని మనస్సుతో జ్ఞాపకం పెట్టుకోవడానికి మరియు హృదయంతో స్మరించడానికి గల భేదం దీని వలన మనకు తెలుస్తుంది. మీరు బాబూజీని ఆలోచనల ద్వారా జ్ఞాపకం చేసుకోవద్దు. ఎందుకంటే ఇంకొక ఆలోచన రాగానే, బాబూజీ యొక్క ఆలోచన మీ మనస్సులో నుండి వెళ్ళిపోతుంది. అప్పుడు బాబూజీని మరచిపోతారు. కాని మీరు బాబూజీని హృదయంతో స్మరించినట్లయితే, మరచిపోవడం అనేది ఉండదు. ఏదైనా పనిలో మీ మనస్సు లీనమై ఉన్నప్పటికిని, మీరు బాబూజీని జ్ఞాపకం చేసుకోగానే, 'వారు' మీ హృదయంలోనే ఉన్నట్లుగా, 'వారి' ప్రజెన్స్‌ను (ఉనికిని) అనుభూతి పొందుతారు.

**ప్రశ్న: నేను బాబూజీ చెప్పిన మాటలను, బోధనలను మనస్సులో జ్ఞాపకం చేసుకుంటున్నాను. హృదయంతో స్మరణ చేసుకోవడం అంటే ఏమిటి?**

**జవాబు:** హృదయంతో స్మరించడం అంటే ఆ ఫీలింగ్, అనుభూతిని పొందడం, మనస్సుతో బాబూజీని జ్ఞాపకం చేసుకుంటాం. కాని హృదయం 'వారి' ప్రజెన్స్‌ను అనుభూతి చెందుతుంది. జ్ఞాపకం అనేది మనస్సుకు సంబంధించినది. ఫీలింగ్ అనేది హృదయానికి సంబంధించినది.

వారం రోజులలో, ప్రతి 'రోజు' కూడా, క్రితం రోజు అది నిన్నటి రోజుగా, నేడు ఈ రోజుగా, ముందు రోజు రేపటి రోజుగా స్థిరంగా ఉంటాయి. అందులో మార్పు లేదు. కాని మనం మార్పు చెందాలి. మన హృదయంలో ఎవరు ఉన్నారో అది తెలుసుకోవాలి. ఇది ఈ రోజు, ఇది నిన్నటి రోజు అని స్వయంగా ప్రకృతియే మనకు చెప్తుతోంది. ప్రకృతియే ఆ విధంగా పని చేస్తోంది. నేడు ప్రకృతి యొక్క 'ప్రకృతి'యే మారిపోతూ ఉంది. అనగా సమస్త విశ్వం కూడా దివ్య శక్తితో చార్జ్ చేయబడుతోంది. అందువల్లనే ఈ రోజు మనం సహజంగానే బాబూజీ యొక్క సామీప్యత అనుభూతి చెందుతున్నాం. ఇప్పుడు ప్రకృతి యొక్క ప్రకృతియే మారిపోతూ ఉన్నది కనుక, ప్రతి ఒక్క మానవుడు కూడా తప్పక మార్పు చెందవలసినదే!

"ధ్యానం అయిపోయిన తరువాత 4,5 నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చొని ధ్యానంలో కలిగిన స్థితిని మననం చేసుకోవాలి. అప్పుడు మీరు ఆ కండిషన్‌ను చదువగలరు" అని బాబూజీ చెప్పారు.

ధ్యానంలో చాలా ఆలోచనలు వస్తే అరక్షణం కళ్ళు తెరచి, ప్రేమతో బాబూజీని చూసి, మరల ధ్యానంలో కూర్చోండి. అప్పుడు మీకు మరల ఆలోచనలు రావు. (బాబూజీని హృదయంలో చూడాలా? ఎక్కడా?) మీ ఎదుటనే కూర్చొని ఉన్న బాబూజీని చూడండి. ఒకసారి ఇదే ప్రశ్నను ప్రిసెప్టర్స్ మీటింగ్‌లో అడిగారు: "అభ్యాసీకి ధ్యానంలో చాలా ఆలోచనలు వస్తే ఏమి చేయాలి?" అని. అప్పుడు నేను, "బాబూజీ మహరాజ్! ధ్యానంలో నాకు ఎప్పుడైనా చాలా ఆలోచనలు వస్తున్నాయని అనిపించగానే, వెంటనే నేను కళ్ళు తెరచి, అరనిమిషం మిమ్మల్ని చూసిన తురువాత మరల ధ్యానంలో కూర్చొనే దాన్ని. అప్పుడు ఆలోచనలు ఏమీరావు" అని 'వారి'తో అన్నాను. అప్పుడు వారు "బిటియా! ఈ విధంగా ఎందుకు జరుగుతుందో తెలుసా? నీవు థాట్‌లెస్ పర్సనాలిటీ (ఆలోచనలేని మూర్తిత్వాన్ని) చూసినట్లయితే నీకు ఆలోచనలు రావు" అని అన్నారు. (కాని మేము బాబూజీని కళ్ళు మూసుకుని ఉంటేనే కదా చూడగలం!) కళ్ళు మూసుకుని మీరు ధ్యానం చేస్తున్నప్పుడు, మీకు ఆలోచనలు వస్తున్నాయి అని మీరు అంటున్నారు. దీని అర్థం ఏమిటంటే, మీరు ఆలోచనలనే చూస్తున్నారని అర్థం. చాలా ఆలోచనలు వస్తున్నాయి కనుక, ఒకసారి కళ్ళు తెరచి అరనిమిషం బాబూజీని అనగా థాట్‌లెస్ పర్సనాలిటీని చూసి, మరల కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తే ఆలోచనలు తగ్గిపోతాయి. "భగవంతుని మనం ఈ నేత్రాలతో చూడలేము" అని బాబూజీ ఒకసారి అన్నారు. దీని అర్థం ఏమిటంటే, మనం "భగవంతుడిని ఈ హృదయంతోనే చూడగలం" అని దాని అర్థం.

ఒకసారి డా॥ వరదాచారిగారు, "బాబూజీ! మన మిషన్‌లో బాగా చదువుకున్నవారు, తెలివైనవారు ఎంతోమంది ఉన్నారు కదా! మీ బిటియా కస్తూరీకి చదువు రాదు, ఏమీ చెప్పలేదు. ఎందుకు మీరు ఈమెను రీసెర్చి (పరిశోధన) కొరకు తీసుకున్నారు?" అని అడిగినపుడు బాబూజీ, "నీవు ఒక ప్రొఫెసర్‌వు.

ఎవరైనా బాగా తెలివైన విద్యార్థి ఉంటే, అతనిని పిలిచి నీ ముందు కూర్చోబెట్టుకుంటావు. ప్రాపంచికమైన చదువులో తెలివితేటలు ముఖ్యం. కాని ఆధ్యాత్మికతలో హృదయం చాలా ముఖ్యమైంది" అని, మరల బాబూజీ, "తెలివైన వ్యక్తికి రకరకాల ఆలోచనలు వస్తాయి. కాని ఆధ్యాత్మిక వ్యక్తిలో భగవంతుడిని చేరుకోవడం ఎలా? అనే ఒకే ఒక ఆలోచన మాత్రమే ఉంటుంది" అని అన్నారు.

ఈ ప్రాపంచికమైన కర్తవ్యాలను నిర్వహించడానికి మనస్సు ఇవ్వబడినది. హృదయం బాబూజీని ఫీలింగ్ ద్వారా స్మరించడానికి ఇవ్వబడింది. "నేను ఈ పనిని చేస్తున్నాను, నేను ఆ పనిని చేస్తున్నాను; నేను, నేను...." అని మీరు అంటున్నప్పుడు మీ దృష్టి 'నేను' అనే దాని మీదనే ఉంటుంది. ఆ 'నేను' అనేదాన్ని బాబూజీ మహరాజ్‌కు కనెక్ట్ చేయాలి. బాబూజీని ప్రేమతో స్మరించడం అనేది చాలా ముఖ్యమైన విషయం.

"మరణం గురించిగాని, మరి దేన్నిగురించి అయినాగాని మీరు చింతించవలసిన అవసరం లేదు. నా ప్రేమ, అభ్యాసీని, అతని మరణ సమయంలో ఉన్నత స్థితికి తీసుకొని వెళ్ళుతుంది" అని అన్నారు బాబూజీ. బాబూజీ చాల అందమైన ఓ మాట 'గ్రేస్' అని చెప్పారు. 'గ్రేస్' అంటే కృప. బాబూజీ యొక్క కృప మనకు లభిస్తూ ఉంది. 'గ్రేస్' అంటే అర్థం ఏమిటి? ఎవరైనా విద్యార్థి పరీక్షలో ఫెయిల్ అయినపుడు గ్రేస్ మార్కులు కలిపి, అతన్ని పాస్ చేస్తారు. కనుక మీరు దేన్ని గురించీ నిరాశపడవలసిన అవసరం లేదు, చింతించవలసిన అవసరమూ లేదు. 'వారే' మనకు శరణు. మనకు ప్రతిరోజు, ప్రతి సిట్టింగ్‌లోను బాబూజీ యొక్క 'గ్రేస్' (కృప) లభిస్తూ ఉన్నది.

**ప్రశ్న: బెహెన్‌జీ! మరణం గురించి చింతించవలసిన అవసరం లేదని మీరు చెప్పారు. కాని మరణ సమయంలో బాబూజీని గుర్తు పెట్టుకోవడానికి ఈ శరీరం, మనస్సు సహకరించకపోతే ఎలా?**

**జవాబు:** ఆ విధంగా మీరు ఆలోచించి, బాధ పడవలసిన అవసరం లేదు. మీరు ఎల్లప్పుడు కూడా బాబూజీతోనే ఆనందంగా ఉండండి. మనకు 'వారి' గ్రేస్ ఉన్నది. వారి 'గ్రేస్' (కృప) వర్షిస్తూ ఉన్నది. కనుక మనం ఫెయిల్ అయ్యే సమస్య లేదు. మనం 'గ్రేస్' మార్కులను పొందుతున్నాం. ప్రతి ఒక్కరు, అందరు కూడా ప్రథమ శ్రేణిలో లేదా ద్వితీయ శ్రేణిలోనైనా 'పాస్' కావాలని నా బాబూజీ మహరాజ్ కోరుతున్నారు.

**ప్రశ్న: ఈ ప్రపంచాన్ని మార్చటానికి ఎంత కాలం పడ్తుంది?**

**జవాబు:** అది బాబూజీకే తెలుసు. మనం మారుతున్నట్లు మనం చూస్తూనే ఉన్నాం. ఒకసారి ఒక అభ్యాసీ, "బాబూజీ! మీరు నా ఆయుష్షును పెంచడానికి మీ గ్రేస్ (కృప) ఇవ్వలేరు కదా!" అని అన్నాడు. అప్పుడు బాబూజీ "అది ప్రకృతి చేయవలసిన పని. ప్రకృతి (నేచర్) యొక్క పనిని నేను తీసుకోను" అని అన్నారు.

**ప్రశ్న: ఆధ్యాత్మికంగా పని చేయడానికి కుండలినీ శక్తి మనలో మేల్కోవడం అనేది అవసరమా?**

**జవాబు:** ఆధ్యాత్మికంగా పని చేయడానికి కుండలినీ శక్తి అవసరం లేదు. ఒకసారి బాబూజీ, "బిటియా! శరీరంలోని ప్రతి అణువు (సామ్యావస్థ) బ్యాలెన్స్‌డ్ స్టేట్‌లోకి వచ్చినప్పుడు, సహజంగానే కుండలినీ శక్తి

దానంతట అదే మేల్కొల్పబడుతుంది" అని నాకు వ్రాశారు. బ్యాలెన్స్‌డ్ స్టేట్ (సామ్యావస్థ) లేకుండానే కుండలినీ శక్తి జాగృతం కావడం వలన రావణుడు రాక్షసునిగా తయారయ్యాడు. కుంభకర్ణుడు నిద్రను కోరుకున్నాడు. ఒక్క విభీషణుడు మాత్రమే భక్తుడయ్యాడు. మీలోని కణకణం కూడా ఆ బ్యాలెన్స్‌డ్ స్టేట్‌ను పొందినప్పుడు కుండలినీ శక్తి మీ ఎరుక లేకుండానే మీలో మేల్కొల్పబడుతుంది. అంతేకాదు, కుండలినీతోపాటుగా షట్‌చక్రాలు కూడ మేల్కొల్పబడుతాయి. కుండలినీ మరియు షట్‌చక్రాలు మేల్కొల్పబడటం వలన ఆపారమైన శక్తి లభిస్తుంది. ఈ శక్తి అంతా కూడా సాక్షాత్కారం కోసం మీకుగల తపన, ఆవేదనలలో మిళితమై, లక్ష్యం కొరకు మీలో ఇంకా తీవ్రమైన తపన ఏర్పడుతుంది. "మనం ఒక్క అడుగు వేస్తే, భగవంతుడు మనవైపుకు పది అడుగులు ముందుకు వేస్తాడు" అని అంటారు. దీని అర్థం ఏమిటంటే, భగవంతుడు నడవడం కాదు. ఆ కుండలినీ మరియు షట్‌చక్రాలు వికసించడం వలన లభించిన అమితమైన శక్తి వలన మన యాత్ర చాలా వేగవంతంగా అవుతుంది. నేను "బాబూజీ! మీరు నాలో కుండలినీ శక్తి మేల్కొన్నది, అని వ్రాశారు. కాని దానికి నేను సంతోషపడటం లేదు. ఎల్లవేళల కేవలం మీరు మాత్రమే నా ఎదుటనే ఉండాలి, ఇదే నా ప్రార్థన" అని వారికి వ్రాశాను.

**ప్రశ్న: ప్రతి ఒక్కరు బాబూజీ మహరాజ్‌లో లయం కావాలి కదా! అప్పుడు మరల క్రొత్త సృష్టి అనేది ఏర్పడుతుందా?**

**జవాబు:** కాలం మారుతుంది. ప్రజల యొక్క ఆలోచన విధానం మారుతుంది. సత్యయుగం ఏర్పడుతుంది. సృష్టి మాత్రం అదే విధంగా ఉంటుంది.

**ప్రశ్న: ఈ ప్రపంచాన్ని మార్చడానికి బాబూజీకి ఎన్ని సంవత్సరాలు పడుతుంది?**

**జవాబు:** అది బాబూజీకి తెలుసు. మనం మార్పు చెందుతున్నాం అనేది మాత్రం మనకు తెలుసు. మనం సహజమార్గ్ సిస్టమ్‌లో చేరాము. ఏమి జరుగుతుంది, ఎలా జరుగుతుంది అనేది 'వారి'కి మాత్రమే తెలుసు.

మీ కెపాసిటీ (సామర్థ్యాని)కి మించిన స్థితిని బాబూజీ మీకు ప్రసాదించారు. ఈ స్థితిని జాగ్రత్తగా కాపాడుకోండి. కాపాడుకోవడం కాదు, మీరు ఇంకా దానిని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించండి.

లాలాజీ మహరాజ్ కృప వలన మనకు ఈ దివ్యశక్తి లభించింది. నిన్న రియాలిటీ (సత్యత్వం) ఎక్కడి నుండి ప్రారంభమవుతుందో చర్చించుకున్నాము. సహజమార్గం సత్యపథ్ గుండా ప్రవేశించాక రియాలిటీ వ్యాపించి ఉంటుంది. అనగా సహజమార్గ విధానం ద్వారా మనం ప్రయాణించినట్లయితే దానిని మించి ఉన్న రియాలిటీ ప్రారంభమవుతుంది. అక్కడకు అందరూ చేరవలసి ఉంది. అంచెలంచెలుగా అందరూ చేరతారు. మన సంస్థ యొక్క చిహ్నంలో ఇవి అన్నీ చూపించబడ్డాయి. అది సామాన్యమైన చిహ్నం కాదు. అందులో స్థితులన్నీ చిత్రీకరించబడ్డాయి. మధ్యలో ఉన్నది ఎడతెగని దివ్యశక్తి ప్రవాహం.

బాబూజీ యొక్క దివ్యకృప మీ అందరి మీద వర్షిస్తోంది. మీ శక్తికి మించిన స్థితిని వారు మీకు ప్రసాదించారు. ఆ స్థితిని జాగ్రత్తగా నిలుపుకొని ఇంకా ఉన్నతికి పాటుపడండి. మీ ఆలోచనలను, హృదయాన్ని అనవసర విషయాలమీదకు మరల్చకుండా మీ స్థితిని కాపాడుకోండి. అభ్యాసులందరూ చక్కగా ఉన్నతి

నొందుతున్నారు. డాక్టరు పార్థసారధిగారికి, వి.పి. రావుగార్కి నా నమస్కారాలు. వారు దీర్ఘాయుష్మలై ఆరోగ్యంగా ఉండాలని బాబూజీ మహరాజ్‌ను ప్రార్థిస్తున్నాను.

బాబూజీ మహరాజ్ మనవారు. వారు మన కోసం వచ్చారు. మనం వారిని ప్రేమిస్తున్నాం. వారు అభ్యాసీలందరినీ ప్రేమిస్తున్నారు. ఎందుకంటే, మనమంతా వారి బిడ్డలం. మనం వారు చెప్పినట్లు నడుచుకుంటే వారు ఎంతో సంతోషిస్తారు. మన మనస్సు, జీవితం సర్వం వారి కోసం, మన రామచంద్ర మిషన్ కోసం, అని అభ్యాసీ భావించినపుడు, మన సంస్థ బాగా పురోగమిస్తుంది.

'జీవన్'కు అర్థం ఏమిటంటే, దానిని విడదీసి చదివినపుడు అది జీ + వన్ అవుతుంది. అనగా జీవనం + వన్. అంటే మనం వారిలో లయమై జీవించినపుడు 'వన్' అనగా 'వారు' ఒక్కరే అక్కడ ఉంటారు. వారు ఒక్కరే మిగులుతారు.

ఇతరులు మన సంస్థలో చేరటానికి మనం ఏ విధంగా ప్రార్థించాలి అంటే, "బాబూజీ, వారు కూడా మీ బిడ్డలు. వారిని కూడా మన సంస్థలో చేర్చుకోండి" అని ప్రార్థించాలి. ఈ శరీరం, మనస్సు అన్నీ మీవే అని నివేదించాలి.

బాబూజీగారిని మానసికంగా తనలో ఉన్నట్లు తలుచుకుంటూ ఉండేవానిని 'అభ్యాసీ' అంటారు. ఎప్పుడైతే బాబూజీగారిని తనలో (ఫీల్) అనుభూతి చెందుతాడో అపుడు భక్తుడు అవుతాడు. దీని తర్వాత దశలో భక్తి వృద్ధి చెందుతుంది. ఉదయం నిద్రలేవగానే, "బాబూజీ! ఈ రోజు మీ కొరకు జీవిస్తాను" అని అనుకొని బాబూజీగారిని ఫీల్ అయి వారి సంతృప్తి కోసం అనగా వారికి ఇష్టమైన విధంగా, వారి సంతోషమే తన సంతోషంగా జీవించటం జరుగుతుంది. ఈ విధంగా భక్తి వృద్ధి చెందుతుంది.

భక్తుడు, పూజారికి గల భేదం ఏమిటంటే, భక్తుడు తనలోపల ఉన్న దైవాన్ని అనుభూతి చెంది, 'అతని'తో ఏకమై జీవిస్తాడు. కాని పూజారి 24 గంటలూ విగ్రహారాధన చేస్తుంటాడు. కేవలం యాంత్రికంగా పూజా కార్యాలను నిర్వహిస్తుంటాడు. పూజారి విగ్రహారాధన చేస్తాడు కాని భక్తుడు తనలోని భగవంతునితో ఏకమై ఆ ఆనందంతోనే జీవిస్తాడు.

బాబూజీగారు అందర్నీ 'మానవ మూర్తులు' అనేవారు. గుడిలో దేవుని విగ్రహ ప్రతిష్ట జరిగిన తర్వాత ఆ దేవుడ్ని ఆవాహన జరుపుతారు. ఇది మానవ నిర్మితమైనది. మానవుడు తాను తయారుచేసిన విగ్రహాన్ని తానే ఆవాహన చేసి పూజిస్తాడు. కాని తను తయారుచేసిన మానవునిలో తానే ఉన్నాడు ఆ దైవం. మనిషి తనలో ఉన్న ఆ దైవాన్ని గుర్తించకుండా గుడిలోని విగ్రహంలో వెదుకుతున్నాడు.

బాబూజీగారు మొదటిసారిగా దక్షిణ భారతదేశానికి వెళ్ళి తిరిగి వచ్చారు. అపుడు మేమంతా వారికి ఎదురేగి, "అక్కడ ఎలా ఉన్నారు? అక్కడివారు మిమ్మల్ని గుర్తించారా?" అని అడుగగా, దానికి సమాధానంగా వారు "నేను అందర్నీ గుర్తించాను. కానీ నన్ను ఎవరూ గుర్తించలేదు" అని మరల వారు ఇలా అన్నారు: "అందరినీ అంతిమం తీసుకుని వెళ్ళాలి అనే సంకల్పంతో వచ్చాను. ఒక్కొక్కరికి అర్థమవ్వటానికి తగిన సమయం అవసరమవుతుంది. కనుక ముందు వెనుకగా అందర్నీ అంతిమానికి చేరుస్తాను" అని అన్నారు.

తనువు, మనస్సు అంతా బాబూజీగారికే అని అంటూ ఉంటారు. అది ఏ విధంగా ఉండాలి అంటే నేను లక్నోలో ఉన్నా బాబూజీగారిని తలచుకొన్నంతనే వారి దగ్గర ఉన్న అనుభూతి కలిగేది. అనగా శారీరకంగా కూడా వారి దగ్గరకు చేరాను. బాబూజీగారు చెప్పిన, నన్ను నేను మరచిన స్థితిలో (ఫర్‌గాట్‌ఫుల్ స్టేట్‌లో) ఉన్నాను. బాబూజీగారికి ఈ విషయం వ్రాయగా, వారు ఇలా వ్రాశారు: "నాకూ అలాగే ఉన్నది. నిన్ను తలచుకొనగానే నీ దగ్గర ఉన్నాను" అని. కనుక ఇది నిజమైన తనువు, మనస్సు అర్పణ స్థితి. ఇది మాటలతో చెప్పేదికాదు, అనుభవంతో తెలుసుకొనదగినది.

మొదటిసారి బాబూజీ విదేశాలకు వెళ్ళుతున్నప్పుడు చారిగారు బాబూజీతో "మీరు ఇలా పాతకోటుతో విదేశాలకు వెళ్ళితే బాగుండదు. క్రొత్త కోటు కొనండి" అన్నారు. అప్పుడు బాబూజీ మా అమ్మ దగ్గరకు వచ్చి "అమ్మా! (సిస్టర్‌గారి అమ్మను కూడా బాబూజీ ఇలానే అంటూ ఉంటారు) చూడు. చారిగారు క్రొత్తకోటు కొనమంటున్నారు. నావద్ద అంత ధనం లేదు, ఎలా?" అన్నారు. మా అమ్మగారు "కోటుని చూడటానికి ఎవరూ నిన్ను చూడరు. నీలోని ఆధ్యాత్మికత నిన్ను చూసేలా చేస్తుంది కాని, కోటును చూసికాదు. అయినా నీవు మంచిగా ఉంటావు" అని అన్నారు. అపుడు బాబూజీ "అమ్మా! నేను నిజంగా అంత బాగున్నానా!" అని అన్నారు. అపుడు మా అమ్మగారు "ఆ చెప్పిన అతన్ని తనను తాను మార్చుకోమను. అంతేకాని కోటు మారితే మనిషి మారరు కదా!" అని అన్నారు. "అతను పెద్దవారు. అతన్ని అలా అనకూడదు కదా!" అని బాబూజీ అన్నారు. బాబూజీగారి కోటును తీసి మా అమ్మగారు, ఈశ్వర సహాయ్‌గారు కోటును విప్పి లోపలిది బయటకు, బయటది లోపలికు వచ్చేలా తిరగేసి కుట్టారు. ఆ కోటు క్రొత్తగా అయ్యింది. బాబూజీ సంతోషంగా ఆ కోటుని తీసుకున్నారు. అంత సహజంగా, సరళంగా బాబూజీగారు వ్యవహరిస్తారు.

ఒకసారి మా ఇంటిలోని చిన్నపిల్లలు నన్ను ఇలా అడిగారు: "మీరు ఏమేమో మాట్లాడతారు. మీకు ఇన్ని విషయాలు ఎలా తెలుస్తాయి?" అని. అపుడు నేను "బాబూజీగారు నాకు చదువు చెప్తారు. మీకు స్కూలులో అర్థమైనా, కాకున్నా వర్క్ ఇస్తూ ఉంటారు. కాని బాబూజీ అలాకాదు. అనుభవం కలిగించి విద్య నేర్పుతారు" అని చెప్పాను.

కొందరు అభ్యాసీలు మేము ఫలానా వారి దగ్గర సిట్టింగ్ తీసుకుంటామని తలుస్తూ ఉంటారు. వారు గ్రహించాల్సిన విషయం ఏమిటంటే, ట్రాన్స్‌మిషన్ బాబూజీగారు మాత్రమే ఇవ్వగలరు. వారి నుండి మాత్రమే ప్రాణాహుతి శక్తి లభిస్తుంది, అంతేకాని వేరెవరి నుండి అది రాదు. అది వారి ప్రసాదం.

మనం చేసేది కొంచెం, పొందేది అనంతం. వారి కొరకై జీవితాన్ని అర్పించి, వారి సంతోషం కోసం జీవిస్తూ ఉంటే, బాబూజీయే (జన్మభూమికి) అనంతానికి చేరుస్తారు. సహజమార్గం సహజమైన జీవిత విధానం, కృత్రిమమైనది కాదు. ఇది సరళమైనది, సులభమైనది. ఈ విధంగా జీవించండి. అందరికీ తెలియజేయండి.

పూర్వకాలంలో భక్తులు అంటే మీరాబాయి, కబీరు, తులసీదాసు లాంటివారు కొందరు మాత్రమే ఉండేవారు. కాని బాబూజీగారు ఈ భూమిపై అందరినీ అంతటి భక్తులుగా తీర్చిదిద్దుతారు.

కొందరు ట్రాన్స్‌మిషన్ అనుభవం కాలేదు అని అంటూ ఉంటారు. అందరికీ చేరాలని బాబూజీ ట్రాన్స్‌మిషన్ ఇస్తూ ఉంటారు. ఎవరైతే ఆ ట్రాన్స్‌మిషన్ కొరకు ఎదురుచూస్తూ, తపించిపోతుంటారో వారు ఆ అనుభవం పొందుతారు. కనుక అభ్యాసీ అలర్ట్‌గా, సెన్సిటివ్‌గా ఉంటే ట్రాన్స్‌మిషన్ అనుభూతి పొందుతాడు. మనం బాబూజీని చేరేంతవరకు సంతోషం, తృప్తి పొందరాదు. వారిని చేరటానికి, వారిలో కలిసిపోవటానికి తపనతోనే ఉండాలి.

బాబూజీగారి పిల్లలు చాలా చిన్న వయస్సులో ఉన్నప్పుడే వారు తల్లికి దూరమయ్యారు. పిల్లలు నన్ను ఇలా అడిగారు: “మా అమ్మను ఒక్కసారి మమ్మల్ని చూడటానికి పిలవమని బాబూజీగార్కి మీరు చెప్పండి” అని. ఈ విషయం బాబూజీకి చెప్పాగా వారు ఇలా అన్నారు: “ఆమె విముక్తి ఆత్మ (లిబరెటడ్ సోల్). ఆమె ఈ బంధనాలు ఏవీలేని ఆనంద స్థితిలో అనగా బ్రైటర్‌వరల్డ్‌లో ఉన్నారు. పిలిచినా పలుకరు. ఆ ఆత్మ ఇక్కడకు వచ్చినా ఎవరినీ గుర్తుపట్టదు.”

ప్రార్థన యాచన కాకూడదు. ఎవ్వరినీ అర్థించకండి. బాబూజీగారికి మాత్రమే విన్నవించుకోండి. “నా పరిస్థితి ఇది. ఏమి చేసినా మీదే భారం” అని బాబూజీగారిని ప్రార్థించండి.

నేను రోజూ ధ్యానం చేస్తున్నాను, ధ్యానంలో కూర్చుంటున్నాను అని అంటారు. అలా కూర్చొనడం, ధ్యానం చేయడం యాంత్రికంగా చేయకుండా దైవం మనలోనే ఉన్నాడు. వారు ఎంతగానో మనలను ప్రేమిస్తున్నారు. లక్ష్యాన్ని చేరటానికి మనలను తయారు చేస్తున్నారు, అని ‘వారి’ స్మరణలో మునిగి ధ్యానం చేయాలి. అప్పుడే ఫలితం ఉంటుంది. రామ నామ స్మరణ చేయమంటారు. రామ నామాన్ని ప్రేమతో ఉచ్ఛరిస్తున్నారేతప్ప ఆ నామం ఎవరిది? ఎందుకు మనం స్మరించాలి? వారి గొప్పతనం ఏమిటి? అని ఆలోచించరు. దైవం మన హృదయంలోనే ఉన్నాడని వారి సామీప్యతను అనుభూతి మరియు వారి దర్శనాన్ని పొందాలి. ధ్యానంలో కూర్చొనడం కాదు, ధ్యానంలో నిమగ్నమవ్వాలి. పిల్లలను చదవమంటే పుస్తకాలు ముందు ఉంచుకుని చదువుతారు. పూజ అలా చెబితే చేసేది కాదు. ధ్యానంలో పూర్తిగా లీనమై చేయాలి. మనస్సును దైవం మీద లగ్నం చేయాలి.

నేను 20 సంవత్సరాల నుండి పూజ చేస్తున్నాను, రోజూ గీతాపారాయణం చేస్తున్నాను, భక్తిని పెంచే పుస్తకాలను చదువుతున్నాను అని అంటారు. అలా చేయడం మంచిదే. హృదయంలో ఈశ్వరుని ప్రతిష్ఠించుకుంటే వారితో కనెక్షన్ అప్రయత్నంగా ఏర్పడుతుంది. ఆ స్థితిలో కలిగిన అనుభూతి మన ప్రేమను రోజు రోజుకి ఎక్కువ చేస్తుంది.

మనం మన పిల్లల గురించి ఎక్కువగా ఆలోచిస్తాం. మిగతా వారి పిల్లలను గురించి ఆలోచించము, ఎందుకు? వారు మన పిల్లలుకారు కనుక. అలానే బాబూజీ మనవారు అని అనుకుంటే మనకు తెలియకుండానే మనస్సు వారివైపు లాగుతుంది, దూరం తగ్గి సామీప్యత ఏర్పడుతుంది. అప్పుడు ఎటువంటి స్థితి కలుగుతుంది అంటే వారిని గుర్తుచేసుకుంటున్నామన్న భావన కూడా మనలో ఉండదు. బాబూజీ మనలను ఎప్పుడూ వదిలిపెట్టరు. మనతోనే ఉంటారు. అలానే మనం కూడా వారిని వదిలిపెట్టకుండా ధ్యానంలో కూర్చున్నా,

ఆఫీస్ పని, ఇంటి పని ఏది చేస్తున్నా వారి స్మరణలోనే చేయాలి. బాబూజీ మనకు లక్ష్యాన్ని ఇచ్చారు. లక్ష్యాన్ని చేరటానికి దివ్యశక్తిని ప్రసాదిస్తున్నారు. ఆ దివ్య శక్తి ప్రవాహం వలన ధ్యానం మీద శ్రద్ధ రోజు రోజుకి ఎక్కువ అవుతుంది.

బాబూజీ మనకు సహజమార్గాన్ని ఇచ్చి ట్రాన్స్‌మిషన్ ద్వారా భగవంతుని చేరుకొనగలమనే భావాన్ని ఇచ్చారు. ట్రాన్స్‌మిషన్ మనలో మార్పును కలిగించి భగవంతుని చేరటానికి యోగ్యతను కలిగిస్తుంది. మన సాధనకు ట్రాన్స్‌మిషన్ ఒక పరికరం. ఆ దివ్యశక్తి వలన దైవంలో లయమవ్వటం జరుగుతుంది.

ఒక ఆఫ్రికన్ వెబ్‌సైట్‌లో నా (సిస్టర్ కస్తూరిగారు) గురించి తెలుసుకొని, నన్ను చూడటానికి ఐదు ఆరుగురు అభ్యాసులు లక్నోకి రావటానికి ఏర్పాటు చేసుకొన్నారు. వారికి వారి మాతృభాష అయిన ఫ్రెంచ్ భాష తప్పించి వేరే ఏ భాష తెలియదు. అందువలన వారు వచ్చేటప్పుడు ఒక అనువాదకుడిని (ట్రాన్స్‌లేటర్) కూడా తమతోపాటు తీసుకుని రావటానికి ఏర్పటు చేసుకున్నారు. కాని వారి ప్రయాణం రోజున అతడు అనారోగ్యంగా ఉండటంవలన రాలేకపోయాడు. గత్యంతరంలేక వాళ్ళు అనువాదకుడు లేకుండానే నా దగ్గరకు వచ్చారు. వారు లక్నోలో వారం రోజులు ఉన్నారు. భాష రానందున వారు ఏమి మాట్లాడలేదు. తిరిగి వారు తమ దేశాన్ని చేరిన తర్వాత ఒక ఉత్తరం ఇలా వ్రాయించారు: "మేము ఏ ఏ ప్రశ్నలు అడగాలని అక్కడకు వచ్చామో వాటి అన్నింటికి సమాధానాలు లభించాయి" అని. నా హృదయం వారితో మాట్లాడింది. హృదయం హృదయంతో మాట్లాడటానికి భాష అవసరంలేదు. వారు, ఆ తర్వాత వారి భాషలో ఎన్నో మంచి గ్రంధాలు వ్రాశారు. కనకు మనం భాష రాదని బాధపడవలసిన అవసరం లేదు. అనుభూతియే దేవుని భాష (Feeling is the language of the God).

మనం ధ్యానంలో, సత్సంగ్‌ల్లో కలిగిన అనుభూతులను డైరీలో వ్రాయాలి. నేను బాబూజీగారికి ఇలా వ్రాశాను: "నాకు భగవంతుడుని త్వరగా చేరాలి అని తపన ఎక్కువగా ఉన్నది. ఎప్పుడు వారిని చేరగలను?" అని. దానికి సమాధానంగా బాబూజీ ఇలా వ్రాశారు: "ఎప్పుడైతే నీవు నీలోను, నీ చుట్టూ దైవాన్ని అనుభూతి చెంది ఆనందిస్తావో, ధ్యానంలో ఉన్నప్పుడే కాకుండా ఎప్పుడూ ఆ ఆనందాన్ని పొందుతూ ఉంటావో, అప్పుడు నీవు సరియైన మార్గంలో వెళ్ళుతూ ఉన్నట్లు. అప్పుడే ఆ దైవాన్ని చేరగలవు. నీవు ఆధ్యాత్మిక దశల గురించి వ్రాయగలవు, వ్రాయి" అని వ్రాశారు. అప్పటినుండి నేను ఆధ్యాత్మిక యాత్రలోని దశల గురించి, ఆ దశలలో కలిగే అనుభూతులను గురించి వ్రాశాను. అది వారు నాకు ఇచ్చిన బహుమనం. తపన మనలో ఒక రకమైన బాధను కలిగిస్తుంది. ఆ తపనలోని బాధ వారిని చేరుతున్నప్పుడు ఆనందంగా మారుతుంది. బాధ ఎందుకు కలుగుతుందంటే ఇన్ని జన్మలు ఎత్తినా వారిని చేరలేకపోయినందుకు. ఈ తపన లేకపోతే మనం వారిని చేరలేము. శాశ్వతమైన ఆనందాన్ని పొందటానికి ఈ తపన, బాధ తప్పనిసరి. ఈ ఆనందాన్ని నేను పొందినప్పుడు బాబూజీని నేను అభ్యాసీ లందరూ మీ సామీప్యతానుభూతిని, ఈ ఆనందాన్ని మీ ట్రాన్స్‌మిషన్ ద్వారా పొందాలని ప్రార్థించాను. ఈ ట్రాన్స్‌మిషన్ మనలను సహజమార్గం ద్వారా ప్రయాణింపచేసి, దైవంతో కలుపుతుంది.

ధ్యానంలో వారి సామీప్యతానుభూతిని పొంది, వారిని దర్శిస్తున్నప్పుడు వారిని మర్చిపోవటమనే ప్రశ్నే ఉండదు. మూర్తి పూజలో అనంతుడైన దైవాన్ని ఆ మూర్తికే పరిమితం చేస్తాము. ధ్యానంలో అయితే అనంతంలో వ్యాప్తి చెంది, ఆ ఆనంతంలో కలిసిపోతాము. బాబూజీ మన కోసం వచ్చారు. సహజమార్గాన్ని చూపారు. ట్రాన్స్‌మిషన్ ఇస్తున్నారు. ఏదో ఒక రోజున మనమందరమూ తప్పక దివ్యశక్తి అనే సాధనం (పరికరం) ద్వారా అనంతాన్ని (అల్టిమేట్‌ను) చేరుకుంటాము.

ఆధ్యాత్మికతను గురించి తెలుసుకున్నంతమాత్రాన ప్రయోజం ఉండదు. ఆ ఆధ్యాత్మికత ద్వారా దైవాన్ని, దైవ దర్శనాన్ని పొందాలి. దర్శనం అంటే భౌతికరూపం కాదు. వారి దివ్యత్వాన్ని వారిచ్చిన దివ్య శక్తి ద్వారా పొందాలి.

**ప్రశ్న: ఎందరో మహానుభావులు ఈ భూమి మీదకు వచ్చారు. ఈ విశిష్టవ్యక్తి (బాబూజీ మహరాజ్) యొక్క విశిష్టత ఏమిటి?**

**జవాబు:** ఎందరో మహానుభావులు ఈ భూమి మీదకు వచ్చారు. దైవం గురించి చాలా చెప్పారు. కానీ బాబూజీ ఒక్కరే భూమా నుండి మన కోసం వచ్చి, మనకు ఆ దివ్య శక్తిని (డివైన్ పవర్‌ను) ఇస్తున్నారు. దైవాన్ని చేరటానికి ఆ ట్రాన్స్‌మిషన్‌ను మనకు ఆసరాగా ఇస్తున్నారు. దైవంతో కలుపుతున్నారు. అదే వారి విశిష్టత.

మనం ఎక్కడికి వెళ్ళితే అక్కడి పద్ధతులను పాటించాలి. తనకన్న చిన్నవారు చెప్పినా ఆ మాటలు పాటించాలి. లేకపోతే వారు బాధపడ్తారు. బాబూజీ మహరాజ్ ఎవరినీ నొప్పించరు.

బాబూజీ ఇలా చెప్పారు: "నేను నా బిడ్డలను భిక్షగాళ్ళను చేయను. దేనికోసమూ యాచించవలసిన పనిలేదు. తల్లిదండ్రులు పిల్లలకు ఏమి కావాలో అది వారే ఇస్తారు. ఎప్పుడూ పిల్లలకు మంచినే చేస్తారు" అని. అభ్యాసీలు అందరూ వారి బిడ్డలే. వారు ఏమి ఇచ్చినా అది మన మంచికేనని భావించాలి.

ఒకసారి బాబూజీతో కలిసి నేను (సిస్టర్ కస్తూరిగారు) ఒక ఉత్సవంలో పాల్గొన్నాను. అక్కడ ఒక టెన్ట్‌లో అభ్యాసీలకు సిట్టింగ్ ఇస్తూ ఉండగా పెద్దగా వాన మొదలైంది. అప్పుడు అక్కడ ఉన్న అభ్యాసీలు బాబూజీతో ఇలా అన్నారు: "బాబూజీ! సిస్టర్ కస్తూరిగారు అవతలి టెన్ట్‌లో అభ్యాసీలకు సిట్టింగ్ ఇస్తున్నారు. ఈ వానకు టెన్ట్‌లోనికి నీళ్ళు వెళ్ళతాయి. అక్కడ ఉన్న వారంతా తడిచిపోతారు" అని. అప్పుడు బాబూజీ ఏమి మాట్లడకుండా మౌనంగా ఉన్నారు. కాసేపు అయినాక వాళ్ళు బయటకు వచ్చి చూస్తే టెన్ట్‌మీద వాన పడలేదు. చుట్టూ ప్రవహించే నీళ్ళు కూడా టెన్ట్‌లోనికి వెళ్ళలేదు. సిట్టింగ్ యధావిధిగా జరిగిపోయింది. బాబూజీ పనికి ఏ ఆటంకమూ కలగకుండా (నేచర్) ప్రకృతి తన పని తాను చేసుకుంటుంది.

మన ఇంటిలో అభ్యాసీ సోదరీలు ఎలా ఉండాలంటే, ఒకవేళ కోడలు చెడు మాటలు చెప్పినప్పటికీ, విని ఊరుకోవాలి. కోడలను ఏమి అనకూడదు. తిరిగి ఆమెను (కోడలు) గురించి ఎవరికి ఏమి చెప్పకూడదు.

**ప్రశ్న: బెహన్‌జీ! మాంసాహారం తినవచ్చునా?**

**జవాబు:** కూరగాయలు దొరకవు కనుక బెంగాల్‌లో చేపను శాఖాహారంగా పరిగణించారు. మాంసాహారాన్ని 'ప్రసాదం'గా భావించి తీసుకుంటే అది మంచిది, కాని రుచికోసం సేవిస్తే అది విషతుల్యం అవుతుంది.

**ప్రశ్న: బెహన్‌జీ! పిల్లి, విడో (భర్తను కోల్పోయినవారు) ఎదురువస్తే అపశకునం అంటారు. నిజమేనా?**

**జవాబు:** బాబూజీ మహరాజ్ తమ సోదరి వివాహం జరిగే సందర్భంలో విడో అయిన వారి తల్లి బయటకు వచ్చి పెళ్ళికుమార్తెను దీవించరాదని ఎవరో అన్నారు. అపుడు బాబూజీ ఇలా అన్నారు: "నా సోదరిపట్ల నా తల్లికంటె ఎక్కువ ప్రేమ ఎవరికి ఉన్నదో నాకు చెప్పండి" అని. దానికి అక్కడ ఉన్న వారందరూ మౌనంగా ఉండిపోయారు.

మన విధానం యొక్క పేరు 'సహజమార్గం' మరియు 'ప్రార్థన' అనేవి రెండూ దివి నుంచి దిగి వచ్చినవే కాని మానవ సంకల్పం కావని బాబూజీ మహరాజ్ చెప్పటమేకాక వ్రాసి ఉన్నారు కూడా. మనం భగవత్ సాక్షాత్కారాన్నే మన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నాము. మునులు, ఋషులు కూడా మానవులకు భగవత్ సాక్షాత్కారాన్నే లక్ష్యంగా ఉపదేశించారు. కాని బాబూజీ మహరాజ్ మాత్రం మనకు అంతిమం చేరటమే మన గమ్యంగా నిర్దేశించారు. అనగా పరిపూర్ణ శక్తులతో కూడిన భగవత్ సాక్షాత్కారమవుతుంది. అది సిద్ధించిన తర్వాత ఎవరైనా భగవత్ సాక్షాత్కారం గురించి ప్రస్తావించినట్లయితే అది అర్థంలేని మాటగా అనిపిస్తుంది. అలా ఎందుకంటే, ప్రార్థనలోని "ఓ మాస్టర్! మానవ జీవిత యదార్థ లక్ష్యం నీవే" అని సంబోధించబడినవారు బాబూజీగానే గ్రహించబడుతుంది కనుక. ఆ తర్వాత మనం వారి ఎదుటనే ఉండి, ఇతరులు ఎవ్వరూ కనిపించకపోవటం జరిగినంతనే మాస్టర్ యొక్క పాత్ర నిర్వహణ ప్రారంభమవుతుంది. అటువంటి సమయంలో, మనం అంతిమ సాక్షాత్కారం పొందాలి అను వారి సంకల్పం, అభ్యాసులమైన మనలో అంతిమ సాక్షాత్కారం పొందాలనేటటువంటి క్షోభ లేదా సంవేదనను పునరుద్ఘాటిస్తుంది. దానితో అభ్యాసుల ఉన్నతికోసం అంతిమం యొక్క సర్వశక్తులతోసహా బాబూజీ యొక్క కృషి ప్రారంభమవుతుంది. సృష్టించగల శక్తి భగవంతునికే పరిమితంగా ఉన్న కారణంగా, అటువంటి స్థితి కలగకముందు ఏ విధమైన కటాక్షంగాని, శక్తిగాని పొందే అవకాశం లేదు. ఆ సృష్టికర్తకు మిన్నయైన స్థితికి మనల్ని తీసుకుని వెళ్ళాలని బాబూజీ తలుస్తారు. కనుక వారు విశిష్టమైన కృషి చేయాల్సి ఉంటుంది. అంతిమానికి, దైవానికి మధ్య ఏ విధమైన శక్తిగాని, అనుగ్రహంగాని ఉండవు. అప్పుడింక అభ్యాసులను అంతిమం చేర్చటానికి మాస్టర్ (బాబూజీ) మాత్రమే కృషి చేయాల్సి ఉంటుంది. అప్పుడు ప్రార్థనలో మనం చెప్పేటటువంటి – "ఓ మాస్టర్! మానవ జీవిత యదార్థ లక్ష్యం నీవే"తో ప్రారంభమై "అట్టి ఆత్మోన్నత స్థితికి చేర్చటానికి నీవే ఏకైక శక్తివి, దైవానివి" అను ఆర్తితో అంతమయ్యే వాక్కులు బాబూజీనే సంకేతపరుస్తాయి.

కనుక మాస్టర్ అన్న పదం ఒక్క శ్రీ బాబూజీ మహరాజ్‌కే తప్ప అన్యులెవ్వరికీ చెందదు. మీరు అనుమతినిస్తే ఈ సందర్భంగా చెప్పదలచింది ఏమిటంటే, ఈ 'మాస్టర్' అన్న పదం ఒక సర్వనామంగాని,

నామవాచకంగాని కాకపోగా ఆ స్థాయికి మించి ఆ పదం వారికి, మరీ చెప్పాలంటే వారికి మాత్రమే చెందుతుందిగాని అన్యులెవ్వరికీ ఆపాదించబడదు.

పరిపక్వమైన ఆలోచన అంటే ఏమిటి? ఒకే లక్ష్యం, ఒకే మాస్టర్, ఒకే విధానంకు బద్ధులై ఉండటమే. మన అభ్యాసులందరికీ భూత, వర్తమాన, భవిష్యత్ కాలా లన్నింటిలోను వారే మన మాస్టర్.

మన హృదయాలలో వారిని పదిలపర్చుకోవటానికి, వారు ఆశించినట్లు మనం ఔన్నత్యం చెందటానికి వారు మనకు శక్తిని ప్రసాదిస్తారు.

**--000--**

